రజనీ
భావతరంగాలు





బాలాంత్రపు రజనీకాంతరావు

రజనీ భావతరంగాలు

బాలాంత్రపు రజనీకాంతరావు

నవోదయ పబ్లిషర్స్ కారల్‌మార్క్స్ రోడ్డు
విజయవాడ-520 002

RAJANI BHAVA TARANGAALU (Essays)
Balantrapu Rajanikanta Rao

January 2011

Cover Design : A. Giridhar

Published by :
Navodaya Publishers
Karl Marx Road, Vijayawada - 520 002
Phone : (0866) 2573500
Email : vjw_booklink@yahoo.co.in

DTP & Printing :
Sri Sri Printers
Vijayawada - 520 002
Phone : 9490634849

Price :
Paperback : Rs. 100/-
Hard bound : Rs. 125/-

నా పాటల్నీ, నా సంగీతాన్నీ
ఎంతో ఆదరించే
చిరంజీవులు
పరుచూరి శ్రీనివాస్
చేబియ్యం గోపీకృష్ణలకు
ఆశీస్సులు...

- రజనీకాంతరావు బాలాంత్రపు

ఆంధ్రప్రభ దినపత్రిక నుండి
పునర్ముద్రితము
సంపాదకులకు కృతజ్ఞతలు

విషయ సూచిక

1. వేసవి 'సుఖ' భోగాలు -మృగశిర

వేసంగి–వేసవి అనే పేరులే ఈ కాలానికి వైశాఖమాసం నుంచి, వైశాఖి అనే సంస్కృతపు పేరు నుండి పుట్టాయనే విషయం మనలో చాలా మందికి చటుక్కున తట్టదు.

మా తరం వాళ్ళకి మా చిన్నతనంలో గ్రామాలలో జరిగే సాంఘిక వినోదం అనండి, సాంస్కృతిక సంఘటనం అనండి. వైశాఖపూజ జ్ఞాపకం వస్తుంది. బాగా చిన్నతనంలో జరిగిన విషయమే. దానిలోని పూజా కార్యక్రమం ఏ విధంగా జరిగేదో జ్ఞాపకం లేదు. కాని వచ్చి కూర్చున్న సదస్యులందరికీ చందనచర్చ, పన్నీటి జల్లు చేసి విసనకర్రలు పంచి పెట్టి, వడపప్పు తినిపించి, పానకం గ్లాసులు తాగించి, మామిడి పళ్ళు సరఫరా చేసేవారు. అప్పుడు గ్రామగ్రామానికి గాని, ఇంటింటికి గాని, విద్యుచ్ఛక్తి ఇప్పటంతగా విస్తరించలేదు. అందుచేత అప్పటి జనసమూహాల సమావేశాలలో ఉక్క ఘుమాయింపు, వీటి మధ్య చందనచర్చలా పన్నీటి జల్లుల పరిమళాలు తాటాకు విసనకర్రతో నీళ్ళు చల్లిన వట్టివేళ్ళ విసనకర్రతో విసురుకోవడం ద్వారా కమ్మటి పరిమళాలు నాసాగ్రానికి చేరి మానసమందిరంలో ఆహా ఇదొక వేసవి 'సుఖ' భోగం అనిపించేది.

మన పెళ్లి ముహూర్తాలు అప్పటికీ ఇప్పటికీ సంవత్సరంలోని మాసాలన్నింటి లోను వైశాఖ మాసంలోనే ఎక్కువ కదా. ఉక్క ఘుమాయింపూ, ఒళ్ళంతా తడిపేసే చెమటా వీటినేమీ పాటించకుండా జనసమూహం బంధుమిత్ర కుటుంబాలన్నీ వధూవరుల కల్యాణవేదిక చుట్టూ చేరి అయిదారు రోజులు వేడుకలు, వినోదాలు తు.చ. తప్పకుండా పాటించిన ఆ రోజులలో 'వేసవి సుఖభోగాల'ను మనసు కెక్కించేవి. ఆనాటి తాలవృంతాలనబడే విసనకర్రలూ, ఆ చందన చర్చలు పన్నీటిజల్లులూ!

ఒక్కొక్కరికి ఆ విసనకర్రలు ఎంత అలవాటయిపోయాయంటే కేరళలో మనిషి మనిషికి గొడుగులాగా, చేతిలో చేతికర్రా, గొడుగూ, విసనకర్రా, కాశీయాత్ర పెళ్లికొడుకుని అలంకరించినట్లు ఉంటూండేవి. మా మేస్టారొకాయన చాలా ప్రసిద్ధులే. ఎలెక్ట్రిసిటీ, ఫానులూ వచ్చాక కూడా ఫాన్ ఫుల్‌గా తిప్పేసి, చేతిలో విసనకర్ర వూపుకుంటూ ఆ ఎలక్ట్రిక్ ఫాన్ కింద కూర్చునేవారు.

ఈ మధ్య కరెంటు కోత ఫలితంగా న్యూస్ పేపరో, విసనకర్రో దొరికితే అసలు విసనకర్రతోనే 'వేసవి సుఖభోగం' మనకంతా అనుభవానికి వస్తోంది. ఏడూ, పధ్నాలుగూ, ఇరవయ్యీ అంతస్థుల భవనాలలో కరెంటు కోతలో భోగుల అనుభవం తలచుకుంటే ఒళ్లు జలదరిస్తుంది.

ఏప్రిల్ 1 నుండి మే 14 లోగా సూర్యుడు మేషరాశిలో సంచారం చేస్తుంటాడు. అది ఆయనకు ఉచ్చరాశి. అయినా వేడిమి మాత్రం క్రమక్రమంగానే హెచ్చుతుంది. మేషంలో నుండి వృషభంలో ప్రవేశించేటప్పుడు ఆయన కృత్తికానక్షత్రంలో సంచరిస్తూ కత్తెరవానలు కురిపిస్తే కురిపిస్తాడు. కాని మే 23న చంద్రుడికి ఉచ్చరాశి అయిన వృషభంలో చంద్రుడికి రథం అనదగిన రోహిణీనక్షత్రంలో ప్రవేశిస్తూ, తీవ్రమైన ఎండతో రోళ్లు బద్దలు చేసే రోహిణీకార్తెను ప్రసాదిస్తాడు.

వ్యవసాయం చేసుకునే పెద్దలు చెబుతారు. రోహిణిలో వాన పడకూడదు, చల్లపడకూడదు. అలా పడిందంటే పంటంతా చెడిపోతుందని. రోహిణిలో మన వీపులు మాడేటంత ఎండలు కాసి వడగాడ్పులు వీస్తే ఆ ఏడు వేసవి సార్థకం అయిందన్న మాట. అప్పుడు వేసవి సుఖభోగం అంటే ఇదీ అని తెలిసివస్తుంది. ఆ వేసవి మనకు ప్రసాదించే తొలకరి జూన్ 7,8 తేదీలలో సూర్యుని మృగశిరాప్రవేశంతో మనస్సులను చల్లపరుస్తుంది. జ్యేష్ఠమాస పౌర్ణమినాడు చంద్రుడు జ్యేష్ఠానక్షత్రం లోను, సూర్యుడు మృగశిర 2వ పాదంలోను ఉంటారు. అదే తొలకరి పున్నమి. రవీంద్రుడు ఒక పాటలో ఇలా రాస్తారు.

> *"ఎటు నుంచో నల్లని కాటుక మబ్బొకటి జ్యేష్ఠమాసంలో వచ్చి ఈశాన్యమూల కనబడుతుంది.*
> *ఎటు నుంచో నల్లని కోమలచ్ఛాయ ఆషాఢమాసంలో చీకటి చెట్ల తోపులో పొడ చూపుతుంది.*
> *ఎటు నుండో శ్రావణ రాత్రివేళ ఆకస్మిక సంతోషం మనస్సును ఆవరిస్తుంది."*

అటువంటి మానసావరణంలో చల్లబడిన ప్రకృతితో పాటు ఆకాశంలో తొంగి చూసిన ములగశిర అంటే సూర్యుని మృగశిర ప్రవేశం గురించి మేఘదూత నాటికలో గ్రామీణుల గొంతుల్లో రజని ఇలా గానం చేస్తాడు. వేసవి ప్రసాదించిన సుఖభోగం తొలకరి మేఘాన్ని గురించి

"వచ్చిందా తిరిగి వచ్చిందా
తొంగిచూసిన ములగశిర మృగశిరకి పొంగిపోయే తొలిమేగం వచ్చిందా తిరిగి వచ్చిందా?
ఏటి ఒడ్డున మొల్లరుప్పొ యెల్లువగా నవ్విందా నవ్వీనా తన కళ్లా నవరసులా రువ్విందా?
వచ్చిందా తిరిగి వచ్చిందా?
తొంగి చూసిన ములగసిరకి పొంగిపోయే తొలిమేగం వచ్చిందా తిరిగి వచ్చిందా?" ■

29, ఏప్రిల్ 07, ఆదివారం ఆంధ్రప్రభ,

2. అన్నమయ్య శబ్దశిల్పంలో మార్మిక సౌందర్య మాధురి

సంతోసించితిమి నిన్ను. చల్లగా పెండ్లాడితివి

ఇంతటివాడవైతివి యేమనేము నిన్నును

అనే సాళంగ నాట రాగకీర్తనలో నాయకుడైన వేంకటేశ్వరస్వామి ఏకైక పురుషత్వమునూ, ప్రకృతి ప్రతిరూపిణులైన సాంప్రదాయిక దివ్యనాయికలే కాక మిగిలిన ప్రాకృతజీవులందరు స్త్రీత్వప్రతీకలై ఆయనకు దేవేరులుగా ఆయన యందు అనురక్తలై ఉండడమునూ చిత్రిస్తాడన్నమయ్య.

స్వామిని వలచిన ఒక అనుకూలనాయికగా గాని, భక్తుడైన కవిగా గాని, అన్నమయ్య అంటున్న మాటలే ఇవి - దక్షిణనాయకుడైన స్వామితో (ఒకతె కంటె ఎక్కువ నాయికల పట్ల ప్రీతి కలిగినవాడు దక్షిణనాయకుడు)

ఒరపైన జాణండవు వొక్కడవే ఇంతటికీ

గురి నీ వలపులైతే కోటానుకోటి

పరపుపై చూచితేను పదారువేల దేవుళ్లు (దేవేళ్లు)

యెరగము నీ మహిమలు ఏమనేము నిన్నును!!

'గురి నీ వలపులైతే కోటానుకోటి' అన్న మాటలలో కోటాను కోట్ల నాయికల పట్ల ఆయన వలపు అవిభాజ్యమై ప్రసరిస్తూంటుందనే సత్యాన్ని ప్రవచిస్తున్నాడు.

పరపు పైని పదారువేల దేవేళ్లు అంటే దేవేరులు ఆ మహారాజుకు పట్టమహిషులు - దేవుళ్లు అనే ప్రయోగం దేవేరులు-దేవేళ్లు అనే పదానికి వ్యావహారికరూపంగా గ్రహించాలి.

వొలసితే వొక్కతెను వురమెక్కించుకొందువు

పిలిచి వొకతె నెత్తిబెట్టుకొందువు

తలుపు తెరిచితేను దండనెల్లా గొల్లెతలే

ఇల నిన్ను గెలవలేము ఏమనేము నిన్నును

ఉరముపై ఎక్కించుకొన్న నాయిక ఆదిలక్ష్మి నెత్తిని పెట్టుకొన్నది భూదేవో, ఆండాళ్లో, అలమేలుమంగో, దండనెల్లా గొల్లెతలు - ప్రాకృతికజీవులైన మహర్షులు, భక్తులూ, మీరూ, మేమూను.

గొంది పవ్వళించితేనే గోవిందరాజవు నీవు
కందువ నిలుచుంటే శ్రీవేంకటపతివి
అందుకుంటేనే ఇద్దరంగనలు పాదాలొద్ద
ఇందరిలో మమ్మేలితివి ఏమనేము నిన్నును !

పాదాలొద్దనున్న ఇద్దరంగనలు భూదేవీ, శ్రీదేవులు. ఇందరు దేవేరులున్నా మమ్ము కూడా దేవేరిగా ఏలుకొన్నావు అని నాయికగా అన్నమయ్య అనే మాటలు.

తాను రచించిన అన్ని వేల కీర్తనలలో – మనకు లభించిన ఒక్క కీర్తనలో మాత్రం అన్నమయ్య స్వామి పట్ల తన అపరిమితమైన భక్తినీ, ప్రేమనూ, స్వామి వియోగం వల్ల తాను పడే విరహబాధనూ వెల్లడిస్తూ తన పాత్రను నాయికయైన స్త్రీ పాత్రగా కాక భక్తుడైన పురుషపాత్రగానే చిత్రిస్తాడు. అది కన్నడగౌళరాగ కీర్తన

వెలికి వెళ్లడూ చలికి వెరవడూ
ఉలికీ ఉలికీ ఉలికెనయా
రోగియై తారుచుల బాయడూ.
భోగియై రతి పొందొల్లడూ
వేగివేగి వెడ చీకటి నీరు
త్రాగీ త్రాగీ త్రాగెనయా!!

భక్తయోగియైన అన్నమయ్య స్వామి వియోగవిరహంలో తపిస్తూ వెడచీకటి నీరు–ఎడబాటు అనే చీకటి నీరు తాగుతున్నాడట. అనుభూతి లోతులను, ఎత్తులను అందుకుంటున్న ఈ భావశబలత అన్నమయ్య కవితాశక్తిని విశిష్టకోణంలో ప్రదర్శిస్తుంది.

అన్నమయ్య అనేక కీర్తనలలో పొందిన స్త్రీ సద్భావమునకు నాయికానాయక దాంపత్యభావమునకు –మరుడనే శబ్దానికి, భావానికి ఆయన ఇచ్చిన అత్యంత గౌరవస్థానం ఏకత్ర సమకూడిన, ఒక గేయం

మరుని నగరి దండ మా యిల్లెరుగవా
విరుల తావులు వెల్లివిరిసేటి చోట!
మరుగుమూక చింతల మా యిల్లెరుగవా
గురుతైన బంగారు కొండల సందె...

బంగారు కొండల సందును సందెగా పేర్కొని సంధ్యారాగాన్ని స్ఫురింప జేయడమూ, ఆ సంధ్యారాగాన్ని స్వర్ణకలశముల వంటి వక్షోజాల నడుమ మూకచింతలతో మరిగే స్త్రీ హృదయాన్ని – నాయికాహృదయంగా స్ఫురింపజేయడమూ ద్వారా

అన్నమాచార్యుడు మహనీయుడైన అనుభూతిశిల్పిగా మనకు దర్శనం ఇస్తాడు. మన్మథుని అంతఃపురానికి పక్కనే నాయిక ఇల్లు-విరుల తావులు వెల్లివిరిసే చోటు !

నాయిక ఇల్లింకా ఎలాంటిది? మరపు తెలివి ఇంకా జ్ఞానాజ్ఞానముల తెర గల చోటు మదనుడు నిర్భయంగా వేటాడుతాడు. మదనుని వెదసంత నాయిక ఉండే చోటు. అక్కడ చిమ్మచీకట్లు చెదరకుండా ఉంటాయి.చివరి చరణంలో -

మరులుమ్మెతల తోట మా ఇల్లెరుగవా
తిరువేంకటగిరి దేవుండ వీవు
మరుముద్రల వాకిలి మా ఇల్లెరుగవా
నిరతము నీ సిరుల నించేటి చోటు !!

ఈ గేయంలోని అనితరసాధ్యమైన అన్నమాచార్యుని మహత్తరశిల్పానికి ఆలవాలమైన శబ్దాల కూర్పులోని ప్రతీకార్థములు వెదకడం కంటే, ఆ శబ్దాలు చిమ్మే మార్మికసౌందర్యమాధురులను సహృదయతతో స్వానుభవానికి తెచ్చుకోవడమే ఈ వైశాఖ పూర్ణిమ సందర్భాన మనం ఆయనకు అందీయగలిగే నివాళి ! ■

6, మే 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

3. భారత జాతీయగీతం

పొంచీష్-ఎ-బోయ్‌షాఖ్ అంటే (బెంగాలీ పంచాంగగణనల ప్రకారం) వైశాఖమాసపు 25వ రోజు ప్రతి ఏడు మే నెల 6 నుండి 9వ తేదీలోగా పడుతూ ఉంటుంది. ఈ ఏడాది మే నెల 9వ తేదీకి సరిపోతుంది. ఆనాడు విశ్వకవి రవీంద్రనాథ్ ఠాకూర్ జన్మదినం. ఆయన సహస్రమాసజీవి. అంటే 80 ఏళ్లకు పైగా జీవించారు. ఆయన వ్రాసిన, గానం చేసిన వేల కొద్దీ గేయాలలో, తన పుట్టిన రోజును గురించి చేసిన కవితాగానాలు చాలా అపూర్వభావాలతో, ఉదాత్తగంభీరశైలితో ఉంటాయి. వాటన్నింటిలోను అతి ముఖ్యమైనది నా భావతరంగాలపై ముందాడుతోంది.

తన జన్మదినపు శుభక్షణాన్ని 'హే నూతన్' అని సంబోధిస్తారాయన. నా తెలుగు అనువాదంలో సంబోధనను 'ఓ నవయువకా' అని చేశాను. ఓ నవయువకా రా మరోసారి జన్మదినపు తొలి శుభఘటికా అని ఆ గేయపు పల్లవి. "రవిసంకాశము నీ ప్రకాశము హరించె నీహార యవనికా" అంటారు. ఆ శుభక్షణాన వెలిగిన రవీంద్ర రవికిరణాలు మంచుతెరలను కరిగిపోయేటట్టు చేశాయి. 'రిక్తతావక్షమును చీల్చి' ఆ శుభక్షణం ఉన్మత్తతను పొందినదట. అనంతత్వపు శూన్యతా గర్భాన్ని చించుకుని వెలువడిందట, ఆ తొలి శుభఘటిక! తద్వారా జీవనవిజయం అంటే ఏమిటో వ్యక్తమయింది. తెలియని సీమల చిరవిస్మయాన్ని వ్యక్తమయేటట్టు చేసింది ఆ శుభక్షణం!

ఉదయదిగంతపు శంఖారావం హృదంతరంలో మోగింది. అది హృదంతరంలో మోగిన చిరనూతనమధురశ్రుతి వైశాఖ పంచవింశతి (వైశాఖ మాసపు ఇరవై అయిదవ రోజు) నిత్యనూతనం, నవయౌవనభరితం ఆ జన్మదినపు తొలి శుభక్షణం!

రవీంద్ర సంగీతానికి ఆకరం అయిన రవీంద్రుని గేయాలు దాదాపు రెండు వేల అయిదు వందల వరకు ఉంటాయి. కొన్ని కవితా ప్రధానమైనవి. కొన్ని సంగీత ప్రధమైనవి, బ్రహ్మసమాజ (ఏకేశ్వర) భక్తిగీతాలు, దేశభక్తి గీతాలు, ప్రణయ గీతాలు, ఋతు గీతాలు, మైథిలీభాషలో విద్యాపతి శైలిలో వ్రాసిన భానుసింహపదావళి, చండీదాసు శైలిలో రాధాకృష్ణ, కీర్తనగేయాలు, వైదికప్రార్థనా ఋక్కులు - ఇలాగ వాటిని స్థూలంగా విభజించవచ్చు. ఆయన సంస్కృతభాషా ప్రవీణత (ఓరియంటేషన్)కు ఉదాహరణగా

రష్యా పర్యటన చేసి వచ్చాక అక్కడి యాంత్రికపారిశ్రామికవిప్లవాన్ని దృష్టిలో ఉంచుకుని వ్రాసిన గేయం.

నమోజన్త్ర నమోజన్త్ర నమోజన్త్ర తుమి చక్రముఖర
మన్ద్రిత తుమ వజ్రవహ్ని వర్థిత తవ వస్తు వక్షదంశ,
ధ్వంసవికటదన్త, తవదీప్త అగ్నిశతఘ్ని విఘ్న విజయపన్థ
తవలౌహ గలన శైలదలన అచలచలన మన్త్ర
కబుకాష్ఠలోష్ట ఇష్టక దృఢ ఘన పినద్ధకాయా
కబుభూతల జల అంతరిక్ష లంఘన లఘుమాయా
తవఖని ఖనిత్ర నఖవిదీర్ణ క్షితివికీర్ణ అస్త్ర
తవ పంచభూత బంధనకర ఇన్ద్రజాల తన్త్ర.

సంస్కృతశబ్దాల ధ్వనిలో యాంత్రిక నాగరికతలోని దృశ్యాలను శ్రోతలకూ, పాఠకులకూ మానసికంగా కనిపించేట్టు చేసే ఆయన కవితాశక్తికి ఇది మచ్చు. తెలుగు వారి సౌలభ్యం కోసం వకారబకారాలను విడదీసి వ్రాశాను. శ్రీశ్రీలా కాకుండా రవీంద్రుని దృష్టి తటస్థదర్శనం అనిపిస్తుంది.

భారతరాజ్యాంగ నిర్ణయపరిషత్తు కొన్ని గేయాలను క్షుణ్ణంగా పరిశీలించి అన్నివిధాలా అర్హమైనదానిని భారతజాతీయ గీతంగా నిర్ణయించిన 'జనగణమన' గేయం, ఇటీవల మన దేశంలో కొన్ని మూలల విమర్శకు గురికావడం చాలా శోచనీయం. సంశయనిర్మూలన కోసం ఆ పాటలోని ప్రతి చరణానికి తాత్పర్యం ఏమిటో చూద్దాం.

జనగణములకు మనోనాయకుడైన భారతభాగ్యవిధాతా నీకు జయము. పంజాబు, సింధు, గుజరాతు, మరాఠా, ద్రావిడ, ఉత్కల, వంగ భాషాప్రాంతాలకు చెందిన ప్రజలు యమునా గంగానదుల జలధి యొక్క పైకెగసే తరంగాల వలె వింధ్య హిమాచల పర్వతాల ఔన్నత్యాలను అందుకునేట్టు ప్రతి ఉదయమూ నీ ఉదారనామము స్మరిస్తూ మేలుకొంటున్నారు. జనగణానికి నిత్యము మంగళము సమకూర్చే భారత భాగ్యవిధాతా నీకు జయము!

ప్రతిదినమూ నీ పిలుపు ద్వారా ప్రచారితమవుతూ ఉండే నీ ఉదారవాణిని ఆలకించి హిందువులు, బౌద్ధులు, సిక్కులు, జైనులు, పారశీకులు, ముసల్మానులు, క్రైస్తవులు ఒక ప్రేమ తోరణమును గుచ్చుకున్నారు, తూర్పు నుండి పడమటి కొస వరకు నీ సింహాసనమునకు యెదుట నిలబడి. ఓ జనగణ ఐక్య విధాతా భారత భాగ్య విధాతా నీకు జయము!

పతనాభ్యుదయాలతో కూడుకున్న (విశ్వగమన) మార్గంలో యుగయుగాలుగా పరుగిడి వస్తున్న యాత్రికుడా, ఓ సనాతన సారధీ, నీ రథచక్ర నిస్వనాలతో రాత్రింబవళ్లు మార్మోగుతున్నాయి. దారుణవిప్లవం నడుమ స్వాతంత్ర్యసంగ్రామం, నీ శంఖధ్వని వినిపించింది. సంకటముల నుండి దుఃఖముల నుండి కాపాడేవాడా జనగణములకు దారి తీసే భారత భాగ్యవిధాతా నీకు జయము!

చిక్కటి చీకటి ఇరుకుసందులో చిక్కుకున్న రాత్రి! (పరపాలన) నీడలో మూర్ఛితమైన దేశం (అలమటిస్తూ) ఉండగా, అచంచలమైన నీ మంగళాశీస్సు మేలుకొలిపింది. రెప్పవాల్చకుండా చల్లని చూపు చూస్తూ చెడు కలలో విరోధంలో ఉన్న జాతిని ఒడిలోకి తీసుకుని రక్షించిన నువ్వు ప్రేమమయియైన తల్లివి! జనగణములను దుఃఖము నుండి ఉద్ధరించే భారతభాగ్యవిధాతా నీకు జయము!

రాత్రి తెల్లవారుతుంది. తూర్పున పొడుపు కొండ నుదుటి మీద రవికాంతి పైకి లేస్తుంది. పక్షులు పాడుతాయి. నవజీవనరసము తొలుకాడే పుణ్యపవనాలు వీస్తాయి. నీ కరుణారుణరాగంలో నిద్రితభారతం మేలుకొంటుంది. నీ చరణాలపై తల వంచుతుంది. జయము జయము ఓ రాజేశ్వరుడైన భారత భాగ్యవిధాతా నీకు జయము! ■

13, మే 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

4. జంతు నేస్తాలు

మా తాతగారి పెరటిలో ఆవుని పాలేరు కాని, మా బామ్మగారు కాని పాలు పితకగానే, మళ్ళీ దూడని వదిలేసే లోపున అప్పటికి చిన్నపిల్లాడుగా ఉన్న మా పెదనాన్న గార్లలో ఒకాయన పొదుగును దూడలాగే కరుచుకుని పాలు తాగేవారని మా చిన్నతనంలో చెప్పుకునేవాళ్ళు. ఆవు ఏమీ రభస చేయకుండా తనపెయ్యని నాకినట్టే పిల్లాడిని నాకేదిట.

ఆవుపెయ్య గాని కోడెదూడ గాని చాలా ముద్దుగా ఉంటాయి. మా ఇంట్లో మా చిన్నతనంలో ఒకటి-రెండు సార్లు ఆవు ఈనడం, ఆ తువ్వాయికి మా నాన్నగారే స్వయంగా గోళ్లు గిల్లి తీసిపారేసి,కడిగిన తువ్వాయికి బొటనవేలు కుడిపితే, అది ఆ వేలు కుడుచుకుంటుంటే చూడడమూ, వాళ్లమ్మ దగ్గర పాలు తాగేటప్పుడు తోక నిక్కించి వొంపుగా జెండాలా ఎత్తడమూ, ఆ ఎత్తిన తోకతో పెరటిలో ఈ వైపు నుంచి ఆ వైపు చెంగు చెంగున పరుగులు పెట్టడమూ, నాకూ, నాతోటి పిల్లలకూ ఎంతో సరదాగా ఉండేది. ఎదుగుతున్న గిత్తదూడ మెళ్లో మువ్వల పట్టా కట్టడం ఒక సరదా. దానికి కొమ్ములు వచ్చేటప్పుడు మోర వంచి పొడవడానికి రావడం కూడా ముద్దుగా ఉండేది.

మేం పుట్టక పూర్వం ఇంట్లో లక్ష్మి అనే ఆవు ఉండేది. అది పరమటి (పడమటి) ఆవు అని చెప్పుకునేవారు. ఒంగోలు వంగడం అయి ఉండవచ్చు. మంచి ఎత్తరి అన్నమాట. పెద్ద పొదుగూను. మా నాన్నగారన్నా, కుటుంబసభ్యులన్నా ఎంతో ప్రేమ కలిగి ఉండేదిట. అది పెద్దది అయిపోయిందనో ఏమో పొరుగూరి ఆసామీకి ఇచ్చివేస్తూ ఆ వూరికి తోలిపెట్టేశారట. అయినా సరే, ఆ ఆవు ఆ ఆసామి పశువుల శాల నుంచి కన్నెతాడు తెంపుకుని ఇరవై-ముప్ఫై మైళ్ళు నడిచి మూడు రోజులు తిరక్కుండా మళ్ళీ మా ఇంటికి తిరిగి వచ్చిందిట.

మా ఊళ్ళో ఇంట్లోనూ, మా అమ్మగారింట్లోనూ పాల దిగుబడి కోసం గేదెలను పెంచడం ఉండేది. ఆవు కంటె గేదె అంటే ఎందుకో నాకు అనురక్తి తక్కువగా ఉండేది. కాని ఆ విరక్తిని పోగొట్టే గేదె నేస్తాన్ని మొన్నామధ్య చూశాను. నా బాల్యస్నేహితుడు ఇప్పుడు 70 ఏళ్ల బ్రహ్మచారి. లంకంత కొంప, ఒక ఎకరంపైగా వైశాల్యం ఉండే మొక్కా, మోడుతో నిండిన పెద్ద దొడ్డీ. అతను ఒకటి రెండుదశాబ్దాల నుండి ఒక

గేదెను సాకుతున్నాడు. నిజానికి ఆ గేదె అతడిని తన పాలతో సాకుతోందని చెప్పాలి. మూడేళ్ల క్రితం నేనూ, ఆ స్నేహితుడూ రెండు నెలలపాటు విదేశయాత్ర చేశాము. దానికి ముందు బ్రహ్మప్రయత్నం చేసి ఈ గేదె సంరక్షణకీ, పాలు పితికి వాడుకోడానికీ, నమ్మకమైన మనిషిని ఏర్పాటు చేసుకుని మరీ బయలుదేరాడతను. తిరిగి వచ్చాక మేమిద్దరమూ మా మిత్రుడుండే గ్రామానికి వెళ్ళినపుడు, అతను నన్ను తన ఇంటికి తీసుకెళ్లి పెరటి తలుపు తీశాడు. తియ్యగా దూరాన చెట్టుకింద రాటకు కట్టి రొచ్చుకు దగ్గరగా పడుకున్న గేదె, చటాలున లేచి మా మిత్రుడి వైపు మోర చాచి 'వాంయ్' అని మంద్రస్వరంతో పలకరించింది. మా మిత్రుడు, "చూశావురా నీ దగ్గర పాట పాడే కుక్క ఒకటుందని మురిసిపోతుంటావ్! విన్నావా మా గేదె పాటా?" అన్నాడు. నాకు నిజంగా అబ్బురమూ, ఆనందమూ కలిగాయి. గేదె మీద నా ప్రిజుడిస్ మాయం అయిపోయింది.

ఇక మా పాట పాడే కుక్క సీజర్‌ని గురించి రాయకుండా ఎలాగ? ఈ అక్షరాలు రాస్తుంటే నా మనవడిని దగ్గరికి రానీకుండా గుర్రుమని తరిమేసి, నా కాళ్ల దగ్గర నా మంచం మీద కంగారూలాగా ముంగాళ్లు, వెనక్కాళ్లు కలిపి ముడిపెట్టి ముడుచుకుని పడుకుని ఉంది. నేను రాసుకునే కాగితాలిష్టం దానికి. రాసీ రాసీ ప్యాడ్ తలగడ మీద పెట్టి అలా వెళ్ళి వచ్చేలోగా ఆ అక్షరాల మీద ఆప్యాయంగా నాకుతుంది. మంచి డీలక్స్ బైండ్ పుస్తకం ఏదైనా చదివి అలా పక్కన పెడితే, దాని పుటలను కొంచెం అయినా నాలుకతో తడి చెయ్యకుండా ఉండలేదు. ఒకటి-రెండు వారాల క్రితం దాని పాటకి మురిసిపోయిన మా స్నేహితుడొకాయన, మరో ముగ్గురు పెద్దమనుషులతో సహా మా ఇంటికి వచ్చారు. నా మీద వారికి ఉండే ఆదరాభిమానాలతో, కొత్తవారు రాగానే ముందు భౌభౌ అంటుంది. "వాళ్లు నీ పాట వింటారు పాడమ్మా మెల్లిగా" అనేసరికి, గమకాలతో సహా మంద్రస్థాయిలో సన్నంగా ఆలాపనలు చేస్తుంది. రేడియోలో గానీ, టీవీలో గానీ, బాలమురళిలాగా రసానుభవంతో స్థాయి నిలుపుతూ పాడే ఏ ఆలాపననైనా సరే, వినగానే మనం అడక్కుండానే తన గొంతు శ్రుతి కలిపి పాడటం మొదలుపెడుతుంది. నేను నోటి మీద చూపుడువేలితో దానిని "నో నో నో నువ్విప్పుడు పాడకూడదు. మమ్మల్ని ఆ పాట విననీ" అంటే, అతికష్టం మీద పాడటం ఆపి తనని పాడనీకుండా చేస్తున్నారని చెప్పి గాలితో పూరించిన దవడలు ఎగరేస్తూ ఆపసోపాలు పడుతుంది. దాని పాటంటే ఇష్టపడిన స్నేహితులు టెలిఫోను చేసి నాతో మాట్లాడుతుంటే, మా సీజర్ తాను పడుకుని ఉన్న సోఫా కింద నుంచి ఓ అని రాగాలాపన ఆరంభిస్తుంది.

ఒకవేళ ఏ నిద్రలోనో ఉండిపోయి, దాని పాట వినిపించకపోతే టెలిఫోన్లో మాటాడే మిత్రులు, "ఏమండీ, మీ భైరవమూర్తి గారి పాట వినిపించడం లేదే!" అని అడుగుతారు.

మా ఇంటిల్లిపాదీ అంటే దానికి ఎంతో ఇష్టం. దానిని విడిచి ఏ పక్కింటి వారికో అప్పగించి, ఒకటి-రెండు రోజుల ప్రయాణాని కన్నా మా ఇంటిల్లిపాది వెళ్ళవలసి వస్తే పాపం, సీజర్ చాలా కష్టపడుతుంది. ఏడుస్తుంది. తిండి తినదు మేం తిరిగి వచ్చేదాకా! ■

20, మే 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

5. సమాన భావ సౌరభాలు

ఈ మధ్య విశ్వకవి రవీంద్రుని జయంతి రావడం, వైశాఖ పూర్ణిమనాడు ఆంధ్రమహావాగ్గేయకారుడు అన్నమాచార్యుని జయంతి రావడం వల్ల, ఈ మహాకవులిద్దరి గేయరచన ధోరణిలో సామ్యములు, వ్యత్యాసాలు వివరిస్తాను.

ఇద్దరూ సహస్రమాసజీవులే. ఇద్దరికీ నడుమ నాలుగువందల సంవత్సరాల వార ఉన్నా ఆత్మశుద్ధిపూర్వకమైన దైవభక్తి ఇద్దరికి వారి వారి నిత్యగేయరచనా వ్యాసంగానికి ప్రేరణ ఇచ్చింది. రవీంద్రుని ఉపాస్యదైవం నిర్గుణ పరమాత్మా, అన్నమాచార్యులకు సగుణాత్మకమైన వేంకటేశ్వరమూర్తీ. ఒకే విరాడ్రూపమైన ఏకేశ్వరుడైన ఆ పరమాత్మకు ప్రతీకలే. తరుచ్ఛాయా నిబిడములైన వనసీమలతో కూడిన ప్రకృతిమాత ఒడిలో చిందులు తొక్కిన నాట్యగీత మంటపం గురుదేవుని శాంతినికేతనం, శిల్పకళాశోభితములైన సహస్రస్తంభ మంటపాలతో ప్రదక్షిణావరణాలతో పవిత్రమైన ఆలయప్రాంగణాలు అన్నమాచార్యుల సంకీర్తనగానమునకు, ఆలయనర్తకీమణుల నాట్యవిన్యాసాలకు అంగణాలు.

'ఊరికి పోయెడి వోతడా(ఓ అతడా) కడు చేరువ తెరువేగి చెలగుమీ'

ఓ అతడు అనడానికి పాటలో ఓ తడా అనేది కేవలం వ్యావహారికరూపం ముద్దయినది. చెప్పకపోతే ఈ పల్లవి అన్నమాచార్యుని కీర్తన అనుకోరు. ఓ వేఫేరర్ అని మొదలుపెట్టే ఏ ఆంగ్లపద్యానికో, లేదా రవీంద్రుని ఏ బెంగాలీ కవితకో అనుసరణమో అనిపించేటట్టు ఉంటుంది.

ఇలాంటిదే రవీంద్రుని పల్లవి :

పాంథేతుమి పాంథజనేర నఖాహే
పథేరలాఖి సేఇతో తోమార్ పావా
జాత్రాపథేర ఆనందగాన జేగాహే
తారికంఠే తోమారిగాన్ గావా?

రవీంద్రుని గేయంలో భావం ఇదీ. 'ఓ పాంథుడా, యాత్రికజనులకు నువ్వు

మిత్రుడవు. యాత్రాపథంలో సాగిపోయే నీకు ఇదే సుమా, యాత్రాపథంలో మారుమోగే ఆనందగానంలో ఆ కంఠాలతో పాటు నీ పాట కూడా వినపడుతుంది.

అన్నమాచార్యుల వేదాంతదృష్టిలో దేవుడూ, ఆయన యెడల మనిషి చూపవలసిన అఖండభక్తి, ఈ వాతావరణంలోని పాపావరణాన్ని కడుక్కోవలసిన మనిషి దైవత్వసాధనలో ఏకమై పోయి కనపడతాడు.

రవీంద్రుని ఆధునిక కవితాదృష్టిలో మనిషి విశ్వవ్యాపిగ చిరంతన యాత్రికుడుగా ఎదిగి దైవత్వాన్ని అందుకోడానికి సిద్ధపడుతూ దర్శనం ఇస్తాడు. మళ్ళీ అన్నమాచార్యుని గేయాలలో ఒక దానిలోని ఆధునిక చిత్రంగా దర్శనం ఇస్తుందిలా.

మారుచేతులీయవద్దు మారుగాళ్లీయవద్దు
బీరాన గుండెలు కోసిపెట్టవద్దు
గోరవడి చిచ్చులోన గుండాలు చొరవద్దు
ఊరకే మీవారమని ఉన్న చాలు
సిడితల లియ్యవద్దు జీవాల చంపవద్దు
బడిబడి పగ్గాల పారవద్దు
సిడిమీద బిత్తరపు చిమ్ములు చిమ్మగవద్దు
కడనుండే కొండదారి కన్నజాలు
(పల్లవి) మొక్కరో మీరు మోసపోక
మీకు దిక్కు దెసయిన ఆదిదేవునికి?

తన ఈ పాటలో అన్నమాచార్యుల సందేశమేమిటి? తర్కించి చూస్తే మొక్కరో మీరు మోసపోక – అనే పల్లవిలోని ప్రధాన వాక్యానికి అర్థం, ముఖ్యంగా మోసపోక అనే మాటకి అర్థం ఇతరులను నమ్మించడానికి, ఆడంబరానికి, ఆత్మవంచనకు కాకుండా, శుద్ధమైన అంతరాత్మతో వెంకటేశ్వరునికి మొక్కండి అంటారు. భక్తితో (సంపూర్ణ) ప్రపత్తితో మొక్కండి అంటారు. భక్తితో (సంపూర్ణ) ప్రపత్తితో మొక్కాలి కాని కేవలం మొక్కుబడికోసం మొక్కకండి అంటున్నారా అనిపిస్తుంది. మారుచేతులీయవద్దు. మారు గాళ్లీయవద్దు. ప్రగల్భంగా గుండెలు, ఒళ్ళూ కోసుకోవద్దు. ఊరకే మీవారమని ప్రపత్తితో ఉంటే చాలు అంటూ సిడితల లియ్యవద్దు అంటే సిరిబొమ్మ ఉత్సవాలలో వీరభక్తులు తలలిచ్చుకోడం కావచ్చు. దానికి ప్రతీకగా తలనీలాలివ్వడమూ కావచ్చు. ఇలాంటి మొక్కుబడుల కంటె కడ నుండే కొండదారి దేవునిపై సరియైన గురీ భక్తీ ఉండటం ముఖ్యమని, ఈ పాటలో సందేశం.

రవీంద్రుని గేయాలలో ఒకటి ఈ సందర్భంలో జ్ఞాపకం వస్తుంది. (ఆచంట జానకిరాం గారి అనువాదం) ఆంగ్లగీతాంజలి నుంచి-

చాలించవోయీ ఈ జపతపాలూ, ఈ మంత్రోచ్చారణలూ ఆ దివ్య నామసంకీర్తన ఈ నిర్జన దేవాలయం తలుపులన్నీ బిగించుకుని చీకటిమూల ఒక్కడవూ ఎవరిని గురించి పూజ చేస్తున్నావు. కళ్ళు తెరిచి చూడు నీవనుకున్న దేవుడు నీ ఎదుట లేడు సుమా.

అతడెక్కడున్నాడా ఓపికతో కఠినేలను దున్నుతున్న పంట కాపు ఉన్న చోట, కొండలను పిండికొట్టి జనపథమును చదునుచేసే ఉప్పర మనిషి ఉన్న చోట, ఎండనక వాననక ఎల్లప్పుడూ వారితోను, దుమ్ము నిండిన దుస్తులతోను ఉంటాడు అతను. నీ పట్టుబట్టలు వదలి మన్నులోకి రావోయి.

పరస్పరయుద్ధాలు, శత్రుదండయాత్రలు జరిగి రాజధానుల ప్రజలు హింసాకాండకు కడగండ్లకు గురి అయిన పరిస్థితి అన్నమాచార్యుల కీర్తనలలో ఒక దానిలో చిత్రించారు.

అరుదుగనో హత్యలు సేయగ దూడ లంగలార్చ
సరిధర్మదేవతెట్లు సమ్మతించెనో
పరధర్మ చూరకెట్టు పట్టాయెనో లక్ష్మి
కరుణ యెంచ నోడెనో కలికాలమహిమ
దేవాలయాలు నానా దేశములెల్లా చొచ్చి
దేవదానెట్లుండిరో దేవతలు
తావులేక రాజులకు దయ కొంత పుట్టదాయె
కావరమో ఘనమో కలికాలమహిమ

ప్రపంచంలోని హింసాకాండకు వ్యధ చెంది పాడిన రవీంద్రుని గేయాలలో ప్రసిద్ధమైన (నా అనువాదం) హింసాయ్ ఉన్మత్త పృథ్వీ అనే గేయానికి

ధరాతలము హింసోన్మత్తము, ద్వంద్వభావ సమరోద్రిక్తము
లోభ జటిల బంధములడచ, ఘోరకుటిల పంథల నడుచు
నూతనావతారము నెత్తి కాతరులగు సకలప్రాణులకు
అభయమిమ్మహెూ మహా ప్రాణ, ఆలకింపని మృమృతవాణి
విరియనిమ్ము ప్రేమకమలము, చిరుమధునిష్యందమునులము
ఓయి శాంత ఓయి ముక్త ఓహెూ అనంతపుణ్య
కరుణా ఘన కావింపు ధరాతలి కళంకశూన్య! ■

27, మే 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

6. పక్షి నేస్తాలు

అఖిల భారత రచయితల సమావేశం జరుగుతోంది, 30 ఏళ్ళ క్రితం కేరళలో ఉద్యోగమండల్ అనే చోట. భారతదేశపు వివిధభాషల రచయితలు ఉన్నారు. ఆ వేళ కాలక్షేపవినోదంగా ఆధునిక కర్ణాటక నాటకరచయిత గిరీశ్ కర్నాడ్, కారంత్ మొదలైన నటులకు, నాటక నిర్మాతలకు గురువు ఒక క్విజ్ కార్యక్రమం నడుపుతున్నారు.

'గెస్ ది బర్డ్' ఈ పక్షి పేరేమిటో చెప్పుకోండి. ఆ గురువు ఆద్య రంగాచార్య. ఆ నాటికి దగ్గరగా 60 ఏళ్ళ వయస్సు. సుమారు ఆరడుగుల పొడవు. ఆయన ఒక్కొక్క పక్షినీ ఊహించుకుని దాని ఒడ్డూ, పొడవు, నడకా, మెడ తిప్పూ, ముక్కు కదలికా – ఇలాటిచేష్టలను తాదాత్మ్యభావనతో అభినయిస్తున్నారు. చుట్టూ పరివేష్టించిన రచయితలూ, నటులూ, ఆ పక్షి స్ఫురించగానే దాని పేరు చెబుతారు. ఇది ఉభయులకీ పరీక్షే. అభినయిస్తున్నాయన సరిగ్గా ఏ పక్షిని ఉద్దేశించాడో దాని లక్షణాలను తన అవయవాల ద్వారా స్ఫురించేటట్లు కొన్ని చేష్టలు చేస్తుంటే చూసేవారికి సరిగ్గా ఆ పక్షి స్వరూపమూ, పేరూ స్ఫురిస్తే, వాళ్ళు దానిని సరిగ్గా చెప్పుకోగలిగితే ఉభయపక్షాలూ ఆనందంతో చప్పట్లు కొట్టేవారు. కాకీ, కొంగా, బాతూ, రామచిలకా, గోరింకా, గద్దా, రాబందూ, గుడ్లగూబా యివన్నీ గుర్తుపట్టడానికి వీలైన ఆకారచేష్టలు గల పక్షులే.

చిన్నప్పటినుంచి నాకు కొన్ని ఇంటి పిట్టల పట్లా, ఊరపిట్టలపట్లా మైత్రీభావం ఏర్పడిపోయి ఉంది. మా అమ్మమ్మగారింట్లో రెండు రామచిలకలూ, ఒక మైనా గోరా, కొన్ని వారాలు పెరిగి ఎక్కడికో పోతూ ఉండే భృంగరాజు పిట్టా ఉండేవి. మా ఇంట్లోనే ముప్ఫయి ఏళ్లకి పైగా మాతోపాటు పెరిగిన ఒక రామచిలకను, మా నాన్నగారితో సహా ఎక్స్‌ప్రెస్ ఫొటోవిలేఖరి మురళి ఫొటో తీసి, దానితో సుమారు రెండు దశాబ్దాల క్రితం ఆంధ్రప్రభ వారపత్రికలో ఒక వ్యాసం ప్రకటించారు. దానికి మేం పంజరం దగ్గర నుంచుని నేర్పిన మాటల కంటె ఇంట్లో మా సంభాషణలలో మాటలెన్నో నేర్చుకుని ఆయా వేళల చక్కగా పలుకుతుండేది. ఎవరైనా వీధి తలుపు తట్టగానే వచ్చె వచ్చె అని మేం అనే మాటలని అది తనంతట తానే పలకనేర్చింది. ఎవరు వారు చుట్టాలొచ్చారు పీటెయ్యండి. ఇవి మేం దగ్గరుండి నేర్పిన మాటలు. అమ్మగారూ కూరగాయలు లాంటివీ, నాన్నా అన్నానికి రావచ్చు ఇలాంటివి ఇది సొంతంగా నేర్చినవి. మా అమ్మమ్మగారి

చిలక కృష్ణా, వాసుదేవా, కేశవా, పరమాత్మా అనే పద్యంలో మొదటి పంక్తిలో మాటలు చక్కగా అనేది. బాలమురళీకృష్ణ గారింట్లో మైనగోర సరిపదనిపమరిగరిస/ పదపపసా లాంటి రాగస్వరగుచ్ఛాలను స్వరయుక్తంగా పలుకుతుంది. అవి ఆయన ఇంట్లో పాడుతుంటే దానంతటది తటాలున నేర్చుకున్నవే.

భారతదేశంలో ఏ రాష్ట్రానికి వెళ్లినా తెల్లవారుతుంటే కొక్కొరొకో అంటూ తెల్లవారే అని చిన్నప్పుడు మా పల్లెటూరిలో కలిగిన ఆ ప్రభాతప్రశాంతిభావాలను అరుణరాగంతో మనసు పటంపై కుంచెతో అవే ఉదయదృశ్యాలను చిత్రిస్తుంది సర్వసామాన్య గ్రామీణపక్షి కోడి.

కొక్కొరొకో అనే ఆ కూతతో కోడి భాషలో దాంపత్యసంబంధమైన సర్వసామాన్య నిగూఢార్థం ఏదో ఉండి ఉండవచ్చు. ఈ కాలంలోని పౌల్ట్రీ ఫారాలలో కోళ్ల దాంపత్య పద్ధతులలో మార్పుల వల్లనేమో, ఆ శబ్ద ప్రయోగంలో స్వరవిన్యాసాలు మారి వేరు వేరు ఒత్తిడులతో వినపడుతూ ఉంటాయి.

గోడకి వేలాడే నిలువుటద్దంలోని నీడతో ముక్కూ ముక్కూ ఢీకొని పోరాడటము లోను, పటాల ఫ్రేముల వెనకా, గోడగడియారాల పైనో, ఎలక్ట్రికల్ ఫాన్ కుదుటిలోనో గడ్డీ గత్తరా కూరి గూడుకట్టే ప్రయత్నాలు మనకి యెంతో చిరాకు అనిపించినా జంట విడకుండా మన ఇంటి పట్టుల్లో కిచకిచ భాషల సల్లాపాలు చేసుకునే పిచిక దంపతులంటే నాకు ఎప్పుడూ ఇష్టమే. కిచకిచల్ని రెండు జంటలూ, మూడు జంటలూ, నాలుగు జంటలుగా పేర్చి వ్రాసుకుని ఒక్కొక్క కిచ మీదా ఒత్తిడి మారిస్తే అర్థాలు వేరుగా స్ఫురిస్తూ పిచికల భాషకి వ్యాకరణం వ్రాయవచ్చు అని కొన్నిసార్లు ఆలోచించాను. చేకూరి వంటి భాషాశాస్త్రజ్ఞులేమంటారో గాని, క్వా అంటూ గునగున నడిచే బాతులన్నా గుబిల్ గుబిల్‌మనే ప్రణయసల్లాపాల పావురాలన్నా నాకిష్టం!

కూజంతం రామరామేతి అని వాల్మీకిని కోకిలతో పోల్చి పొగడిన కవి దగ్గర్నుంచి, కవులెంతో అభిమానించిన కోకిల–పికఃకూజతి పంచమం అని అమరనిఘంటువు వల్ల అమరమైపోయిన కోకిల–పిల్లల్ని కని, పెంచడంలో తన గుడ్లు తీసుకెళ్లి కాకి గూట్లో పెడుతుందని, కాకి పొదగడం వల్లే ఆ గుడ్లు పగిలి కాకిపిల్లలతో పాటు కోకిల పిట్టలు కూడా నోరూ, కళ్ళూ తెరిచి బయటపడతాయని తెలిశాక, సోమరితనపు కోకిల మీద అభిమానం (దాని పాటమీదే కాదు) తగ్గి కాకి అంటే ఇష్టం పెరిగింది. చుట్టాలొస్తారని సూచించే కాకి కూత అన్నా ఇష్టమే మరి. పెరటిలో పనిమనిషికి కడగటానికి పడవేసిన భోజనపాత్రలలోని భుక్తశేషాలైన మిరపతొక్కలూ, మెతుకులూ, ఆవకాయ పెచ్చులూ, వగైరాలంటే ఎంతో ఆత్రంగా వాలే కాకి అన్నా, దానికి కొంచెం ముందో వెనకో

రంగుల ముక్కూ, కాళ్లూ ఆడిస్తూ దుముకుతూ వచ్చే గోరింక అన్నా, చిన్నప్పటి నుంచి మన కుటుంబం (పరివారం)లో సభ్యులలాగా, మన ఇంటికి కొన్ని తరాలుగా ఋణపడిపోయిన వెట్టిచాకిరీ పనివాళ్లలా మన ఆదరానికి పాత్రమవుతాయి.

అవి ప్రకృతి ఏర్పరచిన పారిశుద్ధ్యకార్యకర్తలు. కృష్ణాష్టమికి ఒంగోలులో తరంగాల భజన మిట్టమధ్యాహ్నం దాకా సాగిన తర్వాత ఆ భక్తులర్పించే ప్రసాదం స్వీకరించడానికి కృష్ణా అంటూ రెండు గద్దలు వాలతాయని చెబుతారు. తిరుక్కాళికుంద్రం వద్ద కూడా దక్షిణాదిన గద్దలు వస్తాయి. గరుడధ్వని అనే రాగంలో నుంచి గగ్గారిసదపా ససాదసగరీ అనే స్వరాలతో ఆ గద్ద కూతని నేను ఒకసారి వాద్యగోష్ఠి ద్వారా పలికించాను.

విజయవాడలో ఆరుబయటి రంగస్థలం షెడ్డులో ఒకసారి ఒక వాద్యగోష్ఠిని వాల్మీకి కవితకు కారణమైన క్రౌంచపక్షుల ప్రణయ సంగీతధ్వనులతో కూర్చి రిహార్సల్స్ చేయిస్తున్న ఆ రాత్రి 9 గంటల సమయం ఆ పక్షుల ప్రణయకలాపధ్వనులను వాద్యగోష్ఠిపై పలికించి, గాయకవిద్వాంసులు కొంచెం సేపు విరామం ఇచ్చారు. ఆ విరామంలో ఆ షెడ్డుకి పైన ఉన్న మామిడిచెట్టు గుబుర్లలో అంతవరకు విశ్రమిస్తున్న అసలు పక్షుల గుంపు, చటాలున తమ కలకలరావాలు వినిపించాయి. గాయకవిద్వాంసులంతా ఆనందంతో ఒళ్లు పులకరించి పక్షుల భాషను మనం సంగీతవాద్యాలపై వినిపిస్తే పక్షులు విని ఉత్తేజితకంఠాలతో తిరిగి తమ కలరావాలతో ప్రత్యుత్తరం ఇచ్చాయి, అని సంగీతం కల్పించిన నన్ను అభినందిస్తూ చేతులు జోడించారు. నేను తిరిగి నా చేతులు జోడించి నాదబ్రహ్మకు నమోవాకాలర్పించాను.■

03, జూన్ 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

7. ముందు వెనుకలు

ముందూ, వెనుకా, శబ్దాలు తెలుగు భాషలో సామాన్యుల నుంచి మేధావుల దాకా అన్ని వర్గాలకు చెందిన వ్యక్తులు, వక్తలూ తాము మాట్లాడే సంభాషణల్లో, తమ పద్యగద్య కవితలతో సమాచార నివేదిక రచనల్లో ఎంతో విరివిగా ప్రయోగించే తేలికయిన అచ్చతెలుగు (దేశి) మాటలు, కాని, అర్థగాంభీర్యంలో ఒక్కోసారి ఏ సంస్కృతశబ్దంతో అయినా పోటీపడి నిలబడగల సామర్థ్యం వీటికి వస్తూంటుంది – ప్రయోగసందర్భాన్ని బట్టి!

చాలా మాటల జంటలలాగ, ఇవి కూడా చూడడానికి (పైకి) పరస్పరం వ్యతిరేకమైన అర్థాలతోనే స్ఫురిస్తాయి రెండూ కలిపి వాడినప్పుడు మాత్రమే! విడివిడిగా వాడినప్పుడు మాత్రం చిత్రంగా ఒకదాని అర్థం రెండోది పూర్తిగా సొంతం చేసుకుంటుంది – ఒక్కొక్కసారి !

నిఘంటువులో 'ముందు' శబ్దానికి అర్థాలలో పూర్వకాలం, తొలి, మొదలు పురోభాగము, ఎదురు, వీటిలో వెనుక అనే అర్థం లేదు కాని, 'వెను', 'వెనుక' శబ్దాలకిచ్చిన అర్థాలే కొన, పృష్ఠభాగము(తోక), పశ్చాద్భాగము, అంటే తరువాత భాగము ఇవి మాత్రం 'వెను'కకి ప్రత్యేకం.

నందూరి సుబ్బారావు గారి యెంకి పాటలో యీ జంట మాటల సార్థకమైన ప్రయోగం ప్రసిద్ధమైంది ఈ శతాబ్దితొలి సగంలో !

'యెనక జల్మములోన యెవరమో'నంటి
సిగ్గొచ్చి నవ్వింది సిలక నా యెంకి
'ముందు మనకే జల్మముందోలే' యంటి!
తెల్లతెలపోయింది పిల్ల నా యెంకి!

ఈ పాటలోని 'యెనక జల్మము' అంటే గతజన్మమే! 'ముందు జల్మము' రాబోవు భావికాలానికి చెందినది.

వర్తమానంలో ఈ పాటను పాడుతున్న నాయుడుబావకి ఆ అర్థంతోనే ఆ 'యెనకా', 'ముందూ' శబ్దాలు పలికాయి!

'ముందు వచ్చిన చెవుల కంటే వెనక వొచ్చిన కొమ్ములు వాడి' అనే సామెతలో

'ముందు' అంటే పుట్టడంతోటే ఉన్న చెవులు, 'వెనుక' అంటే ఆ తరువాత కొన్నాళ్ళకు వచ్చిన కొమ్ములు! పార్వతీ పరమేశ్వరుల సంతానంలో జ్యేష్ఠుడైన కుమారస్వామికి వెనుక అంటే తర్వాత పుట్టిన వినాయకుడు వెనకయ్య అంతే అవడంలో విచిత్రం లేదు. కుమారస్వామికి 'వెనుకయ్య' 'వెన'కయ్య అంటే వెనకయ్యకంటే వెనుక అంటే ముందు పుట్టినవాడు అనే అర్థంలో ప్రయోగం విచిత్రం!

ముందడుగు అంటే ప్రగతి – విజయపూర్వకంగా భవిష్యత్తులోకి సాగించే గమనమూ, వెనుకంజ అంటే పరాజయం పొంది ఉన్న స్థలం నుంచి వీపున్న వెనుక వైపుకు పారిపోవడం! ముందడుగూ, వెనుకంజా – రెండూ కూడా వర్తమానంలో ఉండిన చోటు నుంచో, స్థితి నుంచో స్థలంలో ముందూ, వెనుకా అయినా, కాలంలో మట్టుకు భావిలోకి సాగేవే! వెనుక ముందడుగు అనినా, ముందడుగు వెనుక పెట్టు అనినా పరాజయం పొందడమే! మునుపూ, ముందరా అన్నా, 'వెనకటికి' అన్నా పూర్వకాలానికే పేర్లు! మున్ను – ముందు అంటే అంతమూ, కడా లేక కడపటా అనే అర్థాలూ కూడా ఉన్నాయి. వెన్ను 'వీపునకు మెడ కింద నుంచి పిరుదుల మధ్య దాకా ఉండే నిలువు – దానికి లోపల వెన్నెముకా లేక వెన్నుపాము అనే శరీరావయవభాగం కుండలినీశక్తి అనే అపూర్వ యోగశక్తికి కార్యస్థానం!

ముంజేతి కంకణం చూసుకోడానికి అద్దాన్ని వెదకం! ముంగురులు సర్దుకోడానికి మాత్రం అద్దం కావాలి. చక్కగా పండిన వరిచేనులో ప్రతి మొక్కా ధాన్యపుగింజలతో బరువెక్కి వెన్నులు పోస్తుంది. వెన్ను పాన్పు అంటే విష్ణుని శయ్య –శేషశయ్య– అంటే ఆదిశేషుడనే మహానాగం! అదే కాలనాగం అయితే, దాని తోకను తానే కబళించే ఆ నాగపు నోరు– అదే ముందు– అది వర్తమానం అనే క్షణాన్ని మింగడానికి వస్తున్న భవిష్యత్తనుకుంటే, వెనుకా ముందూ కలిసిపోయే చోటు ఎప్పటికప్పుడు తక్షణం లేక తాత్కాలికక్షణం అవుతూ ఉంటుంది.

భావతరంగం భావి వైపు చూస్తుంటే ముందు చూపూ, గతం వైపు చూస్తుంటే వెనుక చూపూ! వెనుక చూపులో గతాన్ని గురించి అన్వేషణ ఉంటుంది. ఆ అన్వేషణలో వెనక్కు వెనక్కి జరుగుకుంటూ పోతే అన్నిటికంటే వెనుకటిదీ, ముందటిదీ తొట్టతొలుతదీ కావడం అత్యంత అపూర్వమూ, విచిత్రమూ అనిపిస్తుంది. అందుకే వెంకటేశ్వరుడు అనే పేరు 'వెనుకటి ఈశ్వరుడు' అంటే, అన్నిటికి ఆదిమూలమైన మొదటి దేవుడు అని నేను చెబుతూ వచ్చాను. 'వెనకయ్య' లాగే వెంకయ్యా, వెంకన్న కూడా వెనుక శబ్దంలో నుంచి ఏర్పడిన తేట తెలుగు దేశి పేర్లు అని నా ఊహ! ■

10, జూన్ 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

8. 'వైఖరి'

నా భావతరంగాలలో నుంచి వెలువడిన మాటలు వాక్యాలై ఎదుటి మనిషికి వినిపించినప్పుడూ, వెంటనే మీకు అర్థమై, భావాలు నచ్చి, వ్యాసాన్ని పూర్తిగా చదివించకపోతే నా 'వైఖరి' బాగులేదంటాము. ఆకర్షించి చదివేటట్లు చేస్తే 'వైఖరి' బాగుంటుందన్నమాట. మాటకీ, వ్రాతలకీ, ఉపయోగింవడలసిన 'వైఖరి' అనే శబ్దాన్ని– మన మామూలు సంభాషణలో వాడి, 'వైఖరి' చాలా ఆకర్షణీయంగా ఉంటుందనీ 'వైఖరి' అనే మాటని వాడుకుంటూంటాం.

నిజానికి మనిషికీ, మనిషికీ మధ్యా, మనిషికీ, సమాజానికీ మధ్యా, భావవేదనకీ, సమాచార ప్రచారానికీ, వినోదవిజ్ఞానప్రసారానికీ మనం నిత్యం వినియోగించే మాటలు ఇన్నీ అన్నీ కావు. మనుష్యులెందరు జాతులు, ఎన్ని భాషలు ఉన్నాయో, అన్ని భాషలలోనూ మాటలు– మాటలు! ప్రచారమాధ్యమాలైన పత్రికలలో, రేడియోలో, టీవీలో మాటలు, మాటలు! వాక్యాలు, వాక్యాలు! వీటన్నిటిలోను 'వైఖరి' బాగుంటేనే నివేదనమూ, ప్రసారమూ సుకరంగా సాగిపోతుంటాయి. 'వైఖరి'బాగులేకపోతే రేడియో, టీవీ స్విచ్ ఆఫ్ చేస్తాము. మాటాడే మనిషిని వినిపించుకోక పెడమొగం పెడతారు. పత్రిక మడత పెట్టి అటక ఎక్కిస్తాం.

శాబ్దికులయిన మన పెద్దలు, లోకంలో మాటలతో జరిగే ఈ వ్యాసంగం అంతటినీ కలిపి 'వాగ్వ్యాపారం' అన్నారు. సంభాషణల్లోను, వేదికల నుంచి వినబడే ఉపన్యాసాలలోను, విలేఖరుల వ్రాతలలోను, గ్రంథకర్త రచనలలోను జరిగేదంతా భావం అంటూ మనస్సులో పుట్టి, కొన్ని పరిమాణాలను చెంది రూపురేఖావిలాసాలను పొంది మాటగా, వాక్యంగా రూపొంది బహిర్జగత్తులో వ్యాపించే దశను 'వైఖరి' దశ అనీ, ఈ నాల్గవ దశకు ముందుగా మూడు దశలున్నాయనీ, వాటి పేర్లు పరా, పశ్యంతీ, మధ్యమా అనే మూడు దశలనీ చెప్పారు.

భావం శబ్దాలుగా రూపొంది. ఆ శబ్దాలు వాక్యాలుగా రూపొంది, వ్యాసంగా తయారయే మానసిక వాగ్ వ్యాపారంలో కలిగే దశలను పాఠకులకు అర్థమయేటట్లు చెప్పాలంటే రచయితనైన నాకు ఆ దశలు ఎలా కలిగాయో చెప్పాలి. మొదటిది –

పరా. మూలాధార జన్యమయిన వాక్కు. మనుష్యులందరిలోను కేవలం ఒకే విధమైన వెలుగుగా యోగశాస్త్రంలో చెప్పిన మూలాధారచక్రం నుంచి నాభివరకూ సాగే నాడీ మండలంలో మినుక్కు మినుక్కుమని మెరుస్తూంటుంది.

మూలాధారచక్రం - ఆసనస్థానంలో ఉంటుంది. ఆ తర్వాత స్వాధిష్ఠానచక్రం జననేంద్రియస్థానంలో ఉంటుంది. ఆ పైని నాభి (బొడ్డు) దగ్గర మణిపూరకచక్రమూ, హృదయం(గుండె) వద్ద అనాహత చక్రమూ, ఆపైని కంఠంలో థైరాయిడ్ గ్లాండ్ వద్ద విశుద్ధిచక్రమూ- ఈ నాలుగు చక్రాలూ మనుష్యుల వాగ్ వ్యాపారం పనిచేసే నాడీమండలక్షేత్రానికి సంబంధించినవి. ఈ చక్రాలకు పైని కనుబొమ్మల మధ్య సుషుమ్న వద్ద ఆజ్ఞాచక్రమనీ, నడినెత్తిన మాడుపట్టు వద్ద సహస్రారచక్రమనీ ఉన్నాయి. సహస్రారచక్రాన్ని అంటి ఉన్న తలలో పెద్ద మెదడూ, దాని కింద ముచ్చెల గుంట వరకూ చిన్న మెదడూ ఉంటాయి. ఈ మెదడు భాగాల నుంచి దేహంలో అన్ని అవయవాలకూ లాగే, ముందు చెప్పిన ఆరు చక్రాలకూ నాడీతంతువులు అల్లుకొని ఉంటాయి. ఇదంతా ఆజ్ఞావార్తా ప్రసార తంత్రీజాలం అంటే (Nervous System) ఒక టెలిగ్రాఫిక్ నెట్‌వర్క్‌లాగా బద్ధమై ఉంటాయి. వాగ్ వ్యాపారపు ప్రథమదశ మూలాధారచక్రం నుంచి నాభి దగ్గరి మణిపూరక చక్రం వరకూ మినుకు మినుకుమనే వెలుగులోంచి భావతరంగాలు రూపరహితస్థితి లోంచి పశ్యంతీదశకు చేరినప్పుడు, భావాలకు అర్థం ద్యోతకమయే పరిణామం కలుగుతుంది. నేను వ్రాసేది నలుగురికీ అర్థం కావడానికి వీలుగా మూర్తిమంతములైన ఉపమానాలు చెప్పాలి - అనే ఈ భావం నాకు పశ్యంతీదశలో స్ఫురిస్తుంది. ఈ వాక్యం నాకు మానసికంగా అక్షర రూపంలోను, ధ్వన్యాత్మకంగానూ కనబడి, వినబడే దశ మాధ్యమం - అనీ, మానసికమైన ఒక టేప్ రికార్డర్‌పై ఆ వాక్యం వినబడుతుందనీ తెలుసుకోవాలి. ఆ వాక్యం ఏ అక్షరాలతో కంఠంలోని భాగాలను కదిపితే స్పష్టంగా పైకి వచ్చేటట్లు పలికిస్తుందో, కలం చేత వ్రాయిస్తుందో అది 'వైఖరి'!

మూలాధారం నుంచి ఆజ్ఞాచక్రం వరకూ వెన్నెముక ద్వారా వ్యాపించిన నాడీమండలంలోని నరాలన్నీ మన భావ-భాషణాది వాగ్వ్యాపారాన్ని సాగించడానికి తోడుపడతాయనే విషయం యోగశాస్త్రం చెప్పింది. యోగశాస్త్రంలోని అంశాలను ఆధునిక శరీరనిర్మాణశాస్త్రం (ఫిజియాలజీ)లోని అంశాలతో సరిపోల్చి, సర్ జాన్ వుడ్రోఫ్ వంటి పాశ్చాత్యవైజ్ఞానికులు 'కుండలినీశక్తి' అనే గ్రంథంలో వ్రాశారు. మూలాధారం నుంచి సహస్రారం వరకూ వ్యాపించిన వెన్నుపాము అనే కుండలిని ద్వారా, 'ఓంకారం', ఏ

తంత్రీ మీటకుండానే మోగుతూంటుంది. త్యాగరాజు వంటి నాదతపస్వులు, యోగాభ్యాససిద్ధులూ, ఆ ప్రణవనాదాన్ని వినగలుగుతారు. ఒక్కొక్క చక్రం వద్ద కొన్ని మంచి గుణాలను, కొన్ని చెడ్డ గుణాలను, మంచి భావాలను, చెడు భావాలనూ కలిగించే రేకులుంటాయి. అందుకే అనాది నుంచి చెడు నుంచి మంచికీ, అసత్తు నుంచి సత్తుకూ, తమస్సు నుంచి జ్యోతికీ, మృత్యువు నుంచి అమృతత్వానికీ మేలుకొలుపమని వేదర్షుల ప్రార్థన. వాగ్వ్యాపారపు తొలి దశయైన 'పరావాక్కు'కు నిలయమైన స్థితిలో మనుష్యులందరికీ అంతరాత్మ అనదగిన పరమాత్మ వెలుగుతూ ఉంటుంది. అందుకే కాళిదాసు తపోధ్యానమగ్నుడైన శివుణ్ని 'ఆత్మానం ఆత్మని అవలోకయంతం' – తనదైన మూర్తినే తనలో దర్శిస్తున్నవాడని వర్ణిస్తాడు. ■

17, జూన్ 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

9. అలనాటి మద్రాసు రేడియో డైరెక్టర్లు

ఆ నాడు బ్రిటిష పరిపాలనలోని దక్షిణభారతానికంతకూ అవిభక్త మద్రాసు రాష్ట్రానికి రాజధానియైన మద్రాసు ఒకటే 1938 జూన్ 16న ఏకైక రేడియో కేంద్రంగా ప్రారంభం అయింది. 1939 జూన్ – జూలైలలో తిరుచ్చిరాపల్లి కేంద్రం వచ్చింది. తిరుచ్చి కేవలం తమిళ కార్యక్రమానికి. కాని మద్రాసు నుంచి – తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం – నాలుగు భాషాప్రాంతాల సంస్కృతులనూ ప్రతిబింబించే కార్యక్రమాలు ప్రసారం అయ్యేవి. నేను క్యాజువల్ ఆర్టిస్టుగాను, రచయితగాను పాల్గొన్నాను.

1942 జూలై 1వ తేదీన నేను మద్రాసు రేడియోలో నిలయ కళాకారుడుగాను, రచయితగాను చేరాను. అప్పటి ప్రోగ్రామ్ ఆఫీసర్లకు ఒకరిద్దరు కళాకారుల్ని వ్రాత పనులకీ, చేదోడువాదోడు పనులకీ కేటాయించేవారు. నేను ఆచంట జానకిరాం గారికి సహాయకుడుగా పనిచేసేవాణ్ణి. కార్యక్రమనిర్వహణలో గాని, ఆఫీసు కార్యనిర్వహణలో గాని ఒక్కొక్క సమస్య వచ్చినప్పుడు, "నువ్వు ఆర్టిస్టుగానే ఉండిపోతావా, ప్రోగ్రాం ఆఫీసరువీ, స్టేషన్ డైరెక్టర్‌వీ ఎప్పటికి కాగలుగుతావయ్యా ఇలాగయితే? అన్ని విషయాల పైనా చిన్న విషయాలపైనా కూడా సర్వసమగ్రమైన దృష్టి ఉంచుకోవాలి" అనే వారు. నాకు మాత్రం ఏదో పాటో, నాటకమో వ్రాయడమో, రిహార్సలు చేయడమో, దానిని ప్రసారం చేయడమో అదే ధ్యేయంగా అంతిమ గమ్యంగా అనిపించేది – 1943లో ప్రోగ్రాం అసిస్టెంట్ పదవికి దరఖాస్తు పెట్టి, ఆగస్టు 15న ఇంటర్వ్యూలో నెగ్గి, 1944లో ప్రోగ్రాం ఆఫీసర్ గాను, ఎగ్జిక్యూటివ్‌గాను సెలక్ట్ అయినప్పటికీ, కార్యక్రమ నిర్వహణా, దేశంలోని పలువురు రచయితలు, కళాకారులు రేడియో కార్యక్రమాలలో పాల్గొనేటట్లు ప్లాన్ చెయ్యడమూ – ఆ కార్యక్రమాలలో వారి విజయం నా విజయంగా భావించి తృప్తి చెందడమూ, గమ్యం అనుకునేవాణ్ణి.

ఆ మొదటి పదేళ్లలో మద్రాసు కేంద్రాన్ని నిర్వహించిన డైరెక్టర్లను, వాళ్ల పరిపాలనా పద్ధతులూ, సామర్థ్యమూ, వ్యక్తిగత విశిష్టచాతుర్యాలూ, వివిధ విషయ పరిజ్ఞానమూ చూస్తుంటే వాళ్లు విలక్షణ వ్యక్తులుగా, ఎంతో ఎత్తుగా పైకి తలెత్తి చూడవలసిన వాళ్లుగా కనిపించేవారు. అటువంటి డైరెక్టర్ కుర్చీలో ఒక నాటికి నేను

కూర్పుని, కేంద్రాన్నీ, దాని వివిధశాఖలనీ, దానిలోని కళాకారులనీ, రచయితలనీ, ఉద్యోగులనీ, ఆ డైరెక్టర్లు దిద్దుకుని నడిపించినట్లు చేయగలుగుతానన్న ఆశ ఏ కోశానా ఉండేది కాదు.

మద్రాసు కేంద్రపు డైరెక్టర్లలో మొట్టమొదటి ఆయన పేరు విక్టర్ పరంజ్యోతి. ఆయన మద్రాసులోని సెయింట్ ఆండ్రూస్ చర్చిలో 'కోయిర్ లీడర్' గాయకబృంద నాయకుడు. కొన్నాళ్లు 'ది మెద్రాస్ మెయిల్' ఇంగ్లీషు దినపత్రిక సంపాదకవర్గంలో పని చేశారు. 1938 జూన్ 16న మద్రాసు కేంద్రం ప్రారంభం అవుతుండగా ఆయననే స్టేషన్ డైరెక్టరుగా వేశారు. మద్రాసు కేంద్రపు పాశ్చాత్యసంగీత నిర్వాహకులూ, ఇంగ్లీషు కార్యక్రమ నిర్వాహకులూ ఎందర్నో ఆయన రూపొందించారు. తన తర్వాత తనంతటి వాడుగా, కోయిర్ లీడర్‌గా, పాశ్చాత్యసంగీత ప్రయోక్తగా, ప్రొడ్యూసర్ ఎమెరిటస్ రాష్ట్రపతి గౌరవాన్ని అందుకున్న శ్రీ హెండెల్ మేన్యూల్ శ్రీ పరంజ్యోతికి శిష్యవర్గంలో ప్రధానుడు. నేను నా తొలి కార్యక్రమాలలో చండీదాసు నాటకంతో మద్రాసు చేరినప్పుడు డైరెక్టర్ శ్రీ పరంజ్యోతే. ఆ తరువాత ఆయన కలకత్తా, బొంబాయి ఆల్ ఇండియా రేడియోలకు డైరెక్టర్‌గా వేరు వేరు వ్యవధుల్లో పని చేసి, ఢిల్లీలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ పదవిలో కొంత కాలం పని చేసి, 1947 ప్రాంతంలో తిరిగి బొంబాయి డైరెక్టర్‌గా పనిచేసి రిటైరయ్యారు.

1942లో నేను మద్రాసు కేంద్రపు నిలయకళాకారుడుగా చేరినప్పుడు, స్టేషన్ డైరెక్టర్ శ్రీ ఎస్. గోపాలన్. ఈయన కామర్స్ గ్రాడ్యుయేట్. చిన్ననాటి నుంచీ రేడియో ప్రసారాలంటే చాల ఇష్టమూ, కుతూహలమూ ఉండేవి. 1933లోనే 'HAM' ఔత్సాహిక రేడియో షార్ట్ వేవ్ ప్రసారాలకు లైసెన్సు తీసుకున్నవారు. కొన్నాళ్ళు 'హిందూ' ఆంగ్ల దినపత్రికకు వారం వారం సమాచారవ్యాసాలూ, ప్రకటనలూ పర్యవేక్షిస్తుండేవారు. 1936లో ఆల్ ఇండియా రేడియోలో రీసెర్చి ఆఫీసర్‌గా చేరారు. తరువాత డైరెక్టర్ జనరల్ లయొనెల్ ఫీల్డెన్ ఆయనను 1939 జూలైలో తిరుచ్చిరాపల్లి రేడియో కేంద్రానికి డైరెక్టర్‌గా వేశారు. 1941లో మద్రాసు కేంద్రంలో నేను చండీదాసు ప్రసారం చేసినప్పుడు డైరెక్టర్ ఆఫ్ ప్రోగ్రాం గాను, ఆ తరువాత ఎసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్ గా పనిచేసిన జి. త్యాగరాజ శాస్త్రిని తిరుచ్చికి డైరెక్టర్‌గా పంపి, తిరుచ్చిలో డైరెక్టర్‌గా ఉండిన గోపాలన్‌ను మద్రాసు డైరెక్టర్ చేశారు. 'సంగీతం వంటి కళల సంప్రదాయాన్ని పోషించాలి. పరిరక్షించాలి' అనే విధానం శాస్త్రి గారిది. 'నిత్యరచనాశీలమైన కళలలో కొత్త పుంతలు తొక్కడాన్ని ప్రోత్సహించాలి' అనే విధానం గోపాలన్‌గారిది.

గోపాలన్ గారి దగ్గరకు రేడియో ప్రసారానికి వచ్చిన వ్యక్తులు, రచయిత గాని,

సంగీతవిద్వాంసుడు గాని, చిత్రకారుడు గాని, విజ్ఞానశాస్త్రవేత్త గాని, ఆర్థికశాస్త్రనిధి గాని ఎవరు వచ్చినా వారి వారి విషయాలలో తనకు కూడా ఎంతో ప్రవేశమూ, శ్రద్ధా, కుతూహలమూ ఉండినట్లు వారి సంభాషణ సాగేది. అవతలివారు ఆశ్చర్యపోయేవారు. ఈయనకిన్ని విషయాలెలా తెలుసని.

అత్యంతం ఆయనకు ఇష్టమైన కార్యక్రమం - ఆయన స్వయంగా స్టూడియోలో కూర్చుని నిలయవిద్వాంసులతో - కళాకారులతో పనిచేయించిన ప్రత్యేక కార్యక్రమం - 'సంగీతంలో రమ్యాలోకం' (నూతన ప్రయోగాలు). 'రీమా' అనే 'పెన్' నేమ్‌తో ఆర్. వైద్యనాథన్ అనే జెమినీ స్టూడియోలోని సంగీత ప్రయోక్త, బాలచందర్, నారాయణ అయ్యర్, రజని, 'నియాజి' అనే పెషావర్ నుంచి వచ్చిన అసిస్టెంట్ డైరెక్టరూ వంటి విద్వాంసులను, కళాకారులను స్టూడియోకి పిలిపించి పాత సంగీత వరుసలలో కొత్తదనం ఎలా వస్తుంది? పంజాబీ వరుసలలో కొన్నిటికి కొత్త మెరుపులు జోడిస్తే ఆకర్షణీయమైన లలిత గేయంగా ఎలా రూపొందుతుంది? ఇలాంటి ఈ కార్యక్రమాలలో ఈమని శంకరశాస్త్రి అయిదు వీణలతో చేసిన 'ఆదర్శశిఖరారోహణం' మరువరానిదీ - చాలా పేరు పొందినదీను. ఎవరెస్టు శిఖరం పై సాధించిన విజయం ఆదర్శశిఖరారోహణం! వాద్యగోష్ఠిలో అక్షరాలు లేకుండా కూర్చిన సంగీతంలో భావరూప కల్పనా, కథాకల్పనా, ఆ కథకు శీర్షికపెట్టడమూ- ఈ ప్రయోగంలో తయారయింది. ఈ కల్పనలకూ, శీర్షికలకూ, నాకు తొలి శిక్షణ గోపాలన్ ద్వారానే! ■

24, జూన్ 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

10. సంగీత రీతి ఏదైనా రసభరితమే !

మధ్య ప్రాచ్యసంగీతపు ఆలాపనా పద్ధతుల్ని మా 'రజని' అవలీలగా తన లలితసంగీతంలో పాడేశాడని డైరెక్టర్ గోపాలన్ గారు సగర్వంగా చెప్పడం వల్ల. ప్రత్యేకంగా మోజు పడి, ప్రసిద్ధ వాహినీ ఫిల్మ్ డైరెక్టర్ బి.ఎన్. రెడ్డి తాము అప్పుడు తీస్తున్న 'స్వర్గసీమ' చిత్రంలోకి నా చేత 'ఓహెూ పావురమా' మొదలైన అరబ్బుజను పాటలు వ్రాయించుకున్నారు.

స్టూడియోలో రిహార్సల్సుతోనో, రికార్డింగ్‌తోనో రాత్రి పన్నెండూ – ఒంటిగంటా దాటిపోతే, కార్యక్రమంలో పాల్గొంటున్న కళాకారుల్ని రేడియో వ్యాన్‌లో ఇళ్లకు పంపుతూ, గోపాలన్ గారు, నన్ను మాత్రం స్వయంగా తన కారులో మైలాపూర్‌లో దిగబెట్టేవారు. నీ గదిలో దీపం ఇంకా వెలుగుతూ మీ ఆవిడ ఎదురు చూస్తోందని చెపుతోందనేవారు.

నూతనరీతుల క్రియాశీలతకు సంప్రదాయపరిధులు అడ్డురాకూడదనే విధానం గోపాలన్ గారిదయితే, ఆయన తర్వాత మద్రాసు కేంద్రపు డైరెక్టరయిన జి. త్యాగరాజశాస్త్రి క్రియాశీలతలో ఏ కొత్త పోకడలు పోయినా, సంప్రదాయపరిధులలోనే ఇరపాలనే విధానం పాటించేవారు.

రేడియోకు రాక పూర్వమే నా సంగీతరచన – రెండు ప్రవాహాలలో సాగుతూ వచ్చేది. ఒకటి సంప్రదాయపరిధులలో ప్రసిద్ధకర్ణాటక రాగాలతో రసవంతంగా, భావయుక్తంగా సాహిత్యాన్ని పాడించే ధోరణీ, మరొకటి సమకాలీన ఆంధ్రేతరభారతీయ సంగీతధోరణులూ, ప్రపంచసంగీత ధోరణులూ, మన పాటలకు నప్పేటట్లు వాడుకోవడము. రెండోది గోపాలన్ గారికి నచ్చితే (మొదటిది ఆయనకు నచ్చలేదని కాదు) మొదటి ధోరణి వల్ల త్యాగరాజశాస్త్రిగారు కూడా నా పని పట్లా, నా పట్లా ఆదరణ చూపారు. నేను విద్యార్థి దశలో 18 ఏట చేసిన 'పసిడి మెరుంగుల తళతళలు' అనే తెలుగుతల్లి పాట ఆనంద భైరవి రాగంలో సంప్రదాయపరిధిలో విశిష్టమైన పోకడలో కూర్చడం వల్లనే అనుకుంటాను, శాస్త్రిగారు నన్ను ఆఫీసు పని అయిపోయాక వారింటికి రప్పించుకుని, ఆ తెలుగు పాట సాహిత్యమూ, స్వరమూ దేవనాగరీలిపిలో వ్రాయించి

వారి శ్రీమతికి చెప్పించారు. 'ఆఫీసు పని అయిపోయాక' అనే మాటలు శాస్త్రిగారి వ్యక్తిసంబంధం విషయాలలో, మర్యాదలలో మరిచిపోరాని విషయం. జి.టి. శాస్త్రి అంటే ఆయన ఆఫీసుకు వచ్చి పొద్దుటే మెట్లెక్కుతుంటే స్టూడియో టయిం తొమ్మిది అయిందన్నమాట, సాయంత్రం ఆయన మెట్లు దిగుతుంటే 5 గంటలు కొట్టిందన్న మాట. తిరిగీ ఆయన డ్యూటీ రూంకి వచ్చారంటే ఏడు గంటలయిందన్నమాట. ఈ అలవాట్ల వల్ల ఆయన్ని గడియారం త్యాగరాజశాస్త్రిగారనేవారం.

నా మొదటి సంగీతనాటకం రేడియోలో చేరక పూర్వం–విన్న అధికారులలో త్యాగరాజశాస్త్రిగారు కూడా ఉన్నారు. దానికి నేను వాడిన బెంగాలీ సంగీతం శాస్త్రిగారికి వ్యక్తిగతంగా ఇష్టం కాదు. అయినా ఆ నాటకాన్ని అంగీకరించడానికి వెనుకాడలేదు. ఆయనే అడిగారు అప్పుడు. 'మన కర్ణాటక సంగీతసంప్రదాయంలో కూడా నువ్వు వరుసలు అమర్చగలవా' అని, గ్రీష్మఋతువు అనే సంగీతనాటకం గౌళ, మోహన, మందారి, శహన వంటి రాగాలలో కూర్చాను. ఆ తర్వాత దివ్యజ్యోతి, మేఘదూత వంటి కొన్ని నాటకాల్లో సంప్రదాయ సంగీతమే అమర్చాను. రసస్ఫోరకత్వానికి కర్ణాటక సంగీతం కూడా సమర్థమే అనీ, సంగీతరచయితలో ఉంది కాని, సంగీత పద్ధతి ఏదీ రసహీనం కాదని నా మతం అంటే ఆయనకు నచ్చేది.

ఆ రోజులలో జాతీయసంగీత కార్యక్రమాలకు బదులు ఢిల్లీ నుంచి రాత్రి 8–30 నుంచి 9–15 దాకా మ్యూజికల్ రౌండప్ అనే కార్యక్రమం వచ్చేది. ఒక్కొక్క కేంద్రంలో తయారైన విశిష్టమైన క్రియాశీలమైన అయిదు నిముషాల కార్యక్రమాన్ని నిర్మాత గురించీ, రచయిత గురించిన వివరాలు చెబుతూ ప్రసారం చేసేవారు. అది ఒక ప్రతిష్ఠాపూర్వకమైన కార్యక్రమం అన్నమాట.

'హల్బులబ్బులా ఆయీ, ఆయ ఆయీ ఆపదల గాయీ, ఏడవకు ఏడవకు వెర్రి అబ్బాయి, ఏడిస్తే నీ కళ్ల నీలాలు గారూ', అని మా వేంకట–పార్వతీశ్వరకవులు ఒకటవ తరగతి బాలగీతావళిలో సమకూర్చిన పాటని నేను ఒక చౌచౌ–కార్యక్రమంలో కుమారి ఎస్. వరలక్ష్మి చేత ఆనందభైరవి రాగంలో తల్లుల జోలపాట వరుసలో పాడించాను. అలాగే 'ఘనా ఘనా ఘనా గర్జించవా ఘనా శని' (ఘన+అశని) అనే సొంత గేయాన్ని మేఘరంజని రాగంలో వాద్యనేపథ్యంతో సహా గాలీ, వానా రాగస్వరాలలో కలిపి కీ.శే. ఘంటసాల చేత పాడించాను. ఈ రెండూ శాస్త్రిగారు ఎంపిక చేసి, ఢిల్లీ పంపి ప్రసారం చేయించారు. ఈ రెండింటిలో కూడా ఆయన కోరే సాంప్రదాయికతా, రసవత్తా జాతి సంస్కృతి ప్రతిబింబించడమూ వంటి సుగుణాలుండటమే ఆయన ఎంపికకు కారణం అయ్యాయి.

1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పుడు ఆ అర్ధరాత్రి (1947 ఆగస్టు 14/15) ప్రధాని నెహ్రూ ప్రసంగం కావడంతోనే మద్రాసు నుంచి – సుబ్రహ్మణ్య భారతి తమిళ గేయం 'ఆడువోమే', డి.కె. పట్టమ్మాళ్‌చేతా, రజని తెలుగు గేయం 'ఉదయమ్మాయెను స్వేచ్ఛాభారతి' – టి. సూర్యకుమారి చేతా పాడించటానికి ప్రతిపాదించినారు డైరెక్టర్ గోపాలన్‌గారు. 1948లో నాచేత భగవద్గీత, ఉపనిషత్తులూ చదివించినవారు శాస్త్రిగారు.

ఒక సాయంత్రం 5 గంటలకి డైరెక్టర్ శాస్త్రిగారి సమక్షంలో మా స్టాఫ్ అంతా ఒక పార్టీకి సమావేశం అవుతున్నాం. నేను సరిగ్గా 5 గంటలు అయేసరికి హాలులో ప్రవేశించాను. అప్పుడప్పుడు మరిచిపోవడం అనే నా దౌర్బల్యం గురించి కర్ణాకర్ణిగా విన్న శాస్త్రిగారు, నన్ను చూసి, "రజనీ హేజ్ ఫర్గాటెన్ టు ఫర్‌గెట్" – (రజనీ మరిచిపోవడాన్నే మరచిపోయాడీవేళ) అన్నారు. అంతా గొల్లుమని నవ్వారు.

వీరందరి వద్దా తర్ఫీదు పొంది, మంచి పబ్లిక్ రిలేషన్సు ద్వారా, ఉన్నతస్థాయి అధికారులలో ఒకరుగా పైకి వచ్చినవారు సూరినారాయణమూర్తి (ఎస్.ఎన్.మూర్తి). ఈయన బొంబాయి, కలకత్తా, లక్నోలలో ఆయా పదవులు నిర్వహించి, ఏభైలలో మద్రాసు డైరెక్టరయ్యారు. అప్పుడు– 'భారత్ కే సంత్ కవి' అనే సంగీత రూపకాన్ని (భారతదేశపు భక్తియోగులు) మద్రాసులో ప్రదర్శించడానికి వచ్చిన పంకజ్ మల్లిక్ మూర్తిగారి గదిలోకి అతిథిగా వచ్చి కూచున్నారు. మూర్తిగారు నన్ను పిలిపించి – ఇదుగో ఇతడు మీకు ఏకలవ్యశిష్యుడు. మీ వంగదేశపు కవీశ్వరుడి మీద సంగీతనాటకం వ్రాసి ప్రసారం చేశాడు పదేళ్లక్రితం – అని చెప్పి, నా చేత నా చండీదాసులోని రెండు పాటలు పాడించారు. అప్పుడు – ఆ పాటల్లో (తెలుగు పాటలో) పంకజ్ మల్లిక్ బెంగాలీ పాటల్లోను, హిందీ పాటల్లోను వినిపించే వ్యక్తిగతమైన రాగసంగతులను, తెలుగుతనం ఏ మాత్రమూ చెడకుండా తెలుగు పాటలో వినిపించిన నన్ను, పంకజ్ మల్లిక్ ఆనందబాష్పాలతో కౌగిలించుకోవడం నేను ఎన్నడూ మరిచిపోలేని సంఘటనల్లో ఒకటి.

గోపాలన్, శాస్త్రి వంటి ఆదర్శప్రాయులైన డైరెక్టర్ల ఆదరాభిమానాలు చూరగొని, ఆకాశవాణి కింది శ్రేణుల్లో పని చేసిన అనుభవం, తరువాత రెండు–మూడు కేంద్రాల డైరెక్టర్‌గా పని చేసినప్పుడు నాకెంత ఉపకరించిందో! ■

2, జూలై 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

11. మాట్లాడే శైలి - వ్రాసే శైలి

రెండు–మూడు దశాబ్దాల క్రితం నుంచి అప్పటి ప్రసిద్ధ వ్యాకరణాలలోని సూత్రాలకు అనుగుణంగా వ్రాస్తూ ఉండే గ్రాంథికభాషే వ్రాసే శైలి అనీ, దానికి భిన్నంగా ఆ సూత్రాలను పాటించని వ్యావహారిక భాషే మాట్లాడే శైలి అనీ, మాట్లాడేవారూ, వ్రాసేవారూ కూడా భావించడం పరిపాటయి పోయింది. అయితే ఈ పరిపాటిలో ఒక పొరపాటుంది.

ఉదాహరణకి ఈ శతాబ్ది ప్రారంభంలో అత్యంత జనాదరణ పొంది, గ్రాంథికభాషలో వెలువడిన రంగస్థలనాటకాలు ఒకటి – రెండు తీసుకుందాం. చిలకమర్తి వారి గయోపాఖ్యానంలో –

'అల్లుడా రమ్మని యాదరంబున పిల్వ
బంపు మామను బట్టి చంపగలవే!'
'పాతాళమున కేగి బ్రతుక వచ్చునటన్న
బలిచక్రవర్తినిన్ బట్టి యిచ్చు'

వంటి పద్యాల శైలి గాని తిరుపతి వేంకటకవుల ఉద్యోగవిజయాలలో –

'బావా యెప్పుడు వచ్చితీవు సుఖులే భ్రాతల్ సఖుల్ చుట్టముల్'
'జెండాపై కపిరాజు, ముందు సితవాజశ్రేణి'

ఇత్యాది పద్యాల శైలిగాని, ముఖ్యంగా వీరగ్రాంథికవాదియైన పానుగంటి లక్ష్మీనరసింహరావుగారి సాక్షి ఉపన్యాసాలలోను, జంఘాలశాస్త్రి ఉపన్యాసాలలోను ఆయన అవలంబించిన శైలి గాని, మాట్లాడే (సంభాషణ) శైలి (Conversational Style) నాటి ప్రయోగంలో గాని, సాక్షి వ్యాసాలు పత్రికారచనలుగా చదువుకోవడంలో గాని, ప్రేక్షకపాఠకవర్గాల అపారమైన ఆదరణ పొందగలగడమే గాకుండా, అక్షరాస్యులు కానివారికి కూడా పద్యాలు కంఠోపాఠంగా వచ్చేవి. అవి గ్రాంథికభాషలో సాగిన సంభాషణ (మాట్లాడే) శైలికి ఉదాహరణలు! ఇక వ్యావహారికభాషలో వ్రాసే శైలికి (రచనాలేఖన శైలికి) ఉదాహరణ, ఈ వ్యాసంలో ఇంత వరకు వ్రాసిన వాక్యాలే.

గ్రాంథికభాషా వచనరచనలో మాట్లాడే శైలిని అతిరమ్యంగా చొప్పించగల

మహాశిల్పి విశ్వనాథ సత్యనారాయణగారు. ఆయన శ్రీనాథుని శృంగారనైషధానికి వ్రాసిన పీఠికలోని వాక్యాలు.

"కలి యనగా పాపము వీడు గుణము కాదు. మానవులు కర్మలు చేయుదురు. కొన్ని పుణ్యకర్మలు. కొన్ని పాపకర్మలు. పాపకర్మలకు అధిదేవత కలి. ఒప్పుకొందుము. పుణ్యకర్మల కధిదేవత యెవ్వరు? పుణ్యదేవత యని లేదే! ఎందుకో! పాపమున కొక రూపమిచ్చి వానిని కలియన్నారు. అంతే కాదు. కాలము నాలుగు యుగములుగా విభజించి చివరి యుగము కలియుగమని, దాని మీద వాని నధికారిని చేసినారు!"

గొంతు బాగా పలుకుతూ ఉండే రోజుల్లో కృష్ణశాస్త్రి గారు నిత్య సంభాషణా చతురుడు. మంచి మాటకారి, ఆయన మాటల్లో కవిత్వమూ, లౌక్యజీవితవిమర్శా, తొణికిసలాడుతూండేవి. ఆ మాటాడే శైలి ఆయన రేడియో ప్రసంగాల రచనలో ఆయన వ్యక్తిత్వాన్ని పూర్తిగా ప్రతిబింబింపజేసేది, 'వక్త-శ్రోతలు' అనే శీర్షికను రేడియో ప్రసంగంలో

"ఎంత గడిదేరిన వక్తకయినా గద్దె మీదికి ఎక్కే ముందూ, ఎక్కిన రెండు నిమిషాల దాకా లోపల గుండె పీచుపీచుమంటూ ఉంటుందనుకుంటాను. వేయి మందితో కర్రతో చేడీ యుద్ధం చేయవలసినవాడు వక్త. పదహారు వేలమంది వివిధవిధాల వాళ్ల మనస్సులకు ఒకేసారి చక్కిలిగింత పెట్టవలసిన దక్షిణనాయకుడు వక్త. మెదడుతో ఉప్పట్టీ, చెడుగుడూ, కుండబంతీ, కోతి కొమ్మచ్చీ అంచెల మీద ఆడగలిగే నేర్పరి వక్త! వేదిక ఎక్కగానే సభ్యుల నందరినీ జాగ్రత్తగా చూసుకోవాలి. కొంత వరకు సభ సంగతి తెలిసిపోతుంది. తరువాత చిరునవ్వు మొగంతో మొదలుపెట్టాలో, శాంతంగా మొదలుపెట్టాలో, గంభీరంగా మొదలుపెట్టాలో తెలిసిపోతుంది."

మాట్లాడే శైలి ఆ రచయిత వ్యక్తిత్వాన్నీ, హావభావచేష్టల్నీ ప్రతిబింబిస్తూ కళ్ల ముందే కనబడేట్లు చేస్తుంది. ఆ శైలిలో ఆ మాట తీరు ఆయనదే తప్ప- మరో వ్యక్తిది ఎన్నటికీ కాదు. మరి, వ్రాసే శైలిలోని కూర్పులోని భావమూ వాక్యధోరణీ సాధారణీకరణ చెంది- ఎవరైనా అలాగే వ్రాస్తారు అనిపిస్తుంది. క్లాసులో 'కాంపోజిషన్' వ్యాసరచనలాగ.

మన ఆధునిక మహాకవులైన పెద్దలలో వ్రాసే శైలిలోనే మాట్లాడే అభ్యాసం గల రచయితలున్నారు. అందుచేత వారు మాటాడినా, వ్యావహారికభాషలో వ్రాసినా శైలీ తారతమ్యం కనబడదు. రాయప్రోలు సుబ్బారావుగారు గురుదేవులైన ఠాకూరుని గురించిన వ్యాసంలో-

"ఆచార్య శంకరులు అపారమైన సారస్వతమును తల్లి చనుబాలుగా స్తోత్రం చేశారు. ఈ ప్రసాదక్షీరములను మనము నేటికిని త్రావి, సంతుష్టి, పుష్టి పొందుతున్నాము.

శబ్దభాండము కన్నా నిజంగా అచ్ఛేద్యమూ, అదాహ్యమూ, అక్లేద్యమూ, అశోష్యమూ అయినదేమున్నది? అందువల్లనే అమృతచయనము చేసిన మహాకవులను స్మరించి, సంభావిస్తున్నాము. వారు శరీరమును విసర్జించినా అశరీరంగా లోకమును అనురంజిస్తూనే ఉన్నారు. ముందు కూడా ఇలాగే ఉజ్జీవనదాతలుగా ఉంటారు."

నవలారచయితలూ, కథానికారచయితలుగా ఒకే రచనలో రకరకాల శైలులను అవలంబించడం ఉంటూ ఉంటుంది. అది రచయిత కథ తాను చెపుతున్నట్లు వ్రాస్తే, ఒకలాగ ఉంటుంది. అదే కథనం ఏ పాత్రో చెపుతున్నట్లుగా ఉంటే శైలి పద్ధతి మారుతుంది. మొత్తానికి వ్యావహారిక భాషావాదయుగలక్షణంగా కాకుండా రేడియో మాధ్యమానికి వర్డ్ ఓరియంటేషన్‌తో వ్రాయాలి - అనే ఆశయాన్ని చదువరులకి పరిచయం చేయడానికి చేసిన ప్రయత్నం ఇది! ■

08, జూలై 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

12. ఆషాఢస్య ప్రథమదివసే...

ఆకస్మికంగా వచ్చిన ఏ అతిథిని గురించో, బంధుమిత్రుల్లో ఎవరి గురించయినా "ఏవిటిలా 'అమాంతంగా' ఎక్కణ్ణించో ఊడిపడ్డట్టు వచ్చావు?' అంటూంటాం. అక్కడ 'అమాంతం' అంటే ఆకస్మికంగా అనే అర్థం అని. ఆ అర్థంతో ఆ మాట వాడుతుంటాం. కాని దాని అసలైన అర్థం – 'అమా' అంటే 'అమావాస్య' ఆ 'అమావాస్య'తో అంతమయే నెలా – నెలాఖారూ అనీ. అంటే ఆ అతిథి – తనకు తగ్గ మర్యాదలు చేయతగ్గ పరిస్థితులు ఇంటిలో 'నిండుకొని' ఉండే నెలాఖరు వేళ వచ్చేడూ అని అసలర్థం అన్నమాట.

దక్షిణాది అంతటా, అన్ని భాషల వారికీ చాంద్రమానపునెలలు అమావాస్య తోటే అంతం అవుతాయి. ఉత్తరాదిన – ముఖ్యంగా ఆర్యావర్తంలో మాత్రం అలా కాదు. అక్కడి వారి చాంద్రమానపు నెలలు పూర్ణిమాంతములు. మాసం పూర్ణిమతో పూర్తయి ఆ మర్నాటి బహుళ పాడ్యమితో కొత్తమాసం ప్రారంభిస్తుంది. జ్యేష్ఠమాస పూర్ణిమ జూన్ 11న వస్తోంది కదా. దక్షిణాదివారి చాంద్రమానపు ఆషాఢం – ఆ పూర్ణిమ వెళ్లిన 15 రోజులకి 27వ తేదీన (అమావాస్య మర్నాటి) పాడ్యమితో ప్రారంభిస్తున్నాం కదా. కాని ఉత్తరాది వారి ఆషాఢమాసం – జ్యేష్ఠపూర్ణిమ అయిన జూన్ 11 కి మర్నాడే బహుళ పాడ్యమితో ప్రారంభిస్తుందని గ్రహించాలి. 'మా' అంటే చంద్రుడు 'అమా' అంటే చంద్రుడు లేని కనబడని దినం. 'నో మూన్!'. ఇంగ్లీషులో న్యూ మూన్ అంటే నెలవంక. పూర్ణిమ అంటే పూర్తిగా కనబడే చంద్రుడు – ఇంగ్లీషులో ఫుల్ మూన్.

అందుచేత, కాళిదాసమహాకవి మేఘదూతకావ్యంలో కుబేరశాపగ్రస్తుడై రామగిరిలో ప్రవాసం ఉండిన యక్షుడు, వసంత గ్రీష్మాలు విరహంతో గడిపి, చిక్కిశల్యమైపోయి 'అషాఢస్య ప్రథమదివసే' ఆషాఢ మాసపు మొదటి రోజున కొండ చరియలను ఏనుగులాగ ఒళ్లు రాచుకుంటున్నట్లు నడయాడుతూ ఉత్తరాభిముఖంగా పోతూ ఉన్న ఒక మేఘాన్ని చూసి, 'ఏయ్ ఆగంతకుడా – కొంచెం ఆగూ ఆగు' అని కేకేసి, ఉత్తరాన హిమాలయాలకి అవతల అలకాపురిలో ఏకాకినియై విరహంతో చిక్కి

శల్యమై ఉండిన తన ప్రియురాలికి, తన క్షేమవార్తా, సందేశమూ అందజెయ్యమని ప్రార్థిస్తాడు.

కనుక, కాళిదాసు మేఘదూతలోని ఆషాఢమాస ప్రథమదినానికి మనం వార్షికోత్సవం జరుపుకోవలసివస్తే – అది మన జ్యేష్ఠపూర్ణిమకి మర్నాడు వచ్చే (జూన్ 12) బహుళ పాడ్యమి నాడే అని నిశ్చయంగా చెప్పవచ్చు.

జ్యేష్ఠ పూర్ణిమ నాడు చంద్రుడు వృశ్చికరాశిలో చివరి నక్షత్రమైన జ్యేష్ఠానక్షత్రం 3,4 పాదాలతో వుండగా, సూర్యుడు 180 డిగ్రీలు ఎదురుగా వృషభరాశిలో చివరి నక్షత్రమైన మృగశిర 1,2 పాదాలలో సంచరిస్తూంటాడు. అంటే జూన్ 7,8 తేదీలలో ప్రవేశించిన మృగశిరలోకి సూర్యుడు వచ్చి పూర్ణిమ నాటికి అయిదారు రోజులవుతుంది. దీన్ని బట్టి తేలేదేమంటే, ఈ ఆషాఢ ప్రథమదివసాన ఆంధ్రోత్కళ తీరప్రాంతాలను తాకుతూ – తూర్పు సముద్రం (బంగాళాఖాతం) మీది నుంచి - భారతభూమికీ, ఆర్యావర్తానికీ కాళిదాసమహాకవి కాలం నాటి నుంచీ చల్లపరిచే ఆప్తబంధువుగా విచ్చేసే తొలకరి తొలిమేఘం – అండమాను దీవుల పక్క కొంచెం కనపడిందనో – చిలక సముద్రం దగ్గరో – మచిలీపట్నం దగ్గరో కోస్తా దాటిందనో – వాతావరణశాస్త్రజ్ఞులూ, పత్రికావిలేఖరులూ ఈనాడు కొనియాడుతూ వుండే, ఆప్తమిత్రుడు 'మాన్సూన్' – ఋతుపవనమేఘుడే! అంటే మన అందరికీ ఈ చిరకాలమిత్రుని ఆప్యాయతకి ఒళ్లూ, మనస్సూ పులకించి ఆనంద తరంగితాలవుతాయి. అతన్ని చూసే – కాళిదాసు చెప్పినట్లు "భవనశిఖులు" (ఇంటి నెమళ్లు) కేకోత్కంఠాలయి గానం చేశాయి. ఈ నాడు 'మాన్సూన్'కి స్వాగతం పలికే మన పత్రికావిలేఖరి సోదరుడు, అలనాడు కాళిదాసు కావ్యంలోని యక్షుని భార్యకు క్షేమప్రేమసందేశాల భారవాహకుడై తన భార్యా సోదరుడుగా, బావమరిదిగా, ఆప్తబంధువుగా సంబోధితుడైన ఆ మేఘుడే. నాటి నుంచీ నేటి వరకూ ఆసేతుహిమాచల వాసులూ అయిన భారతీయులందరికీ మానసిక – భౌతిక జీవితాలలో భావైక్యానికీ, సామాజిక, సాంస్కృతిక దృఢచిహ్నంగా వస్తూ – వెళుతున్నవానికి – అందరమూ రెండు చేతులూ ఎత్తి – గొంతులెత్తి నెమళ్లలా షడ్జస్వరాలైక్యం చేస్తూ స్వాగతం చెపుదాము.

"ఏతత్కృత్వా ప్రియమనుచితం
ప్రార్థనా దాత్మనో మే
సౌహార్దాన్ ద్వా విధుర ఇతి
నా మయ్యనుక్రోశ బుద్ధ్యా

ఇష్టాన్ దేశాన్ జలద విచర

ప్రావృషాసంభృతశ్రీః

మా భూ దేవం క్షణమపి చ తే

విద్యుతా విప్రయుక్తః"

"ఓయీ మేఘుడా! నాపై స్నేహం చేతనో, విరహిననని నాపై కనికరం వల్లనో నీ బోటి గొప్పవానికి తగనట్టి సందేశహరణరూపమైన ఈ ఉపకారం నాకు చేసి – ఆ పుణ్యం వలన వర్షాలక్ష్మి చేత ఎంతో శోభిల్లుతూ – నీకిష్టమైన దేశాలు తిరుగు! నాకు కలిగినట్లుగా నీకు నీ భార్య అయిన విద్యుల్లతతో వియోగం కలుగకుండు గాక! ■

15, జూలై 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

13. 'పిఠాపురం సంగీత సంప్రదాయం'

ఈ యేడాది కేంద్ర సంగీతం, నాటక అకాడమీ పురస్కారం ఆంధ్రప్రదేశ్-కర్ణాటక సంగీతవిద్వాంసులలో అగ్రశ్రేణికి చెందిన శ్రీ నేదునూరి కృష్ణమూర్తికి లభించింది. ఈ మధ్యనే ఈయనకు తిరుపతిలోని త్యాగరాయసంగీతసభ ద్వారా సప్తగిరి విద్వన్మణి అనే పురస్కారం కూడా లభించింది. కర్ణాటకసంగీతంలో కిందటి యేడు(1966) కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం గౌరవం అదే అగ్రశ్రేణికి చెందిన శ్రీ వోలేటి వెంకటేశ్వర్లుకు యిచ్చారు.

నేదునూరిది పిఠాపురమూ, వోలేటిది కాకినాడా అయినా, ప్రారంభదశలో గురువులూ, గురుకులపద్ధతులూ వేరయినా, ఇద్దరూ పరిపక్వం అవుతున్న దశలో ఆంధ్రదేశ గాయక విద్వన్మణియైన శ్రీపాద పినాకపాణి గారి ప్రభావానికి పూర్తిగా లోనయ్యారు. మైసూరు లక్ష్మణరావు గారి ప్రారంభగురుకులశిక్షణకు పినాకపాణి గారి బాణీ,విజయనగరంలో ద్వారం వెంకటస్వామినాయుడు గారి విద్వత్శిక్షణలో పదునెక్కి విస్తృతగాంభీర్యాలను సంపాదించింది.

ద్వారం వారి సోదరపుత్రుడయిన నరసింగరావు గారి వద్ద తొలిమెరుగులు దిద్దుకున్న నేదునూరి కృష్ణమూర్తి మలి మెరుగులలో పాణి గారి వద్ద వోలేటికి సహపాఠి అయ్యారు.

పిఠాపురం రాజావారి కాకినాడ కళాశాలలో సంగీతోపన్యాసకులయిన మునుగంటి వేంకటరావు గారి వద్ద తొలి మెరుగులు దిద్దుకున్న వోలేటి, పాణి గారి బాణీకి వశుడయినారు.

అన్న గారయిన వెంకటకృష్ణయనాయుడు గారి వద్ద తొలిమెరుగులు దిద్దుకున్న ద్వారం వెంకటస్వామి గారు, తమ బాణీకి పదునూ, విస్తృతగాంభీర్యాలనూ పిఠాపురం వైణికవిద్వాంసులయిన శ్రీ తుమరాడ సంగమేశ్వరశాస్త్రిగారి వద్ద గ్రహించారు. శ్రీ తుమరాడ సంగన్నశాస్త్రిగారు 19వ శతాబ్దపు ఆంధ్రప్రదేశం ప్రభవింపజేసిన కారణజన్ముడయిన దివ్యవైణికుడు. తరగని అమృత జలాశయం వంటి మేటి విద్వాంసుడు మాత్రమే కాక, నాదకళాతపస్వీ – శిల్పీ! ఆ మహాజలాశయ స్మృతి తరంగాలే ఈ భావతరంగానికి ఘన నయ గమకాలను అందిస్తున్నాయి!

18వ శతాబ్దపు రెండవ సగంలో (1767) జన్మించి, 19వ శతాబ్దపు మొదటి సగపు చివరలో (1847) సిద్ధి పొందిన వాగ్గేయకారపట్టభద్రుడైన వాగ్గేయకారుడు మద్దిరాల వేంకటరాయకవి. ఈయన 1850లో పరమపదించారు. రాజరాజేశ్వరి-కుక్కుటేశ్వరస్వాములు నాయికానాయకులుగా సతిపతిభావంతో భక్తిశృంగారపదములతో కూడిన ఏకాంతసేవావిలాసం అనే సంగీతప్రబంధమూ, ఆ దేవతామూర్తుల పైనీ, ఇంకా పిఠాపురంలోని కుంతీమాధవుని పైనీ ఎన్నో భక్తిరసపూర్వకములైన కీర్తనలను రచించిన మహానుభావుడు. "కన్నబిడ్డడు తన తల్లిదండ్రుల కడ నెన్ని గారాములు, మారాములు వెల్లడించునో యితడును తన యిష్టదేవతలగు పార్వతీపరమేశ్వరుల యెడ అన్నియూ చూపినాడు, అదలించినాడు. తుదకు తల్లియైన పార్వతీదేవి నీ విధముగ మేలమాడినాడు.

"ఏ మంచు నీకిచ్చే నా మంచు కొండదొర
ఆగర్భశ్రీమంతురాలవగు తల్లీ!
కామించి నీవెట్లు కాపురము చేసితివి"

అని యామెను గూర్చి జాలిపడినాడు"- అని 'ఏకాంతసేవావిలాసము'ను 1933లో ప్రచురించిన పరిశోధకవిమర్శకులు నడకుదుటి వీరరాజుపంతులుగారు వ్రాశారు. వెంకటరాయకవి కీర్తనలలో పార్వతీపరమేశ్వరుల తలుపు దగ్గరి సంవాదదరువూ, గంగాగౌరుల సవతిపోరు సంవాదమూ, మేలుకొలుపులు మొదలయిన నిత్యసంకీర్తన సేవాకీర్తనలూ వున్నాయి. కాంభోజి, శంకరాభరణము, ముఖారి, మారువ, రేవగుప్తి, సారంగ భైరవి, సౌరాష్ట్ర, భూపాల, ఆసావేరి, సావేరి, సురట, పూరి, హుస్సేని, కళ్యాణి, జంఝూటి, ఆనందభైరవి, బేగడ, బృందావనసారంగ, నాట వంటి ప్రసిద్ధరాగాలలో ఈ కీర్తనలు మొన్నమొన్నటి దాకా దేవాలయంలోని పూజారులు, నృత్యకైంకర్యం చేసే పిఠాపుర దేవదాసినులు గానం చేస్తూ వుండేవారు. 1958, 1960 మధ్య పిఠాపుర కుక్కుటేశ్వర స్వామి ఆలయపు అర్చకులయిన కందా శేషయ్యగారనే అప్పటికి 80 ఏళ్ల పైబడిన వృద్ధగాయకుని ద్వారా ఆ సంగీతపు వరుసలు గ్రహించి శ్రీ వోలేటీ, నేనూ విజయవాడ కేంద్రమునుంచి మాత్రమే కాక, జాతీయకార్యక్రమంగా ఇంగ్లీషు, హిందీ భాషలలో ఉపోద్ఘాతంతో ఆకాశవాణి అన్ని కేంద్రాల నుంచీ ప్రసారం చేయించాము.

ఆ తరువాత 19వ శతాబ్ద ద్వితీయభాగంలో జన్మించి, 1931లో స్వర్గస్థులయిన వీణాచార్యులు తుమరాడ సంగమేశ్వరులు పిఠాపురానికి సంగీతలోకంలో

ఘనమైన ప్రతిష్ఠ తెచ్చిపెట్టారు. 1919లో రవీంద్రనాథ ఠాగూరు పిఠాపురం వచ్చి, సంగన్న గారి వీణాగానానికి ముగ్ధులైపోయి, ఆయనను శాంతినికేతనానికి తీసుకుని వెళ్లి, కొన్ని మాసాలు నికేతనపు నిత్యోత్సవసంగీతప్రదర్శనలలో అయితేనేం, ప్రత్యేకంగా అయితేనేం-ఆయన దివ్యవీణాగానానికి తన్మయుడైపోయిన విషయాలు ఈ శీర్షికలో ముచ్చటించాము. నలభై ఏళ్ల క్రితం సంగన్నగారి కుమారుడు సత్యనారాయణ, మదరాసు రేడియో నుంచి వీణాగానం ప్రసారం చేశారు.

అతడొక అద్వితీయ ప్రజ్ఞాశాలి. పంచె అంచు పళ్ల మధ్య బిగించి పట్టుకుని, 'లంబోదర లకుమికరా' వంటి గీతాలను పంచె అంచు పైని పలికించేవాడు.

ఆయన శిష్యులలో ఆమర్తి వేమన దొరగారి వయొలిన్ ద్వారం వారి ధనుర్నాదానికి సమీపంగా పలికేది. మండ ప్రకాశంగారు, మండ కృష్ణమూర్తి గారు గాత్ర పాట పాఠాలు నేర్పేవారు. కృష్ణమూర్తిగారి పెంపుడు కుమారుడు మండ లక్ష్మీనరసింహం తదుపరి విశాఖ ఆకాశవాణి నిలయ విద్వాంసుడు. మధురమైన గాత్రం. కృష్ణమూర్తి పాఠాలు-కోటవారి వీధిని అచంట వారి యింట్లో, మా యింట్లో(నాకు), మొక్కపాటి నరసింహశాస్త్రి గారింట్లో వారి కుమార్తెలకూ చెప్పేవారు.

తోట చెల్లాయమ్మగారు తుమరాడ వారి శిష్యవర్గంలో ఒకరు. చలం గారి మ్యూజింగ్సులోని లీల గారీవిడే! ఈమె మా కుటుంబ మిత్రులు! చల్లగా గాత్రంతో వీణ మీటు కలిపి క్షేత్రయపదాలను రసవంతంగా పాడేవారు.

దాక్షారం నుంచి పిఠాపురం వస్తూ పోతూ ఉండే ఈమని అచ్యుతరామశాస్త్రి గారి పై తుమరాడ వారి ప్రభావం ఎంత వుండేదో-ఆయన కుమారుడైన శంకర శాస్త్రిగారి వీణావాదనంలోనూ, ఆయన ప్రియశిష్యుడైన చిట్టిబాబు వీణావాదనంలోనూ మనకు సంగన్నగారి వీణావారసత్వమూ, పిఠాపురం సంగీతసంప్రదాయమూ, వాద్యంలోని యాంత్రికవశీకరణతంత్రం ద్వారా నేటికీ వినిపిస్తుంటాయి. ■

22, జూలై 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

14. పిఠాపురం జాన్సన్స్ క్లబ్

భావతరంగాలు పిఠాపురం పైకి ప్రసరించడానికి కారణం ఆంధ్రప్రభలోని 'శరథి తరంగాలు.' అందులో దాశరథిగారు జ్ఞాపకం చేసి ప్రశంసించిన కవి కాళ్లకూరి గోపాలరావుగారు. మా బంధువర్గంలోని వారు. ఆయన రచించి, సెట్టి లక్ష్మీనరసింహం గారికి అంకితం ఇచ్చిన సౌందర్యమంజరి పద్యకావ్యాన్ని కవిగారు స్వయంగా మా ఇంటికి వచ్చి మా నాన్నగారయిన బాలాంత్రపు వేంకటరావుగారికీ, మా పినతండ్రి సూరిబాబుగారికీ వినిపిస్తుంటే 1930 ప్రాంతంలో నా బాల్యంలోనే విన్నాను. అంతేకాక, గోపాలరావు 'చంద్రలేఖావిలాపం' అనే మధ్యయుగపు పచ్చి శృంగారకావ్యం తాళపత్రప్రతిని పరిశోధనాత్మకంగా సంస్కరించి, అచ్చు వేయించారని జ్ఞాపకం. అది పిఠాపురానికి నాలుగు మైళ్ల దూరాన వున్న చంద్రపాలెం వాస్తవ్యులైన కూచిమంచి జగ్గకవి రచించిన హేళనకావ్యం (సెటైర్)! ఇవి గాక, వాల్మీకి జీవితంపై ఒక నాటకం కూడా అప్పటికే వ్రాశారు.

ముప్పయ్యవ దశకంలో పిఠాపురంలోని ప్రతి పేటా, ప్రతి వీధీ, సంస్కృతాంధ్ర కవిపండిత ప్రకాండులతో కిటకిటలాడుతూ వుండేది. రైల్వేస్టేషన్‌లో రైలు దిగి ఊళ్లోకి సాగిపోయే రహదారికి ఎడమవైపున ఆస్థానకవిద్వయం వేకంటరామకృష్ణకవుల (ఓలేటి వేంకటరామశాస్త్రీ-వేదుల రామకృష్ణకవి) మేడలూ, ఎదురుగా కొంచెం పక్కగా వెనుక స్టూవర్టుపేటను ఆనుకొని ఆస్థానకవీ, ప్రసిద్ధనాటక కర్తా, సాక్షివ్యాససంపుటాల రచయితా, షేక్స్‌పియరూ, ఎడిసనూ కలిసి మూర్తీభవించిన కవీశ్వరుడు పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి ఇల్లూ! ఇలా బైలుదేరిన రాచబాట, కొద్దిగా ఎడమవైపు మలుపు తీసుకుని, తిన్నగా రాజా వారి కోటగుమ్మం దగ్గరికి తీసుకెడుతుంది. కోటగుమ్మం ఎడమవైపుగా పెద్ద బజారు దాటి దక్షిణంగా వెళ్లే రహదారి ఈ వీధికి అంటే కోటవారి వీధికి వెడుతుంది. ఆ వీధిని ఆ నాటి పిఠాపురసాహితీపరులలో లార్డ్ జాన్సన్, నడకుదుటి వీరరాజు గారిల్లు. ఈయన కాళ్లకూరి గోపాలరావుకి మేనమామ. వారి వీధిన నడకుదుటి వారిల్లూ, పక్కనే చర్లవారు, పిశుపాటివారూ, బారువారి వీధిని బాలవ్యాస వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రుల వారిల్లు వేదపారాయణ పంచకావ్యాల పాఠాలతోనూ, ఆ పక్కనే ఓలేటి పార్వతీశకవిగారి ఇల్లూనూ!

మా యింటికి ఎడమవైపున పక్క సందులో పిఠాపురం రాణీవారికీ, ఆడపిల్లలకూ, ఊరి ఉత్తరపు కొసనున్న టౌన్ హాల్స్‌లో ఒకదానిలో ఊరిలోని మహిళల విద్యాభ్యాసానికి సంస్కృతాంధ్రాలు నేర్పే జూలూరు తులశమ్మగారు 'కవయిత్రి' వుండేవారు. ఆ సందుకి ఎదుటి సందులో ప్రసిద్ధులైన హెడ్మాస్టరూ, కవీ అయిన కూచి నరసింహం గారుండేవారు. మా యింటికి కుడిపక్క ఒక పెద్ద మేడలో సూర్యరాయాంధ్రని ఘంటుకార్యస్థానం వుండేది. అందులో చర్ల నారాయణశాస్త్రి, గణపతిశాస్త్రి, పిశుపాటి చిదంబరశాస్త్రి, శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రి, వెంపరాల సూర్యనారాయణశాస్త్రి, పురాణం సూర్యనారాయణతీర్థుల వంటి సంస్కృతాంధ్రవిద్వాంసులు పని చేసేవారు. ఆ మేడకు పక్క సందులోనే దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు, వారి అక్కగారూ, 'అనసూయ' మాసపత్రికాసంపాదకురాలు వింజమూరి వెంకటరత్నమ్మగారు, బావగారు వింజమూరి లక్ష్మీనరసింహారావు గారు, టౌన్ హాలు వెనుకగా బారిస్టర్ పార్వతీశం రచించి ప్రసిద్ధి పొందన మొక్కపాటి నరసింహశాస్త్రిగారూ వుండేవారు. మా యింటి వెనుక పేటలో కుమారస్వామి చెరువు వొడ్డున వీణాచార్య సంగమేశ్వరశాస్త్రిగారిల్లు!

ఆనాటి పిఠాపురపు జాన్సన్స్ క్లబ్‌కు (విమర్శాదర్శ సాహితీకూటానికి) అధ్యక్షులైన మా వీరరాజు తాతగారు జ్ఞాపకం రావడానికి కారణం, ఈ వ్యాసం మొదటిలో పేర్కొన్న కాళ్లకూరి గోపాలరావుగారు. ఆయన మా వీరరాజు తాతగారి సొంత మేనల్లుడు. మా నాన్నగారు (బాలాంత్రపు వేంకటరావు గారు) ఒక వేలు విడిచిన మేనల్లుడు, వీరరాజు గారి సాహితీకూటంలో ఒక పక్క హాలులో ఆనాడు పది-పండెండ్రు మంది, ఏడెనిమిది పేక దస్తాలు కలిపి ఆడే బ్రిడ్జి అనే ఆట ఆడేవారు. ఆ సంరంభంలో మధ్య మధ్య 'నన్నయ యతులు-కొన్నింటి గతు'లను గురించీ, కవిరాజశిఖామణియైన నన్నెచోడుని కవితాగుంభనాలను గురించీ, ఎఱ్ఱాప్రెగడా, నాచనసోముల తారతమ్యాల గురించీ చర్చలు సాగుతూ వుండేవి. వీరరాజు కవిగారికి విమర్శాదర్శక అనే సార్థక బిరుదాన్ని ఒకానొక సాహిత్యపరిషత్తు వారిచ్చి గౌరవించారు. 1903 ప్రాంతంలో ఆచంట సాంఖ్యాయనశర్మ గారి కల్పలత పత్రికలో సమస్యాపూరణ కవిత్వపు పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయబహుమతులు పొందడమూ, 1906 ప్రాంతంలో పిఠాపురంలో వీరరాజు గారి దగ్గర బంధువర్గంలోని మా అమ్మగారిని పెళ్లి చేసుకొనడమూ, మా నాన్నగారినీ, ఓలేటి పార్వతీశం గారినీ వీరరాజుగారికి మరింత సన్నిహితులను చేశాయి.

ఎఱ్ఱాప్రెగడ, నాచనసోములు హరివంశరచనలో నాచనసోమునిదే పైచేయి అని వీరరాజుగారి వాదము. అతడికి లేని సంయమనం అనే గుణం లెస్సగా వున్నవాడు

గనుక ఎర్రాప్రెగడదే పైచేయి అని రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారు. ఆనాడు చేసిన సాహితీచర్చలు, ఆ నాటి భారతి పాఠకులకు సుపరిచితాలు!

వేంకటపార్వతీశ్వరుల 'కావ్యకుసుమావళి' అనే రెండు సంపుటాల కవితా సంకలనాలు నడకుదుటి వీరరాజు పంతులు గారి తెలుగు పీఠికతో 1924లో ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయం ప్రచురించింది. ఆ సంపుటాలకు ఆంగ్లపీఠిక వ్రాసిన టేకుమళ్ల రాజగోపాలరావు గారు, ఆంధ్రభాషావికాసకర్త చిలుకూరి నారాయణరావుగారు, వీరరాజు గారికీ, వేంకటపార్వతీశ్వరులకు చాలా ఆత్మీయులైన మిత్రులు. వారూ, కవితరంగిణీకర్త చాగంటి శేషయ్యగారూ, వీరంతా పిఠాపురం వస్తూ పోతూ ఉండేవారు. విమర్శాదర్శ సాహితీకూటంలో మిత్రులు. వీరరాజుగారూ, వేంకటపార్వతీశ్వరులూ కలిసి మూర్తిత్రయం అనే పేర శివ పురాణం, బ్రహ్మ పురాణం, వామన పురాణం, 10 15 సంపుటాలుగా పురాణగ్రంథమాలికగా ప్రచురించారు. విద్వజ్జన మనోరంజనీ ముద్రాక్షరశాల వీరరాజు గారు నడుపుతూండిన ముద్రణాలయం! ■

29, జూలై 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

15. అలనాటి పిఠాపురం -మరి కొందరు కవిపండితులు

పిఠాపురం రైల్వే స్టేషన్ నుంచి ఊళ్లోకి, కోటగుమ్మానికి తీసుకెళ్లే రాచబాటకి ఎడమవైపున అప్పటి రాజావారి ఆస్థానకవీశ్వరులు జంట కవులైన ఓలేటి వెంకటరామ శాస్త్రి గారిదీ, వేదుల రామకృష్ణ కవి గారిదీ మేడలున్నాయి. ఆ మేడలకి ఎదుట దక్షిణంగా సామర్లకోట రైలు దారికి సమానాంతరంగా అర్ధమైలు నడిస్తే ఒక మసీదూ, దాని పక్క ఉమర్ ఆలీషా కవిగారి మేడా వస్తాయి. 'ఉమ్రాలీషాగారు, కుక్కుటేశ్వర మాధవస్వాముల రథాలుండే మంద బయలికి ఎదుట కావ్యకర్త. ధారాళంగా ధారా శుద్ధితో సంస్కృతాంధ్రాలలో కవిత చెప్పగలిగే కవీశ్వరుడు. ఉర్దూ, అరబీ, ఫారశీ, ఆంగ్లభాషలు క్షుణ్ణంగా చదివినవారు. 1934 నుంచి 45 వరకు ఢిల్లీ లోని కేంద్రశాసనసభలో సభ్యుడు.

'మా తాతయు మా తండ్రియు ఖ్యాతిని అఖైలలీ మహాగురువర వి
ద్యాతత్త్వము నేర్పిరి తద్రీతుల వివరింతు యోగరీతులు తెలియన్'

అనే పద్యంలో చెప్పినట్లు, ఉమ్రాలీషాగా రింట మూడు-నాలుగు తరాలుగా ఆఖైలలీ మహాగురు పరంపరలో సూఫీ వేదాంతమును బోధించే గురుపీఠాధిపతులు. వీరి శిష్యవర్గంలో ముస్లిములే కాక అమలాపురం ప్రాంతాలకు చెందిన శ్రోత్రియ కుటుంబాలకు చెందిన బ్రాహ్మలు కూడా ఉండేవారు. ఉమర్‌ఖయ్యాం (పారశీకకవి) రుబాయీలకు కవిగారితెలుగు అనువాదం, చంద్రగుప్త, అనసూయాదేవి కళ అనే మూడు నాటకాలు, (సూఫీ) తత్త్వసందేశము కీర్తనలు, స్వర్గమాత అనే శీర్షికను కందార్థదరువులు. ఉమరాలీషా గారి తెలుగు రచనలు. వీరింటి కెదురుగా ఉన్న రథాల మంద బయలులో కుక్కుటేశ్వరస్వామి. మాధవ స్వాముల రథోత్సవం రాత్రులలో తెల్లవార్లూ పెండ్యాల సత్యభామగారి (భామాకలాప) భాగవతమేళ ప్రదర్శన జరుగుతూండేది, ఏటేటా! ఆ ప్రభావమే ఆయనచేత తత్త్వసందేశాన్ని కీర్తనలుగాను, స్వర్గమాత కందార్థదరువులనూ రచింపచేసిందని అనుకుంటాను. సూఫీతత్త్వాన్ని గురించిన ఆయన పద్యం ఒకటి.

కనదుల్ పాదరసంబు తాత్త్వికుడు బంగారంబు గావించిన
ట్లనుమానాస్పదమై వినాశకరమై యల్లాడు జీవుండు బ్ర

హ్మముగా మార్చెదు త్రోవ జూపితి నిధి ధ్యాసంబు సంధించి మీ
కనులన్ విప్పుడు శూన్యమందు హరి సంకాశంబు సంధిల్లెడున్!

కవి గారి ఇంటికెదురుగా పోయే బస్సు దారీ, దానిని దాటి ఇంకాస్త పైకి పోతే సామర్లకోట పోయే రైలుదారి దాటి అవతల చిత్రాడ వైపు వెళ్లే దారిలో పక్క పొలాల్లో ఉమ్రాలీషా గారి ముద్రాక్షరశాల ఉండేది. అప్పుడు ఊరికి అవతల ఈ ప్రెస్సూ, ఊరి లోపల కోటవారి వీధిని వి.ఎమ్.ఆర్ ప్రెస్సూ (నడకుదుటి వీరరాజుగారి విద్వజ్జన మనోరంజని), రెండూ పని చేస్తుండేవి. కంపోజిటర్లూ, మొదలైన కార్యకర్తలు కొందరు కొన్నేళ్లు ఒక ప్రెస్సులోను, కొన్నేళ్లు మరొక దానిలోను పని చేయడం ఉండేది. హనుమంతరావు అనే మా పెత్తల్లి కొడుకుతో నా చిన్నతనంలో కొన్నిసార్లు ఆ ప్రెస్సుకీ, కొన్ని సార్లు ఈ ప్రెస్సుకీ వెళ్లాను. వీరరాజుగారి ప్రెస్సులో కంపోజిటర్‌గా పనిచేసి క్రమంగా సాహిత్యపరిశోధనాకావ్య పరిశీలనలో వారి వద్దా, గురువుగారనబడే ఆస్థానకవిగారైన ఓలేటి వేంకటరామశాస్త్రిగారి వద్దా ఆశీస్సులందిన దాసరి లక్ష్మణస్వామి గారు, వర్ణన రత్నాకరము అనే నాలుగు సంపుటాలలో తెలుగు మహాకావ్య ప్రబంధాల నుంచి వివిధాంశాలపై కావ్య ఖండికలను సంకలనం చేసి ప్రకటించారు ఆ రోజులలోనే.

రైలు స్టేషన్‌కి ఎదురుగా తూర్పు పడమరలుగా పోయే రోడ్డు మీదున్న పానుగంటి లక్ష్మీనరసింహారావు గారి ఇంటికి పక్క సందు స్టూవర్ట్‌పేటకి తీసుకు వెడుతుంది. ఆ పేటలో వేదకాలం నాటి భారతీయవ్యవసాయచరిత్రను, (ప్రసిద్ధమైన) మహాభారత విమర్శమునూ, ఉత్తరభారతకథాపరీక్షిచ్చరిత్రా అనే గ్రంథాలను రచించిన ఉద్దండ పండితుడు మా గురువు గారు హైస్కూలు పండితులు పెండ్యాల వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి గారిల్లుండేది. ఈయన అనేక ఉత్తర దక్షిణ – భారత విద్వాంసుల, పాశ్చాత్య విద్వాంసుల పరిశోధనలను పరిశీలించి మహాభారత కథాకాలమునూ, రచనా కాలమునూ ప్రతి ప్రధానపాత్ర స్వభావాది విశేషాలను ఆధునిక దృక్పథంతో తర్కించి, భారత కాలము నాటి సాంఘికాదిపరిస్థితులపై తన అభిప్రాయాలను నిష్కర్షగా ప్రకటించి ఆ నాటి సాంప్రదాయిక విద్వాంసులైన కాశీభట్ల సుబ్బయ్యశాస్త్రిగారి వంటి వారితో వివాదాలకూ, కోర్టు కేసులకూ దిగి ఢీకొన్నవారు. ఇక కోటవారి వీధిన చీమలకొండ అద్వైత పరబ్రహ్మశాస్త్రి గారనే మా మరో గురువు గారు సంస్కృతాంధ్ర పండితు లుండేవారు. ఆయన సంగీతప్రియుడు. వివిధరాగాలలో పద్యాలను పాడనేర్పినవారు, మా తరగతిలో ఆయన నా చేత ఆ పని చేయించి ఆనందించేవారు.

కొత్తపేటలో మా ఇంటికి ఎడమపక్క సందు రాజావారి కుమార్తెలకూ, ఘోషా స్కూలులో ఉన్న మహిళలకూ తెలుగు-సంస్కృతాలు నేర్పే ఉపాధ్యాయిని జూలూరి

తులశమ్మగారు కాపురముండేవారని వ్రాశానే, ఆవిడ కాపురం ఉండే ఇల్లు కొటికలపూడి సీతమ్మగారిది. ఆవిడ ఒక కవయిత్రి. రాణీ గారు దసరాలకు కోటలో ఏర్పాటు చేసే మహిళాసమావేశాలలో వీరిద్దరూ, జ్ఞానమాంబగారనే మరో విదుషీమణీ ఉపన్యాసాలిస్తుండేవారు.

మా మేనమామ దుగ్గిరాల పళ్ళంరాజు గారు, పానుగంటి వారి కుమారులు చిరంజీవిరావు, విజయరాఘవరావు, రమణరావుగార్లూ, కృష్ణశాస్త్రి గారి మేనల్లుళ్లు వింజమూరి శివరామరావు, వెలమకన్ని సుబ్బరాయశాస్త్రిగార్లు, మా పెత్తండ్రిగారి కుమారుడు బాలాంత్రపు సత్యనారాయణరావు, చాగంటి శేషయ్యగారి కుమారుడు భీమశంకరం–వీరంతా సారస్వతమిత్రమండలిగా ఆనాడు సాహిత్యసేవ చేసే యువతరపు కవులు!

మా యింటికి ఎదురుగా దక్షిణోత్తరంగా సాగిపోయే రాచబాటను ది గ్రాండ్ నార్తరన్ ట్రంక్ రోడ్ అనే వారు. మా యింటికి కుడివైపున (ఉత్తరం) ఉండే దివానుగార్ల బంగళాలలో మొదటిదానిలో రఘుపతి వేంకటరత్నంనాయుడు గారుండేవారు. ఆయన వీరేశలింగం వారితో పాటు, సంఘసంస్కరణలోను, హరిజనోద్ధరణ కోసమూ పాటుపడిన ఆధునికాంధ్రనిర్మాతలలో ఒకరు. బ్రహ్మసమాజానికీ, మహరాజా వారి కుమారులకూ, కుమార్తెలకూ గురువుగాను, కాకినాడలోని పిఠాపురం రాజావారి కళాశాల ప్రిన్సిపాలుగాను, ఆ తర్వాత మద్రాసు విశ్వవిద్యాలయంలో కులపతిగానూ పని చేసి, కృతకృత్యులై, నిరంతర దైవధ్యాన నిరతులై దీనజనోద్ధరణకు దీక్షాదక్షులై బ్రహ్మర్షి అనిపించుకున్న మహనీయుడు! హేమచంద్ర సర్కారు వంటి రాష్ట్రేతర అతిథులు మహారాజావారి ఆహ్వానంపైని పిఠాపురం వచ్చినపుడు, నాయుడుగారితో బస చేసి, మా యింటి ముందు నుంచి పోయే గుర్రపు సార్టులో కనబడేవారు! ■

05, ఆగస్టు 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

16. శ్రీనాథుడి జాతీయతా ప్రబోధం

శ్రీ అక్కిరాజు ఉమాకాన్తవిద్యాశేఖరులు తాము పరిష్కరించి ప్రచురించిన 'పల్నాటి వీరచరిత్ర' భూమికలో–వీరచరిత్రను గురించి ఇలా వ్రాశారు–"వీరచరిత్ర కర్తయైన శ్రీనాథుడు, ప్రాచీనాంధ్ర గ్రంథకర్తల్లో విశిష్టుడు. ఇతడి వైదుష్యం అన్యదీయాపేక్ష చేత అసాధారణమైనదిగా కనబడుతున్నది. కాళిదాసాదులకు భారతవర్షం వలె ఇతడికి ఆంధ్రదేశం అఖండరూపంతో గోచరించినట్లు విదితమవుతున్నది."

విశ్వనాథుని వలె త్రిలింగశూరతేజస్సు ఇతణ్ణి పరవశుణ్ణి చేసినట్లు కనబడుతున్నది.... తెలుగు భూమి ఆంధ్రభూమి అని తన కృతుల్లో పలు చోట్ల ప్రస్తావిస్తూ వచ్చాడు. ఆంధ్రదేశానికి సంబంధించిన భీమఖండాన్ని సంస్కృతంలో కూడా శ్రీనాథుడే రచించాడేమోనని కొందరు పెద్దలలాగా నేనప్పుడప్పుడు అనుకొంటూ ఉంటాను.

శ్రీనాథుడి ఆంధ్రభూభువనవర్ణనం గురించి భావతరంగాలలో ఒకసారి స్మరించుకున్నాము. పల్నాటి వీరచరిత్రలో భట్టు రాయబారం అనే ఘట్టంలోని వాక్యాలలో – ఐకమత్యం, పారతంత్ర్యం, స్వాతంత్ర్యం అనే పదాలను వాడిన సార్థకమైన ఉపదేశంలో శ్రీనాథుని జాతీయతాభావాలు ఎంత ఆధునికంగా కనిపిస్తాయో అని ఆశ్చర్యం వేస్తుంది. 12వ శతాబ్దిలో పల్నాడులో జరిగిన ఈ కథ జానపదుల నోళ్లలో వీరపదాలుగా మార్మోగిన గాథ, సామాన్య జనుల కోరికపై 16వ శతాబ్దిలో శ్రీనాథుడు ద్విపదకావ్యంగా చేశాడు.

గురిజాల రాజధానిగా పల్నాడును పరిపాలించిన రాజు అనుగురాజు. ఆయనకు ముగ్గురు భార్యలు. వీరవిద్యాదేవి, భూరమాదేవి, మైలమాదేవి. వీరవిద్యాదేవికి పెదమలిదేవుడు, పినమలిదేవుడు, బాలమలిదేవుడూ అని ముగ్గురు కొడుకులు. భూరమాదేవికి కామరాజు, నరసింహభూపతి, ఘట్టిరాజు, పెరుమాళ్లరాజు అని నలుగురు కొడుకులు. అనుగురాజుకు మంత్రి దొడ్డనాయుడు. ఈ మంత్రి కొంత కాలానికి చనిపోయాడు. అనుగురాజు అనుగ్రహం సంపాదించి, ఆయన మరణం తర్వాత రాజు అయిన నలగామరాజుకు మంత్రి అయింది నాగమ్మ. బ్రహ్మనాయుడు అనుగురాజు రెండవ భార్య బిడ్డలైన మలిదేవాదులకు సంరక్షకుడై, మలిదేవరాజుకు మాచెర్ల రాజధానిగా చేసి, తాను మంత్రిగా వుంటూ వచ్చాడు. నలగామరాజాదులకు, మలిదేవాదులకు మధ్య మొత్తం పల్నాడు కోసం జరిగిన యుద్ధంలో నాయకురాలు

నాగమ్మ నలగామునికీ, బ్రహ్మనాయుడు మలిదేవునికీ మంత్రులు. పల్నాటి యుద్ధం ఆంధ్రదేశంలో, పల్నాడులో జరిగిన కురుక్షేత్రయుద్ధం, సోదరుల మధ్య జరిగినదే-భారతయుద్ధం లాగ. బ్రహ్మనాయని పక్షం వారు భట్టును నలగామరాజు ఆస్థానానికి సంధి కోసం రాయబారం పంపుతారు.

భట్టు నలగామరాజుతో ఇలా అన్నాడు : "రాయబారానికై మా మలిదేవరాజు పంపిన అలరాజు మీ అల్లుడని కూడా పరిగణించక శత్రుపక్షం వాడినిగా భావించి, చంపించివేశారు గదా. మలిదేవుడు అందుపై కక్షతో తానూ, తన బంధువులూ, సేనలతో శ్రీరాముడు ఖరదూషణాదులను చంపిన చోట శ్రీశైలభూమిలో పేరెన్నిక పొందిన కారెంపూడిలో శిబిరాలలో విడిసివున్నారు. వీరనాయకులు యుద్ధానికి వేగిర పడుతున్నారు. ఆ సందర్భంలో మలిదేవరాజు మీతో సంధి కోసం నన్ను రాయబారిగా పంపించారు.

"పగ వృద్ధి పొందించు భ్రష్టులే కాని
అడగించు నేర్పరు లవనిలో లేరు"

"మీ తమ్ములైన నరసింహభూపతిని మలిదేవరాజు వద్దకు నమ్మకంగా రాజీగా ఉందామని రాయబారం పంపండి. పగలనణచి..... పలనాడు మొదలైన బహుభూము లెల్ల - ఎదురెవ్వరును లేక ఏలుడి సుఖిత

పోరు మంచిది కాదు భూమి నెక్కడను
పాడౌను దేశంబు పగ మించెనేని,
ప్రజలెల్ల నశియించి పారిపోవుదురు.

* * *

మేకొని మీలోన మీరు పోరాడ
చూచెడివారికి చులకనయౌను
పలువలు మిము జేరి పగ చావనీక
చెప్పుచునుందురు చెనటి వాక్యముల
ఐకమత్యము చెడు నద్దాని తోడ
చెడును బలంబును చెడు భాగ్యంబు
చెడును యశంబును చెడును శౌర్యంబు
చెడును రాజ్యంబును చెడ్డ పిమ్మటను
దేశంబు పరనృపాధీనమౌ సుమ్ము!

పారతంత్ర్యంబు మీపై బడగలదు!
పరతంత్రజనముల పాలి కష్టములు
చెప్పంగ నలవియే శివునకునైన!

* * *

బోనులో నుంచిన పులుల విధంబు
స్వాతంత్ర్యహీనత బడియుండవలయు!

* * *

పార్థివా యిటువంటి పారతంత్ర్యంబు
కటకటా పగవారికైనను వలదు"

రెడ్డి సామ్రాజ్యాలన్నీ పడిపోయి, దేశం ఉత్కళులకూ, తురుష్కులకూ వశమైన రోజుల్లో శ్రీనాథుడు, సామాన్యజనులసఖ్యం వుండగా వ్రాసిన కావ్యమిది! శిలాప్రతిమా ప్రాంగణాలలో గాని, మన శాసనసభాభవనాంగణాలలో గాని, జాతీయతా ఐకమత్యాలను ప్రబోధించే శ్రీనాథకవిసార్వభౌముని ఈ 15వ శతాబ్ద శిలాక్షర సందేశాలను (శాశ్వత) శిలాక్షరాలుగా చెక్కించి, ఈ సందేశంలోని ఆదర్శాలను ఆచరణలో పెట్టగలిగితే ఎంత శుభోదర్కంగా వుంటుందో! ■

12, ఆగస్టు 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

17. ఆంధ్రకేసరి

మాతృదేశ స్వాతంత్ర్యయోధవర
మాన్యమేరుగిరి ఆంధ్రకేసరీఐ ఏరీ నీ సరి?
వేరేరీ నీ సరి?

భారతజననీ ప్రియకుమార గుణధీర
దేశభక్తాగ్రగణ్య

అవిభక్త చెన్న రాజ్య ప్రధాని!

అశేష పౌర సంక్షేమ నిధాని! ॥ఏరీ నీ సరి॥

స్వరాజ్య సూత్రయజ్ఞనాయకమణి,
వీరాదాంధ్రధరా సాధకాగ్రణీ!

శౌర్యధనుల, త్యాగధనుల సంతత
జనహితైకరంజనీ సుకృతులం దేరీ నీ సరి?

భారతస్వాతంత్ర్యోత్సవపు పండుగ జరిగిన ఒక వారానికి ఆగస్టు 23న (ఆగస్టు 8 అని కొందరు) సాహసికాంధ్ర వీరయోధులకూ, స్వాతంత్ర్యపు పోరాటంలో తనది అనేది ఏదీ మిగుల్చుకోని త్యాగశీలురకూ ప్రతీక అయిన టంగుటూరి ప్రకాశం పంతులు పుట్టినరోజు. 1946లో ఆయన అవిభక్త చెన్న(మద్రాసు)రాష్ట్రానికి ప్రధానమంత్రి (అప్పటి రాజ్యాంగం ప్రకారం). 1953 అక్టోబరు ఒకటవ తేదీన అవతరించిన తొలి ఆంధ్రరాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి. ఈ భావతరంగాలు ఆ మహనీయుని అమరస్మృతికి అంజలివ్వడానికి తలపువొద్దులను దరిసి పొంగుతున్నాయి. తొలి తరపు జాతీయోద్యమనాయకులైన మోతీలాల్ నెహ్రూ, చిత్తరంజన్‌దాస్‌లతో 1921 ప్రాంతాలలో స్వరాజ్య పార్టీ స్థాపకస్తంభాలలో ఒకరయి, 'స్వరాజ్య' ఆంగ్లదినపత్రికను తానే సంపాదకులుగా 1921లోనే స్థాపించారు. ప్రముఖపత్రికావిలేఖరులయిన కృపానిధి, ఖాసా సుబ్బారావు, కుందూరు ఈశ్వరదత్తుగార్లు ఆ పత్రికకు సహసంపాదకులు. 1895లోనే ఈయన న్యాయవాదిగా పట్టా తీసుకుని రాజమండ్రిలో ప్రాక్టీసు చేయడమూ, 1901లో రాజమండ్రి మున్సిపాల్టీ ఛైర్మన్ కావడమూ, 1903లో ఇంగ్లండు వెళ్లి బారిష్టర్

పట్టా పుచ్చుకుని తిరిగి వచ్చాక రాజకీయాల్లో దిగడమూ, ఇవన్నీ ఆయన వీరవిక్రమగాథలుగా చెప్పుకునేవారు వెనుకటి తరాలవారు. ఆ గాథలలో పతాకశీర్షిక 1928లో సైమన్ కమిషను భారతదేశం వచ్చినపుడు మద్రాసు హైకోర్టు వద్ద బ్రిటిష్ సామ్రాజ్యపు పోలీసుల తుపాకులకు ఎదురుగా నిలబడి 'కాల్చుకుంటే కాల్చుకోండిరా' అని ప్రాణాలకు తెగించిన ధీరుడు!

1946లో ఆయన అవిభక్త చెన్నరాష్ట్రానికి ప్రధానమంత్రి అయినపుడు కృష్ణశాస్త్రిగారు ఆయనను గురించి అన్న వాక్యాలలో కొన్ని -

"ప్రస్తుతం ప్రకాశం మకాం మద్రాసు గవర్నర్ భవనంలో
గద్దె మీదా, గరికె నేల మీదా ఒకే ఠీవితో కూర్చోగలిగినవాడిదే హుందా
ప్రకాశం మూడు కోట్ల జనం పేరు."

"ప్రకాశం అంటే 1921 తర్వాత వచ్చిన ప్రజాజాతీయోద్యమానికి ప్రబలచిహ్నం అన్నమాట."

"మన రాష్ట్రంలో ఆ ఉద్యమచైతన్యం అంతా అతనిలో ఇమిడి ఉంది. అతని మూర్తిలో మనకు ఆ ప్రజాశక్తి కనిపిస్తుంది."

"1921లో మన రాష్ట్రంలో కూడా ఒకసారి ఒళ్లు విరుచుకుని హుమ్మని లేచిన జనసామాన్యానికి ఉన్న గుణాలన్నీ ప్రకాశంలో ఉన్నాయి. ఆవేశం, ఉత్సాహం, ఆగ్రహం, అనుగ్రహం, ఔదార్యం, అసూయ, పట్టుదల, మొండితనం, సాహసం, తిక్కా అన్నీను."

"మనలాగ ఉంటాడు. మనలాగ చేస్తాడు. మనలాగ బాధపడ్డాడు. సుఖపడ్డాడు. మనకు మించిన తెలివితేటలున్నా మన బుర్రలకి వాటిని రుద్దడు. మనకు తెలియకుండానే వాటిని మన కోసం వినియోగిస్తాడు."

ఇది ప్రజాప్రభుత్వం అయితే ప్రకాశం లాంటి ప్రధాని మరొక్కడు ఇప్పుడు దొరకడు.

అది 1953 సెప్టెంబరు 20-25ల మధ్య. ఇంకో ఐదారు రోజులలో ఆంధ్రరాష్ట్రం ఏర్పడబోతుంది. మంత్రివర్గం మిశ్రమపక్షాల ప్రతినిధులతో ప్రకాశంగారి ముఖ్యమంత్రిత్వం, ప్రమాణస్వీకారం కర్నూలులో జరుగబోతున్నాయని అప్పటికే వెల్లడయింది. మిశ్రమపక్షాలలోఎవరెవరు కనిపిస్తారో, ఎవరెవరికి మంత్రిత్వాలు ఇస్తారో ఇంకా ఏదీ తేలని సమయంలో, ఈ వ్యాసరచయిత, ఆయనను కలుసుకుని "మద్రాసు రేడియో తరఫున తమ సందేశం రికార్డు చేస్తారా?" అని అడిగాడు. "సందేశం ఏమిటోయ్.

అంతా ఇంకా అయోమయంగా ఉంటేనూ" అన్నారు. "జీరో అవర్ (ఆఖరి నిమిషంలో) కాని ఏమీ తేలదు. కర్నూలు రా!" అన్నారు. విజయవాడ నుంచి వెళ్లారు.

రాజధానిగా కర్నూలు, హైకోర్టు స్థానంగా గుంటూరు, అప్పుడు పంతులుగారు ఎంపిక చెయ్యడమే ఆ తర్వాత తెలంగాణకూడా కలసి వచ్చి, మరో మూడేళ్లకి ఆంధ్రప్రదేశ్ ఏర్పడటానికి దారి తీసిన గడసరి ఎత్తుగడ అని ఆంధ్రచరిత్రకారులు చెబుతుంటారు.

తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయమూ, కృష్ణా బ్యారేజి, ఆయన సాధించి పెట్టిన విజయాలే, ఆంధ్రులకి ఈ నాటికీ ఏ నాటికీ జమీందారీల తుడిచివేత ఆయన ప్రతిపాదన ఫలితమే. రాజకీయప్రత్యర్థుల రాజకీయాలతో ఆయన మంత్రివర్గం పడిపోకుండా ఉంటే, ఆయన తలపెట్టిన ప్రజాహిత సంస్కరణల ద్వారా మన రాష్ట్రపు బడుగుజనం పరిస్థితి మరోలా ఉండేది! ■

19, ఆగస్టు 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

18. చీమ నా తొలి నేస్తం

ఈ భావతరంగం నా చిన్నతనపు జ్ఞాపకాల తెరలలోంచి పొంగుతోంది. మనుష్యులు, తమ నిత్యజీవితంలో శత్రువులుగా భావించి దూరంగా వుంచడం కానీ, నిర్మూలించడం కానీ చేస్తూండే కొన్ని అల్పజీవుల పట్ల నాకు కొంత స్నేహభావం కలుగుతూండేది. చీమ, దోమ, నల్లి, సాలీడు, బొద్దింక వంటివి. పిపీలికాది బ్రహ్మ పర్యంతమూ కాదేదీ రచనకనర్హం!

చీమ నా తొలినేస్తం. మా అమ్మో, అన్నో, మావయ్యో, నాకు పదే పదే చెప్పిన తొలికథ ఏడుగురు రాకుమారులు వేటకు వెళ్లడం – చేపలు తెచ్చి ఎండెయ్యడం, అందులో ఒక చేప ఎండకపోవడానికి కారణం ఏవిటని ఒక్కొక్కరిని అడుగుతూ వుంటే, చివర్న ఏడుస్తున్న పిల్లాణ్ణి కుట్టిన చీమ కారణం గదా అని, చీమా చీమా ఎందుకు పిల్లాణ్ణి కుట్టేవే అంటే, "నా బంగారు పుట్టలో వేలు పెడితే నేను కుట్టనా?" అన్న చీమ, నా తొలి నేస్తం. ఆ కథ మూలాన్నే అది నా నేస్తం అయిందేమో! ఏటేటా పసివాడుగా ఎదుగుతూన్న నేను, ఈ గదిలోనూ, ఆ గదిలోనూ, వాకిట్లోనూ, పెరటి అరుగు మీదా తారాడుతూ ఉండేటప్పుడు, బారులు బారులుగా జాతరకు పోయే మనుష్యులలాగే పనికట్టుకు త్వరత్వరగా సాగిపోయే చీమల్ని అలా చూస్తూ వుండేవాణ్ని. 'అక్కడ బారుకి అవతలి కొసని ఏదో వింతో, తియ్యని తినుబండారాల మూటో వుంది. మేం ఒక్కొక్కళ్లమూ ఒకొక్క కణం తీసుకున్నాం. మీరు కూడా తెచ్చుకోండి' అని అట్నుంచి వచ్చేసే చీమలు, ఇట్నుంచి వెళ్లే వాటిని మూతీ మూతీ తాకించి మాట ఉప్పందించినట్టు తలూపి తిరిగి తమ పోకడ కొనసాగిస్తుండేవి.

అమ్మో, పిన్నో అరక్షితంగా గూట్లో పెట్టిన పటికబెల్లాన్ని వాళ్లెంత అడిగినా నాకు పెట్టకపోతే నేనే వెళ్లి దాన్ని తీసుకొని ఆత్రంతో నోట్లో పెట్టుకోగానే పటికబెల్లపు ముక్కని పట్టిన చీమల గుంపు నా పెదవుల్ని పట్టి పీకేసినా, వాటి మీద నా నేస్తభావం పోలేదెందుకో మరి! ఒకసారి కండ చీమల పుట్ట మీద కాలుపెట్టీపెట్టడంతోనే నా పాదాన్ని నాల్గు పక్కలా కరచి పట్టుకున్న కండచీమల్లో ఒకటి మా అమ్మమ్మ, తలా, మొండెమూ వేరు చేసినప్పటికీ నా కాలు వదల్లేదు. వీటన్నింటికీ ఒకటే నీతి మొదటి కథలోనే వుంది– "నా బంగారుపుట్టలో వేలు పెడితే కుట్టనా?" అని.

దోమపై నేస్తభావం మరి కాస్త ఎదిగాక కలిగినట్లుంది. బడి పాఠాలు ఇంట్లోనే పునశ్చరణ చేసుకొనేటపుడూ, హోం వర్కు వ్రాసుకొనేటపుడూ, వ్రాసే ముంజెయ్యి మీదో, ఎడం బుజం మీదో, చెంపమీదో, ఒకటో రెండో దోమలు వాటి తొండంతో పొడుస్తూ రక్తం తాగేస్తూ వుండేవి. మనం మొదట్లో దాని మీద దృష్టి పెట్టకపోయినా, అది పొడవగా ఉడుకుమోతుతనం వచ్చి అంతవరకూ పాటించిన జీవహింసా వ్యతిరేకభావాన్ని అవతలికి నెట్టి, వ్రాసే చేతిలో కలం అలా పెట్టి, దోమ వాలిన చోట తప్పున కొడితే నాకే తగిలి దోమ ఎగిరిపోయేది. ఈ శత్రుభావం పటాపంచలై పోయిందెప్పుడంటే నాకు కొంత సంగీతజ్ఞానం కలిగి, పెద్దవాళ్లు చెప్పిన మాటల్లో, ప్రకృతిలో అనాతనాదాలూ, మోగుతూ ప్రణవాన్ని అంటే ఓంకారాన్ని రూపొందింప జేస్తాయని విని, మా ఇంటి పెరటిలోనో, మా తోట పాకలోనో, రాత్రి వేళ మరొకరు తోడుండి పడుకున్నప్పుడు, మొదట కప్పుకొన్న శాలువ మీదుగా జంయ్‌మంటూ దోమ సంగీతం వినబడేది. వినబడే ధ్వనులన్నిటిలోకీ దోమ పాట ఫ్రీక్వెన్సీ బాగా హెచ్చు. ఆ తర్వాత కీచురాల పాట వినబడేది. దోమ సంగీతరహస్యం ఏదో తెలియదు గాని, కీచురాళ్లది మాత్రం ఇటాలియన్ హీరోలాగా బాల్కనీ మీదున్న ప్రియురాలికి కింది నించి సెరినేడ్ అనే ప్రణయగీతం వినిపించడం లాంటిది. మగకీచురాయి పాడుతూం టుంది. దీని శ్రుతిని మించి, మరి కొన్ని కొత్త సంగతులతో అల్లంత దూరం నుంచి మరొక ప్రియుడు. అదే ప్రియురాలిని ఆకర్షించడానికి పాడడం మొదలుపెడతాడు. అది పాటల పోటీయే దానిలో నెగ్గినవాడు ఆ ప్రియురాలిని ఎగరకొట్టుకుపోతాడు, ఆ రాత్రికి! వీటి రెండుసంగీతాలనూ హేమంత రాత్రి అనే వాద్యబృందరచనలో నేను, వాస్తవికతకీ, సంగీతసిద్ధికీ మధ్యేమార్గంలో రెండు భావాలూ స్ఫురించేటట్లు ప్రయోగించ గలిగాను. ఈ రచన నేను కార్యక్రమప్రసారసేవలో వున్నపుడు సాధించినది. అందుకనే దోమలూ, కీచురాళ్ళూ నా నేస్తాలయ్యాయి.

చదువుకొనే రోజుల్లో నల్లులతో ఎంతో సహజీవనం చేస్తూ వుండేవాణ్ని. మొదట్లో కుట్టిన నల్లిని అహింసాధర్మంతో చంపకుండా పట్టి, అవతల పారేస్తూ వచ్చినా, ఒక్కొక్క రాత్రి, రాత్రంతా మేలుకొని జనమేజయుడి సర్పయాగంలా యజ్ఞం చెయ్యవలసి వచ్చేది. ముందు చెప్పిన నేస్తాలతో కలిగిన స్నేహభావం నల్లి పట్ల కలిగిందనుకోను. పుస్తకాల అలమార్లు, బీరువాలు చాలా తక్కువసార్లు రిఫరెన్సులకే చూసుకొనే పుస్తకాలుండే గదీ, వీటిల్లో సాలీళ్లూ, బొద్దింకలూ, వీటి పట్ల నేస్తభావం ఉండేదనే చెప్పాలి. నేస్తభావం ఎందుకంటే పుస్తకం అంటేనూ, అందులో పాత పుస్తకాలంటేనూ నాకెంతిష్టమో, వాటికీ

అంతిష్టమే కదా! వాటిని నిర్మూలించడానికీ, ఆటంకపరచడానికీ కలరా ఉండలనీ, వాసన పొట్లాన్ని ఎన్నిక చేసినా, వాటి పని అవి చేస్తూనే వుండేవి.

మా నాన్నగారు మాత్రమే తన రోజుల్లో అప్పుడప్పుడు తీసి చదువుకునే కొన్ని పుస్తకాలు నేను ఆప్యాయంగా తెరిచి చూసుకుంటే మధ్య మధ్య బుక్ మార్కులలాగా చదువుతుండిన పుట గుర్తుపెట్టుకోవడానికి ఉంచుకొనే చిహ్నంలాగా సహాయ పడతుంటాయి బొద్దింక రెక్కలు!

సాలీళ్ల గూళ్ల అల్లిక అందాలు మెచ్చుకోవాలంటే ఔటుహౌసులోను, పాత హవేలీలలోను, కొన్ని గ్రంథాలయాల్లోనూ చూసి తీరాల్సిందే! ఆ పన్నిన వలలో పడిన మరో అల్పజీవిని సాలీడు ఆహారంగా భోంచెయ్యడం పాపం అన్నా చూడకుండా వుండలేము.

"బ్రదుకు తెరువు అరయు జీవి గొంతులో
బెదిరి ఉసురు వదలు అల్పజీవి జాలి వంతలో
దుఃఖమ్మనీ సౌఖ్యమ్ము దూరమనీ!
ఏమని పాడెనో సోమరి గాయకుడు." ■

26, ఆగస్టు 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

19. మాతృమందిరం నవలాప్రాశస్త్యం

నవలాయుగానికి నాయకమణి 'మాలపల్లి' అనే శీర్షికతో ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారి వ్యాసం పట్ల గాని, ఉన్నవవారి నవల పట్ల గాని ఈర్ష్యతో వ్రాస్తున్నది కాదీ భావతరంగం.

1920వ సంవత్సరం జూలైలో ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయపు 24వ కుసుమంగా వేంకటపార్వతీశ్వరకవులు రాజమండ్రి నుంచి వెలువరించిన రెండవ నవలగా, మూడవ స్వతంత్రనవలగా మాతృమందిర రచనలో జంట కవులు చొప్పించిన కొన్ని మార్గదర్శకలక్షణాలు, తెలుగు నవలావికాసపరిశోధకులూ, విమర్శకవరేణ్యులూ అయిన ఈనాటి ఆచార్యవర్యుల దృష్టిని ఆకర్షించకపోవడం చింతావశుణ్ణి చేస్తూ ఉంటుంది నన్ను.

అనుస్మరణము అనే శీర్షికతో ఈ నవలకు నాందీస్థానంలో ప్రకటించిన ఖండకావ్యంలో జంట కవులిలా గానం చేశారు.

"తల్లి నిన్ను దలంచి ధర్మంబు తలచి, కష్టంబు సుఖములో గడిపివచ్చితిమి
చౌర్యవృత్తి చరింపజాలగా లేక, ఆకలిఁ దృష్టిలో అడచివచ్చితిమి
పరుషభాషణములు పలుకగాలేక, క్రోధంబు శాంతిలో కూల్చి వచ్చితిమి
దయ తప్పి రక్తపాతము చేయలేక, వైరంబు మైత్రిలో వదలివచ్చితిమి
ఆశాప్రలోభాప్తి నల్లాడలేక, మమతను సమతలో మడపివచ్చితిమి - జయ
సుధామయసూక్తి, జయదివ్యశక్తి! జయ సర్వజనయిత్రి జయ జగద్ధాత్రి!"

మాతృ (దేశ) మూర్తిని దేవీమూర్తిగా దర్శించి ఆ మూర్తి ముందు ప్రార్థించే జనులందరకు శాంతి, మైత్రి, సమతాదర్శములను బోధించిన తొలి తెలుగుకవుల కోవలో వేంకట పార్వతీశ్వరుల స్థానమేదో శ్రీమతి నాయని కృష్ణకుమారిగారు తప్ప, మిగిలిన సాహిత్యాచార్యులెందరు విస్మరిస్తున్నారో! అంతే కాదు, మహాత్మాగాంధీ సత్యాగ్రహశాంతి సమరపు పిలుపు తేదీలతో, మాతృమందిరరచన జరిగిన తేదీల ముందువెనుకలు కూడా పరిశోధనీయాలే!

9-7-1920 రాజమండ్రి నుంచి వెలువడిన మాతృమందిరం తొలి కూర్పులో

విజ్ఞానచంద్రికాగ్రంథమాల వ్యవస్థాపకులు కొమర్రాజు లక్ష్మణరావుగారి ఆంగ్లపీఠికలో కొన్ని వాక్యాలకు నా తెలుగు సేత

"తమ మాతృభూమియైన ఆంధ్రభూమి ఈ నాటి దేశభక్తునకు కనిపించే (వృద్ధిక్షయాలతో కూడిన) అన్ని కళల కథాబద్ధం చేయాలని గ్రంథకర్తల ఆశయంగా కనబడుతుంది. ఆ కథాబంధంలో కొంత ప్రేమతత్త్వం కొంత మార్మికతా (మిస్టిసిజం) కలుస్తాయి. ఈ మేళనంలో-తమదైన విశిష్టపంథాను ఏర్పరచుకొన్న బంగాలీ రచయితల వల్ల ఈ గ్రంథకర్తలు ప్రభావితులైనట్లు తోస్తుంది. ఇతివృత్తంలోని ప్రధాన కథాంశం పట్ల కుతూహలం చివరి దాకా తరగని విధంగా దానిలో ప్రేమతత్త్వాన్ని, మార్మికతనూ పోషించే వేర్వేరు ఉపకథలను జోడించారు. ఈ నవలలో ప్రబోధాత్మకమైన నీతి ఉంది. దుర్వ్యసనాల పట్ల సంయమనమూ, స్వచ్ఛజీవమూ, సర్వమానవ సౌభ్రాతృత్వమూ, దేశభక్తి, స్వధర్మనిరతీ వంటి సదాచారాలను విధిగా సంఘంలోని వివిధవర్గాల వేరువేరు మనస్తత్త్వాలకు చెందిన పాత్రలకు, సంఘటనలను చిత్రించారు. తెలుగు నవలారచనలో నూతనమార్గమును తొక్కిన ఈ గ్రంథకర్తలను, ప్రచురణకర్తను ప్రజలు ఆదరిస్తారని ఆశిస్తున్నాను."

ఈ నవలలోని ప్రధానకథాంశం ఏదంటే అవతారికలో జంటకవుల స్వప్న దర్శనంలో సాధుయోగిస్వరూపులైన తమ తమ తండ్రుల మూర్తులు దర్శనమిచ్చి, రెండూ కలిసి ఒక్కటయి, నవలాకథలో మాతృమందిరస్థాపకుడయిన ప్రబోధానంద స్వామిగా రూపొంది, మాతృదేవీపూజా, మాతృదేవీసేవా, సంఘసేవా, దీనజన సేవా కార్యక్రమాలకు దేశవాసులకు దీక్షా ప్రబోధాలను కలిగించే అమూల్యపుస్తకాన్ని కవులకు అందియ్యడము! ఈ సంఘటనా రూపకల్పనలోనేమి, మాతృమందిరసేవా సంస్థ నవలా కథాగతిలో చివరదాకా కొనసాగించిన సముద్ధరణ కార్యక్రమాలలోను కవులకు గల దూరదర్శిత్వం ప్రబోధానందునిలో జాతిపిత దర్శనంగాను, మాతృమందిరసేవాసంస్థలో ఏబది యేళ్లుగా దేశంలో నెలకొన్న సేవాసంస్థల దర్శనంగానూ బావించడం సమంజసమూ, న్యాయమూ కాదా!

చెప్పవలసిన ఆధునికభావాలను సూటిగా వాస్తవోక్తిగా చెప్పిన, ఈ జంట కవులు సంకేతములు ప్రతీకల వాడి, వ్యంజనాశక్తి ద్వారా ప్రకటించినందువల్ల నవలావికాసప్రదర్శకులకూ, విమర్శకులకూ వారి భావాలు తేటతెల్లం కాలేదు అనుకోడానికి – మాతృమందిరపు తొలిప్రకరణంలో (అవతారికా ప్రకరణం అయిన వెంటనే) పుస్తకమయిన చుక్కా-మిణుగురుల సంవాదం ఉదాహరణం అవుతుందా-

అందులో సర్వజీవనసమానత్వాన్ని తమ యీ నవలారచనకు ప్రధానాదర్శంగా సూచించారు గదా?

మిణుగురు : అక్కా! నేనును నీ వంటి దాననగుట యెట్లో చెప్పవా?

చుక్క : ఈ యున్నతస్థానమునకు చేరగలిగినచో నీవును నా వంటి దాననవే అగుదువు.

మిణుగురు : అక్కా! నేనంత దూర మెట్లు రాగులుగుదును?

చుక్క : వెర్రిదానా, నీవు నొక్కప్పుడు ఖద్యోతమవై యీ జగమంతయు వెలిగించు దానవే కాదా?

మిణుగురు : కేవల నామసామ్యమును బట్టి నన్ను పరిహసించుచుంటివా పరంజ్యోతి!

చుక్క : లేదు తల్లి! లేదు? నీవును పరంజ్యోతిస్వరూపిణివే! ■

2, సెప్టెంబర్ 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

20. నా సినిమా వ్యాసంగం - 1

నా యువమిత్రుడు భట్టొకసారి అడిగాడు నన్ను– "రజనిగారూ, మీ నాటికలూ, గేయాలూ నాటక మాధ్యమం కోసం రాశారు? రేడియోలో లాగా అతుక్కుపోకుండా సినీమాతో సంపర్కం ఎందుకు దూరంగా ఉంటూ వచ్చింది?" అని.

నా సాహిత్యరసభావప్రకటనకు ఊతగా నాకు చిన్ననాటి నుంచి అప్రయత్నంగా అవలీలగా లభించిన ప్రక్రియ పాట. ఆ పాట ప్రక్రియ చాలా బలీయం కావడం వల్ల నాలోని నాటకీయతా ప్రదర్శనోత్సాహం కూడా గేయనాటకరూపాన్ని అవలంబించింది. ప్రత్యక్షరంలో ప్రతీ పదంలో గేయత్వాన్నీ, నాటకీయతనీ ప్రదర్శించడమే నా లక్ష్యం కావడం చేత – నా ప్రదర్శనమాధ్యమం రంగస్థలమా, రేడియోనా అనే ప్రశ్న నన్ను ఎదుర్కోలేదు. ఇది పై ప్రశ్నలో మొదటి భాగానికి జవాబు.

ప్రశ్నలోని రెండవ భాగానికి తోడు మరొక అభిమాన ఆప్తమిత్రుడు శ్రీ వి.ఎ.కె., "రజనిగారూ, సినిమా సేవలో మీ కృషి ఫలితం చాలా అజ్ఞానంగానో, ప్రచ్ఛన్నంగానో, గుప్తనామాలతోనో పరకాయ (నామ) ప్రవేశాల చాటునో మరుగు పడిపోయినట్లు తెలుస్తోంది. ఈ అజ్ఞాతసంతానాన్ని మీరు 'మమ' కారంతో నాదని మీ వ్రాతలలో ప్రకటించవలసిన 'వయస్సు' మీకు వచ్చిందనుకుంటాను. సాధ్యమయినంత త్వరగా ఆ పని చేస్తారా" అని అడిగారు.

అందుకని, ఈ 'భావతరంగాన్ని' నా సినీమా వ్యాసంగ శీర్షికతో 'ఫ్లాష్ బాక్' చేస్తున్నాను.

1941 ఫిబ్రవరిలో నా 'చండీదాసు' నాటకం రేడియోలో ప్రసారం అయ్యాక, నా రెండో సంగీతనాటిక 'గ్రీష్మ ఋతువు' – సాంప్రదాయికమైన (కర్ణాటక) సంగీతంలో చేశాను. మద్రాసు రేడియో అధికారులు నన్ను నిలయవిద్వాంసుడుగా చేర్చుకోడానికి చర్చలు జరిపారు. అవి ఒక కొలిక్కి రాలేదు. ఈ లోగా అప్పటికే 'ద్రౌపది మాన సరంక్షణానికి' (బళ్ళారి రాఘవ దుర్యోధనుడుగా నటించినది) దర్శకత్వం చేసిన కీ॥శే॥ శ్రీ నిడుమోలు జగన్నాథ్–మా కుటుంబ సన్నిహితమిత్రుడు – తాను తీస్తున్న 'తారుమారు–భలే పెళ్లి' అనే రెండు హాస్య, సాంఘిక చిత్రాలలో నా పాటలనీ, సంగీతాన్నీ వినియోగించుకున్నారు. సినిమాతో నా తొలి సంపర్కం అదే. 'తారుమారు'లో ఒక జోలపాట 'జో అచ్యుతానంద జోజో ముకుందా లాలి పరమానంద రామ గోవిందా'

అనే సాంప్రదాయికగేయాన్ని మా ఆవిడ శ్రీమతి బాలాంత్రపు సుభద్రాదేవి చేత, శ్రీమతి గాడేపల్లి సుందరీశంకరం (దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి పినమామగారి సతీమణి) చేత పాడించాను. 'భలే పెళ్ళి'లో అంతర్నాటకంగా అప్పటికే తయారయి, దుర్గాబాయమ్మగారి ఆంధ్ర మహాసభ (స్త్రీల శాఖ) సాంస్కృతికోత్సవాలలో నృత్యనాటిక ప్రదర్శితమైన నా 'మేనకావిశ్వామిత్ర'లో శ్రీమతి పసుమర్తి విశ్వేశ్వరమ్మగారూ, నేనూ పాడగా–చిత్రీకృతం అయింది. ఈ నాటికనీ 1973 నుంచి–శ్రీ వెంపటి చినసత్యం గారి నాట్యబృందమూ, కుమారి శోభానాయుడు నాట్యబృందమూ నాట్యవేదికలపై ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రదర్శనల్లో నా సంగీతం సకృత్తు మాత్రమే.

ఆ తర్వాత (1941–42) నిర్వ్యాపారిగా నిరుద్యోగిగా ఉండే నేను కొన్నాళ్లు – రోహిణీ పిక్చర్సులో ఆర్థిక సలహాదారుగా ఉండే వడ్లమన్నాటి కుటుంబరావు గారి (కథానికా రచయిత) సలహా పైని –హెచ్.ఎమ్. రెడ్డిగారి 'కొలువుకూటా'నికి గేయరచయితగా, సంగీత దర్శకుడుగా చేరాను. ఎల్.వి.ప్రసాద్‌గారు ఒకటి–రెండు ప్రధానపాత్రలను ధరిస్తూ అక్కడ పరిచయం అయారు. హిందీ సినిమాలలో హిట్స్‌గా ప్రొడ్యూసర్లు భావించే పాటలకు వాద్యగోష్ఠి నిర్వాహకులు శర్మా బ్రదర్స్ స్వరం రాసేసుకుని వాయిస్తుంటే, ఆ స్వరాలకి పాటలు వ్రాయాలి. సదాశివబ్రహ్మం అనే ఆయన చాలా చురుగ్గా రాసేవాడు. ఆ పని నాకు నచ్చక మానేశాను.

1942 జులై 1వ తేదీన నేను మద్రాసు కేంద్రంలో నిలయరచయితగా, కళాకారుడుగా చేరాక నా గీతావళి (లలిత సంగీతం) కార్యక్రమాలలో ఒకసారి 'స్వామి నీ ఆలయమున సంధ్యాదీపకళికనోయి' అనే గేయం పాడుతూ దాని నిండా మధ్య ప్రాచ్య సంగీతధోరణులు వినిపించాను. కృష్ణశాస్త్రిగారు అది విని, హాఫీజ్ పర్షియన్ కవితలకు ఆంగ్లానువాదాలు చదివి తాను 'ఉమర్ ఖైయాం' జీవితం పైని తయారుచేసిన 'అతిథిశాల' నాటకాన్ని నా చేత సంగీతం పెట్టించి ప్రసారం చేయించారు. అది 1944–45. 'అతిథిశాల'లో నేను పాడిన మధ్యప్రాచ్య సంగీత ధోరణులకు ఆకర్షితులై వాహినీ దర్శకులు శ్రీ బి.ఎన్. రెడ్డి మద్రాసు కేంద్ర అధికారులయిన గోపాలన్, మూర్తిగారలకు ఆ సంగీతంలోని ఆకర్షణ గురించి ప్రశంసించి, అప్పుడు తాను తీస్తున్న 'స్వర్గసీమ' చిత్రంలోకి ఒక యువకవి చేత కొత్త రకం పాటలను నూత్నసంగీతరీతులలో వినిపించాలనే తన ఆశయాన్ని ప్రకటించారు.

'రీటా' హేవర్త్ నటించిన 'బ్లడ్ అండ్ శాండ్' అనే చిత్రాన్ని నాకు చూపించి, అందులోని మధ్యప్రాచ్య సంగీతధోరణిని స్ఫురింపజేసే 'పల్లవి'తో ఒక పాట తయారుచేయ మన్నారు. అదే – 'ఓహో పావురమా' భానుమతి పాడింది.■

09, సెప్టెంబర్ 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

21. నా సినిమా వ్యాసంగం - 2

శ్రీమతి భానుమతి రామకృష్ణ 'వ్యాంప్' పాత్రలో-హీరో (నాగయ్య)ను ఆకర్షిస్తూ పాడిన 'ఓహో పావురమా", ఆమెయే-సోలోగా ప్రారంభించి, చివర స్త్రీ బృందంతో కలిసి పాడిన 'ఓడ సెట్టింగ్' పాట 'ఓహో తపోధనా సుందరా'- ఇవి రెండూ అంత వరకూ సినిమాలలో రాని అపురూపపు మాటల కూర్పుతో, నా మధ్యప్రాచ్య రాగధోరణులతో బాగా జనరంజకం అయి, ఒక కొత్త తరంగం అనిపించాయి. ఇవి కాక - శ్రీ నాగయ్య పాడిన "హాయి సఖీ" (మోహన) 'గృహమే కదా స్వర్గసీమ' సుఖసందర్భంలో పాడేదొకటీను., పైగా నా గొంతులో హీరోయిన్ జయమ్మ విషాదాభినయానికి నేపథ్యంలో రేడియో పాటగా వినిపించిన "ఎవని రాకకై ఎదురు చూచెదో ఏకాకినివౌ బేలా" (వకుళాభరణం) మళ్లీ మధ్య ప్రాచ్యధోరణి గల రాగంలో పాట-వ్యవహారపు చిక్కుల వల్ల ఈ పాటలన్నిటికీ వ్యవహారపు ఒప్పందం, వాహినీవారితో మా అన్నయ్య శ్రీ నళినీకాంతరావు కుదుర్చుకున్నారు. టైటిల్స్‌లో క్రెడిట్స్-ఆయన రచనలుగా ప్రకటించినా ఆయన తరఫున పని నిర్వహించింది నేనే. నేను పాట పాడుకోకుండా వ్రాయడం అలవాటు లేదు గనుక, ఈ పాటలన్నిటికీ ప్రాథమిక సంగీతం నాదే - సంగీతదర్శకత్వం శ్రీ నాగయ్య ఆ పాటలకు చిలవలూ, పలవలూ, వాద్య రమ్యతలూ చేకూర్చారు.

వాహినీ వారి 'స్వర్గసీమ' లోని ఈ కొత్త ధోరణి పాటల సంగీతతరంగం వల్ల ఆకర్షితులై ఆ వెనువెంటనే సారథి వారు శ్రీ ఎల్.వి. ప్రసాద్, శ్రీమతి భానుమతీ రామకృష్ణలతో, శ్రీ సి.ఎస్.ఆర్. ఆంజనేయులుతో తీసిన 'గృహ ప్రవేశం' చిత్రం మొత్తానికి పాటలూ, సంగీతమూ నాచే తయారుచేయించడానికి- మా అన్నయ్య శ్రీ నళినీకాంతరావుతో ఒప్పందం కుదుర్చుకున్నారు. పని నాదే. క్రెడిట్స్ మా అన్నయ్య పేరుకు వచ్చాయి. ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్‌గా ఏయే సమయాలలో నా పని చూసుకోవాలో వాటికేమీ భంగం రాని విధంగా నేను సినీస్టూడియోలో మా అన్నయ్య తరఫున పని చేస్తూ వచ్చాను. 'గృహప్రవేశం' చిత్రానికి నేనిచ్చిన స్వరాలతో, ముఖ్యకళాకారులకు నేర్పిన పాటలతో, ఎల్ల కాలాలలోను నిర్వహించడానికి శ్రీ పెండ్యాల నాగేశ్వరరావు మొదటిసారిగా ఎసోసియేట్ మ్యూజిక్ డైరెక్టర్‌గా క్రెడిట్ పొందారు.

ఈ చిత్రంలో శ్రీమతి భానుమతి పాడిన 'అనగనగా ఒక రాణి', 'అమ్మా అమ్మా' (చారుకేశి రాగం), 'మేలుకోవే భారతనారీ', 'వెనుకాడ దేలనోయి'–'ఏమగునో నా జీవితమిక ఎటు పోవునో - యీ చుక్కాని లేని నౌక' అనే పాటలూ, ఎమ్.ఎస్. రామారావు, శ్రీ ఎల్.వి. ప్రసాద్ గారి హీరో పాత్రకి పాడిన 'హాలాహల మెగయునో' అనే పాటా, దాని వెనువెంటనే –కెమెరామాన్ రహ్మాన్– 'ఓహో పావురమా' టెక్నిక్‌లో తీసిన చిత్రీకరణతో రివాల్వింగ్ ప్లాట్‌ఫాం మీద శ్రీమతి భానుమతి పాడిన 'కనవోహో– తెరువరీ' అనే పాటా, శ్రీ సి.ఎస్.ఆర్. ఆంజనేయులు పాడిన 'జానకి నాదేనోయి', 'మై డియర్ తులసెమ్మక్కా' అనే హాస్యం కలిగించే పాటలూ, ఒక సీసపద్యమూ ఇవన్నీ నా (అజ్ఞాత) సంతానమే, ఈ 'గృహప్రవేశం' చిత్రానికి కథా, సంభాషణలూ, సినేరియో రచనా, కీర్తిశేషులు శ్రీ త్రిపురనేని గోపీచంద్.

'పితకో, పతికో, సుతునకో, ఆ జీవితమూ, విధేయతా యుగ యుగాలకు లభింపదోయిక స్వతంత్రతా!' అని భారతనారిని గురించిన గేయంలోనూ, 'మతమనుచు కులములనుచు ద్వేషములు పెరిగిపోయె, శాద్వల శ్యామభూమి రక్తసంసిక్తమాయె తెగత్రెంచెదమిక, దేశపు దాస్యపు సంకెలలు తొలగించెదమిక దారిద్ర్యకాటకాలు రూపుమాపుదము కులమత జాతివిభేదాలు అని' 1945 నాటి నుంచి నేటి వరకూ మారని మన దేశపరిస్థితులను గురించి, గోపీచంద్ నా చేత ఆనాడే వ్రాయించిన పాటలు జ్ఞాపకం చేసుకుని, ఆయనా, నేనూ హైద్రాబాద్ ఆకాశవాణిలో కలిసి పని చేసిన 1960–68 మధ్య–ఆయన నిట్టూర్పుతో కూడిన సంతృప్తి వెలిబుచ్చేవాడు.

'గృహప్రవేశం' చిత్రనిర్మాణంలో కలిసిపోయిన మా మనోధర్మానికి సంతృప్తితో శ్రీ గోపీచంద్–ఆ తర్వాత శోభనాచలవారికి తీయబోతున్న 'లక్ష్మమ్మ కథ' చిత్రానికి పాటా, సంగీతమూ ఇమ్మని నన్నడిగారు. ప్రభుత్వసమ్మతి కోసం దరఖాస్తు పెట్టుకున్న నేను ప్లూరసీ అస్వస్థతకు లోనయి, బెడ్ రెస్టు తీసుకున్న సమయంలో ఆ పని పడింది. ప్రభుత్వానికి పెట్టుకున్న దరఖాస్తు రద్దు చేసుకోవలసి వచ్చింది. పాటలూ, సంగీతంతో సహా అనారోగ్యపు పక్క మీదే తయారయిపోయేవి. కీర్తిశేషుడు శ్రీ ఘంటసాల మా ఇంటికి వచ్చి ఆ పాటలూ, సాహిత్యమూ, స్వరాలూ స్వయంగా వ్రాసుకుని, లక్ష్మమ్మ కథకు సంగీతదర్శకుడుగా క్రెడిట్స్‌లో మొదటిసారి అవకాశం లభింపజేసుకోగలిగారు. ఆ పాటల రచన 'తారానాథ్' అనే నా కలం పేరుతో క్రెడిట్స్ కెక్కింది. ఈ చిత్రంలో శ్రీ చదలువాడ నారాయణరావు, శ్రీమతి కృష్ణవేణి, హీరో - హీరోయిన్లు, పాటలు శ్రీఎమ్.ఎస్. రామారావు, శ్రీమతి కృష్ణవేణి, హాస్యపుపాటలు రేలంగీ, నల్లరామమూర్తి పాడారు. ఇదే కథతో మరో కంపెనీ వారి ఇంకొక చిత్రం 'శ్రీలక్ష్మమ్మ కథ' అనే పేరుతో

పోటీగా ఒకే సమయాన విడుదల అయినా, ఆంధ్రమహాజనం రెండు చిత్రాలనూ సమానంగానే ఆదరించారు. ఈ చిత్రంలోని పాటలలో-లక్ష్మమ్మ అత్తింటికి మేనా సవారిలో వెడుతున్నప్పటి పాట 'చిన్ననాటి స్వప్నసీమ కన్నయూరు విడువలేము'- ఇదొకటీ, కథానాయకుడు విలాసవతి అందానికి మరిగి-రెండు రస్తాల మధ్య, దీపస్తంభం కింద చతికిలబడి 'ఇటో-అటో-ఎటు పోవుటో - జీవితమార్గము చీలిపోయెనిట' అనేది- మరపు రానివి.

రెండు చిత్రాల్లో నా పాటలకూ, సంగీతానికీ రుచి మరిగిన శ్రీ గోపీచంద్, 'పేరంటాలు' అనే జానపదగాథాచిత్రానికి నా చేత అధికారుల అనుమతికై దరఖాస్తు పెట్టించి పాటలూ, సంగీతమూ ఇమ్మన్నారు. ఈ చిత్రం పాటలలో జానపదధోరణి యెక్కువ. అదే సమయంలో శ్రీ వై.వి.రావు (యరగుడిపాటి వరదారావు) తీస్తూండిన 'మానవతి' చిత్రానికి కూడా నేను ప్రభుత్వానుమతి తీసుకుని పాటలూ, సంగీతమూ నా పేరుతోనే యిచ్చాను. ఈ చిత్రాల పాటలు గ్రామఫోను రికార్డులలో నా పేరుతో వచ్చాయి. 'పేరంటాలు' పాటలు మొదళ్ల కంటె 'మానవతి' చిత్రంలోని పాటలు స్మృతిలో ముందాడుతున్నవి. పద్మినీ, నారాయణరావులకు ప్లేబ్యాక్‌గా-రావు బాలసరస్వతీదేవి, ఎమ్.ఎస్. రామారావు పాడిన 'ఓ మలయపవనమా' అనే మలయమారుతరాగంలోని యుగళగీతమూ, 'ఓ నా సఖీ' అనే రంజనిరాగ యుగళగీతమూ, రసాళి అనే సాంప్రదాయికరాగంలో 'తన పంతమే తావిడువదే' అనే కథానాయిక సోలో బాలసరస్వతీదేవి పాడినదీ-గ్రామఫోను రికార్డుల్లో తరచు వినిపించేవి. ఈ చిత్రాల్లో నా పని రేడియోపని సమయాలకు భంగం కాకుండానే జరిగేది. ■

16, సెప్టెంబర్ 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

22. 'నా సినిమా వ్యాసంగం' - 3

వాహినీ స్టూడియోల కట్టడాలు పూర్తి అవుతున్న రోజులవి. నా కన్న భావుకకవి అయిన కృష్ణశాస్త్రిగారి చేత పాటలు వ్రాయించి నా వంటివాని చేత సంగీతం పెట్టించాలనే ఆశయం ఉండేది బి.ఎన్. (నరసింహా) రెడ్డికి. మా ఇద్దరినీ తమ కారులో స్టూడియో భవన సముదాయానికి తీసుకువెళ్లి, అవి చూపించేటప్పుడు ఒకహాల్‌లో కొత్తగా తెప్పించిన హేమండ్స్ ఆర్గన్ (పెద్ద ఎలక్ట్రికల్ ఆర్గన్) చూపించి 'ఇది మీ గది, మ్యూజిక్ డైరెక్టర్ గది అన్నమాట' అన్నారు, నన్ను చూసి. ఆ కొత్తగా వచ్చిన ఆర్గన్ పైని ట్రయల్స్ చెయ్యడానికి ఆకాశవాణిలోని పాశ్చాత్య సంగీతవిద్వాంసుడు హేండల్ మాన్యుఅల్‌ని మాతో తీసుకెళ్లాం. నన్ను గురించి బి.ఎన్. ఆశయం ఆచరణలోకి రాలేదు గాని, ఆ వెనువెంటనే ఆయన తీసిన 'మల్లీశ్వరి' చిత్రానికి కృష్ణశాస్త్రిగారి పాటలకి నా మిత్రుడు సాలూరు రాజేశ్వరరావు చేత సంగీతం చేయించారు. ఆంధ్రలోకం అంతటితో పాటు నేను కూడా ఆ చిత్రం పాటల సంగీతానికి ఆనందించాను.

తరువాత కొన్నాళ్లకి 'బంగారుపాప' చిత్రానికి కృష్ణశాస్త్రిగారి పాటలూ, నా సంగీతమూ అని మొదట అన్నారు, బి.ఎన్. 'ఏ కొర నోములు నోచెనో గాని, కన్న దేవకి వంతు కన్నీరె ఆయె' అనే పాట శాస్త్రిగారు వ్రాసిందానికీ, 'తాధిమి తకధిమి తోలుబొమ్మ' అని ఎస్.వి. రంగారావు పాత్రకి మాధవపెద్ది పాడిన బ్రహ్మంగారి తత్త్వానికీ సంగీతం నేనిచ్చినవే. క్రమంగా ఆ చిత్రం దినచర్యలో రెడ్డిగారి కొలువుకూటంలో సంగీత సలహాదారులు ఎక్కువయి, నేను తటాలున తప్పుకున్నాను ఏ క్లెయిమూ చెయ్యకుండా.

ఇలాంటిదే–శ్రీ గోపీచంద్ డైరెక్ట్ చేసిన 'ప్రియురాలు' చిత్రంలో నా సంగీతప్రమేయం. దానిలో పాటలు వ్రాయడానికి నేనే కాక అనిసెట్టి సుబ్బారావును నియోగించారు. ఆయన వ్రాసిన 'అవనీ' అనే పాట సంగీతం నాదే. ఆ చిత్రంలో శ్రీమతి రావు బాలసరస్వతీదేవి, నాయిక కోసం పాడిన 'ఉందువో మధురానగరి' (ఉదయ రవిచంద్రిక), 'ఎవనిదా వేణుగీతి' (హేమవతి) రెండు నృత్యగీతాలు నా 'మధురానగరి' అనే నృత్య నాటిక లోనివి. ఆ పాటలు గ్రామ్‌ఫోన్ రికార్డులలో వచ్చాయి. ఆ చిత్రం నుంచి కూడా తప్పుకున్నాను. దానికి అద్దేపల్లి రామారావు మ్యూజిక్ డైరెక్టరు.

కె.ఎస్. ప్రకాశరావు డైరెక్ట్ చేసి, హీరోగా నటించారనుకుంటాను, 'ద్రోహి' అనే చిత్రంలో. దానికి 'జీవితమూ దుఃఖపూరితమూ' అనే పాట నా సంగీతంలో నా రచన, ఎమ్.ఎస్. రామారావు పాడారు. ఈ పాట 1940లో మా పిఠాపురంలో ఆడించిన 'దేవదాస్' నాటకానికి నేను వ్రాసిన పాటల లోనిది. 1956లో నేను మద్రాసు నుంచి విజయవాడకు బదిలీ అయిపోయాను. 1960 దాకా అక్కడ ఉంటూ-మధ్య మధ్య అప్పుడప్పుడు మద్రాసు వెళ్లినప్పుడు బి.ఎన్. కబురంపించి, 'రాజమకుటం' చిత్రానికి రెండుపాటలు వ్రాయించుకున్నారు నా చేత. మధ్యప్రాచ్యసంగీతధోరణిలో ఉన్న యుగళగీతం 'ఊరేది పేరేదీ - ఊరేల-పేరేలా' అని ఘంటసాలా, శ్రీమతి పి. లీల పాడిన పాటొకటీ - 'తంగనా తింగానా డిల్ల, కొంగన్న ముక్కున జెల్లా' భావగర్భితమైన మాటలతో కూడిన పాటా నేను వ్రాసినవే. నా సంగీతముతోనే మ్యూజిక్ డైరెక్టర్ వేణు వాటిని రికార్డు చేశారు. సినిమా పాటల పుస్తకంలో వాటి రచన మా బావగారయిన బుద్ధవరపు నాగరాజుమాత్యుని పేరును ప్రకటించారు.

విజయవాడకు బదిలీ కాక ముందే అంటే 1945-56 మధ్య మద్రాసులో కొన్ని వ్యాసంగాలను గురించి ఇప్పుడు జ్ఞాపకం వస్తోంది.

శ్రీమతి భానుమతి, శ్రీ పి. రామకృష్ణరావు దంపతులు (భరణీవారు) నేను అంటే అత్యంత ఆప్యాయతతో కుటుంబమిత్రుడుగా చాలా అభిమానం చూపేవారు. నా సంగీతం అన్నా వారికిష్టమే. వారి 'రత్నమాల' చిత్రంలో 'ఏమే ఓ చిలుకా' అనే పాట రచనా, సంగీతమూ నావే. వారి 'విప్రనారాయణ' చిత్రంలో టైటిల్స్‌పై 'కౌసల్యా సుప్రజారామా' -శ్లోకం నా చేత చదివించారు. 1953 అక్టోబరు 1వ తేదీన ఆంధ్రరాష్ట్రం అవతరించిన ప్రభాతవేళ మద్రాసు నుంచి ప్రత్యేక ప్రభాత గీతావళి కార్యక్రమంలోశ్రీమతి భానుమతి-నా తెలుగు తల్లి పాట 'స్వరంబెత్తి పాడరా సోదరా ఆంధ్రోదయ వేళా' (ఘనశ్యామ సుందరా వరుస), అన్నమాచార్యుల 'విన్నపాలు వినవలె' (భూపాల), ఒక అష్టపదీగానం చేశారు. విజయవాడ రిలే చేసింది, 1947-48లో నేనూ, ఆవిడా కలిసి, 'నా తెలుగు తల్లి' పాటా, వెనుక పక్క 'వందే మాతరం' పాటా-గ్రామొఫోన్ కంపెనీవారి కోరిక పైన రికార్డు చేశాము.

సలభయిల చివర్లో ననుకుంటాను-శ్రీమతి కన్నాంబ, కడారు నాగభూషణం గార్ల రాజరాజేశ్వరి ఫిలింస్ తరఫున, ఆరుద్ర నన్ను తనతో తీసుకువెళ్లి వారి 'సౌదామని' చిత్రానికి ఒక రెండు పాటలు సంగీతంతో సహా వ్రాయించారు. అవి 'ఏవేవి' అనేది కూడా జ్ఞాపకం లేకపోవడానికి కారణం, అవి నా అభిప్రాయంలో కుంతీదేవి కన్న కర్ణసంతానం లాంటివి కావడమేమో!

లైలా మజ్నూన్ సినిమా తెలుగులో రావడానికి ముందే రేడియోలో లైలా మజ్నూన్, షిరీన్ ఫరహద్, సోహినీ మహీవాల్ వంటి సంగీతనాటకాలు ప్రసారం చేశాము. వాటిలో లైలా మజ్నూన్ పాటలు నేను వ్రాశాను–సంగీతం నాది, శ్రీ ఘంటసాల పాడారా పాటలు. వాటిలో 'గుడారమెత్తి వేశారు కడకొంటరిగ మిగిలాను' అనే చంద్రకౌంస్ రాగం పాటా, 'ఎందు చూసినా గాని నీవు లైలా మృతి లేదు ప్రేమకంటావు' అనే 'మధ్యప్రాచ్యధోరణి' పాటా ఘంటసాల రికార్డిచ్చారు కూడా. అవి సినిమా చిత్రాల లోనివి కావు–రేడియో నాటకంలోనివి అని స్పష్టపరచడానికి ఈ అవకాశం తీసుకుంటున్నాను.

రేడియోలో ఘంటసాల వంటి కళాకారుని చేత, నేను ప్రయోగరీత్యా రచించి సంగీతం కూర్చి పాడించిన 'ఘనాఘనా గర్జింపవో'–మేఘరంజని రాగంలో పాట వంటివి ఎన్నో తరువాత సినీమాల అనుకరణల్లోకి పాకిపోయేవి. భరణీవారి విప్రనారాయణలోని 'ఎందుకోయీ తోటమాలీ' అనే మధ్యప్రాచ్యధోరణి పాట గాని, 'నారీ నారీ నడుమ మురారీ' పాట గాని నావి కావు. నా ధోరణులపై అభిమానం గల గేయకర్తలూ, సంగీతకర్తలూ కూర్చినవి. వారికి నేనెప్పుడూ కృతజ్ఞుడిని. అలాగే ఘంటసాల పద్యపఠనధోరణీ, గీతాపఠనమూ, రేడియో కార్యక్రమాలలో, నాటకాలలో రాణ తేరినదే అని గర్విస్తుంటాను. ■

23, సెప్టెంబర్ 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

23. గాంధీజీ జీవితంపై ధ్వనిప్రకాశిని

ఆకాశవాణి 'కర్సియాంగ్' కేంద్రంలో అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా రెండేళ్లు పనిచేసి, నేను సాధించగలిగిన ఘనకార్యం– అక్కడి కేంద్రకార్యక్రమ నిర్వాహకుల, ప్రయోక్తల దృక్పథాన్ని ఉదారభావాలతో ఆ ప్రాంతాల జానపదగాయకుల సార్వత్రీయ సంగీత రీతులకూ, సామాన్య పల్లీయజనుల పల్లెపాటలకూ, ఆ రేడియో కేంద్రంలో అంత వరకూ సాగుతూ వచ్చిన శాస్త్రీయసంగీతంతో, రవీంద్రసంగీతంతోపాటు సమాన సామాజికగౌరవం కలిగించడం!

1966 మే, జూన్‌లలో కర్సియాంగ్ నుంచి నాకు ఢిల్లీ బదిలీ అయింది. అదే పదవి. పని చేయడం ఢిల్లీ రేడియో కేంద్రంలో కాదు. ట్రాన్స్‌క్రిప్షన్ అండ్ ప్రోగ్రాం ఎక్స్‌ఛేంజ్ సర్వీస్‌లో, దేశంలోని వివిధ రేడియోకేంద్రాలలో తయారైన మంచి మంచి సంగీతకార్యక్రమాలనూ, నాయకులా, సాహిత్యపరులా, ఉత్తమప్రసంగాలనూ భద్రపరిచే అర్కైవ్స్ శాఖ. వాటి నుంచి వివిధకేంద్రాలు ఎంపిక చేసుకుని కోరుకోగా, వాటికి సరఫరా చేసే ప్రోగ్రాం ఎక్స్‌చేంజి శాఖ. దేశంలో వివిధప్రాంతాలలోని వివిధభారతి కేంద్రాలకి లలితసంగీత, ఫిలిం సంగీతకార్యక్రమాలనూ, లఘురూపకాలనూ, ధ్వనిముద్రణయంత్రాల ద్వారా నలభై ప్రతిరూపాలకు పైగా ముద్రించి టేపులను సరఫరా చేయడమూ ఇవీ పనులు. నా జాతకం వ్రాసిన 'భృగునాడి' ఈ పనిని ఇలా వర్ణించింది. 'యంత్రనిక్షిప్య కార్మికాన్ నియోజ్య, ఉత్తమోత్తమ వినోదగీతానంద భావతన్మయ భాషానాద బ్రహ్మతత్త్వం ప్రసారం'

దేశంలోని రేడియో కేంద్రాలలో ఎక్కడ పని చేస్తున్నా, పై అధికారులు పని కట్టుకుని పిలిచి, బరువైన ప్రత్యేకకార్యక్రమాల బాధ్యతేదో ఒప్పగిస్తూండడం నా సర్వీసులో పరిపాటి!

అది 1969 మే నెల మొదటి వారం, ఆకాశవాణి మహానిర్దేశకుడు (డైరెక్టర్ జనరల్) పి.సి. సేన్‌గారి ఛేంబర్‌కి రమ్మని నాకు పిలుపు వచ్చింది. ప్రధానమంత్రికి ప్రత్యేకకార్యదర్శియైన శారదాప్రసాద్ అక్కడున్నారు. మే 27వ తేదీ పండిత జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతికి తీన్ మూర్తిభవనం ఆవరణలో ఏర్పాటు అయ్యే ప్రార్థనసమావేశంలో వేరు వేరు భాషల గాయకబృందాలతో పాటు నన్ను కూడా తెలుగు గాయకబృందానికి

నాయకుడుగా తెలుగుపాటలు, ప్రార్ధన గీతాలు, దేశభక్తి, మానవతాగేయాలు పాడడానికి ఎంపిక చేశారు. ఢిల్లీ ఆకాశవాణి, ఇతర కార్యాలయాలలో కొన్ని తెలుగు కంఠాలను చేర్చుకుని నేను ఆ కార్యక్రమాన్ని అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ, మున్నగువారి సమక్షంలో నిర్వహించాను.

డైరెక్టర్ జనరల్ ఛేంబర్‌లోకి మరొకసారి నాకు పిలుపు వచ్చినపుడు అక్కడ గాంధీ సంస్థాపన సంఘాధ్యక్షులు డా. కె. ఎల్.రావు గారు ఉన్నారు. ఆ సంస్థ కార్యదర్శి మాషూర్‌కర్ వున్నారు.

విజయవాడ గాంధీ పర్వతం పైన నిత్యమూ ప్రదర్శిస్తూ వుండడానికి గాంధీజీ జీవితం పైని ధ్వని ప్రకాశినీ రూపకం (శబ్దరూపకం) ఒకటి తయారుచెయ్యాలి. ఇంగ్లీషులో ఒకటీ, తెలుగులో ఒకటీ. గాంధీజీ జీవితసంఘటనల కథాకథనవ్యాఖ్యలతో, సంఘటనల రూపకీకృత శబ్దాత్మకదృశ్యాలతో, సందర్భోచితంగా వేరువేరు భాషల గేయాలతో రికార్డు చెయ్యాలి. రచన ఇంగ్లీషు మూలం యు.ఆర్. రావు. దాని నాటకీకృతసంభాషణల రచన ఆంగ్లంలో శ్రీమతి శాంతా రంగాచారి (ఈమె ఫిల్మ్స్ డివిజన్‌లోని భరత్ రంగాచార్యకు తల్లిగారు). ఆ నాటకీకరణకు తెలుగు అనువాదము నాది. ఆంగ్లరూపకానికి దర్శకుడు రమేశ్‌చంద్ర అనే అప్పటి ఢిల్లీ దూరదర్శన్ కేంద్రనిర్దేశకుడు. తెలుగు రూపకానికి దర్శకుణ్ని నేను. రెండు రూపకాలకు ఢిల్లీ ఆకాశవాణి వాద్యబృందం సహకారంతో నేపథ్యసంగీత రచనా, నిర్వహణా నావి. ఢిల్లీలోని, బొంబాయిలోని నట బృందంతో రమేశ్‌చంద్ర ఆంగ్లరూపకాన్నీ, ఢిల్లీ వాద్యగోష్ఠితో నేను సంగీతాన్నీ, ఢిల్లీ బ్రాడ్ కాస్టింగ్ హౌస్ స్టూడియోలలో రికార్డు చెయ్యాలి. తెలుగు రూపకానికి కావలసిన నటీనటులను తెలుగు సినిమారంగం నుంచి నేను ఎంపిక చేసి కె.యల్.రావు గారు మున్నగు గాంధీ సంస్థా నిర్వాహకుల ఏర్పాటు ప్రకారం, ఆకాశవాణి మద్రాసు స్టూడియోలో నా దర్శకత్వంలో రికార్డు చెయ్యాలి.

రమేశ్‌చంద్రా, నేను పారితోషికాన్ని ఏమీ కోరకుండా ఈ గాంధీ రూపకాల నిర్వహణనూ, రికార్డింగునూ ప్రభుత్వసేవలో మేం చెయ్యవలసిన విధులుగా నిర్వర్తించడానికీ, నా మద్రాసు ప్రయాణానికీ, అక్కడ రికార్డింగ్ ఏర్పాటులకీ, డైరెక్టర్ జనరల్ నిర్దేశాలు జారీ చేశారు. ఆరు నెలలు పట్టింది పని పూర్తి కావడానికి.

ఆంగ్లరూపకంలో ఢిల్లీ స్కూల్ ఆఫ్ డ్రామా డైరెక్టర్ అల్కాజీ, కథకపాత్రా, బొంబాయి నుంచి అనుకుంటా, జూల్ వెలానీ గాంధీజీ పాత్రా నిర్వహించారు. మిగిలిన పాత్రలు కూడా సమర్థులైనవారే నిర్వహించారు. తెలుగు రూపకంలో గాంధీజీ పాత్రకి శ్రీ చిత్తూరు నాగయ్య, బాలగాంధీ తల్లి పాత్రకి మద్రాసు రేడియో భానుమతీ, కస్తూరిబా

పాత్రకి శ్రీమతి షావుకారు జానకీ, ముఖ్యకథకులుగా శ్రీ జగ్గయ్య, శ్రీ గుమ్మడీ, స్వాతంత్ర్య ప్రతిజ్ఞా పఠనానికి శ్రీ ఎన్.టి. రామారావు మున్నగువారు నా అభ్యర్థన పైనీ, కె.ఎల్. రావుగారి కోరికపైనీ, గాంధీజీపై భక్తిశ్రద్ధలతో 'అమూల్యం'గా పాల్గొని, తెలుగు రూపకం రికార్డింగ్‌కి తమ అమూల్యసేవలు అందజేశారు. ధ్వని ప్రసారకాంతి ప్రసారాల సమయోచిత సమ్మేళన ద్వారా ఈ విధంగా రూపకనిరూపణ చేసే కార్యక్రమాన్ని, సౌండ్ అండ్ లైట్ ప్రోగ్రాం అంటారు.

మన స్వాతంత్ర్యోద్యమంలో దేశవాసుల్ని ఉగ్రూతలూగించిన తెలుగు, తమిళ, హిందీ, బెంగాలీగేయాలను ఎన్నింటినో ఈ రూపకం కోసం రికార్డు చేశాం. నా క్రియాత్మకచాతుర్యం వెల్లడి చేసే రెండు-మూడు వాద్యగోష్ఠి రచనలు కూడా ఈ రూపకాలలో నేపథ్యావేశాన్ని కలిగిస్తాయి. వాటిలో ఒకటి ఫెనిక్స్ అనే పక్షి, మరణానంతరం పునర్జన్మ ఎత్తడాన్ని నిరూపిస్తుంది. ఫెనిక్స్ అనే ఆశ్రమం (దక్షిణాఫ్రికా) ఘట్టంలో వస్తుంది.

గాంధీపర్వతం పైని పోర్‌బందర్ కోటా, బురుజులతో దుర్గమూ, దక్షిణాఫ్రికాలోని గాంధీజీ ఫెనిక్స్ ఆశ్రమమూ, సబర్మతీ ఆశ్రమమూ, సేవాగ్రాం ఆశ్రమమూ, చిన్న చిన్న కట్టడాలుగా కట్టి, వాటి లోపలా, బయటా విద్యుద్దీపాలు వెలుగుతూ, ఆరుతూ వుంటే, ఆడిటోరియంకు నాలుగు వైపులా స్టీరియో పద్ధతిని శబ్దరూపకంలోని సంభాషణలు వస్తూంటే, పాత్రలు ఎదురుగా నటిస్తున్న భ్రమగొలిపే పద్ధతిని, ఈ రూపకానికి హాలండ్ ఫిలిప్స్ కంపెనీవారు శబ్దశ్రవణ, విద్యుద్దీపచాలనాలు సన్నిహితసంబంధం వుండేటట్లు సమకూర్చారు.

ఏటంబరో నిర్వహణ పైని బెన్‌కింగ్‌స్లే గాంధీజీగా తర్వాత ఇటీవల ఆంగ్ల హిందీ భాషలలో వచ్చిన సినిమా సినేరియోకూ, మా ధ్వనిరూపకానికీ, సినేరియోలోనూ, శాబ్దికదృశ్యనిరూపణలోనూ చాలా పోలికలు ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. వాన లేని సాయంత్రాల్లో విజయవాడ గాంధీ కొండ పైని ఈ రూపకప్రదర్శనను ఇప్పటికీ విని ఆనందించవచ్చు. ■

30, సెప్టెంబర్ 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

24. 'కృష్ణదేవరాయ వైభవం'

(తొలి రేడియో డాక్యుమెంటరీ)

తొలి రోజులలో మద్రాసు రేడియో తెలుగు కార్యక్రమాల నిర్మాతల్లో క్రియాశీలురైన వైతాళికులలో ప్రథమశ్రేణికి చెందిన వారిలో అగ్రగణ్యులు ఆచంట జానకిరాం. 1938 జులై మొదటివారంలో మద్రాసు నుంచి ప్రసారం అయిన మొదటి తెలుగు రేడియో నాటిక అనార్కలీ–కూర్పు, నిర్వహణా, దర్శకత్వమూ ఆయనవే. ఆయన వ్రాసి, దర్శకత్వం నిర్వహించిన కార్యక్రమాలను –కొన్నింటిని 'అజంతా' అనీ, కొన్నిటికి 'సుకుమార్' అనీ, కొన్ని ప్రత్యేకసందర్భాలలో ఆయన అసలు పేరుతోనూ ప్రకటించేవారు.

1941 జనవరి 7వ తేదీన నేను మొదటి రేడియో సంగీతనాటకం శ్రీశ్రీ – మోహినీ రుక్మాంగదలో పాల్గొన్నానని వ్రాశాను. ఆ తరువాత వారం రోజులకే – జానకిరాం గారు, 'కృష్ణదేవరాయవైభవం' అనే చారిత్రక రూపకం–'డాక్యుమెంటరీ' తాను పరిశోధనాత్మకంగా బహుప్రయాసతో కూర్చిన రూపకంలో నేను పాల్గొనడానికి, స్టేషన్ డైరెక్టర్ ప్రత్యేకసమ్మతి పొందవలసి వచ్చింది. అది ప్రసారం అయినది 15 జనవరి 1941వ తేదీన.

ఈ రూపకం మౌలికరచన శ్రీ ఆకొండి వేంకటేశ్వరరావు. దానిని ఆధారంగా చారిత్రకవిషయాలనెన్నింటినో పయస్, న్యూనిజ్ వంటి విదేశీచరిత్రకారుల వ్రాతల నుంచీ, యదార్థసంఘటన స్వరూపస్వభావాలతో రూపకాన్ని పెంచడానికి జానకిరాం– నన్ను వెంటపెట్టుకొని మద్రాసులోని–కన్నిమారా, మద్రాసు విశ్వవిద్యాలయం, ప్రాచ్యలిఖితగ్రంథాలయాలన్నీ తిరిగి విషయసేకరణ చేశారు. నేను తెలుగు సాహిత్యంలో ఎమ్.ఏ పట్టభద్రుణ్ని అయి ఒక్క యేడాదే అయివుండడం ఒక్కటీ, శాసనాలలోని గద్యపద్యాలను రాగయుక్తంగా సాంప్రదాయిక నాగస్వరసంగీతంతోపాటు పఠించగలగడం ఒక్కటీ, నేను పాల్గొనడానికి ఆయన ప్రత్యేక అనుమతి పొందడానికి తోడ్పడ్డాయి.

నేను గాక ఆ రూపకంలో పాల్గొన్నవారిలో ఆ నాటికి, నాటక సినిమా రంగాలలో పేరు మోసిన దిగ్గంతులు కొందరున్నారు. వారిలో ముఖ్యులు – రాయల పాత్రధారి శ్రీ పారుపల్లి సుబ్బారావు, తిమ్మరుసు పాత్రధారి శ్రీ ముంజులూరి కృష్ణారావు, అల్లసాని పెద్దన్న పాత్రధారి పారుపల్లి సత్యనారాయణ. ఇంకా అప్పటికే నిలయ కళాకారుడైన ప్రయాగ నరసింహశాస్త్రి కూడా వున్నారు.

రాయల చారిత్రకవైభవం వీలైనన్ని కోణాల నుంచి ఆ రూపకంలో చొప్పించడానికి చేసిన ప్రయత్నంలో, తర్వాత దేశంలో కొట్టిన పిండి అయిపోయిన భువనవిజయకవితాగోష్ఠి, రాయవాచకం అనే రాయల ఆస్థానోద్యోగుల సమాచార వివరణము చేసే కవితలో నుంచి కొన్ని ఘట్టాలు, విదేశీయాత్రికులు చేసిన రాయల సభావర్ణనలు, సభలో రాజనర్తకి నృత్యగీతప్రదర్శనం, ఇవికాక, ఒకానొక ఉత్తరాయణ పుణ్యకాలంలో పెద్దనగారు రచించిన పద్యాలతో రాయలవారు జారీ చేసిన దానశాసనం- ఇవన్నీ ఆ రూపకంలో చోటు చేసుకున్నాయి.

రూపకం ఒకేసారి మూడు-నాలుగు స్టూడియోల నుంచి ప్రసారం అయింది. ఒక్కొక్క స్టూడియోలలోను నిర్మాతకు కుడిభుజం లాంటి సహచరులు ఒక్కొక్క రూపకం ప్రతితోను, అది సంభాషణల స్టూడియో అయితే వారంతా ఒక స్టూడియో! సంగీతం పాడే వారూ, వాయించేవారూ ఒక స్టూడియోలో ప్రధానపాత్రలయిన రాయలు, తిమ్మరుసు పెద్దన వంటి పాత్రలకు పాడే పద్యాలుంటే, వారికి పక్క వాద్యకారులూ, హర్షధ్వానాలు, ప్రజల జయజయధ్వానాలకు వెనుక ఉండే సామూహికపు రొదా వంటి నేపథ్య ధ్వనులు రికార్డుల ద్వారా వినిపించే వాటికి టర్న్ టేబుల్ ఉండే ఒక స్టూడియో, ఇలాగ ఏర్పాటు చేశారు. పాత్రధారులందరికీ ఒక్కొక్కరి చేతిలోనూ ఒక్కొక్క ప్రతి ఉండేటట్లు, జానకిరాం రూపకం మొత్తం త్యాగరాయనగర్‌లో ఒక ప్రెస్‌లో అచ్చు వేయించి తెచ్చి పంచిపెట్టారు.

నేను శాసనం పఠించిన పద్ధతి, బ్రాడ్కాస్టింగ్ ప్రసార చమత్కారాలు విరివిగా వృద్ధి పొందని ఆ రోజుల్లో, చాలా అపురూపమైనది. ఒక స్టూడియోలో టర్న్ టేబుల్ పైని ఒక నాగస్వరం రికార్డు డోలు లయ సాగుతుంటే, కేవలం రాగాలాపన చేసే ఘట్టం నాకు హెడ్ ఫోన్స్ ద్వారా చెవుల్లో వినిపింపజేశారు. డోలు ముక్తాయి పూర్తయి, రాగం ఒక ఆవృత్తి కాగానే, నేను గొంతు కలిపి 'శాలివాహన' శకవరుషంబులు వెయ్యిన్నీ నన్నూట నలుబది రెండగునేట, ఉత్తరాయణపుణ్యకాలంబున అని, నాగస్వరం రికార్డు వినిపించే రాగావృతాలతో మేళనం అయ్యేటట్లు పఠించడం, ఆ భాగం ఒక డిస్కు మీద రికార్డు చేసి, విన్నవారంతా అది ఆ కాలంలో 16వ శతాబ్దంలో నుంచి వెలువడుతున్న కంఠంలా ఆనందించారు. ఈ ధ్వన్యాత్మకచమత్కారం ఆ తొలి రోజుల్లోనే నా చేత జయప్రదంగా పలికించిన జానకిరాం క్రియాశీలభావాలు, ఆ తర్వాత నా బ్రాడ్‌కాస్టింగ్ జీవితంలో ఎన్నో కొత్త పరుగులు పెట్టించాయని ఎప్పుడూ తలచుకుంటూ ఉంటాను.

నాకే కొన్ని జ్ఞాపకాలు తోసుకు వస్తూంటే, సహస్ర మాస జీవియై, మన మధ్యని, ఇంకా రేడియో వింటూ, టీవీ చూస్తూ ఉంటే, ఆయనకి ఎన్నెన్ని జ్ఞాపకాలూ, ఎన్నెన్ని సాగుతూన్న యాత్రానుభవాలూ రేగుతూ ఉంటాయో! ■

07, అక్టోబర్ 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

25. దేవీ నవరాత్రులు - శక్త్యారాధన

వేద ఋక్కులలో ఋగ్వేదం ప్రథమమండలంలోని "ఏకం సత్ విప్రా బహుధావదన్తి" అనే ఋక్కులో వేర్వేరు నామాలతో, గుణాలతో ఆరాధ్యులయిన పురుషదేవతలంతా ఏకేశ్వరుడైన పరబ్రహ్మలో లీనమైనట్లుగానే - గాయత్రి, సావిత్రి వంటి సౌరశక్తి ప్రతిమూర్తులూ, సరస్వతి, శచి, ఇంద్రాణీ - వంటి దేవీ మూర్తులూ, ద్యావాభూముల నామాలతో పితృమాతృమూర్తులుగా వర్ణితులయిన జంటలోని మాతృమూర్తి పృథ్వీ-ప్రకృతిలో-ఆదిశక్తిలో లీనమయినాయి.

"త్వాం ఆమనన్తి ప్రకృతిం పురుషార్థప్రవర్తినీమ్
తద్దర్శన ముదాసీనం త్వామేవ పురుషం విదుః"॥

"పురుషార్థాలను ధర్మార్థకామమోక్షాలను ప్రవర్తింపజేసే ప్రకృతి దేవివీ అనగా పంచభూతాత్మకమైన జీవరాశుల మూలస్వభావానివి నీవే అంటారు! ఆమెను తటస్థంగా (కూటస్థుడివై) దర్శించే పురుషమూర్తివీ నీవే అని జ్ఞానులు తెలుసుకుంటారు" అని కాళిదాసమహాకవి, పరమేశ్వరుని గురించి చేసిన స్తుతిలో, ముందుగా పేర్కొన్నది ప్రకృతిదేవినే. ఆ ప్రకృతిదేవే ఆదిశక్తి!

సింధునాగరికయుగంలోనే శివుడు పశుపతిగాను, లింగమూర్తిగాను, ఆదిశక్తియైన భవాని జననకారణిగానూ, లోకమాతగానూ పూజితులయినట్లు, ఆ సంస్కృతి అవశేషచిహ్నాల ద్వారా మనకు తెలుస్తోంది.

అనాదిగా తెలుగు పల్లీగ్రామాలలో తెలుగు పామరజనం చేత ఏటికోళ్లూ, కొలువులూ, జాతరలూ జరిపించుకొంటుండిన అమ్మవారి అవతారాలలో కొన్ని పేర్లు ఎల్లమ్మ, బతకమ్మ, రేణుకా, ఏకవీర, కాకతమ్మ, మాహురమ్మ-(కాకతమ్మకు సైదోడు ఏకవీర అని శ్రీనాథుడు), తలుపులమ్మ, పైడితల్లీ, నూకాలమ్మా, మరిడమ్మా, మూలగూరమ్మా (శ్రీనాథుని రాజమండ్రి వర్ణన పద్యాల్లో మూలగూరశక్తి)! కొండలలో, లోయలలో, అడవులలో, కోనలలో, నదీతీరాలలో, పల్లెలలో, పట్టణాలలో, దుర్గాలలో, పురాలలో, నగరాలలో ఆదిశక్తి మానవసమాజపూజలలో అనేక అవతారాలెత్తింది. సౌభాగ్యసంపదలు కలిగించే సౌమ్యదేవతగా కొన్ని మూర్తులు, ప్రకృతివైపరీత్యాలనూ, భీతావహావిపత్తులనూ, జాడ్య-ఉపద్రవాలను కలిగించేవీ, వాటి నుంచి రక్షించేవీ కొన్ని

మూర్తులు. ఈ మూర్తులలో పండితులకు (అక్షరాస్య తరగతుల వారికి) ఆరాధ్యమైనవి కొన్నీ, ఆటవికులకూ, కొండజాతులకూ ఆరాధ్యమైనవి కొన్నీ! అందరికీ ఆరాధ్యాలు కొన్నీ! దేశద్రిమ్మరులుగా పేరుపడిన ఎరుకలూ, చెంచులూ, కొరవలూ 'సోది' అనే పేరుతో భూతభవిష్యవర్తమానాలను తమ ఆధ్యాత్మిక శక్తితో చెప్పుకుపోవడమూ, అన్ని తరగతులవారూ చెప్పించుకోవడమూ ఆచారంగా వుండేది. ఆ 'సోది'లో ఎన్నో ఊళ్ల పేర్లతో కలిసి ఆయా క్షేత్రాలలో వెలసిన దేవీమూర్తుల పేర్లు వినిపించేవి, కొరవంజులనే దేశీ నాటక ప్రదర్శనలలోకీ, వాఙ్మయంలోకీ ప్రవేశించాయి.

కంచి కామాక్షి, మధుర మీనాక్షి, కాశీ విశాలాక్షి, శ్రీశైలం భ్రమరాంబ, కొల్లాపురం లచ్చుమమ్మ, బెజవాడ కనకదుర్గమ్మ, దాక్షారం మాణిక్యాలమ్మ, పిఠాపురం పీటలమ్మ, సామర్లకోట చామలమ్మ, శృంగేరి శారదాంబ-ఇత్యాది దేవతామూర్తులు, సోదిలో ప్రస్తుతి పొందినవారిలో కొందరు.

మంత్రశాస్త్రంతోపాటు, వామాచార యుక్తమైన తంత్రశాస్త్రంతో పాటు దేవీమూర్తుల సంఖ్య పండితులకు మరింత కరతలామలకమయింది. వీటన్నింటికీ శ్రీ చక్ర స్థాపన, శ్రీ విద్యోపాసనా అనుపేర మరొక పెద్ద గుడి కట్టారు. లలితా, శారదా, రాజరాజేశ్వరీ, శ్రీ సూక్త నాయికయైన లక్ష్మీదేవీ, త్రిపురసుందరి, బాల ఇత్యాదిగా దేవీ మూర్తులు పెరిగాయి. వాగ్గేయకారులు కీర్తనలను కృతులను వ్రాసి పాడి దేవిని ఆరాధించారు-నానా నామరూపాలతో.

'వారాహి, వైష్ణవి, సుమంగళి, వామిని, నిగమాగమ సంచారిణి'-

'అంబ పరదేవతే అఖిలాండేశ్వరి' ఇత్యాది-

'పంచాశత్పీఠ వాసిని' అని ఒక కీర్తనలో ముత్తుస్వామి దీక్షితులు అంబని స్తుతిస్తారు. ప్రసిద్ధమైన అంబికా పీఠాలు 50 ఉన్నాయట. శ్యామశాస్త్రి కామాక్షీ భక్తులు. పంజాబు జలంధర పీఠవాసినిపైని కూడా దీక్షితుల కీర్తన ఉంది.

ఆదిశంకరాచార్యులు శృంగేరీ పీఠంలోనే కాక, అనేక ప్రసిద్ధ దేవస్థానాల్లో దేశంలోని అనేక క్షేత్రాలలో అమ్మవారి పీఠాల కడ శ్రీ చక్ర ప్రతిష్ఠ చేశారని చెపుతారు. దేశం అంతటా ఆ జగద్గురువుకు ఆనాడు వెలసిన అంబికా మూర్తుల ద్వారా అద్వితీయమైన అంబికా సౌందర్య లహరీ దర్శనం లభించి ఉండాలి-ఆయనకు!

"గిరాం ఆహుర్దేవీం ద్రుహిణ గృహిణీం ఆగమవిదోః
హరేః పత్నీం పద్మా, హరసహచరీం అద్రితనయాం

తురీయా వాసి త్వం దురధిగమ నిస్సీమమహిమా
మహా మాయా విశ్వంభ్రమయసి పరబ్రహ్మ మహిషీ!"

"అమ్మా వేద విజ్ఞులు నిన్ను బ్రహ్మదేవుని భార్యయైన వాక్‌దేవి శారదగాను, శ్రీ మహావిష్ణుని భార్య యైన సిరులిచ్చే లక్ష్మీదేవిగాను, సదాశివుని సతియైన శుభములిచ్చే పార్వతిగాను సృష్టి స్థితి లయ కారకులు ముగ్గురకును దేవేరి స్థానంలో దర్శిస్తారు. కాని నీవు నిజానికి ఆ మూడు మూర్తులకు మూలమైన నాలుగో పదవిలో హద్దులు లేని –అందదానికి వీలుకాని మహిమతో మహామాయవై లోకాలన్నింటినీ భ్రమింపజేసే – పరబ్రహ్మ మహిషివి – పరమాత్మకు పట్టపురాణివి కదా!"

అశ్వయుజ శుద్ధ మహాష్టమినాడు లక్ష్మీపూజ, ఆ మర్నాడు మహర్నవమి రోజున సరస్వతీ పూజ – లేక ఆయుధ పూజ – ఆయా వృత్తుల ప్రజలు తమ తమ వృత్తులకు ముఖ్యావశ్యకాలైన పరికరాలను పనిముట్లను దేవి పాదాల వద్ద ఉంచి, తమ తమ కార్యకలాపాలలో విజయాభివృద్ధులను అర్థిస్తారు. పాండవుల శమీపూజే దీనికి ప్రారంభం అనుకోకూడదు. ఆనాటికే ప్రజలలో పాదుకుపోయిన పూర్వాచారం ఇది. చివరి రోజు విజయదశమినాడు దుర్గా పూజ. ఈమె వీరుల దేవత, సైనికులకు దుర్గ, రాజ్య రక్షకులకు ఆరాధ్య దేవత, విజయ సాధని! రాజ్యరక్షకురాలు.

"యాదేవీ సర్వభూతేషు మాతృ రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః॥"

అనే ఆయన గురువు, భూతభవిష్యవర్తమాన కాలాల సమ్యగ్రూపమే మహాకాళి (ళి) అనంత'కాలరూపిణియైన ప్రకృతిదేవికి ప్రతిమూర్తి' – అన్నారు.■

14, అక్టోబర్ 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

26. వందేమాతరం...

ఆదిశంకరాచార్యులు వర్ణించిన సౌందర్యలహరియైన పరబ్రహ్మమహిషి- త్రిగుణాతీత! ఆమెలోని తమో రూపప్రతీకయే మహాకాళి. ఆవిడే వంగదేశీయుల శ్యామాదేవి లేక శ్యామలాదేవి. కాళిదాసుదని చెప్పబడే శ్యామలాదండకం-'మాణిక్యవీణా ముపలాలయన్తీం, మదాలసాం మంజుల వాగ్విలాసినీం' ఇత్యాదిస్తోత్రం ఆ దేవీమూర్తిని గురించే!

1890 ప్రాంతంలో బెంగాల్‌లో -'ఆనందమఠ' అనే నవల వ్రాస్తున్న మహాకవి బంకించంద్ర చటర్జీ, అంతకు ముందు తాను ఒక పత్రికా సంపాదకీయానికి బదులు ఆయనకు ఆనాడు కలిగిన మాతృదేశభక్తిభావతరంగాలకు సాహిత్యరూపాన్నిచ్చి ఆలవోకగా అశువుగా కూర్చిన అపూర్వ గేయం 'వందే మాతరం'. ఒక పాతిక-ముప్ఫై ఏళ్లు గడిచాక ఈ గేయం, ఒక ఉద్యమానికి మూలమంత్రం కాగలదు-అని బంకించంద్రుడు ఆనాడు తన గీతాన్ని అచ్చులో కూర్చిన కంపోజిటర్‌తో అన్నాడట. అఖిల భారత కాంగ్రెస్ మహాసభల్లో ఉచ్చస్వరంతో గానం చేసి, దేశం అంతటినీ ఉద్రిక్తం చేసిన ప్రథమగాయకుడు రవీంద్రనాథ ఠాగూరు. బంకించంద్రుడి కంటే ఒక తరం చిన్నవాడైన యువతరానికి చెందిన కవీశ్వరుడు.

'తుమిహి దశ ప్రహరణధారిణీ-
కే బోలే మాతుమి అబలా'

(పది కొరడాలు కలిసిన ఆయుధాన్ని ధరించిన నిన్ను అబల అని ఎవరన్నారమ్మా)

'త్రింశకోటి కంఠ కలకల నినదకరాలే
ద్విత్రింశకోటి భుజైర్ ధృతఖర కరవాలే'

(ముప్ఫై కోట్ల కంఠాల కలకలనినాదాలతో శత్రుభీకరంగా కనిపించే తల్లీ! అరవై కోట్ల (లేక ముప్ఫై కోట్ల కరయుగళాల) చేతులతో ఎత్తిన వాడి కత్తులు దాల్చిన అంబికా!)

అంబిక క్రోధరాజసావతారాలలోని దుర్గా, కాళీశక్తులు కరాల రూపం-బంకిం మాతృగీతంలో దేశమాతృరూపానికి ప్రతిమూర్తిగా పరిపాలనకు వ్యతిరేకంగా ప్రజలను

మేలు కొలిపే భారత మాతృదేశభక్తి ప్రబోధగేయంగా 'వందేమాతరం' భారత స్వాతంత్ర్య ప్రబోధోద్యమానికి ఆ నాడు మూలమంత్రం అయింది. నవలలో సన్యాసుల విప్లవానికి కారణోద్బోధకం అయిన గేయం, ఆ తర్వాత మన జాతీయగేయమయింది.

1913లో ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయం (నిడదవోలు) వారి ప్రచురణగా వేంకట-పార్వతీశ్వర కవులు రచించిన (రెండవ) స్వతంత్ర నవల ప్రమదావనంలోను వారే 1921లో (రాజమండ్రి నుంచి) ప్రచురించిన మూడవ స్వతంత్రనవల 'మాతృమందిరం' లోను, ఆ వెనువెంటనే రచించిన 'శ్యామల' నవలలో కూడా ప్రతి నవలా, తన కథాకథనంలో -పరమేశ్వరుడైన పురుషోత్తముని అవినాభావసహధర్మిణీ, ప్రకృతి బింబరూపిణీ అయిన అంబ, జగన్మాత ప్రేరేపణను తమ అసందిగ్ధధోరణిలో సాంప్రదాయిక దేవీప్రార్థనాశ్లోకాలలో వెల్లడించారు. 'ప్రమదావనం'లోని నాయకుడైన కృష్ణదేవరాయలకు తూర్పు దిగ్విజయయాత్రకు ముందరి రాత్రి స్వప్నంలో ఒక దేవీమూర్తి దర్శనం అవుతుంది. ఆ మహాదేవి పూర్వాపర సముద్రమధ్యస్థితయైన దక్షిణభారతిగాను, ఆంధ్రమాతృమూర్తిగాను, సాహిత్యభోజునికి నిత్యార్చితయైన వాగ్దేవీమూర్తిగాను కూడా కనిపిస్తుంది. ఆమె జగన్మాతృ ప్రతిమూర్తియే.

'మాతృమందిరం' 1920 నాటి ఆంధ్ర దేశసాంఘికజీవన చిత్రణమే. ఆ నవలలో జంటకవులు (వేంకట-పార్వతీశ్వరులు) బంకించంద్రుని ఆనందమఠంలోని కొన్ని అంశాల వల్ల ప్రబోధితులయారు! ప్రబోధానందుడనే యోగి స్థాపించిన మాతృమందిరం సంఘసేవాపరుల మాతృపూజామందిరం-పతితోద్ధారణం, సర్వసమత్వం వంటి ఆదర్శాలతో ప్రబుద్ధభారతంలో తరువాత తరువాత ఏర్పడిన అనేక సంఘసేవాసంస్థలకు సాహిత్యమార్గదర్శకాలు! ఆ సంస్థలో మారుమ్రోగే ప్రార్థనలలో అదే మంత్రం- 'యా దేవీ సర్వభూతేషు మాతృరూపేణ సంస్థితా నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః ■

21, అక్టోబర్ 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

27. నన్నయ శారదరాత్రులు

"భూసతికిన్ దివంబునకు పొల్పెసగంగ శరత్సమాగ
మంబాసకల ప్రమోదకరమై విలసిల్లె మహర్షి మండలో
పాసిత రాజహంస గతి భాసి, ప్రసన్న సరస్వతీక మ
బ్జాసన శోభితం బగుచు నబ్జజయానముతో సమానమై!
శారద రాత్రులుజ్జ్వల లసత్తర తారకహారపంక్తులన్
చారుతరంబులయ్యె, వికసన్నవకైరవ గంధబంధురో
దార సమీరసౌరభము దాల్చి సుధాంశువికీర్యమాణ క
ర్పూర పరాగపాండు రుచిపూరములన్ బరిపూరితంబులై.

తెలుగు మహాభారతం అరణ్యపర్వం చతుర్థాశ్వాసంలోని 140, 141 సంఖ్యలు గల ఈ రెండు పద్యాలూ, నన్నయ్యగారి రచనలో మనకి దక్కిన ఆఖరి రెండు పద్యాలూ అని పరిశోధకులు చెపుతూంటారు. భూమిపైనా, ఆకాశంలోనూ శరదృతువు వచ్చి ఏ విధంగా సకలానందహేతువయిందో మొదటి పద్యంలో ఆదికవి వర్ణించారు. రెండో పద్యంలో శారద రాత్రులు తారకహారపంక్తులతో చంద్రుడు వెదజల్లే తెల్లని చల్లని వెన్నెలతో అందగించిన తీరు వర్ణించారు.

వీటిలో శరత్సమాగమము పద్యానికి సంస్కృతభారతంలో మూలశ్లోకాలు లేవని, తెలిసిన పండితమిత్రులు చెప్పారు. ఈ పద్యంలోని అపురూపమైన ఖగోళ తారామండలాల ప్రశంస నన్నయ్యగారి సొంత ఉపజ్ఞకూ, ఆయన ఖగోళదర్శనశక్తికీ, అపూర్వకవితా దృష్టికీ తార్కాణగా పేర్కొనవచ్చు.

మహర్షి మండలం, రాజహంస గతి, ప్రసన్న సరస్వతీకము, అబ్జాసన శోభితము, అబ్జజయానము– అని ఈ పద్యంలో నన్నయ్యగారు వాడిన ప్రతి సాహిత్య సంకేతాన్నీ, ఒక పక్క భూమండలంలో శరదాగమానికీ, ఇంకొక పక్క ఖగోళం (దినంబు) లో శరదాగమానికీ అన్వయించుకుంటేనే ఈ పద్యం చక్కగా అర్థమై అందులోని అపూర్వ కవితా సౌందర్యం సాక్షాత్కరిస్తుంది.

ముందు భూమండలం పైనీ, ఆ తర్వాత ఆకాశంలోని శరత్సమాగమం వల్ల ప్రమోదం ఎలా కలిగిందో చూద్దాం. మహర్షి మండలం అంటే భూలోకంలో

అరణ్యాలలో, కొండ గుహలలో, నదీతీరాలలో తపస్సు చేసుకునే మునిపుంగవులు. వారు ఉపాసించే రాజహంస-పరమాత్మ స్వరూపమైన బ్రహ్మమే-సోహం అనీ, హంసోహం అనీ అహం బ్రహ్మాస్మి అనే ఆత్మజ్ఞానం!

ఈ శరత్కాలం, ఆకాశంలో ధ్రువనక్షత్రానికీ, చూపరుల నడినెత్తికీ మధ్య, సప్తర్షి మండలమూ (ది గ్రేట్ బేర్) ధ్రువనక్షత్రాన్ని ప్రదక్షిణం చేస్తూ ఈశాన్య ఆకాశం నుంచి వాయవ్య ఆకాశం దాకా ప్రవేశ నిష్క్రమణాలు జరిపే ఆ సప్తర్షులకు, ఉపాస్య దేవతగా ముందు దారి చూపుతూ రాజహంస మండలమూ సాగుతూ ఉంటాయి. రాజహంస మండలాన్ని పాశ్చాత్యులు సిగ్నస్ అంటారు. అంటే దివ్యహంస అనే అర్థం. ఈ రాజహంసకు పైన దానిని వాహనంగా గల దేవతామూర్తులయిన సరస్వతీ, చతుర్ముఖ బ్రహ్మల నక్షత్రాలు కనిపిస్తాయి. వేగా, ఎప్సిలాన్‌లైరా, లైరా, అని పాశ్చాత్యులు పిలిచే చుక్కల గుంపులో, ఎప్సిలాన్ లైరా ఒక దాని చుట్టూ ఒకటి ఒప్పుల కుప్పాటగా తిరిగే చుక్కల జంటలు రెండు. ఒక జంట చుట్టూ రెండో జంటా, రెండో దాని చుట్టూ మొదటి జంటా తిరుగుతుంటాయి. ఈ రెండు జంటల చుక్కల గుంపును ఇంగ్లీషులో డబుల్ బైనరీ అంటారు. అదే చతుర్ముఖబ్రహ్మ. లైరాయే శారదాదేవి. అందుచేతనే నన్నయ్య గారి పద్యంలో శరత్సమాగమం వల్ల కలిగిన ప్రమోదం, ఆకాశంలో ప్రసన్నురాలయిన సరస్వతి వల్లనూ, ఆ పక్కనే అబ్జాసనుడయిన బ్రహ్మదేవుని శోభ చేతనూ ఇనుమిక్కిలి అయింది. భూలోకంలో కలిగిన సకలజన ప్రమోదము అబ్జజుయానముతో సమానమై, అంటే-బ్రహ్మదేవుని వాహనమైన రాజహంసతో తుల్యమై యోగుల మానసంలో యోగసాధనలో మూలాధారం నుంచి సహస్రారానికి ఊర్ధ్వగమనం చేసి కుండలినీ శక్తిరూపం దాల్చిన బ్రహ్మ, సోఽహంసోఽహం అనే ఉదాత్త తపోరూపమైన హంసలాగా ఊర్ధ్వగమనం చేసింది. అంటే భూలోకం నుంచి స్వర్గానికి అంటే ఆకాశానికి వ్యాపించిందని అర్థం.

వికసించే కొత్త కలువల ఘుమఘుమలతో నిండి, పైకి తేలే చల్లగాలులు మోసే సువాసనలతో, చంద్రుడు వెదజల్లుతూండిన కర్పూరపు పొడుల వంటి తెల్లని వెన్నెల కాంతులు, అన్ని దిక్కులా వ్యాపించి, శారదరాత్రులు సుందరహారములలాగా మెరిసిపోయే నక్షత్రపంక్తులతో మనోహరములయినాయి అని రెండో పద్యం అర్థం! ■

28, అక్టోబర్ 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

28. దీపావళి ముసురు - స్వాతివాన

అవకాశం ఇస్తే ఆకాశ పంచాంగం విప్పుతాడతను అని ఒక్కొక్కరి మాట్లాడే ధోరణి గురించీ, వ్రాసే ధోరణి గురించీ అంటుంటారు. అవకాశం దొరకపుచ్చుకొని ఈ భావతరంగాల్లో 'ఆకాశ పంచాంగం' విప్పుతుంటాన్నేను! వాడుకలో దీని అర్థం అసందర్భ ప్రసంగం! నా వ్రాతల్లో లిటరల్ మీనింగే! (వాచ్యార్థమే) ఈ నెల 22వ తేదీన దీపావళి పండుగ. ఆకాశంతోటీ, పంచాంగం తోటీ ఏదో ఒక ముడి లేకుండా మన పండుగలు రావు కదా. 17వ తేదీన తులారాశిలో ప్రవేశించిన సూర్యుడు 22 దాకా చిత్రానక్షత్రం 3,4 పాదాలలో సంచరించి, 23వ తేదీన స్వాతిలో ప్రవేశిస్తాడు. 22న రాత్రి 1గం॥50ని.ల దాకా చంద్రుడు ఆ ముందు రోజునా చిత్రా నక్షత్రసంచారం చెయ్యడం చేత, స్వాతిలోకి కూడా సూర్యునితో పాటు అనుసరించడం చేత ఆనాడు అమావాస్య సంభవించి చంద్రుడు కనిపించడు. అదే దీపావళీ అమావాస్య.

తెలుగు జనానీకం పండితపామరులందరిలోను, అనాదిగా వాడుకగా వస్తున్న అనుభవపూర్వకమైన 'నానుడుల'లో దీపావళి ముసురూ, స్వాతివానా -మన జనం తరతరాలా వింటూ వాడుకుంటూ వస్తున్న భావసంపన్నాలైన విలువైన పాత మాటలే. ఇది సాధారణంగా ప్రతి యేడాదీ వస్తూ ఉంటుంది. కనుకనే జనం వాడుకలో 'నానుడి' అయిపోయింది.

ఇక స్వాతివానా 'ముత్తెపుచిప్పలు గర్భం తాల్చి ముత్యాన్ని ప్రసవిస్తాయి', అనే విశ్వాసం జనం వాడుకలోనూ, కవిత్వ 'సమయం'గానూ కూడా తరతరాలా వినిపిస్తోంది. ఆధునికప్రకృతి శాస్త్రజ్ఞులు ముత్యపుచిప్పలో ముత్యం ఏర్పడదానికీ, వాన చినుకుకీ సంబంధం లేదనీ, దానికి వేరే ప్రకృతికారణాలున్నాయనీ చెప్పిన విజ్ఞానశాస్త్ర విషయాన్ని ప్రస్తుతానికి సగౌరవంగా దూరంగా ఉంచుదాం. సూర్యుని స్వాతీనక్షత్ర సంచారం మొదలుపెట్టడంతో గాని, దానికి కొద్ది రోజులు ముందుగా గాని వానలు పడడం మాత్రం తరతరాలా ఏటేటా సంభవిస్తున్న సంఘటనలే.

మన ఇరవై ఏడు నక్షత్రాలలో ఒక్కొక్క నక్షత్రానికీ ఒక్కొక్కరు అధినేతలు ఉన్నారు. స్వాతి నక్షత్రాన్ని వాయుదైవతాకం అంటారు. అంటే ఆ నక్షత్రానికి అధినేత వాయుదేవుడు. రామాయణ-మహాభారతపాత్రల్లో మహాబలవంతులైన వీరులు హనుమంతుడూ, భీమసేనుడూ స్వాతి నక్షత్రంలో జన్మించారట. వాయుదేవుని అనుగ్రహం

వల్ల పుట్టారట. అందుకనే వారిద్దరికీ 'వాయుసుతుడు, పవన పుత్రుడు, మారుతి, పావని' అనే పేరులు పర్యాయనామాలుగా సాహిత్యంలో వాడుతూంటారు.

సప్తర్షిమండలానికి ఆగ్నేయంగా పాశ్చాత్యులు బూటేశ్–మన వేద సాహిత్యం 'భూతేశ' అని పిలిచే చుక్కల గుంపులో ముత్యంలాగా, ఎర్రని పవడంలాగా కాంతులు విరజిమ్మే నక్షత్రం స్వాతి. ఈ చుక్కను పాశ్చాత్యులు ప్రత్యేకంగా 'ఆర్క్ ట్యురస్' అని పిలుస్తారు. ప్రపంచదేశాల్లో వివిధసాహిత్యాలలో ఈ చుక్కను గురించి ప్రశంస అనాది నుంచీ కనబడుతూంటుంది. ఏటా సూర్యుడు అక్టోబరు 20, నవంబరు 5 తేదీల మధ్య ఈ చుక్క దగ్గరికి వచ్చినపుడే 'స్వాతికార్తె' అంటాం. స్వాతికి అధిదేవత వాయుదేవుడు కదా. అందుకే ఈ కాలంలో తుఫానులూ, ప్రభంజనాలూ, ఉప్పెనలే మన దేశానికి అనుభవంలోకి వస్తూంటాయి. బందరు ఉప్పెనలూ, గాలివానలూ, 1864, 1977లలో చరిత్రలో చెరిగిపోని పుటలను వరదలతో జన నష్టాలతో ఉపద్రవంగా నింపివేసినది ఈ కార్తే! వీటికి ఒరిస్సా దేశంలో 'స్వాతి' పాటొనో (స్వాతి పవనాలు) అనే పేరు.

స్వాతికార్తె, స్వాతివానా దీపావళి అమావాస్యకు మర్నాడే రావలసి ఉన్నా, ముందుగా అనుభవంలోకి గణనం కొద్దిగా ముందు పడడమో, వెనుక పడడమో తరచు సహజంగా జరుగుతూండేదే! తులా రాశిలో ఈ స్వాతికి పక్కనే విశాఖ వస్తుంది. వృశ్చిక రాశిలో తేలు కొండెకి సమానాంతరంగా ఉండే మూడు చుక్కలు విశాఖ: ఎక్లిప్టిక్ దారి ఇక్కడి నుండి దక్షిణానికి మళ్లుతుంది. విశాఖ నక్షత్రాల గుంపు పాశ్చాత్య నామాన్ని గురించి ఒక పాఠకమహాశయులు నేను అప్పుడు రాసిన 'ఆల్ఫా సెంటారీ' అనే పేరు గురించి, అది సరి కాదేమోనని సందేహం వెలిబుచ్చారు. ప్రసిద్ధ ఖగోళ విజ్ఞాని కీ.శే. గొబ్బూరి వెంకటానంద రాఘవరావుగారు విశాఖ అల్ఫాలిబ్రో అని తెలియజేశారు. ప్రసిద్ధ జ్యోతిష్యపత్రికాసంపాదకులు బి.వి. రామన్, జ్యోతిష్య గ్రంథ రచయితలు వి.ఎ.కె. అయ్యర్, ఎ.జి. రెల్లిగార్లు కూడా ఆల్ఫాలిబ్రో అనే చెప్పారు. కాని నేను పై వ్యాసం వ్రాసినపుడు ఈ గ్రంథాలేవీ నా దగ్గర అందుబాటులో లేక, అమెరికాలో హ్యూస్టన్ (టెక్సాస్)లో ఉంటున్న ప్రవాసాంధ్రయువమిత్రుడు డాక్టర్ జి. రామ సోమయాజులు కంప్యూటర్‌పై నా జాతకం గుణించి నాకు పంపిన నక్షత్రాల వివరాలతో 'విశాఖ'కు పాశ్చాత్యనామం 'ఆల్ఫా సెంటారీ' అన్నాడు. అది సరికాకపోవచ్చు. కాని, మన నక్షత్రాల గుంపులలో ఒక నామానికి చెందినవన్నీ, పాశ్చాత్యుల గణనలో, ఒకే గుంపులోకి లెక్కలోకి రావనీ, మన రాశులలోని 27 నక్షత్రాల ఆకారాలు, చుక్కల వివరాలు మన దేశవివరాలు మనవే అనీ, మన ప్రాచీనవారసత్వం అనీ గ్రహించాలి. ■

4, నవంబర్ 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

29. శోభాయమానం సూర్యాభ్యుదయం....

'పిఠాపురం సంస్థానము. కవిపండితపోషణ' అనే పిహెచ్.డి. సిద్ధాంతగ్రంథాన్ని, దాని రచయిత్రి డాక్టర్ కమలా అనార్కలీ ఆ మధ్య రాజమండ్రిలో మా బస వెతుక్కుంటూ వచ్చి, ఆదరాభిమానాలతో నాకందజేశారు.

పుటలు తిరగేశాను. 'సంస్థానాధిపతుల రచనలు, వారికి అంకితం చేయబడిన రచనలు, ఆస్థానకవి పండితుల రచనలు, ఆస్థాన కవులు కాకపోయినా సంస్థానంలో నివసించిన కవుల రచనలు' అని రచయిత్రి చేసిన నాలుగు విభాగాలను, చిట్టచివరి దానిలో శ్రీ వేంకటపార్వతీశ్వర కవుల (మా నాన్నా -మామయ్యల) రచనలలో వారు ఆస్థానకవులు కాకపోయినా మహారాజుకు, యువరాజుకు అంకితం ఇచ్చిన కృతుల సంక్షిప్తసమీక్షను కూడా ఈ సిద్ధాంత వ్యాసంలో చేర్చడం, నాకూ, జంటకవుల అభిమానులకూ ఎంతో సంతోషదాయకం. అదే ఈ భావతరంగాన్ని పురికొల్పింది.

కుమారి అనార్కలీ'ఏకాంతసేవను వీరమహారాజా వారికి కృతి సేయుచు, సూర్యునితో అభేదము చెప్పుట గమనార్హము' - అని ఏకాంతసేవ సమీక్షలో ఇంత వరకూ ఎవరికీ తెలియని, అనుకోని విషయం ఉద్ఘాటిస్తూ, ఆ పద్యకావ్యంలోని నాందీపద్యాన్ని ఉద్ఘాటించారు.

"శ్రీ విలాసంబుతో చిద్విలాసమున
 కర్థతాత్పర్య సమా శ్లేషమయ్యె,
సుకవిగీతములతో శ్రుతిగీతములకు
 షడ్జపంచమనాద సమ్మేళమయ్యె,
 ...నిరుపమానా సూన నిత్యకల్యాణ
శోభామయంబయ్యె సూర్యాభ్యుదయము!"

ఒక విదుషీమణి తన సిద్ధాంత వ్యాసంలో ఆ విధంగా నిర్ధరించాక, ఆ విషయాన్ని కాదనడం ఎవరికైనా కష్టసాధ్యమే. కాని కవుల అంతేవాసినైన నేను చెప్పే మాట ఇదే. ఏకాంతసేవ పద్యకావ్యాన్ని పిఠాపురం మహారాజా అయిన రావు వేంకటకుమార మహీపతి సూర్యారావుగారికి కృతి చేసినట్టుగానీ, అంకితం ఇచ్చినట్లు గానీ ఇంతవరకూ ఎక్కడా వెల్లడి కాలేదు. ఎవరూ అనలేదు.

1922లో ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయం 'పోకెట్ ఎడిషన్'గా కాకినాడ నుంచి వెలువడజేసిన మొదటి ప్రచురణలో కాని, 1936లోకాకినాడ నుంచే వెలువడిన రెండవ కూర్పు (డెమ్మీసైజు)లో కాని, కవుల మాటలలో గాని, ప్రచురణకర్తల పలుకులలో గాని, పెద్దాడరామస్వామిగారి ఆంగ్లపీఠికలో గాని, దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి తెలుగు పీఠికలో గాని ఈ విషయం బైటపడలేదని నా మనవి.

మహారాజా వారి ఆర్థికసహాయం 1913-15 ప్రాంతంలో ఆంధ్రప్రచారిణికి నిడదవోలులో ఉన్నప్పుడే, అప్పటి పిఠాపురం దివానైన మొక్కపాటి సుబ్బారాయుడుగారి సౌహార్దం ద్వారా అంది ఆంధ్రప్రచారిణీ ముద్రాక్షరశాలను నెలకొల్పడానికి సహాయ పడింది. (సుబ్బారాయుడుగారు బారిష్టర్ పార్వతీశం వ్రాసిన నరసింహశాస్త్రిగారి అన్న).

1922లో రాజమండ్రినీ, అద్దేపల్లి లక్ష్మణస్వామి గారినీ వదిలిపెట్టి ఆంధ్ర ప్రచారిణీ గ్రంథనిలయముతో సహా వేంకట-పార్వతీశ్వర కవులు కాకినాడకు మకాం మార్చారు. అప్పుడే సూర్యారావు బహద్దూర్‌కు మహారాజా బిరుదం లభించింది. 1922లోనే కాకినాడ నుంచి వేంకట-పార్వతీశ్వరకవులు 'మహారాజాభినందనము' అనే చిన్ని కవితా పుస్తకం వెలువరించారు. దీనికి దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు తొలి పలుకు వ్రాస్తూ "మహారాజాగారు మా ఇలవేల్పు. మన మహారాజు సాధారణనాథుల కన్న మిన్న. వసంతుని గూర్చి గానము! కోకిలలు గాయకులు! మోడుమ్రాకులు కూడా చిగుర్చకుండునా"అన్నారు.

1922లోనే బ్రహ్మర్షి రఘుపతి వేంకటరత్నం నాయుడుగారికి షష్ట్యబ్ది పూర్తి అయింది. ఆ సభాసందర్భంలో వేంకటపార్వతీశ్వర కవులు నాయుడుగారికి 'రత్నహారము' అనే 60 మంజరీద్విపదుల పద్యహారం కానుక ఇచ్చారు.

1920లో రాజమండ్రిలో ఉండగా వెలువడిన 'మాతృమందిరం' నవలలో వేరు వేరు ప్రకరణాలకు పైన ఉటంకించిన పద్యఖండికలలో ఏకాంతసేవ పద్యకావ్యంలో రెండవ సగం అంతా సిద్ధం అయి వుంది. కృష్ణశాస్త్రి గారి అక్కగారు ప్రకటిస్తూండిన 'అనసూయ' మాసపత్రికలో సీరియల్‌గా అచ్చు అయినది ఈ లోపున అయి ఉండాలి. 1921లో సామర్లకోటలో భీమేశ్వరాలయంలో దానిని పూర్తి చేసి, 1922లో కాకినాడ రాగానే ప్రకటించారు.

ఆ రోజులలో పిఠాపురం కోటలో పండితవర్గంలో ఒక బలీయమైన వర్గం ఏకాంతసేవకు ప్రతికక్షులు. ఈ పద్యకావ్యం భావకవిత్వానికి నాంది అనే మాటకు ఆ వర్గమే ప్రచారం కలిగించి, మహారాజా చెవి కొరుకుతూండేవారని వినికిడి. మహారాణిగారు, యువరాజా, వేంకటరత్నం నాయుడుగార్లకు మాత్రం ఏకాంతసేవ

అంటే 'బైబిలు' హిమ్స్ ఆఫ్ సోల్మన్‌లాగా గీతాంజలిలాగాను. పిఠాపురం, కాకినాడలో బ్రహ్మసమాజమందిర ప్రార్థనసమావేశాలలో ఏకాంతసేవలోని భక్తిగీతాలను పాడినా, వినినా నాయుడుగారు, రామస్వామిగారు మొదలైన పెద్దలు రుద్ధకంఠాలతో కన్నీళ్లు కార్చేవారు. మహారాజు మాత్రం తటస్థులు.

మరో ఇరవైయైదేళ్ల తరువాత 1947-48 ప్రాంతం. మద్రాసు అడయార్లో 'గులాబి' పిఠాపురం మహారాజా బంగళాలో – ఆంధ్ర మహిళాసభ బాలికాబృందం నృత్యనాటకాలను ప్రదర్శిస్తున్నారు. ఆ నాటకాలలో అప్పటికి రేడియోలో నిలదొక్కుకున్న రజనీ సంగీత నాటకాలలో మేనకావిశ్వామిత్ర, సుభద్రార్జునీయం, మధురానగరీ గాథ నాట్యాచార్య కుల్కర్ణి శ్రీనివాస్, ఆచార్య సామ్రాజ్యం రమణారావుల దర్శకత్వంలో ప్రదర్శించారు. నాటకాల మధ్య విరామ సమయంలో చండీదాసు, శతపత్రసుందరి, దివ్యజ్యోతి మొదలైన నాటకాల నుంచి గేయాలను గానం చేశాడు రజని! పక్క వాద్యాలున్నాయి. ఆ గానం అయాక, మహారాజా వేదిక పైకి వచ్చారు. నాట్యాచార్యుల పరిచయాలు, నర్తకీమణుల పరిచయాలూ అయాక గాయక నేపథ్యానికి నన్ను మిస్టర్ రజనీకాంతరావు ఆఫ్ ఆల్ ఇండియా రేడియో అని పరిచయం చేశారు. ఆ వెంటనే నాకూ, మహారాజాకూ జరిగిన సంభాషణ నేనెన్నటికీ మరువలేను.

మహారాజా : డూయు కం ఫ్రం బెంగాల్ (మీరు బెంగాల్ నుంచి వచ్చారా?)

నేను : లేదండీ.తెలుగువాణ్నేనండీ.

మహారాజా : ఏ జిల్లా, ఏ వూరు మీది?

నేను : తూర్పు గోదావరి, పిఠాపురమేనండి.

మహారాజా : మా పిఠాపురమే! పిఠాపురంలో ఎవరబ్బాయి మీరు?

నేను : బాలాంత్రపు వెంకటరావుగారి అబ్బాయినండీ, వేంకట పార్వతీశకవులు.

మహారాజా : మీరు పాడిన పాటలెవరు వ్రాశారు? కవనం చాలా బాగుంది. ఎక్కడ చదివారు?

నేను : నేనే వ్రాశానండీ. కాకినాడ కాలేజీలో చదివానండి, ఇంటర్. ఆంధ్రా యూనివర్సిటీ ఎమ్.ఏ. చదివానండీ.

మహారాజా : తమ్మన్నశాస్త్రి కుమారుడి దగ్గర మీరు చదివారా?

నేను : కృష్ణశాస్త్రిగారాండీ, వారు మా గురువులేనండి.

మహారాజా : మీ కవిత్వం బాగా అర్థం అవుతుంది. మీరు వారిలా భావకవిత్వం వ్రాయరా? మీ నాన్నగారు పార్వతీశంగారూ వాళ్లు నిర్దుష్టంగా వ్రాస్తారు. బాగా అర్థం అవుద్ది.

నేను : చిత్తం, నాది గేయకవిత్వం అండి.

ఆచార్య కులకర్ణి: మీరు దర్శించిన నృత్యనాటకాలు, తాను పాడిన పాటలూ ఆయన రచించినవేనండి.

మహారాజా : ఐయామ్ సో మచ్ ప్లీజ్డ్ విత్ యువర్ పొయిట్రీ అండ్ మ్యూజిక్. మీరు సంగీతం ఎక్కడ నేర్చుకున్నారు? మీ కవిత్వమూ, సంగీతమూ నాకెంతో సంతోషం కలిగించాయి.

నేను : సంగమేశ్వరశాస్త్రి గారి శిష్యులు మంద కృష్ణమూర్తిగారు మా గురువులండీ.

మహారాజా : చాలా సంతోషం. కరపవారి కాలవపక్కని కాదూ మీ ఇల్లు. పిఠాపురంలో, మా సెక్రటరీ నాగరాజుగారు వేంకట్రావుగారి అల్లుడు. ఆయన ఢిల్లీ ఆల్ ఇండియా రేడియోలో ఉన్నారు కదా!

నేను : చిత్తం. ఇప్పుడాయన ఆంధ్రప్రభలో వుంటున్నారండీ.

మహారాజా : వెరీ హేపీ – వెరీ హేపీ మే గాడ్ బ్లెస్ యూ.

నరసారావుపేటలో కోన వెంకటరాయశర్మగారి కార్యదర్శిత్వములో ఆంధ్రసారస్వత పరిషత్తు కవిరాజహంస బిరుదముతో గౌరవించినదీ వోలేటి పార్వతీశము గారొక్కరినే కాదనీ, శ్రీ వేంకట – పార్వతీశకవులిద్దరినీ అనీ సిద్ధాంతవ్యాసరచయిత్రి గమనించవలసి ఉంటుంది. మరిన్నీ –

"తరుణ శృంగార మాధవుడవు నీవు
వరనందనోద్యానవనలక్ష్మి నేను"

– వేంకటపార్వతీశ్వరుల ఏకాంతసేవ

"తరుణ శృంగారమాధవుడవు నీవు
కలికిపాటల కోయిల కొలము మాది'

– కృష్ణశాస్త్రి కృష్ణపక్షం

వేంకట–పార్వతీశ్వరకవుల మార్గదర్శకత్వాన్ని మెచ్చుకుంటూ, 'ఈ మహాకవులు నా గవాక్షాలను కొన్నింటిని తెరిచా'రని కృష్ణశాస్త్రిగారన్న మాటలకు పై పద్యాలు ఉదాహరణలు కావూ? పైవి ద్విపదనాయకుడైన పరమాత్మను గురించి నాయిక అన్న మాటలు. కింది తేటగీతి పాదాలు – మహారాజాను గురించి శాస్త్రిగారి మాటలు. ■

11, నవంబర్ 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

30. ఆనాటి పిఠాపురం యువరాజా

కొన్ని వందలసంవత్సరాల నుంచీ ప్రసిద్ధిపొంది కొన్ని ఎకరాల క్షేత్రం పైని అడయారులో (మదరాసు) యాత్రికులకు కుతూహలాన్ని రేకెత్తిస్తూ వచ్చిన మహావటవృక్షం ఈ మధ్యనే వీచిన తుపాను గాలికి భూమిలో ఏళ్ళ తరబడి నిలదొక్కుకున్న వేళ్ళపాదును పెకల్చుకొని నేలకూలిపోయింది. అయితే ప్రతిభాశాలురైన ఇంజనీర్లూ, వృక్షశాస్త్రజ్ఞులూ సహకరించి, 'తాటాపూటం' చేసి ఆ చెట్టును పునఃప్రతిష్ఠ చేశారని వార్తలలో విన్నాము.

'ఇమ్మనుజేశ్వరాధములు' -అనీ, 'రాజులు రాజులా భువి' అనీ, 'కారే రాజులు రాజ్యముల్ గలుగవే, గర్వోన్నతి జెందరే... పేరైనం గలదే' -అనీ, స్వతంత్రశీలురైన కవీశ్వరులు గర్వించినా, మధ్యయుగపు రాజవ్యవస్థకి చెందిన ఒక్కొక్క విశిష్టవ్యక్తి కవిరాజు అనో, సాహిత్యభోజుడనో తన ఔదార్యకార్యాల వల్లా, కవిపండిత పోషణ వల్లా, ఘనత వహిస్తూ వచ్చారు. అటువంటి విశిష్టవ్యక్తి ఒకరిని గురించి భావతరంగాలలో స్మరించుకున్నాం. 'స్వతంత్ర భారతం' ప్రజాస్వామిక సాంఘికపరివర్తనా తరంగాలలో అప్పటికే క్షీణమై శిథిలమైపోతూ తుడిచిపెట్టుకుపోయిన జమీందారీ వ్యవస్థకు మాత్రం అడయార్ మర్రిచెట్టుకు ప్రాప్తించిన పునఃప్రతిష్ఠాయోగ్యత లభింపకపోవచ్చు. కాని, సాహిత్య భోజులూ, కవిరాజులూ, తమ విశిష్టసారస్వతసేవవల్ల వ్యక్తిగతంగా స్మరణయోగ్యత కోలుపోరు.

1947-48 ప్రాంతంలో మద్రాసు అడయార్‌లో 'గులాబీ' బంగళా కచ్చేరి హాలులో అనుకోకుండా ఆనాటి పిఠాపురం మహారాజాతో నాకు తటస్థించిన రెండునిముషాల 'భేటీ'ని గురించి ఈ భావతరంగాలలో స్మరించి – ఆ సంవత్సరపు ఉగాది పండుగనాడు ఆ మహారాజు కుమారుడూ అప్పటి యువరాజా అయిన ఆర్వీ ఎమ్జీ రామారావు గారి మద్రాసు నివాసం 'వసంతవిహార్' కచ్చేరి హాలులో యువరాజాయే స్వయంగా ఏర్పాటు చేసిన నా సంగీత – సాహిత్య 'కచ్చేరీ' గురించి వ్రాయకుండా ఉండలేక పోతున్నాను. ఇది 'మహారాజు'తో భేటీకి కొన్ని మాసాల ముందే జరిగింది. మద్రాసు రేడియో కేంద్రం ఎగ్మూర్ మార్షల్స్ రోడ్‌లో ఉంటున్న రోజులవి. కార్యక్రమ నిర్వాహకుడు గాను కవిగా, గాయకుడిగా, నాటక రచయితగా, రేడియోలో తరచూ వినబడుతూ నేను నిలదొక్కుకున్న కాలం. లివరీ డ్రెస్సులో ఒక కారు డ్రైవర్ మా

కార్యక్రమ నిర్వాహకుల గదిలోకి వచ్చి నాకు సెల్యూట్ చేశాడు. పిఠాపురం ముఖం చూడగానే గుర్తుపట్టి, 'చెంచు నారాయణ' కాదూ అని చెప్పి, మా గదిలో కుర్చీ చూపించి మర్యాద చెయ్యబోయాను. "కాదు బాబూ యువరాజావారి సెలవయింది. మీకు వీలుగా ఉంటే ఇప్పుడు నాతో ఒకసారి 'వసంతవిహార్'కి దయచెయ్యమన్నారు". అతను యువరాజాగారి డ్రైవర్. పిఠాపురం హైస్కూల్‌లో చదువుకున్నాడు.

నేను వెళ్లాను... రాబోతున్న ఉగాదినాడు 'వసంతవిహార్'లో తన బంధుమిత్ర బృందానికి ఆనందం కలిగించడానికి ఆయన నన్ను ఆల్ ఇండియా రేడియో సహకార వాదకులతో సహా రమ్మని ఆహ్వానించారు.

వీణా, వయొలిన్ విద్వాంసులు శర్మసోదరులు, సారంగీ విద్వాంసుడు ఆలీరజా, తబలా విద్వాంసుడు సిద్ధేశ్‌కుమార్ – వీరి సహకారంతో నేను అచ్‌ఖాన్, చురీదారీ పైజమా వేసుకుని,వసంతవిహార్‌కి వెళ్లాను. యువరాజా, రాజాకుమార్ సతీసమేతంగా ఆహ్వానించారు. ఉయ్యూరు, గొల్లపల్లి, మీర్జాపురం జమీందారులూ, యువరాజా వారి తరానికి చెందిన బంధువులూ, మిత్రులూ స్త్రీపురుషులంతా నూటికి మించి ఉంటారు శ్రోతలు.

ప్రేక్షకులందరికీ స్వాగతం చెప్పారు యువరాజా "మా సంస్థానంలో ఉగాది, దసరా వంటి పండుగలకు కవులను, పండితులను ఆహ్వానించి, వారి విద్వత్సాహితిని కళాప్రదర్శన చేయించి సన్మానించడం ప్రాచీనాచారం.

ఆ ఆచారాన్ని పురస్కరించుకొని, మా తరానికి గురుస్థానీయులైన, నాకు వ్యక్తిగతంగా బృందావనం అనే పద్యకావ్యాన్ని వివాహశుభవేళ అంకితం ఇచ్చిన ఆధునికకవి, కులగురువులు నా కోరికపై ఇప్పుడు రామాయణరచనలో నిమగ్నులైవున్న వేంకట – పార్వతీశ్వర కవులలో, బాలాంత్రపు వెంకటరావుగారి కుమారుడు రజనీకాంత రావు రేడియో ద్వారా 'రజనీ'గా మనకందరకు ఆత్మీయుడవుతున్న 'రజనీ' ఈ ఉగాది నాడు మన వివిధ ఆధునికకవుల గేయాలను, తన గేయాలను వినిపించ బోతున్నాడ"ని సభా ప్రారంభం చేశారు.

నేను నా గేయాలను, కృష్ణశాస్త్రి, నండూరి, అడివి బాపిరాజు గార్ల గేయాలను, వేంకట – పార్వతీశ్వరుల ఏకాంతసేవ నుంచీ, రవీంద్రనాథఠాకూరు వంగగేయాలను, సభాసదుల కోరికపైని కె.ఎల్.సైగల్ హిందీ చిత్రగీతాలను గానం చేశాను. తాంబూలంతో చేర్చి నూటపదహార్లు నాకూ, మిగిలిన విద్వాంసులకు కూడా ఉచిత రీతినీ, యువరాజా బహూకరించి సత్కరించారు.

తండ్రి మహారాజా ఎంత గ్రాంథికవాదో, యువారాజా అంతటి వ్యావహారికవాదీ,

రచయితానూ! 15 సంపుటాల సూర్యరాయాంధ్రనిఘంటువు పలువురు పండిత ప్రకాండుల సంశోధన ద్వారా వెలువడిన గ్రంథం. తెలుగు భాష ఉన్నంత కాలమూ మహారాజా పేరుకు చిరస్థాయిని కలుగజేస్తుంది.

'వలపులు, అలపులు, తలపులు' అనే యువరాజా రచించిన గేయ సంపుటి కమలా అనార్కలీ తన సిద్ధాంత గ్రంథంలో 'ప్రతి అల్ప విషయంపై గేయము వ్రాసి, 'కాదేదీ కవిత కనర్హం' అను అభ్యుదయ కవితా ధోరణి నవలంబించిరి' అన్నారు.

యువరాజా ఆంగ్లంలో తన రచనలను గురించి చెప్పిన మాటలలో 'నా పుస్తకాలు చాలామట్టుకు మనస్తత్త్వ విశ్లేషకాలు, ఆత్మాశ్రయాలూ, వస్త్వాశ్రయాలు కూడాను. గంభీరమైన మానవ హృదయానుభూతులలో మంచివీ, చెడ్డవీ, అసలు పాటించనక్కరలేనివీ కూడా ఉంటాయి. అవి వాస్తవికజీవితంలో నుంచి పుట్టి ఉండొచ్చు, కాల్పనికములూ కూడాను. నేనుముఖ్యంగా నా కోసమే రాస్తాను. నా దిగుళ్ళనూ, పొంగులనూ రచనల ద్వారా వ్యక్తం చెయ్యకుండా ఉండలేను. పాఠకులు వాళ్లకిష్టమైతే వాటిని చదవొచ్చు. నా అనుభూతుల్లో పాల్గొనవొచ్చు. లేకపోతే వాళ్లయిష్టం' అన్నారు.■

18, నవంబర్ 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

31. వేంకట పార్వతీశ్వరకవులు : దేశభక్తి

అమలమైనట్టి 'నీ గృహమందు నేడు
శ్రుతి సుఖావహమైన సుశ్లోకమొకటి
నూతనంబైన జాతీయ గీతమొకటి
వినబడుచునుండె వీనుల విందు గాగ
ఆలకించుచు నుంటివా ఆంధ్రపుత్ర!'

ఈ పద్యం జాతీయగీతం అనే శీర్షికన 1916లో ఆంధ్రప్రచారిణీ గ్రంథ నిలయం 12 పుటల అనుబంధ గ్రంథంగా ప్రకటించిన చిన్ని పుస్తకంలోనిది. వేంకటపార్వతీశ్వరకవులు, ఈ కవితలో భాగవతంలో యయాతివంశీయుడైన బలిపుత్రులలో ఒకడై ఆంధ్రరాజ్యప్రథమ పాలకుడైన 'ఆంధ్రుని' పేర్కొంటారు.

'ఏ మహాపురుషుం డుదయించు కతన
ఏ మహారాజ మూర్ధన్యుడేలు కతన
ఆంధ్రదేశంబు నాగ నీ యవని వెలసె
ఆ మహాభాగు ఆంధ్రు నా యాత్మ దలతు'

కవిరాజహంసలు, కవికులాలంకారులు అయిన ఈ జంట కవులలో మొదటిపేరు బాలాంత్రపు వేంకటరావు గారిది. మా నాన్న గారిది. రెండవది వోలేటి పార్వతీశం గారిది. పార్వతీశం గారు తమ 73వ యేట 1955లోను, మానాన్నగారు తమ 92వ యేట 1972 అక్టోబరు 27వ తేదీన దివంగతులయ్యారు.

1924లో ప్రచురితమైన వారి కావ్యకుసుమావళి సంపుటంలోని ప్రబోధం అనే ఖండకావ్యం అంతకంటె ముందు (1920లో) 'మాతృమందిరం' అనే వారి స్వతంత్ర నవలలో రంగదాసు పాత్ర సామాన్య జనంలో చేసిన ప్రబోధం ఇది.

'ఏకఫలభోగకాంక్షచే ఎట్లు పక్షు
లేక వృక్షాశ్రయంబున ఎనగు, నట్లె
ఏకఫలకాంక్షచే మన మేకదేశ
మాత గొలుపంగ వలెనయ్య భ్రాతలార!'

ఈనాడు మన దూరదర్శన్ ప్రేక్షకులందరికీ ఏకతాకెవృక్ష అనే కార్టూన్ చిత్రంలోని ఇతివృత్తాన్ని పరమార్థాన్నీ వేంకటపార్వతీశ్వరులు 1920లోనే వ్రాసిన ఈ పద్యములో పొందుపరచి ఉండటం గర్వకారణం కాదూ?

"దారధనపుత్ర వాంఛలబారి గూరి
తెలివియుండుటచే పశువులను మించి
విశ్వసోదరభావంబు విస్మరించి తల్లడిల్లుచు నుంటి మో తమ్ములార!"

అనే పద్యంలోని విశ్వసోదరభావం జ్ఞప్తికి తెస్తారు.

అదే పద్యంలోని భావం బ్రిటీషు ప్రభుత్వ పాలనాపద్ధతినే కాక, దేశంలోని దారిద్ర్యాన్ని నిర్మూలించలేని ఏ కాలపు, ఏ స్వతంత్ర దేశపు ప్రభుత్వానికైనా 'చురక'గా తీసుకోవాలి. అలాగే మరొక చురక ఆ ఖండకావ్యం లోనిదే సామ్యవాద ప్రబోధ సూక్తి.

'పేదలగు సోదరుల నోట బెడ్డ గొట్టి
అనుభవంబున కంటే అత్యధిక వృత్తి
ధనము దాన్యమార్జించి పెత్తనము సేత!
వసుపతిత్వమె తస్కరత్వంబు గాక!'

'కలిమిగలవారు లేనివారలకు మగలు
లేనివారలు కలవారి లెంకలను'చు
తలచి వర్తించుచున్నంత దనుక మనకు
పాప నిష్కృతి లేదయ్య భ్రాతలార"

1920లో 'మాతృమందిరం'లో మొదట బందిపోటు దొంగరంగడుగా కనబడి తరువాత మనస్సంస్కారము పొందిన రంగదాసు పాత్ర, వేంకటపార్వతీశ్వరుల సృష్టి. 1921లో ప్రకటితమైన ఉన్నవ లక్ష్మినారాయణ గారి 'మాలపల్లి' నవలలో కూడా తక్కెళ్ళ జగ్గడనే 'ధర్మదొంగ' పాత్రా, (రాబిన్ హుడ్ వంటి పాత్ర) రంగదాసు పాత్రా - రెండూ ఆ దశాబ్దంలో తెలుగువారికి సామ్యవాదం ప్రబోధించిన పాత్రలుగా చిరస్మరణీయులు!.

మాతృదేవీరూపిణిగా దేశమాతను పూజించే 'మాతృమందిరం' అనే సంఘసేవాసంస్థకు కార్యకర్తలు కొందరు సన్యాసులు, సంఘ సేవికలైన పరివ్రాజికలూ! మన జంట కవులు కల్పనలో బంకింబాబు వల్ల ప్రభావితులు! 'మాతృమందిరం'లో భక్తుల ప్రార్థన ఇలా సాగుతుంది (1920లో ప్రకటితం)

'తల్లి నిన్ను తలంచి ధర్మంబు తలచి
కష్టంబు సుఖములో గడపి వచ్చితిమి
ఆకలి తృప్తిలో అడచి వచ్చితిమి
దయ తప్పి రక్తపాతము చేయలేక
వైరంబు మైత్రిలో వదలి వచ్చితిమి
ఆశాప్రలోభాప్తి అల్లాడలేక
మమతను సమతలో మలపి వచ్చితిమి!'
జయసుధామయసూక్తి – జయదివ్యశక్తి!
జయ సర్వజనయిత్రి! జయ జగద్ధాత్రి! ■

25, నవంబర్ 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

32. జంట కవుల జాతీయతాప్రబోధం

భావ తరంగాలలో వేంకట పార్వతీశ్వర కవుల కవిత్వంలో దేశభక్తిని గురించి స్మరిస్తూ వారు 1920 (జులై)లో ప్రచురించిన 'మాతృమందిరం' అనే ఆంధ్రప్రదేశ సాంఘిక కథాత్మకమైన మూడవ స్వతంత్ర నవలలోని మాతృస్తవం పద్యం ఉదహరించాను. ఆ పద్యంలోని 'క్రోధంబు శాంతితో కూర్చి వచ్చితిమి. రక్తపాతము సేయలేక వైరంబు మైత్రితో వదలి వచ్చితిమి మమతను సమతలో మలపి వచ్చితిమి', ఇంకొక పద్యంలో 'విశ్వసోదర భావంబు విస్మరించి తల్లడిల్లుచుంటిమి' ఈ ఆధునిక ఆదర్శ భావాలలో వెనువెంటనే దేశంలో రాబోతున్న శాంతి సమర శంఖనాదాలూ, సామ్యవాద భేరీలూ, వారి కవితలో శ్రుతులు సారించుకున్నాయి.

'మీ కంటబడలేదు. మిము జూడలేదు, మీ మాట వినలేదు. మిము పిలవలేదు, మీ పూజ గొనలేదు, మిము బ్రోవలేదు, దేవేంద్రుడే లాటి దేవుడో మీకు! అంతర్బహిశక్తులడరెడు చోట, అన్నియు నొక్కటై అమరిన చోట, అందరు నేకమే యనుకున్నచోట, తెలిసి కణ్గనుచోట దేవుడున్నాడు, చిరతరాశ్రయుడు, సంజీవనదాత, గోవర్ధనుడు వీని కొలువగా రాదె". దేవేంద్రుడంటే బ్రిటీష్ ప్రభుత్వము.

'గీతాసారం' అనే ఖండ కావ్యంలో జంట కవుల ఐక్యమత్య ప్రబోధం ఆ వెనువెంటనే రగుల్కొన్న స్వాతంత్ర్యోద్యమపు పిలుపులను స్ఫురింపజేస్తుంది.

'ఆషాఢ మరుదెంచె అందరొక్కటిగా, చినుకు నెచ్చెలులార, చేరిరారమ్మ! అందర మొక్కటై అల్లనపోయి, పర్వత శిఖరముల్ పాదాలతన్ని గిరినితంబంబుల క్రీళుల వారి శైలగర్జానల జ్వాలల నాన్చి ఆనంద భువన మహారంగమందు విశ్వమంగళ లీల విహరింపవలయు!' కావ్య కుసుమావళిలోని గోవర్ధనోద్ధారణములో ఆనాటికి గోపాలకృష్ణ గోఖలే నాయకత్వంలో వినిపించిన స్వాతంత్ర్య సందేశగాథ రూపకాలంకారంగా భాసిస్తుంది.

'కాళీయఫణి చూచి కార్చిచ్చు చూచి, వెర్రి గోపకులార వెరచెదరేల కొదవలన్నియు తీర్చు గోపాలమూర్తి మీ పాలనుండగా మీకేల భయము?' గోపాలకృష్ణ గోఖలేయే ఆ గోపాలమూర్తి. గోవర్ధనుడు భారత స్వాతంత్ర్యానికి ప్రతీక.

ఉదయగానం అనే ప్రబోధగీతం కావ్య కుసుమావళిలోనిదే 1922లో రచించినది.

'లేదురా నిద్రలో లేదురా సుగతి, చూడరా కనువిచ్చి చూడరా జగతి'. ఇది ఈ ద్విపద గేయానికి మకుటం. ఒక్కొక్క చరణంలో రెండు ద్విపదలు నాలుగేసి పంక్తులు.

'పొద్దు చెంగట సంజపొంచున్న వేళ, సద్దు చేయక రేయి చనుచున్న వేళ, మిద్దెలోపలి దివ్వె మిన్నెక్కువేళ, తమ్ముడా యీ జోగుతగదురా నీకు" ॥లేదురా నిద్రలో॥

'మంచు పెందెరలపై మంటరేగినది,
కంచు మేడలలోన గంట మ్రోగినది.
పంచమ ధ్వని మింట పర్వసాగినది,
మించి పోయెనికైన మేలుకోవేల' ॥లేదురా నిద్రలో॥

'భవ బంధము లెడల్బు బ్రహ్మణ్యమూర్తి,
కాలపాశము త్రెంచు కైలాసమూర్తి,
వారుణీశ్వరునొంచు వైకుంఠమూర్తి,
ఈ త్రయీ మూర్తి నీ యెదుటనున్నాడు,
వేయి చేతులు సాచి వెలుగుచున్నాడు.
పేరు పేరున లేపి పిల్చుచున్నాడు'. ॥లేదురా నిద్రలో॥

ఈ త్రయీమూర్తి తిలక్, గోఖలే, గాంధీల మూర్తిత్రయమే ఈ జంట కవుల మనోదర్పణంలో ఆనాడు మెరుపు మెరయించారు.

ఆ 1922 ఏప్రిల్‌లో దుర్మతి పోయి దుందుభినామ సంవత్సరం వచ్చింది. ఆ దుందుభి స్వాగతగేయంలో - గాంధీ మహాత్ముని శాంతి సమరసందేశం జంట కవుల గానంలో ప్రతిధ్వనిస్తుంది.

'దారుణక్రియలెన్ని చూపిన
ఓరుపనియెడి మూలమంత్రము
గోరు ముద్దలతోడ నేర్పిన
భారతీయులు భయం పడరని
చాటవే - దుందుభి - చాటవే!
ప్రేమసింధు తరంగములలో
సామగానము వెడలె భారత
భూమిలో గల వారలందరు సోమయాజుల వారలైరని
చాటవే - దుందుభి - చాటవే!'

1913లో ఆంధ్ర ప్రచారిణి ప్రచురించిన ఈ జంట కవుల రెండవ స్వతంత్ర

నవల 'ప్రమదావనం'. దాని ఉపోద్ఘాతంలో 'ఏ భాషాప్రచారమున ఈ దేశమాంధ్ర దేశముగా పేర్కొనబడుచున్నదో, ఏ సార్వభౌముననుగ్రహమున ఈ మాతృభాష సర్వ విధముల నభ్యున్నతికి వచ్చియున్నదో అట్టి శ్రీ కృష్ణదేవరాయని చరిత్రమిందు విశేషముగ సూచించబడియున్నది'. అని కవులే వ్రాసుకున్నారు.

ప్రమదావనంలో ద్వితీయ భాగంలో రాయలు తూర్పు దిగ్విజయ యాత్రయై కళింగ గజపతులపై దండయాత్రకు వెళ్లే ముందు రాత్రి ఒక స్వప్నం వస్తుంది. ఆ స్వప్నంలో రాయలు దర్శించిన దివ్య తేజ స్వరూపిణి, విశ్వేశ్వరి కవులు ఆ సందర్భంలో చేసిన పర్వత నదీనదాల పేర్లను బట్టి, ఆ మహాదేవి పూర్వాపర సముద్రాల మధ్య కళింగాంధ్ర, కర్ణాటక, తమిళ, కేరళ, సమన్వితయైన దక్షిణ భారతిగాను, భాషా దేవీ రూపంలో ఆంధ్ర సరస్వతిగాను గోచరిస్తుంది.

'మాతృమందిరా'నికి పీఠిక వ్రాస్తూ కొమర్రాజు లక్ష్మణరావుగారు తమ మాతృభూమియైన ఆంధ్రభూమి ఈనాటి దేశభక్తునకు కనిపించే అన్ని కళల (వృద్ధిక్షయాత్మకముల) తోను కథాబద్ధంగా చేయవలెనని గ్రంథకర్తల ఆశయంగా కనబడుతుందన్నారు.

కాని 'మాతృమందిర' పూజా నిలయంలోని "యాదేవీ సర్వభూతేషు మాతృరూపేణ సంస్థితా" అనే ప్రార్థనల వల్ల గాని, జంట కవుల 'విశ్వజనని' అనే మరొక ఖండకావ్యాన్ని బట్టి గాని వీరి దేశభక్తి విశ్వరూపిణియైన మాతృదేవతా భక్తియే కాని దానికి ఎల్లలు లేవని గ్రహించవచ్చు. 'మాతృమందిరం'లోకి రంగదాసు ప్రబోధంలోని విశ్వసోదర భావం కూడా దానికి తార్కాణం. విశ్వజననిలో జంటకవులు.

'శాశ్వతా'నంద, వృష్టి, విజ్ఞానదృష్టి, అనుపమోత్సాహ రసవృష్టి, కనకవృష్టి.
వెలయు జేయుచు నజ్ఞాన జలధినుండి, లీలమాయాంధ్రభూమి తేలింపుమమ్మ.

అనే పద్యంలో రవీంద్రుని 'చిత్తమెచట' పద్యాన్ని జ్ఞాపకం చేస్తారు. 15 ఆగస్టు 1947 నాడు స్వాతంత్ర్య భారతిని స్తుతించిన జంటకవుల గేయం – మదగజ యానంలో సైనిక బృందం బ్యాండులాగ నడుస్తోంది.

"భరతమాత స్వతంత్ర భారత భద్ర దుర్గద్వార సన్నిధి
ప్రభుతతో ఎత్తించినది జెండా! కొలవండి
రండో భారతీయులు ముదము మది నిండా". ■

02, డిశంబర్ 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

33. అప్పన్నా తనా మనా

అరవై ఏళ్ళ క్రితం అంటే నా చిన్నతనంలో ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా తూర్పు కోస్తా జిల్లాలోని పల్లీ పట్టణాల్లోని బజారుల్లో పౌరజనం నోళ్ళలోను, ఆనాటి మేజువాణీల (భోగం మేళాలలోను), నౌబత్ ఖాని బ్యాండ్ మేళాలలోను, తరచూ వినిపిస్తూండే ఒక 'చౌకబారు' పాట పల్లవి ఇది. ఈ భావతరంగాలకు ఈ చౌకబారు శీర్షిక ఎత్తుకోవడం చదువరులకు ఆశ్చర్యం కలిగించవచ్చు. దీని వెనుక మన దేశంలోని సాంస్కృతిక ఆదానప్రదానాలకు సంబంధించిన గంభీరవిషయాలను చదువరుల దృష్టికి తెస్తూ, గేయకవితలలో అభిరుచి పెంచుకోవడం గురించి ముందు వ్రాయబోయే ఇంతకంటె గంభీరమైన విషయాలకు నాందీప్రస్తావనలుగా చేపట్టాను.

'అప్పన్నా తనా మనా, మారోరె ఖైరన్నా'

ఇదే వరసలో 'చంచలా లతిక రమా' అనే అర్థంలేని మరో జానపద గేయం కూడా మా ఊళ్ళో ఆ రోజులలో వినిపించేది.

ముందున్న అప్పన్న శబ్దాన్ని బట్టి ఇది విశాఖపట్నం, విజయనగర ప్రాంతాలలోని ప్రసిద్ధ ఆంధ్ర పుణ్యక్షేత్రం సింహాచలంలో కొలువై వున్న దేవుడు 'అప్పన్న'కు సంబంధించిందా అనిపిస్తుంది. కాని ఆ ప్రాంత మేధావులైన పురిపండా, శ్రీశ్రీ, ఆరుద్ర ఆ విషయం ఎప్పుడూ, ఎక్కడా వ్రాసినట్లు గానీ,చెప్పినట్లు గానీ లేదు.

ఆ ప్రాంతపువారైన సంగీత కళానిధి ద్వారం వేంకటస్వామి నాయుడు గారు తమ కర్ణాటక సంగీతకచేరీలలోని చిట్టచివరి అంశాలలో తరచు వినిపిస్తూండిన తెలుగు జానపద గీతాల తోరణ మాలికలో ఈ వరుస కూడా వినిపిస్తూండేది. రాగమాలిక వాయించి వాయించి చివర కాపీ లేదా ఉత్తరాదివారి దేశీ రాగమో ఎత్తుకుని, దానిలోంచి ఈ వరసలోకి వచ్చి, తరువాత ఆ తోరణం వాయించేవారని జ్ఞాపకం.

నా చిన్నతనంలోనే అంటే పదేళ్ళలోపునే మావూళ్ళో (పిఠాపురంలో)కానీ, కాకినాడలో కానీ శెమ్మా భజనగోష్ఠుల వారు ఇదే వరుసలో దశావతారాలన్నిటినీ గూర్చిన ఒక భజన పాట పాడేవారు.

'జాలమూ ఏలనుర, నీలమేఘ శ్యామ పాలించు గుణధామ, భద్రాద్రి శ్రీరామ!!'

అన్ని అవతారాల చరణాలు జ్ఞాపకం లేవు గాని, నరసింహావతారం గురించిన చరణం జ్ఞాపకం ఉంది.

"ఉక్కు స్తంభమునందు ఉద్భవించిన రామ,
బాలునీ భక్తునీ ప్రహ్లాదుకావంగ జాలమూ"

దీని సంగీతం - హిందూస్థానీరాగం దేశ్ స్వరాలకు దగ్గరగా ఇలా ఉంటుంది.

॥రిపమా॥గమగ॥రిరీ।సరిస నినీ। నిసరి-సరీ॥ (రిపమా)
॥రి-మరి-పాప-పపా।, పా-పపా।మపనిప-మగరి॥ (రిపమా)

దీనికి మూలమైన గేయం అప్పన్నా తనా మనా పాటే, ఈ పాట పల్లవిగా తెలుగు సినిమా చిత్రాలలో ఒకటి - రెండింటిలో హాస్యనటుల సన్నివేశాలలో బజారు నృత్యంతో ప్రయోగించినట్లు జ్ఞాపకం.

నా చిన్ననాడు నా మిత్రులు ఈ పాటకి అర్థం ఇలా చెప్పే వారు - ఇది ఇద్దరు తాగుబోతులైన పామరజనుల సంవాదం అని! "అప్పన్నా, తన్ననా మానరా" అని ఒకడు మత్తులో అడుగుతూంటే, రెండో వాడు 'మారోరే ఖైరన్నా' (అంటే కొట్టరా కొట్టు) అని చెపుతూన్నట్లు.

మా ఇంట్లో మా పినతండ్రి జ్ఞానీ, విద్యాధికుడూ, తపస్వీ, కలకత్తా నుంచి కేరళ వరకూ దేశంలో అన్ని ప్రాంతాలూ దర్శించిన శ్రీ బాలాంత్రపు సూర్యనారాయణరావు గారితో జానపద సంగీతం నుంచి శాస్త్రీయ సంగీత రీతుల దాకాను, బజారు మట్టపు కబుర్ల నుంచి బ్రహ్మ పదార్థం దాకా అనేక విషయాలు చర్చించేటప్పుడు, ఒకనాడు ఈ పాటను గురించి ఇలా తోచి అన్నాను.

'ఇది తెలుగు తాగుబోతుల పాట కాదు, సూఫీ వేదాంతగర్భితమైన హిందూస్థానీ ఫకీరు పాట మాటల మూలం "అపనా తన్ నమాన్ నా మరోరే భాయి, రహ్‌నా" - అంటే నీ తనువును గూర్చి పట్టించుకోకు, చావరా సోదరా - అంటే తురీయమూ అనబడే అవస్థలో ఎప్పుడూ (రహ్‌నా) ఉండటం సాధించాలి. మరో అర్థం 'రహ్' నా అంటే 'జీవించకూ' అనగా తనువుపై దృష్టితో జీవించకు అని! మరణంలో గానీ, పరమాత్మ సన్నిధిలో గానీ, తురీయావస్థలో గానీ, శూన్యములో గానీ లభించే సర్వసమభావాన్ని సాధించు అని! ఈ పాటను రామదాసుకు తారకమంత్రోపదేశం చేసిన ఏ కబీరుదాసు వంటి ఫకీరో మన ఆంధ్రప్రదేశ్ జానపదులకు అందించాడని నా అభిప్రాయం' అని చెప్పాను. బాగుందన్నారు మా బాబాయి!

అయితే విషయం బాగా తెలిసిన పెద్ద లెవరైనా కాదని నచ్చచెప్పగలిగితే వినయపూర్వకంగా వింటాను. ■

09, డిశంబర్ 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

34. పాటకి పల్లవి జీవితం...

పాట వాస్తవిక జీవితంలో ఒక భాగమా, కాదా అని ప్రశ్నించుకుంటే వాస్తవిక జీవితంలో ఆయా సందర్భాలలో పాట సహజమే అనిపించే ఘట్టాలు ఎన్నో తారస పడుతుంటాయి. అటువంటి సందర్భాలలో ఒక నాటకాన్ని సమకూర్చుకోవలసి వస్తే ఆ సందర్భాలు జీవితానికి యథాతథమైన అనుకరణలే అయినప్పుడు ఆ ఘట్టాలలోని పాటలు వాస్తవికతతో కూడుకొన్నవే అని చెప్పాలి. ఈ సంగతిని గుర్తించని వాస్తవికతావాదులు -నాటకం జీవితంలోని వాస్తవిక సంఘటనలనే ప్రతిబింబించాలని భావించేవారు. పాటని నాటక రచనా పరిధి నుంచీ, ప్రదర్శన పరిధి నుంచి కూడా దూరంగా ఉంచుతారు. అది తప్పు.

పాట అనేది ఒక ప్రదర్శన వాహిక (మాధ్యమం) అని గ్రహిస్తే మొత్తం నాటకం అంతా పాటల నాటకం అయినా, నృత్య గేయాల నాటిక అయినా అది ప్రదర్శనలో సామాజికుల మెప్పు పొందగలిగినప్పుడు ఇది వాస్తవికమా కాదా అనే సమస్యే రాదు. అది ఎంత ఆదర్శప్రాయంగా ఎంతటి ఉన్నత కళాప్రమాణాలతో రూపొందించిందీ ఆ రచనలోను ప్రదర్శనలోను ఔచిత్య పరిపోషణ ఎంత సమర్థంగా జరిగిందీ అన్నవే పరిశీలనాంశాలు, విమర్శనాంశాలు అవుతాయి.

పాట అన్నప్పుడు సంగీతంతో కూడా కలిసిన గేయాల్ని తీసుకోవాల్సి ఉంటుంది. గనుక మన పాటలు ప్రధానంగా మూడు నాలుగు రకాలు. శాస్త్రీయ సంగీత గేయాలు, లలిత సంగీత గేయాలు, జానపద శైలిలో రచించిన లలిత గేయాలూ, అసలు సిసలైన జానపద గేయాలూను.

శాస్త్రీయ సంగీత కచ్చేరీలోని పాటలలో ఎన్నో ప్రక్రియలు ఉన్నాయి గాని, వాటి అన్నింటిలో పాట అనే సామాన్యార్థానికి సరిపోయే కీర్తన, కృతి, పదం, జావళీ వంటివి కొంతలో కొంతయినా సాహిత్య ప్రాధాన్యం ఉండే పాటలని మన పరిశీలనకు తీసుకోవాలి. కచేరీలలో పాడే విద్వాంసుల దృష్టిలో ఈ రకపు రచనలన్నింటిలోను విద్వత్ప్రదర్శనకి అనువైన సంగీత నిర్మాణానికే ప్రాధాన్యం. సాహిత్యం ఆ సంగీత ప్రదర్శనకి సహాయపడే ద్వితీయ ప్రాధాన్యంగల నిర్మాణం. శాస్త్రీయసంగీత ప్రాధాన్యం ఉండే పాటలు నాటకంలోగాని, సినీ చిత్రాలలో గానీ, కచ్చేరీపాట అనే సందర్భంలో

తప్ప వాస్తవికాలూ అనిపించుకోవు. అది ఆ వాగ్గేయకారుని జీవితఘట్టపు ప్రదర్శన అయినప్పుడే అది వాస్తవికం అనిపించుకుంటుంది.

మోహనతాన వర్ణాన్ని తీసుకుని (నిన్ను కోరి) దాని స్వర, సాహిత్యాల మధ్యను లయాత్మకమైన క్లబ్ ఆర్కెస్ట్రా ఆవృతాలనూ, లయ తాళధ్వనుల్నీ ఇరికించి ఒక సినిమా సంగీత దర్శకుడు తన శాస్త్రీయ కర్ణాటక సంగీత పరిజ్ఞానాన్ని, పాశ్చాత్య వాద్య సంగీత రచనా ప్రదర్శన (అనుకరణ) నైపుణ్యాన్ని కలగలుపుగా ఒక సినీ చిత్రంలో ఇటీవల చొప్పించారు. జావళీలలోను, వర్ణాలలోను, కొంత చవుకబారు శృంగారాన్ని శాస్త్రీయ సంగీత విద్వాంసులే అంగీకరించినప్పుడు, అటువంటి 'పాట'లో క్లబ్ డ్యాన్సు వాద్యఘోషలతో,తరుణీ నృత్యపు తైతక్కలతో ఎందుకు 'మిళావు' చెయ్యకూడదని సంగీత దర్శకుడు ఊహించి, ఆశించి, తన ప్రయోగంలో కృతకృత్యుడనిపించుకొని ఉంటాడు. ఇక్కడ 'ఔచిత్య' ప్రమాణాలు కూడా తమ జనరంజకతా ప్రజాస్వామ్య జనాభిప్రాయాలను అనుసరించి నిర్ధారణ అవుతాయి.

శాస్త్రీయ సంగీతపు పాటలన్నింటిలో మొత్తం రెండే రెండు రసాలు వినియోగానికి వస్తుంటాయి. అవి రెండింటినీ రాముడిపరంగా సమాన పాళల్లో రంగరించి, కీర్తనలు చేసి, ఉర్రూతలూగించగలిగాడు త్యాగరాజు!

వాగ్గేయకారుల రచనలలో భక్తి సంకీర్తనలూ ఆధ్యాత్మికతత్వం గల కీర్తనలు కూడా లభిస్తాయి. అన్నమాచార్యుల వంటి వాగ్గేయకారులు ఆధ్యాత్మిక కీర్తనలలో శృంగారతత్వాన్ని, శృంగార పదాలలో ఆధ్యాత్మికతత్వాన్ని సంకేతాలనూ విరివిగా వాడారు.

నిత్య జీవితంలో సామాన్య జనం పనిపాటుల్లో వినియోగించుకునే పాటలలో రాగం కంటే పాట వరుసలోని చిన్న రాగపుమెలికా, లయలోని లఘుత్వమూ అవే చెవినీ, గుండెలనీ పనిపాటలలోని కదలికనూ ఊపునూ ఇట్టే ఆకట్టుకుంటాయి. ■

16, డిశంబర్ 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

35. అది స్లోగన్ కవిత్వం!

శాస్త్రీయ సంగీతసంపుటితో లఘుసంగీత స్వరలయ సంపుటులను మేళవించి, ఒక సంగీత దర్శకుడు ఇటీవల ఒకచలనచిత్రంలో ఒక ఆధునిక రచనను ప్రదర్శించాడని, ఇంతకుముందు శీర్షికలో ముచ్చటించాను. రామనాడ్ (పూచీ) శ్రీనివాసయ్యంగారి రచన అది. తానానికి అనువైన 'ఘన' పద్ధతి రాగవిన్యాసంలో ఆ వర్ణపు సాహిత్యాన్ని అయ్యంగారు ఈ శతాబ్ది మొదటి దశాబ్దంలో కూర్చారు. అది భరతనాట్యం చేసే వారికి అత్యంత రక్తికరమైన అంశంగా ఒక శతాబ్దానికి పైగా రాజ్యమేలిన వర్ణం! దానిని క్లబ్ డ్యాన్స్‌తో కలిపిన ఘనత ఇళయరాజా అనే సంగీత దర్శకుడిది. 'పూర్వ కవుల కైత్యానికి' (కవిత్వానికి) మన పైత్యం చేర్చటం ఏం సబబు' అనే విమర్శ అలా వదిలేసి ఆ చిత్ర ఇతివృత్తానికీ దర్శకులూ, నిర్మాతలూ ప్రేక్షక మనస్సులలో నిరూపించదలచుకొన్న సందేశానికీ, కలిగించదలచుకున్న వినోదానందాలకీ తగిన ఔన్నత్యం పాటించబడిన విషయం ప్రేక్షకశ్రోతలలో జిజ్ఞాసువులకి వదిలేద్దాం.

శాస్త్రీయసంగీతాన్ని ఒక ప్రక్కకు పెట్టి, లలితసంగీతానికి అనువైన ఆధునిక గేయకవితలను పరిశీలనకి తీసుకుందాం.

ఆధునిక గేయ కవితలకు కులగురువని పేరుపడిన గురజాడ అప్పారావు గారి గేయాలలో కొన్ని చాలా లలితంగా, మృదువుగా, రసభరితంగా ఉంటాయి. అవి ఆయన కథాపదాలు (బ్యాలడ్స్). పుత్తడిబొమ్మ పూర్ణమ్మ వంటివి. నీలగిరి పాటలు ఆయన కేవలం సంగీతంతో పాడదగిన పాటలుగానే రచించి స్వరాలతో సహా ప్రకటించారు. ఇక మాత్రాఛందస్సులలో వ్రాసిన ముత్యాలసరాలు, దేశమును ప్రేమించుమన్నా వంటి పాటలలో సందేశపు బరువుతో, ఆవేశపు తీవ్రతతో కూడిన కర్కశత్వం కనబడుతుంది. కవిత్వం(గేయత్వం) తక్కువగా దొరుకుతుంది అంటే ఆయన అభిమానులు కత్రపుచ్చుకుని ఎదుర్కొంటారు. దేశమును ప్రేమించుమన్నా నేను ఖరహరప్రియరాగంలో – రాగయుక్తమైన వరుసలో టంగుటూరి సూర్యకుమారి చేత పాడించాను. దానిని ఆమె చేత గ్రామ్‌ఫోన్ రికార్డులో పాడించాను కూడా.

దేశమును ప్రేమించుమన్నా
మంచి యన్నది పెంచుమన్నా
వట్టి మాటలు కట్టి పెట్టోయ్

గట్టి మేల్ తలపెట్టవోయ్!

ఈ పాటలోని ఖండగతి దప్పుకొట్టినట్లు గుండె మీద మ్రోగుతూ జనాన్ని హెచ్చరిస్తుందన్నమాట నిజమే. అలా దప్పు కొట్టినట్లే పాడాలి అని భావించే వాస్తవిక వాదులైన మిత్రులు సూర్యకుమారి రాగ (మెలొడీ) ప్రధానంగా పాడడం మెచ్చుకోలేక పోయారు. అలాగే శ్రీశ్రీ పాటలలో ప్రసిద్ధమైనది.

పతితులార భ్రష్టులార
బాధాసర్పదష్టులార
ఏడవకండేడవకండీ,
వస్తున్నా యొస్తున్నాయ్
జగన్నాథ రథచక్రా
లొస్తున్నా యొస్తున్నాయి.

ఈ పాటని దీనులకు, బాధాసర్పదష్టులకు ఓదార్పుగా ఉండేట్లు – శ్రీరాగంలో రాగతాళయుక్తంగా పాడినప్పుడు కూడా వాస్తవికవాదులు అసంతృప్తి చెందారు. వాళ్ళు ఆశించేది ఆ పాటల్లోని సందేశాన్ని స్లోగన్‌లాగా అరిస్తే చాలుననుకుంటా.

వింధ్యానగం పగిలిందీ
సంధ్యానగం పగిలిందీ
మహానగాలెగురుతున్నాయి

అన్నప్పుడు ఆ మాటల్ని రాగయుక్తంగా పాడుతూ లయధ్వనులతో మహానగా లెగిరే ధ్వనుల్ని నిరూపించడం సంగీతమతస్తుడయిన నా అభిమతం. కేవలం స్లోగన్సులా అరిస్తేనే – వాస్తవికంగా ఉందనుకునే వాళ్ళకి రాగాలూ, సంగీతమూ అక్కర్లేదు.

ఇటీవల కాలంలో వచనగీతాలనీ, వచన కవితలనీ వస్తున్నవన్నీ సంగీతానికి అల్లంత దూరాన ఉండవలసినవే. కాని, మధ్యయుగాల తెలుగు సాహిత్యంలోను, కన్నడ సాహిత్యంలోనూ పాట లాగా పాడదగిన వచనాలు అనబడే వచనగేయాలున్నాయి. కృష్ణమాచార్యుల సింహగిరి నరహరివచనాలూ, తాళ్ళపాక పెదతిరుమలాచార్యుల వేంకటేశ్వర వచన వైరాగ్యమాలికాగేయాలు అలాటివి! కన్నడంలో బసవేశ్వరవచనాలూ, అక్కమహాదేవి వచనాలు అలాటివే! వాటిని పూర్వకాలంలోను, మొన్నమొన్నటి రంగస్థల ప్రదర్శనలలోను కన్నడనటులు పాడటం విని, నేనూ ఒక సభలో గానం చేశాను. బెంగుళూరులో ఆధునికకర్ణాటకులు కొందరు ఆ వచనాలను వచనంలా చదవాలి గాని సంగీతం పెట్టి గానం చెయ్యడానికి అయిష్టత తెలిపారు. ఆ అయిష్టత చూపినవారు మన వాస్తవిక వాదుల వంటివారు! ■

23, డిశంబర్ 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

36. ప్రణయగీతం 'ఏకాంతసేవ!'

వేంకట – పార్వతీశ్వరకవుల 'ఏకాంత సేవ'ను గురించి "ఇది విమర్శనా తీతము. వంగభాషకు రవీంద్రుని గీతాంజలి యెట్టిదో, మన యాంధ్రమునకీ మహాకవుల భక్తుల ఏకాంతసేవ అట్టిదని నా అభిప్రాయము' అన్నారు కృష్ణశాస్త్రి. అది ఎంత మాత్రము అతిశయోక్తి కాదు.

ఏకాంతసేవ అనగానే సామాన్యజనుల వాడుకలో గుడిలోని దేవునికి పొద్దుటి నుంచి రాత్రి వరకు ప్రతిదినము ప్రభాతం నుంచి రాత్రి పవళింపు వరకు చేసే సేవలలో చిట్టచివరిది అనే అర్థమే వెంటనే స్ఫురిస్తుంది. కాని ఈ కావ్యానికి జంటకవులు పెట్టుకున్న శీర్షిక అర్థంలో అంత కంటె విస్తృతమూ, ఇంకా విశ్వవ్యాప్తమూ అయి ఉన్నాయి.

విశ్వమూ పరమాత్మా, ప్రకృతీ పురుషుడుగా స్త్రీ పురుషతత్వాలకు ప్రతీకలై నిత్యసృష్టికీ, విశ్వగతికీ కారకులుగా, పాలకులుగా వర్తిస్తుంటారు. ఏదీలేని, ఏదీ కాని పరమాణువో లేక సంకల్పమాత్రం అనదగిన శూన్యమో అంతటికీ కారణం అనుకున్నప్పటికీ అది ఆదిలో ఒక్కటయి, ఒకటి రెండయి, రెండు మెండయినట్టు వింటూనే ఉంటాము. ఆ మొదటి రెండింటిలోనివే స్త్రీపురుషతత్వాలు. చరాచర (స్థావరజంగమ) జీవకోటికీ, మనుజరాశికీ ప్రజననకారణమైనవి అవే. ఆ జంటలో పురుషుడు దేవుడయితే స్త్రీ ఆయన దేవేరి. వారిద్దరూ దివ్యులే అయినప్పుడు వారి శృంగారం దివ్యప్రణయం అనిపించుకుంటుంది. శృంగారం అంటే ఇక్కడ అలంకరణం కాదు. నవరసాలలోను రాజు అనిపించుకున్న రసమే. రెండు ఆత్మలు, పరస్పరసమాగమానికి పడే తపన స్థాయీభావంగా 'రతి' అనిపించుకుని ఆ తరువాతి అవస్థలలో పరితప్తమై, భావానుభావ సంచారీసంస్కారాలతో రసస్థాయి పొందితే శృంగారం అవుతుంది. అతి ప్రాచీనకవులలాగ కాక మధ్యయుగకవులు అనేకులు ఈ శృంగార నిరూపణలో స్త్రీపురుష స్వభావాల భౌతికసంబంధాల చిత్రణాన్ని నిర్మోహమాటంగా చొప్పించి కామమాలిన్యం అంటించారనే అప్రతిష్ఠకు లోనయ్యారు. ప్రకృతిపురుషప్రతీకల పరిణామమిథునమైన రాధాకృష్ణుల లీలలో గాని, గోపికాకృష్ణుల లీలలో గాని, శివపార్వతుల కావ్యనాయికానాయకులైనప్పుడు వారి వైవాహికలీలలోగాని ఆ మాలిన్యం అంటించారనిపించని మహాకవుల్ని సంస్కృతాంధ్ర భాషా సాహిత్యాలలో కాగడా పట్టి వెదకవలసిందే.

ఉదాత్తమైనటువంటి దివ్యప్రణయం అనేది చిత్రితం కావలసివచ్చినప్పుడు

దాన్ని అమలినశృంగారం అందాం అని ఆధునికకవితా కులగురువులు భావకవిత్వ ప్రారంభికవైతాళికులు అన్నారు (రాయప్రోలు ప్రభృతులు).

వేంకట-పార్వతీశ్వరకవులు అటువంటి ప్రతిజ్ఞ చేయలేదు. దివ్య ప్రణయం ఇతివృత్తంగా ఒక భక్తిరసకావ్యాన్ని ఆద్యంతమూ అమలినంగా రచించారు.

1920లో వీరి మూడవ స్వతంత్రనవల 'మాతృమందిరం' రచించారు. పద్యకావ్యం ఏకాంతసేవలోని రెండవ సగంలోని పద్యాలెన్నో మాతృమందిరం నవలలోని ప్రకరణాల ముందు ఉదహరిస్తూ వచ్చారు. నవలలో భర్త వదిలిపెట్టి వెళ్ళిపోవడం చేత చింతాగ్రస్తురాలైన కథానాయిక ఇంటిలోని అలమారులోని పుస్తకాలు ఒక్కొక్కటీ తీస్తుంది. మరొకటీ మరొకటీ ఆమె మనస్సుకి నచ్చవు. ఏకాంతసేవ తీస్తుంది. పుటలో పాదజ్ఞాపికలో ఏకాంతసేవ భక్తి రసాత్మక పద్యకావ్యము అని సూచించారు. చివర మాతృమందిర సేవాసంస్థలో ప్రణయమందిరంలో 'ప్రాసాదవీధి వేణుగాన రవంబు వినవచ్చుచుండె. వేదాంతమయు జేరువేళ యేతెంచె భద్రంబు భద్రంబు ప్రాణరత్నంలు' అను మధురభక్తి పూరితమైన 16 పంక్తుల మంజరీగానం వినిపిస్తుంది. 1921లో సామర్ల కోటలో కార్తీకసమారాధనలు జరిపించారు. కాకినాడలోని పెద్దలు, అక్కడి భీమేశ్వ రాలయపు గర్భగుడి డాబా మీద వేంకట - పార్వతీశ్వరులిద్దరూ సమావేశమయ్యేవారు. ఏకాంతసేవ మొదటి సగం అక్కడ, అప్పుడు అలాగ పూర్తి చేశారు. దివ్యుడైన ప్రియతమునితో నాయిక అయిన ప్రేయసి హృదయేశ్వరుని గురించి కోయిలయై గొంతెత్తి పాడుతుంది. కల్యాణగీతిలో అవశయై చిక్కిన కలకంఠిని కరుణించిన కల్యాణమూర్తి కనుమరుగైపోవడం చేత దుర్భరమైన విషాదంలో పరితపించే నాయిక, ప్రణయాధినాథుని సందర్శనానికై ప్రార్థిస్తుంది. ఆత్మేశుతో నైక్యమొందకయున్న ఒకింతసేపైన ఓపని యామె ప్రణయస్వరూపుని పట్టి తెచ్చుటకు ప్రణయవనంబు లోపలి పుష్పరథంలో భ్రమరమే బాసటగా బయలుదేరుతుంది. పదిలమైన పాణిద్వయంతో, నిశ్చలమైన నేత్రయుగంతో చెదరని చిత్తంతో స్వామినర్పించే పూజాద్రవ్యసమితితో ఆమె ఆయత్తురాలు కాగానే శ్రీ పుష్పయోగ సంసిద్ధి చేకూరుతుంది. యుగయుగాల నుండి మోగే అనంతవిశ్వగానం నిత్యనూతనగానం మరల పాడిందే పాటగా తానే తేటియై పాడుతుంది. విశ్వమంతా వెన్నెలతీగ పాకుతున్నట్లు, దిక్కులన్నీ దివ్యగానాలతో నిండునట్లు ప్రకృతి అంతా పరవశమయేటట్లు ప్రవిమల భక్తిపూరితయైన ప్రేయసి, పరమేశ్వరుని గూర్చి పాడే ప్రణయగీతం ఏకాంతసేవ! ■

30, డిశంబర్ 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

37. మైమరపించిన 'ఏకాంతసేవ'

కవిరాజ హంసల నవల 'మాతృమందిరం' వెలువడిన 1920 జులై నాటికి ముందే రెండవ సగం ఏకాంతసేవా, 1921 నవంబర్ నాటికి మొదటి సగమూ రచించారు. ఆ రెండు ఏళ్ళలో కాకినాడ నుంచి అప్పటిలో వింజమూరి వెంకటరత్నమ్మ గారి సంపాదకత్వంలో వెలువడుతుండిన మాసపత్రిక 'అనసూయ'లో కొన్ని మాసాలు ఏకాంతసేవ కవితాఖండాలు సీరియల్‌గా అచ్చవుతూ వచ్చాయి. పత్రికానిర్వహణలో సంపాదకురాలికి ఆమె తమ్ముడు దేవులపల్లి కృష్ణశాస్త్రి సహాయకుడుగా పనిచేసేవారు.

కృష్ణశాస్త్రిగారు గాని, అప్పటిలో కాకినాడ పిఠాపురం రాజా వారి కళాశాలలో ఆంగ్లోపన్యాసకులుగా ఉండిన పెద్దాడ రామస్వామిగారు గాని, బ్రహ్మసమాజానికీ సంఘ సంస్కరణోద్యమానికీ కులపతి మాన్యులనిపించుకున్న బ్రహ్మర్షి రఘుపతి వేంకటరత్నం నాయుడు గారు గాని, ఏకాంతసేవ కవితా ఖండాలను ఏకేశ్వరోపాసనా సమావేశాలలో ప్రార్థనగీతాలుగా తమ నిత్యదైనందిన ధర్మోపన్యాసాలకి ముందుగానో, తరువాతనో గానం చేస్తూ, తాము భక్తి పరవశులైపోయి సభాసదులకి అతిలోకరమణీయమైన తన్మయత్వం కలిగించేవారు. 1922లో వేంకటరత్నంనాయుడు గారి షష్టిపూర్తికి అంకితంగా రచించి ప్రకటించిన రత్నహారం కూడా అత్యంత భక్తిరసపూరితాలైన అరవై మంజరీ షట్పదులతో కూర్చినది. రత్నహారం విడుదల చేసిన కొద్దికాలంలోనే కృష్ణశాస్త్రిగారి తెలుగు పీఠికతోను, పెద్దాడ రామస్వామిగారి ఆంగ్ల ఉపోద్ఘాతంతోను ఏకాంతసేవ కూడా వెలువడింది. రెండూ పాకెట్ ఎడిషన్‌సైజులో వెలువడ్డాయి. ఆ ఏకాంతసేవ చిన్న పుస్తకంలో (80 పుటలు) వేంకట – పార్వతీశ్వరకవుల ఛాయాపటం ఒకరి కొకరెదురుగా ఎడమ మోచేతులపై ఆనుకొని పడుకొని కుడిచేతులతో వ్రాస్తున్నట్లుగా నవ్యతను ప్రకటిస్తూ దర్శనం ఇస్తుంది. ఆధ్యాత్మిక సాధకులైన ప్రతి వ్యక్తినీ (స్త్రీ గాని, పురుషుడు గాని) నిత్య జీవిత సందర్భాలలో ఏదో ఒక మానసిక పరిస్థితికి అప్పటికప్పుడు పరమాత్మకు చేసికొనే విన్నపాలలాగా రత్నహార కవితా ఖండాలూ, ఏకాంతసేవా కవితా ఖండాలూ, చేతికి అంది వస్తూండేవి. పాఠకులనీ, శ్రోతలనీ మైమరపిస్తుండేవి.

ఆధ్యాత్మిక సాధకులూ, జీవితంలో ప్రేమ విరహితులూ, సాహితీ

పిపాసువులూ, సంసారులూ, దూరస్థలాల నుంచి కూడా జంట కవులూ అప్పుడే కాపురం మార్చుకున్న కాకినాడకు వచ్చి ఏకాంతసేవ కావ్యశ్రవణం తరచు చేసి ఆనందబాష్పాలు రాల్చి వెడుతుండేవారు. పిఠాపురం మహారాజావారి కోటలో అంతఃపురం దాకా ఏకాంతసేవ ఆకర్షింపసాగింది. కోటలో యువరాజుదీ, మహారాణిదీ ఒక పక్షం. అది ఇష్టపక్షం. మహారాజా వారు మాత్రం తమ కొలువు కూటంలోని ఒక ఆస్థానకవి అస్తమానమూ చెవిని ఇల్లు కట్టుకుని 'శతపోరు' తూండడం చేత ఏకాంతసేవ అంటే కొంత ఇష్టపడుతూ ఉండి కూడా, పూర్తిగా మనసిచ్చి మెచ్చుకోవడానికి కష్టపడేవారు.

ఆ ఆస్థానకవి చెవిలో చేసే బోధన ఇలా ఉండేది. "ఇది కవిత్వమేమిటి మహారాజా! నా మొగము! ఇందులో నాయిక యేది, నాయకుడేడి ఇందులో పద్యములకు ముందు అవే పద్యమో సూచించు మొదటి యక్షరములున్నవా? ఇదంతా భావకవిత్వం కాదూ! దీనికి పీఠిక వెలిగించినదెవరు మహారాజా! మన తమ్మన్న శాస్త్రిగారి కొడుకు కృష్ణ శాస్త్రే కదా. అతగాని కావ్యాలు ఊర్వశి, ప్రవాసము, కృష్ణపక్షము! ఆ పుస్తకాలలో ఏ పద్యమేదో తెలిపే అక్షర సూచనలున్నవా? అదియును భావకవిత్వమే. ఆ భావకవి గారు పీఠిక వెలయించినదియును భావ కవిత్వమే. ఇటువంటివారికి తగిన గౌరవం దేవిడీమన్నాయే" – ఇలా ఉండేది, ఆ వ్యతిరేక ప్రచారం. సస్పెన్సు కోసం ఆ ప్రచారం చేసిన మహాకవి పేరు ముందు వ్రాయడం లేదు. ఎందుకంటే ఆనాడు సాధారణంగా ఆశుకవితతోనూ, అవధానాలతోనూ, ఇతరులైన జంటకవులతో సాహిత్యయుద్ధాలు చేసిన జంటకవి పెద్దల లాగా ఈ కవిరాజహంసలు, ఆశుకవితజోలికి గాని, అవధానాల జోలికి గాని పోకపోయినా, తమ కావ్యకుసుమావళిలో 'అగ్నిపరీక్ష, నిర్వేదము, ఆత్మప్రబోధము' అనే అన్యాపదేశ కవితలను ప్రకటించి వున్నారు. ఆ కవితలు కావ్యకుసుమావళిలో 1924లో అచ్చుకాక పూర్వం, 'భారతి' వంటి ఆనాటి సాహిత్య పత్రికలలో అచ్చయి, కొందరు సాహితీజిజ్ఞాసువులకి వినోదానందాలను కలిగించేవి. (ఆత్మప్రబోధం నుంచి)

"బ్రహ్మసూత్రంబుతో పదుపుసానిహారంగు
పొంబట్టు లంగాకు బొంది చేసి
గడసాని పారాణికాళ్ళతో వైష్ణవ పంగనామాలకు రంగు వైచి
ముసలి గడ్డంబుతో పసిబాల చిన్నారి చెక్కుటద్దాలకు చెలిమి గూర్చి
వశ్యమంత్రములతో వైరిదుర్జయవీర శైవదీక్షితులకు చదువు చెప్పి
ఇచ్చ వచ్చినట్టు లెన్నియో ప్రకృతుల గూర్చి మార్చి పాడుకొనుము గాని
పాడి తప్పని నీకు పరతత్వబోధనల పేరునిలుపుకొనగ గోరితేని!

వేద్క తత్త్వ వికట విమర్శక పథము బట్టి మిట్టిపడకుమయ్య
పార్వతీపరమేశ పదభావగతి వీవు ప్రకృతిపురుషులకే భ్రమయు టేల?
ధ్వని జీవమైన యువన్యాసకుడ వీవు పలుకుపొందికలకే ఉలుకుటేల?
ప్రణయరసము గొలిపి ప్రకృతిని వలపించి పరవశతను గూర్చు పాటపాడి
ఎన్నో యాటలాడు నీవిట్టు లేకాంతసేవ నింత పడకపోవుటేల?"

ఈ పద్యాలు భారతిలో చదువుకొన్న పాఠకులు కాకినాడలోను, పిఠాపురంలోను, ఊరిలోను, కోటలోను, అంతఃపురంలోను కూడా, ఒకరితో ఒకరు, కంఠాభరణమూ, విప్రనారాయణా, వృద్ధ వివాహమూ నాటకాలను రచించిన పిఠాపురం ఆస్థానకవీశ్వరుడైన పానుగంటి వారి కొలువు కూటపు చెవికొరుకు స్వభావానికి "మంచి 'చపేటిక' తగిలించారు మన జంట కవులు" అని చెప్పుకునేవారు. ■

6, జనవరి 07, ఆదివారం 'ఆంధ్రప్రభ'

38. పోతనామాత్యుని భాగవత 'కలాప - కేళిక'లు

15వ శతాబ్దం ఇద్దరు మహాభక్తియోగులైన మహానుభావులు ఆంధ్ర సంస్కృతికి ఉజ్వల కారకులయ్యారు. వారు పోతనామాత్యుడు, అన్నమాచార్యుడు. భక్తి ఉద్యమ వాహినికి గంగోత్రి అనదగిన భాగవత మహాపురాణాన్ని పండిత పామర హృదయ రంజకమైన పద్యకవితలో తెలిగించి 'భవహరం' అనిపించుకొన్నవాడు పోతనామాత్యుడూ, ఆ వాహినిలో ఓలలాడించే సంకీర్తన తరంగసహస్రాలను తెలుగులో వెలయించి ధన్యుడైనవాడు అన్నమయ్య.

15వ శతాబ్దిలో జీవించిన ఈ మహానుభావులూ, సమకాలికులూ, సమ ప్రాంతీయులూ, సమగ్రామికులూకూడా అనేసందేహం కలిగించేటంతగా కొన్ని పలుకు బడులలో కొన్ని భావాలలో సామ్యాలు ఆశ్చర్యం కలిగిస్తాయి.

పోతనగారి భాగవతంలో ముఖ్యంగా దశమస్కంధంలోని కృష్ణగాథా ఘట్టాలలో కనిపించే దేశిరూపక సంప్రదాయాలలోని జాతీయమైన అందాలు కేవలం తెలుగు నేలలో, తెలుగుజనుల భాగవత కథాకల్పనలో పుట్టుకు వచ్చిన సొంపులు! దేశి రూపకాల సంప్రదాయం నుంచి ఈ అందాలు భాగవత పురాణ పద్య కవితలోకి వెళ్లాయి అనడం గాని, పోతనగారి కవితా సంప్రదాయం నుంచే దేశిరూపక సంప్రదాయాలలోకి వెళ్ళాయి అనడం గాని వాదాలూ సమంజసమేనేమో అనిపిస్తాయి. చెట్టూ – విత్తూ – సామెతలాగ.

సత్యభామ కథా, పారిజాత కథా వంటి కృష్ణ గాథల దేశిరూపక ప్రదర్శనలు నాటకశాలల్లో ప్రదర్శిస్తూండినట్లు అన్నమాచార్యులు రచించిన ఒక కీర్తనలో మనకు సాక్ష్యం కనిపిస్తూందని యింతకు ముందు భావతరంగాలలో చెప్పుకున్నాము.

ఓయమ్మ నీ కుమారుడు మా యిండ్లను పాలు పెరుగు మన నీడమ్మా,
పోయెద మెక్కడికైనను మా యన్నల సురభులాన మంజులవాణీ!

భాగవతంలోని ఈ కంద పద్యంతో పూర్తయే పాతిక, ముప్పై పద్యాల ఘట్టానికి – గోపికలు శ్రీకృష్ణుని దుడుకుచేతలు యశోదాదేవితో చెప్పడం అనే ఘట్టానికి సంప్రదాయాలలో తెలుగువారు కల్పించుకొన్నవి అని మా భావన. అవి పోతన గావించిన తెలుగు భావనలు కూడా కావచ్చు. ఇంకా ఇలాంటి ఘట్టాలేవి అంటే–శ్రీకృష్ణుడు గోప బాలురతో, చల్దులు కుడువవనమున కేగుట, కృష్ణునితో గోపబాలుర చల్దులు, శరద్రాత్రిని శ్రీకృష్ణుని వేణుగాన మహిమలకు సమ్మోహితులై ఆయన్ని వెతుక్కుంటూ గోపికల అన్వేషణ ఘట్టం సంస్కృత భాగవతంలో చాలా క్లుప్తంగా ఉంటే – పోతనగారి చేతిలో

'కర్ణావతంసిత కర్ణికార ప్రభగండభాగద్యుతి గడులుకొనగ'
అని మొదలై 'చతుర నటమూర్తి గోపాల చక్రవర్తి' అనే సీస పద్యం ఆదిగా 20 పద్యాలూ కృష్ణగోపీ సంవాదం 'మేలామీకు భయంబు పుట్టదు గదా' అనే కృష్ణవాక్యంతో మొదలైన ముప్ఫై పద్యాలూ, ఆ తర్వాత కృష్ణుడు తిరోహితుడు కాగా, విరహార్తలై తపించు గోపికలు ఆ ఆత్మేశ్వరుణ్ని అన్వేషిస్తూ ఆయన కనబడి తిరిగి సమాధాన సంవాదం చేసే వరకూ గల డెబ్భై నాలుగు పద్యాలూ ఆ తర్వాత వచ్చే రాసక్రీడా – గద్య, జలక్రీడా వర్ణనలూ, వీటన్నింటినీ పోతనగారి గోప భామాకలాపకేళికలుగా భావించాలి. అంటే, వెనుకటి భావతరంగాలలో చర్చిస్తూ వచ్చిన జీవాత్మా, పరమాత్మానురాగ చిత్రణము చేసే 'శ్రీగదిత'మనే ఉపరూపకం అన్నమాట. ఈ ఘట్టంలోని 'నల్లనివాడు పద్మనయనంబుల వాడు' అనే పద్యం గోపభామ నోట మన మానస శ్రవణగోచరం అవుతూంటే నాయికయైన గోపభామ విరహార్తయై గోపికలందరకు మీకూ, నాకూ ప్రతీకయై 'మీ పొదలమాటున లేడు గదమ్మ చెప్పరే' అని అడుగుతూ కనిపిస్తుంది.
'పున్నాగ కానవే', 'మానినీ మన్మథు', 'అదెనందనందనుండు'
'కొమ్మకు పువ్వులు కోసినాడిక్కడ' 'ఒకయెలనాగ చేయూది నాడిక్కడ',
'ఈ చరణంబులే యిందునిభావన', 'పొదరింటిలో నిందాక కృష్ణుడు' –
ఇలాంటి ఒక్కొక్క సీస పద్యమూ నాయిక గోపభామ విరహార్తితో పాడే దరువులతో ఈ కలాపం మనకు కళ్ళకు కడుతుంది. పోతనగారి కొన్నిపలుకులకు అన్నమయ్యగారి పలుకుబడులతో పోలికలు.

పోతన : 'ఈ మహీజము నీడ నిందాక సుభగుండు
చిట్టంటు చేతల సిగ్గుగొనియె'

అన్నమయ్య : జట్టిగొనెర నిను జవరాలు
చిట్టంటు చేతల చెలగితివపుడు.

పోతన : వెలి, లోను, మొదలు, తుది, నడు
ములు లేక జగంబు తుదియు మొదలున్ నడుమున్
వెలియునులోనగు నీశ్వరు నలవడునే పట్ట ప్రణతురాల్ కాకున్నన్!

అన్నమయ్య : వెలి నుండి, లోనుండి, వెలితిగాకుంటే వెలి, లోను, పలుమారు
వెదకేవె గాలి!!

వీరిద్దరిలో ఒకరు పద్యకవీ, ఒకరుగేయకవీ – ఇద్దరికీ పరమాత్మ రూపియో కృష్ణుడో, వెంకటేశ్వరుడో ధ్యేయం! వారి భావనల్లో పలుకుబడులలో పోలికలు కాకతాళీయాలు అనడానికి వీలులేదు. ■

20, జనవరి, 08.

39. కృష్ణ - రజని

శ్రీ కృష్ణశాస్త్రి గేయ రచనలతో రజని సంగీతానికుండే అనుబంధానికి ఒక సంకేతం 'కృష్ణ – రజని'. ఈ శీర్షికలో ఆత్మాశ్రయ కవితా గేయాలను నేను పక్కన కూచుని పాడుకుంటూ రచించాలనే సంకల్పం ఆయనకి అరవయ్యో దశకంలో మొదటి సగంలో హైదరాబాద్ ఆకాశవాణిలో పనిచేస్తున్నప్పుడు కలిగింది. 20, 24 దాకా గేయాలు రచించారప్పుడు.

అసలు రజని సంగీతంతో తయారయి ప్రసారమైన కృష్ణశాస్త్రి తొలి సంగీత నాటకం 'శర్మిష్ఠ'. 1941 మార్చి 23న మద్రాసు కేంద్రం నుంచి ప్రసారం అయింది.

రేడియోలో నిలయ కళాకారుడిగా నేను ఇంకా చేరకముందే 1941లో జనవరి నుంచే కేజువల్‌గా పాల్గొంటూండిన కార్యక్రమాల జ్ఞాపకాలలో ఈ భావతరంగాలలో తప్పక చేరవలసింది శర్మిష్ఠ.

1941 మార్చి 23న తెలుగు సంవత్సరాది. ఆనాడు శ్రీ ఆచంట జానకిరాం, కృష్ణశాస్త్రి గారి శర్మిష్ఠ షెడ్యూలు చేశారు. యయాతి మహారాజుకు అప్పటి పట్టమహిషియైన దేవయాని వెళ్ళిపోయే హేమంతుడిలా కనబడడమూ, దేవయాని అంతఃపురోద్యానంలో ఆమెకు చెలికత్తెగా ఉంటూండిన యౌవనవతి శర్మిష్ఠలోని వసంతలక్ష్మి రాజును ఆకర్షించడమూ, రాజోద్యానంలో వసంతోత్సవపు వేడుకలలో హేమంతుడికి వీడుకోలూ, దేవయాని మనోవేదనా, శర్మిష్ఠా యయాతుల సమాగమమూ ఈ ఘట్టాలన్నీ ఈ గేయ నాటకంలో (సింబాలికల్) ప్రతీకాత్మకంగా సమకూర్చారు. అందులో ఆరంభంలో హేమంతుడి వీడ్కోలు పాట నేనే పాడాను.

"ఏల యింత జాలి వీడుకోలు, నేనె నిలువజాల
ఆలసించి చేరనా నీహారదూర తీరవేల ! ఏల
అలసి అలసి ఈ హసంతికానలమ్ము నిదురించునొ
మలసి, సొలసి,సేమంతి సుమాళి బాళి పలవించునో
లోలమ్లాన లోధ్రసూన మేఖల దిగజారి సోలు
తూలి తూలినా ద్విపటీ తుహినాంచలములు తేలు

ఏనరేగు ఎటుల మ్రోగు ఈ యీదరగాలి పిలుపు
ఓనరిలెను కాబోలును ఉత్తరపుంగవను తలుపు ॥ఏల॥

ఈ నాటకంలో యయాతి శ్రీ అవసరాల శేషగిరిరావు, దేవయాని శ్రీమతి కొమ్మూరి పద్మావతీదేవి, శర్మిష్ఠ కుమారి టంగుటూరి సూర్యకుమారి, రాజవైద్యుడు శ్రీమర్ల సూర్యనారాయణమూర్తి, కవి, హేమంతుడు రజని, యువీ యువకులు (బృందం) బళ్ళారి లలిత, ఆమె చెల్లెలు, మాలపిల్ల సుందరమ్మ, ఋష్యేంద్రమణి, వాసంతిక, శ్రీ సాలూరిహనుమంతరావు (ఎస్రాజ్), అంజయ్య (తబల), కృష్ణశాస్త్రి గారిని మధ్యపెట్టుకొని శేషగిరిరావూ, నేనూ ఆయనకు చెరొకవైపునా కూర్చోగా మిగిలిన పాత్రధారులతో ఆనాటి ఫోటో ఒకటి నా దగ్గర మిగిలింది.

జయప్రదంగా నాటక ప్రసారం పూర్తికాగానే నిర్వాహకులైన శ్రీ జానకీరాం (1941) అప్పుడు వుడ్ ల్యాండ్స్ హోటల్‌లో రాత్రి విందు ఏర్పాటు చేశారు. నాటకంలో పాల్గొన్న కళాకారులూ, కృష్ణశాస్త్రిగారూ, కొందరు రేడియో సహచరులూ ఆ విందుకు హాజరయ్యారు. దేవయానీ, శర్మిష్ఠా పాత్రధారిణులలో పెద్దామె కన్నా చిన్నామెకే నాటకంలో రాజు మన్నన లభించడం వల్ల దేవయాని పాత్రధారిణి ఆ దిగులును విందులో కూడా ఆమెను వెంటాడడంతో ఆమెకు కొంత అస్వస్థత కలిగి, నన్ను తోడిచ్చి ఇంటికి పంపించారు. ఆవిడ నాకు 'అక్కయ్య'. నన్ను ఆప్యాయంగా తమ్ముడూ అని పిలిచేవారు. ఆనాటి రేడియో నాటిక నాయికా పాత్రధారిణులలో ఆమె నంబర్ వన్ అని ప్రసిద్ధి?

కృష్ణ–రజని అని శీర్షిక పెట్టిన ఈ తరంగంలో కాక, అసలు 'కృష్ణ రజని' పాటల సంకల్పమూ, కూర్పులను గురించి, ముందు మరొకచోట వ్రాస్తాను. 'కృష్ణరజను'ల సాహిత్య సంగీతానుబంధాన్ని ప్రకటించిన మరొక అపురూప కార్యక్రమం గురించి మాత్రం వ్రాస్తాను. కిందటి వారపు శీర్షికలో మధ్య ప్రాచ్య సంగీత ధోరణులను నా లలిత సంగీతంలో పాడినందుకు డైరెక్టర్ గోపాలన్ మెచ్చుకున్నారని వ్రాశాను. అది 1942లో నేను నిలయకళాకారుడిగా,మద్రాసులో చేరాక ప్రసారం అయింది. అప్పటికే కృష్ణశాస్త్రి పారశీక కవి 'హఫీజ్' పద్యాలను కొన్నింటిని తెనిగించి (ఎపిక్యూరియన్) ఉమర్‌ఖయ్యాం జీవిత ఘట్టాలను చిత్రించే నాటకాన్ని ఒకదాన్ని గురించి ఆలోచిస్తూ, వాటిని నాచేత పాడించుకొనే వారు. వాటిలో ఒకటి:

"వేబోక విరయు, నెచ్చెలులార ఇనుడెగయు
లజ్జావతి ఉషస్సు రజత నీహారాంశు

కాంచలమ్ముల మౌక్తికాంసమ్ము కప్పుకొను!
ప్రాభాత కలధౌత పాత్ర తెండో చెలులు!
మరకతాసనముపై కొలువున్నది గులాబి
పరచిరుజ్జ్వల విపుల శాద్వలంపు తివాసి
అరుణ మందారమో, అరుణ ప్రవాళమో
మధువు సోకీ, మధువు మసలదీ తొలిప్రొద్దు!
ఏల ఈ మధుశాల ఎవరు మూసినవారు
చాలు ఈ ప్రొద్దునా శాల మూయగలారు!
హే కవాట విపాటకా, కృపాళూ వేడువార మీ
ద్వార మీవే తీయుమీ నేడు!"

ఈ నాటకం అతిథిశాల సంగీతమూ ప్రధాన పాత్ర నిర్వహణా నావే. తొలిసారి 1942లోనే మద్రాసు నుంచి ప్రసారమయింది. ప్రసారం పూర్తికాగానే ఇంటి నుంచి డైరెక్టర్ గోపాలన్ గారూ, మద్రాసులో ఆనాడున్న అడివి బాపిరాజు గారూ, టెలిఫోన్ చేసి నన్ను ప్రత్యేకంగా అభినందించారు. ఎందుకంటే నేను ఆనాటకంలో ఖయ్యాం పాత్ర ధరించాను. పాటలూ, పద్యాలూ ఆ సంస్కృత సమాసాలు పారశీక శబ్దాల అందాలను, సౌరభాలనూ గుబాళించేటట్లు శ్రీ కృష్ణశాస్త్రి కూర్చారు. పారశీక సంగీత ధోరణులు (వరుసల)లో సమకూరాయి. ఇది 60లలో హైదరాబాద్‌లో నేనూ, శాస్త్రిగారూ కలిసి పనిచేసేటప్పుడు అక్కడ ప్రసారం చేసినప్పుడు చేసిన రికార్డింగ్ (1969) టేపులో కొన్ని పాటలూ, పద్యాలూ ఈ నాటికీ దొరుకుతాయి. విజయవాడ రజతోత్సవ సందర్భంలోనూ, మద్రాసులో కృష్ణశాస్త్రి సన్మానం జరిగిన సభలలోను – ఈ టేపులోని నాటకాన్ని (ధ్వని ముద్రణని) నేపథ్యంలో వినిపిస్తూ విజయవాడలో ఛాయరూపకం (షాడో ప్లే) మద్రాసులో నృత్యనాటిక (బ్యాలే) గాను ప్రదర్శింపజేశాము.

1938లో కృష్ణశాస్త్రిగారు మద్రాసు రేడియోలో తొలి నాటకం అనార్కలీలో పాల్గొన్న దాని రిహార్సలు నేను స్టూడియోలో చూసిననాడు నేను రేడియోలో చేరతాననే ఊహే లేదు. నేను నాటకంతో 1941లో మద్రాసు రేడియోవారిని చేరినపుడు గాని, 1942లో నిలయ కళాకారుడిని అయినప్పుడు గాని శాస్త్రిగారి జోక్యం లేదు. కాని ఆయన 1956–58 ప్రాంతంలో రేడియో ప్రొడ్యూసర్‌గా చేరాలని రేడియోవారు నన్నే రాయబారం పంపారు. ■

27, జనవరి, 09, ఆదివారం 'ఆంధ్రప్రభ'

40. కృష్ణ రజని యక్షగానాలు

1956-60ల మధ్య విజయవాడలో నేను ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా పని చేసినప్పుడు సాహిత్య కార్యక్రమ ప్రయోక్త అయిన పింగళి లక్ష్మీకాంత గారితోనూ, అక్కడి నుండి 1960లో నేను హైదరాబాద్ బదిలీ అయినప్పుడు అక్కడి సాహిత్య కార్యక్రమ ప్రయోక్త అయిన దేవులపల్లి కృష్ణశాస్త్రిగారితోనూ కలిసి కార్యక్రమాలు నిర్వహించే అదృష్టం కలిగింది నాకు. ఈ ఇద్దరిలో ఒకరు నాకు స్వయానా గురువులు రెండవవారు గురుస్థానీయులు.

కృష్ణశాస్త్రి గారిచేత హైదరాబాద్‌లో నా సంగీతంతో మూడు యక్ష గానాలు రచియింపజేసి ప్రసారం చేశాను. రచయితకు పక్కతోడైన సంగీతం ప్రయోక్తను మాత్రమే కాక, ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ ఇంఛార్జిని నేనే. ఆ యక్షగానాలలో ఒకటి క్షీరసాగర మథనం, రెండవది విప్రనారాయణ, మూడవది మాళవిక.

క్షీరసాగరమథనం రచనలో మూడొంతులు నేను చేశాక కాని, శాస్త్రి గారి చేతికి యక్షగాన రచన లొంగిరాలేదు. అప్పుడు ఇద్దరూ కలసి ఆ యక్షగానాల ప్రార్థనా దరువు ఇలా కూర్చాం. ఆ మూడు యక్షగానాలకూ ఇదే ఆరంభ ప్రదర్శన.

అంబా హెచ్చరిక, అపర్ణా హెచ్చరిక
సాంబశివుని ప్రేమధాని హెచ్చరిక
కుంతీ మాధవుకూర్మి సోదరి
కుక్కుటార్ధేందు శేఖరుని దేవేరి హెచ్చరిక!
ముగ్గురమ్మలకు మూలమయిన తల్లీ
ముక్తినిచ్చే కల్పవల్లీ హెచ్చరిక
శ్రీకృష్ణదాన చకోర పూర్ణిమా, రజనీకాంతోదయా, దయారాశీ హెచ్చరిక

ముఖ్యంగా చిట్టచివర మా ఇద్దరి పేర్లూ వచ్చే చరణం జంటకవులు లాగా, నేను శ్రీకృష్ణ దాస చకోర పూర్ణిమా అని ప్రారంభిస్తే ఆయన రజనీకాంతోదయా, దయారాశీ హెచ్చరిక అని పూర్తిచేశారు. రజని గొంతులో రాగం కృష్ణశాస్త్రి కళ్ళకు పూర్ణిమా చంద్రోదయం అని, అది అంబ దయవల్ల ప్రాప్తం అనీ దాని భావం.

క్షీరసాగరమథనం ప్రసారం విజయవంతంగా జరిగిందని, విన్నవారిలో

విజయవాడ రేడియో నాటక ప్రయోక్త బందా కనకలింగేశ్వరరావుగారు హైదరాబాద్ వచ్చి, స్టేషన్ డైరెక్టర్ వద్ద మమ్మల్ని అభినందించి, ఆ యక్షగానాల టేపు ప్రతినొకదానిని తీసుకెళ్ళారు. తనతో యక్షగానం ప్లాను చేసినపుడు గాని, ప్రసారం అయినపుడు గాని కూచిపూడివారెవరికీ దానితో ప్రమేయం గాని, పాల్గొనడం గాని లేదు. కూచిపూడి నాట్యదక్షులలో హేమా హేమీలచేత ఆ నాటకాన్ని రంగస్థల ప్రదర్శనం చేసే ఏర్పాటులన్నిటికీ కీలకపాత్ర బందా వారిదే.

బందావారు, విజయవాడ రేడియో కేంద్రపు డైరెక్టర్ గారూ ఆహ్వానించగా నేనూ, కృష్ణశాస్త్రి గారూ విజయవాడ నుండి, హైదరాబాద్ నుంచి హైదరాబాద్ రేడియో తరఫున విప్రనారాయణ యక్షగానం నా సంగీతంలో కృష్ణశాస్త్రి గారి రచనతో బాలమురళీకృష్ణ, గోపాలరత్నం, వింజమూరి లక్ష్మి మున్నగువారిచేత ప్రధాన పాత్రలు వహించగా, విజయవాడ స్టూడియోలో రికార్డు చేశాం. అందులోని దరువులకు కూచిపూడి నాట్యాచార్యులలో పెద్దవారైన చింతా కృష్ణమూర్తి గారికి ఆయా దరువులు, అవసరమైన కొనుగోలు శబ్దాలు చెప్పడానికి కాంట్రాక్టు ఇచ్చాం. ఆ నాటకపు రికార్డింగ్ కూడా బందావారు తీసుకుని, కూచిపూడి నాట్యాచార్యులు బృందాన్ని సమావేశపరచి రంగస్థల ప్రదర్శనకి ఏర్పాట్లను చర్చించారు. ఇదంతా జరిగింది 1960 అక్టోబరు నుండి 1962 లోపల.

ఆ దరిమిలా ఢిల్లీలో అచ్చయిన అకాడమీ డాన్స్ స్పెషల్ సావినీర్‌లో ఆంధ్రలో నాట్యప్రగతిని గురించి ఆంగ్లంలో ఒక వ్యాసం ఇస్తూ దానిలో ఒకచోట భారతీయ నాట్యచరిత్రలో ఆదినాటకంగా భరతమునిచేత, ఋషులచేత అప్సరసలతో ప్రదర్శితమైన 'అమృతమథనం' నాటకాన్ని, దాక్షిణాత్య భక్తుడైన విప్రనారాయణ ఆళ్వారు చరిత్రను నృత్యనాటకాలుగా రేడియో రంగస్థలంపైనా తనే మొదటిసారిగా ప్రదర్శింపజేశానని బందాగారు వ్రాసుకున్నారు.

నేను నా విద్యార్థిదశ నుండి బందావారిపైన కలిగి ఉన్న గౌరవాన్ని విజయవాడలో కలసి పనిచేసిన స్నేహభావాన్ని ఈ వ్రాత చదివాక హృదయంలో కొంత సడలించుకోకపోలేదు.

విజయవాడలోను, ఇంకా మద్రాసు మొదలైన నగరాలలోను రంగస్థల ప్రదర్శనలుగా ఆడిన క్షీరసాగరమథనం నా రచన సంగతి (కృష్ణశాస్త్రిగారితో కలసి) అటుంచి, నా సంగీతం కూడా ఏ ప్రదర్శనలోనూ ప్రకటించలేదు. కృష్ణశాస్త్రి గారు ఆ నాటకాలు రిహార్సల్ అవుతున్నప్పుడు పక్కన కూర్చుండి కూడా నా సంగీతం సంగతి ఎప్పుడూ చెప్పలేదని, విజయవాడలోని పత్రికారచయితలైన మిత్రులు చెప్పారు.

విప్రనారాయణకు కూడా రంగస్థల ప్రదర్శనల్లో సంగీత ప్రశంస వచ్చేసరికి అది కూచిపూడి వారి సాంప్రదాయక సంగీతం మాదే, మా చింతా కృష్ణమూర్తి గారికి రాయల్టీ ఇచ్చి రేడియో వారు మా సంగీతాన్ని కొనుక్కున్నారు తప్ప దీనికి మీ ప్రమేయం ఉందన్న సంగతి మేం గుర్తించం అన్నట్టుగా పెద్ద మనుషులు వాదించడం నేను వేదికలపైన విన్నాను.

కొన్నాళ్ళు ప్రదర్శనలు ఇచ్చాక సత్యనారాయణశర్మ గారికి నా నాటకం ప్రదర్శించవద్దని కృష్ణశాస్త్రి గారు లాయరు నోటీసు ఇస్తే ఆయన నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్లు గారిచే వేరే వ్రాయించి ఆ నాటకంలోనే కృష్ణశాస్త్రి గారి విప్రనారాయణలోని నాలుగైదు పాటలను తప్పకుండా చొప్పించకుండా ప్రదర్శించడం లేదు.

నా సంగీతంతో కృష్ణశాస్త్రి రచించిన 'కొలువైతివా రంగశాయి', 'ఔరా ఔరౌరా', 'చేకొనవయ్యా రంగయ్యా', 'వెడలెరా వయ్యారులూ' పనిలేని కందార్థం వెడలేనిదే దాసరి సాని వేషంలో దేవదేవి, 'వద్దు వద్దు సుమా కాస్త ఒద్దికగా మసలుమా', వానలోన తడవుండీ తడిసేవూ కాబోలు అనే దరువులూ రామప్రియ మోహన, ఆనందభైరవి, కేదారగౌళ, దర్బారు, సైంధవి, వరాళి, చలనాట రాగాలలో దరువుల్లో ఏ రెండు మూడింటినైనా తన ఆటలో వేదాంతం శర్మగారు, కృష్ణమాచార్లు గారి విప్రనారాయణలో చేర్చుకోడానికి కారణం, వారికి నా సంగీతం పైన గల అపారమైన అనురాగమే. ■

03, ఫిబ్రవరి, 08, ఆదివారం 'ఆంధ్రప్రభ'

41. 'ఆంధ్రి'పై ఒక వెలుగు

భరతుడు నాట్యశాస్త్రంలో, నాటకాలలో పాత్రల ఉత్తమ, మధ్యమ, అధమ స్థాయిలకు తగినట్టు సంస్కృతము ఉత్తమ పాత్రలకు, మధ్యమ స్థాయి పాత్రలకు 'భాషలు' అని ఆనాడు వ్యవహరింపబడే శౌరసేనీ, మాగధీ, అర్ధమాగధి, బాహ్లికా, దాక్షిణాత్య, అవంతికా, ప్రాచ్యా అనే ఏడు ప్రాకృతభాషలనూ, అధమ తరగతి పాత్రలకు 'శకారి, అభీరి, చండాల, శబర, ద్రమిళ, 'ఆంధ్రజా హీనాఃవనే చరాణాంచ విభాషా నాటకే స్మృతా' అనే శ్లోకంలో చెప్పినట్టు శకారి, అభీరి, చాండాలి, శాబరి ద్రామిడి, ఆంధ్రి, హీనులైన (ఆనాటి వెనుకబడిన జాతులు) వనచరుల భాషా, ఈ ఏడింటినీ విభాషలనీ, ఈ విభాషలనే వాడాలనీ చెప్పాడు.

దీనిని బట్టి ఆంధ్రులు (శాతవాహన) సామ్రాజ్య స్థాపకులు కాకపూర్వం విశ్వామిత్రుని శాపాన్ని అనుసరించి శాబర పుళిందాదులతో పాటు ఆర్యసంస్కృతి నుంచి బహిష్కృతులై ఆర్యావర్తాన్ని వదలి వింధ్యను దాటి దక్షిణాపథానికి వచ్చేలోపునే భరతుని నాట్యశాస్త్ర నిబంధనలు ఏర్పడి ఉండాలని తోస్తుంది.

ఓఢ్రల దేశం ఒడిస్సా. వారి దేవాలయాల శిల్పాలలో వారి నాట్యకళా నిదర్శనలు కనిపిస్తాయి. వారి దేశిసంగీతం కాని, నాట్యంకాని ఒడిస్సీ అనిపించు కుంటోంది. పశ్చిమ చాళుక్యులైన సోమేశ్వరాది చక్రవర్తులు దేవగిరి యాదవరాజులు, ద్వారసముద్రం ఏలిన హోయిసలులూ, మైసూరు ఒడయారులూ పాలించిన దేశము, కర్ణాటక దేశభాగాలుగా ప్రసిద్ధి చెందాయి. వారి సంగీతమూ, నాట్యమూ కర్నాటకము అనిపించుకోవడం న్యాయమే.

తమిళులలో కొందరు శిలప్పదికారం, తొల్కాప్పియంలలో వర్ణింపబడిన సంగీతకళా, నాట్యం, భరతుడి సంప్రదాయం కంటె భిన్నమైనవనీ, ద్రావిడ సంగీతమూ, ద్రావిడ నాట్యమూ కోవలన్ కణ్ణకీల కథ జరిగిన కాలం నాటివని చెబుతుంటారు. కాని చరిత్రకారులు 17–18 శతాబ్దిలో తంజావూర్ రాజ్యంలో ఆంధ్ర నాట్య మహారాష్ట్ర రాజుల సంస్థానంలో సిద్ధపరిచిన రాజనర్తకీ నృత్యాంశాలనే భరతనాట్యం అనే పేరుతో శాస్త్రీయ సంగీతంగా తమిళులు పేర్కొంటుండటమూ, దానికి ప్రభుత్వపరంగా ఆ విధమైన గుర్తింపు రావడమూ జరిగిపోయి తమిళులు మేలట్టూరులో తెలుగునాటకాలు

ఆడిన భాగవత నాట్యమేళ నట బృందాన్ని భరతనాట్య సంస్కృతిలో ఒక అంశమని గాని, నాట్యమేళ భాగవతుల నాట్యంలో తంజావూరు భరతనాట్యమే ఒక అంశమని గాని ప్రత్యేకించి గుర్తించలేదు.

కూచిపూడి నాట్య సంప్రదాయానికి ఆంధ్రుల నాట్యసంప్రదాయంగా గాని, భారతీయ శాస్త్రీయ నృత్యాలలో ఒకటి అని గాని గుర్తింపూ, పరిగణనా రావడానికి ముందు చాలా తర్జనభర్జనలూ, అధికార వర్గాలలో కొంత ఉపేక్షాభావమూ, ఇరవయ్యేళ్ళ క్రితం వరకూ ఉంటూ వచ్చాయి. ఈ లోపల కూచిపూడి వారిది కేవలం భాగవత నాట్యమేళం అంటే యక్షగానాలను కలాపాలను ప్రదర్శించే బృందం మాత్రమే. ఇదొక్కటే ఆంధ్రుల నాట్య సంప్రదాయ ఘనతకు అక్షరం అనడానికి వీలులేదు. అనాదిగా గుణగ విజయాదిత్య రాజరాజేంద్రాది చాళుక్య చక్రవర్తుల ప్రోత్సాహం పొందిన రాజనర్తకుల మాటేమిటి, ఆనాడేమి, కాకతీయుల నాడేమి దేవాలయ ప్రాంగణాలను పూజా నృత్యతరంగితాలుగా చేసిన దేవదాసీల మాటేమిటి అనే వాదం వచ్చి, ఆ స్త్రీలే ఆంధ్ర నాట్యానికి 'మూలపురుషుల'నే వాదాలు బయటపడ్డాయి. కాకతీయ గణపతికి గజసైన్యాధ్యక్షుడైన జాయప సేనాని నృత్తరత్నావళికీ, రామప్ప దేవాలయ శిల్పాలకూ గల పరస్పర సంబంధాలు గ్రహించాలి. తరువాత వచ్చిన రెడ్డిరాజులలో కుమారగిరి రెడ్డి కాటయవేముడూ నాట్యశాస్త్రజ్ఞులని, నాట్యశాస్త్రవ్యాఖ్యాతలనీ పెదకోమటి వేముడు సంగీత నాట్యశాస్త్ర గ్రంథాలను రచించిన విషయమూ, రాచకొండ నేలిన సర్వజ్ఞ సింగభూపాలుడూ ఇమ్మడి ప్రౌఢదేవరాయలు విజయనగరాస్థాన బయకారుడు చతురకల్లినాథుడూ, కాళహస్తి సంస్థానాధీశుడూ దామెర వెంకటాద్రి కుమారుడు వీరంతా 'భరతశాస్త్ర నిధి నీవేరా' అనిపించుకున్న వారని గుర్తిస్తే ఆంధ్రుల నాట్యసంప్రదాయాన్ని ఆంధ్రి అనవచ్చుననిపిస్తుంది. ■

10, ఫిబ్రవరి, 08, ఆదివారం 'ఆంధ్రప్రభ'

42. ఆంధ్రి-2

భరతముని నాట్యశాస్త్రంలో జాతి ప్రకరణంలో వివరించబడిన ఆంధ్రీ గాంధారాంశంతో (అంటే గా ప్రారంభ స్వరంగా) నేటి కల్యాణి స్వరాలతో కూడిన రాగమూ, రిషభాంశతో నేటి హనుమతోడి స్వరాలతో కూడిన రాగమూ, పంచమాంశతో (అంటే పా ప్రారంభ స్వరంగా) నేటి నటభైరవి స్వరాలతో కూడిన రాగమూ, భారతీయ సంగీతానికి ఆనాటి ఆంధ్ర జాతీయుల కానుకలుగా గ్రహించుకోవాలి. తరువాత 7వ శతాబ్దిలో మతంగుడు తన బృహద్దేశి అనే లక్షణ గ్రంథంలో ఈ నాలుగు విధాల ఆంధ్రీ జాతి రాగాలనే కాకుండా, పంచమరాగ (నేటి ఖరహరప్రియ స్వరాలు) జన్యమైన 'ఒక ఆంధ్రీ రాగాన్నీ' టక్కరాగ జన్యమైన మరొకదానినీ వివరించాడు. వీటిలో మొదటి రాగానికి మతంగుడిచ్చిన స్వరాలు "సరిసస్సమాపనిదసా, నిదసమారీమసాసాదనిపా" నేటి సుపోషిణీ రాగానికి సరిపోతాయి. పైగా ఇది ఆంధ్ర ఆటవిక గ్రామాలలో దేవీ పూజోత్సవాలలో (అమ్మవారి జాతర్లలో) నృత్యయుక్తంగా పాడతారని వివరించాడు.

12వ శతాబ్దిలో కల్యాణి నగరం రాజధానిగా ఏలిన పశ్చిమ చాళుక్య చక్రవర్తి సోమేశ్వరుని రాగాలలో కల్యాణి పేరుతోనే ఒక రాగం కనబడినా, ఒక శతాబ్ది గడిచాక శార్ఙ్గదేవుడు సంగీతరత్నాకరంలో మళ్ళీ ఆంధ్రీ జాతి నామంతోనే పాడవలసిన 'తరుణేందు కుసుమ ఖచితజటం' అనే శివస్తుతి గేయాన్ని స్వరసహితంగా ప్రదర్శించాడు. ఈ శార్ఙ్గదేవుడు దేవగిరి యాదవ రాజుల ఆస్థాన విద్వాంసుడు. ఆ నాడు దేవగిరికి రాజయిన సింఘణునికి సమకాలికుడూ, రాజకీయ స్పర్ధీ, వైరి రాజన్యుడూ అయిన కాకతీయ చక్రవర్తి గణపతిదేవుని ఆస్థాన విద్వాంసుడు జాయప్ప (గజసైన్యాధ్యక్షుడుకూడా) తన నృత్తరత్నావళిలో భరతమునిని ప్రామాణిక పరమగురువుగా చెపుతూనే, తన గ్రంథంలో అనేక విధాల మార్గనాట్యాన్నీ, దేశసంప్రదాయాలను వివరిస్తూ.

నాట్యవేద ప్రవృత్తత్వాత్ మార్గితత్వాన్మహర్షిభిః
సద్భిః సంచారితత్వాచ్చ మార్గమాహు రి దం బుధాః
నృత్యం శ్రీగదితాది స్యాత్ నాట్యం తన్నాటకాదికం
గీతవాద్యాది యుతం యలమాత్ర సమాశ్రితం...

భరతముని నాట్యవేదంలో చెప్పబడటం చేత మార్గపద్ధతి అనిపించు

కుంటుంది. శ్రీ గదితం మొదలయిన ఉపరూపకాలలో ప్రదర్శితమయేది నృత్యం. ఇది పదార్థాభినయాత్మకమైనది. అంటే పాటలు పాడి వాటి అర్థాన్ని అభినయించేది నృత్యం. ఆ నృత్యాన్ని ప్రదర్శించే ఉపరూపకాలను గురించి భరతునికి తరువాత శాస్త్రజ్ఞులయిన కోహలుడు మున్నగువారు చెప్పారు. ఆ ఉపరూపకాలు శ్రీ గదితం, రాసకం, హల్లీసకం, ప్రేక్షణం, పారిజాతకం మొదలైనవి. వీటిలో రాసకం అనేది రాసలీలా నృత్యం. దాన్ని గురించి ఒకటవ శతాబ్దిలోనే ఆంధ్ర జాతీయులకు అది ఎలా పరిచితమో చర్చించుకున్నాము. ఇక 'శ్రీ గదితం' అంటే 'దేవుని దేవేరి ఏమిచెప్పినది' అని అర్థం. ఒకటవ శతాబ్ది నాటికే తమిళం (దక్షిణభారతం)లో 'పావైకూత్తు' సరిగా 'భామాకలాపం' అనే తెలుగు మాటకు ద్రావిడీకరణం అనండి లేదా ఈ తెలుగుమాటే 'పావైకూత్తు'కు ఆంధ్రీకరణం అనండి, ఆ ప్రదర్శనలు ద్రావిడగేయంలోనూ, తెలుగు గేయంలోను చిరకాలం నుంచి దేశీయ రూపకాల ద్వారా ప్రజలలో ప్రచారంలో ఉండేవి అని గ్రహించాలి.

ఈ 'దేవునిదేవేరు'లైన పార్వతివేషమును గాని, లక్ష్మీవేషమును గాని ధరించి నట్టువరాండ్రు, ఆ దేవేరికి నాయకుడైన (శివదేవుడిగా, విష్ణు) దేవతామూర్తులతో ప్రణయాన్ని అభినయించడాన్ని శ్రీనాథుడు వర్ణించాడు.

(15వ శతాబ్దం) భీమఖండంలో (పార్వతీవేషం).

సాని యీశానియై మహోత్సవమునందు
కేలనవచంద్రకాంతపు గిన్నె పూని
వీధిభిక్షాటన మొనర్చువేళ జేయు
మరులునృత్యంబు జగములమరులు కొలుపు

క్రీడాభిరామంలో జక్కుల పురంధ్రి (లక్ష్మీవేషం)

రాగమున నుండి లంఘించురాగమునకు
ఉరుమ యూరుద్వయంబు పై నొత్తిగిల
కామవల్లీ మహాలక్ష్మి కైటభారి
వలపు పాడుచువచ్చె జక్కుల పురంధ్రి

ఈ విధంగా వీధుల్లో భిక్షాటనం చేసే శైవజంగమ నటీమణులు కాని, జక్కుల పురంధ్రులుకాని, ప్రదర్శించే దేశిగాన నృత్యాత్మకమైన ఇతివృత్తాలను అనుసరించి సత్యభామకథను భామాకలాపంగా స్వీకరించి, పురుష నర్తకులే అభినయించాలనే శాసనం కావించిన గురువర్యుడు సిద్ధేంద్రయోగి. ఈయన వల్ల కూచిపూడి చరితార్థమైంది.

ఒకటవ శతాబ్ది తరువాత ప్రాచుర్యం పొందిన ఉపరూపకాలలోని 'పారిజాతకం' అనేది. సత్యభామాకృష్ణులునాయకులై చేసిన పారిజాతపహరణగాథ ఇతివృత్తంగా ఉండే నృత్యనాటకం. సిద్ధేంద్రుడు స్వీకరించే వరకూ గాని, లేదా నారాయణ తీర్థులు తీసుకునే వరకూ గాని, సాహితీపరుల చేతబడని కేవల దేశిరూపకంగా ఇది ప్రచారంలో ఉంటూండే దనుకోవచ్చు.

శోభనం జరుగుతుందనుకున్న రాత్రి, నదిలో ఆపత్సన్యాసం తీసుకున్న సిద్ధేంద్రుడు అత్తవారి ఊరు విడిచి ఎటువెళ్ళాడు అనే విషయంలో కూచిపూడి పెద్దలు ఒక్కొక్కరు ఒక్కొక్క కథ చెప్పారు. కొందరు శంకరాచార్యుల శృంగేరి వెళ్ళాడన్నారు. కొందరు ఉడిపి వెళ్ళాడన్నారు. కొందరు అస్సాం వెళ్ళాడన్నారు. వెంపటి చినసత్యం గారు ఒకటి, రెండు చోట్ల ప్రచురించిన వ్యాసాలలో ఉడిపి మాధ్వాచార్యులయిన ఆనందతీర్థులను సిద్ధేంద్రుడు కలిసినట్లు వ్రాశారు. ఆనందతీర్థులు క్రీ.శ. 1197-1211 సంవత్సరాల నడుమ కళింగరాజ్యమేలిన రాజరాజ దేవుని సమకాలికుడు. సిద్ధేంద్రుడు అంత వెనుకటి కాలానికి చెందడం సంభవంగా లేదు. పైగా మధ్వ సంప్రదాయానుసారియైన వైష్ణవ చిహ్నాలు – ద్వైతమూ – మనకు సిద్ధేంద్రుని రచనలుగా వినవచ్చే నాటి సాహిత్యంలో కనబడవు. అందుచేత – ఆ సందర్భాన్ని ఊహించి – సంభవనీయంగా కూర్చిన రజనిగేయం.

శోభనము ఆ రాతిరి పరారి – చనెను సిద్ధేంద్రు డే వూరు
కంచికాశి పురములదారి – శంకరాచార్య శృంగేరి
విద్యారణ్యానతిమేర – పరధర్మ విజేతలబారి
ఆర్షధర్మరక్షణ కోరి – వారాహికౌమారి గౌరి
కామాఖ్య మందిరము చేరి – సన్యాసి గురువుల కచేరి
పండితులకు – పామరులకు – తీర్థమ్ముల, క్షేత్రమ్ముల
ఆ సేతు హిమాచల జనులకు – శివ విష్ణు గాథలే ఏరి
భక్తనందించగా కోరి – జీవాత్మకు, పరమాత్మతో
చేరిపోవుటకు మరులూరి – శ్రీ గదితమై, భాగవతమై
స్త్రీరహితమై నటమహితమై, నందికేశ భరతులదారి
కలాపకేళికలను తీరి, యక్షగాన పరిణతి మీరి
తిరిగి కూచిపూడిని చేరె – ఓ శారదా కరుణానిధీ ■

17, ఫిబ్రవరి, 08

43. ఆంధ్ర -3

భావతరంగంలో చిట్టచివరి ఉటంకించిన గేయంలో సూచితమైన కథ - దండాన్వయంగా ఇలా చెప్పుకోవాలి. శోభనపు రాత్రి అత్తవారి ఊరు విడిచి ఏ దూరదేశమో వెళ్ళిపోయాడని చెప్పుకున్న సిద్ధేంద్రుడు కంచి కాశిపురముల దారి దేశంలోని ఆయా పుణ్యక్షేత్రాలను దర్శిస్తూ, అప్పటి శృంగేరి శంకరాచార్యులయిన విద్యారణ్యస్వామిని దర్శించారు. 1330 (క్రీ.శ.)లో విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించిన ఆర్షధర్మరక్షకుడు విద్యారణ్యుడే. కూచిపూడి పెద్దలు కొందరు చెప్పినట్టు అస్సాములోని కామాఖ్య మందిరం కూడా సిద్ధేంద్రుడు దర్శించి ఉండాలి. కూచిపూడి వారి దేవీపీఠాలను దర్శించుకుంటూ కామాఖ్యను కూడా దర్శించాడు. ఆ పాటలో వారాహికౌమారి, గైరీత్యాది దేవీనామాలను బట్టి ఈ మాట చెబుతున్నాము. సిద్ధేంద్రునికి అటువంటి మనోధైర్యమూ, కూచిపూడి వారి భావనలో అద్వైతతత్వమూ ఇవన్నీ కూడా ఆయనకు శృంగేరి గురువుల సంబంధాన్నే కాని ఉడిపి గురువుల సంబంధాన్ని సమర్థించవు.

విద్యారణ్యులు కాని, ఆయనకు వెనువెంటనే పీఠాధిపతి అయిన జగద్గురు శంకరాచార్యులు గాని, శృంగేరిలోనో, కాశీలోనో, నవద్వీపంలోనో, కామాఖ్యపురంలోనో సిద్ధేంద్రుడి వంటి యువ సన్యాసులను, భక్తకవియోగులను సమావేశపరిచి ఉండాలి. ఆయా భక్త కవియోగులు వారి వారి ప్రాంతీయ భాషలలో వారి వారి దేశి సంగీతనృత్య రీతులలో భాగవత పురాణ కథల ఉపరూపకాల ద్వారా భక్తి ప్రచారం చేయాలని జగద్గురువుల సందేశం. 14, 15, 16, 17 శతాబ్దాలలో ఆయాప్రాంతాల భక్త కవియోగులు ఆచరణలో పెట్టారు.

సిద్ధేంద్రుడు భామాకలాపమూ, పారిజాతాపహరణమూ, గొల్లకలాపమూ కూచిపూడి బ్రాహ్మణ కుటుంబాలలో పురుష నర్తకుల ద్వారా భాగవత మేళ రూపకాల ద్వారా ప్రచారం జరగడానికి కారకుడయ్యాడు. వంగదేశంలో చండీదాసూ, మిథిలలో విద్యాపతీ, కామరూపంలో శంకరదేవ మాధవదేవులూ తమ తమ ప్రాంతాలలో వారి వారి ప్రాంతీయ దేశి గాన నృత్యరీతులకు గురువులయినారు. వంగోత్కళ దేశాలలో అంతకు మూడు శతాబ్దాల ముందే రాధాకృష్ణ ప్రణయాన్ని ప్రకృతి పురుషుల శృంగారంగా అనంత భగవత్తత్వంగా గానం చేసిన జయదేవుడు ఆదిగురువైనాడు. వంగదేశంలో

రాధాకృష్ణ ప్రణయం చండీదాసు కీర్తనల ద్వారా భామాకలాప ధోరణికి కొంత భిన్నంగా పరకీయాప్రణయంగా వర్ధితమైన ఘట్టం – మన సిద్ధేంద్రుని గొల్లకలాపాన్ని పోలుతుంది. గొల్లభామ పరకీయ నాయిక. రాధలాగే ఈ దేశిగాన నృత్యరూపకాలన్నీ ఆయా ప్రాంతాలలోని దేవాలయ ప్రాంగణాల్లో వర్ధిల్లినవే అనే విషయం గుర్తుంచుకోవాలి.

కామరూప (అస్సాం) దేశస్థులైన శంకరదేవ మాధవదేవులు అంకావళి వరకథా లేక ఆంకియా నాట్టొ అనే పేర యక్షగాన రూపకాలను రచించారు. వీరిది 17వ శతాబ్దం అయినా వారిపై సిద్ధేంద్రుని ప్రభావం, ముందు చెప్పిన జగద్గురు సందేశ ప్రభావమూ కనబడతాయి. వారి నాటకాలలో సూత్రధారుడున్నాడు. అతడి సంధి వచనాలు కూడా తార్‌పోరే (తదనంతరంబున) బిర్‌హేకారత్ హెయిలే (విరహకాతరురాలై) 'షాత్రొభామాకీబొలి'లో సత్యభామ ఏమనుచున్నదీ అని మన తెలుగు యక్షగాన ధోరణే కనబడుతుంది. మన వాగ్గేయకారులలో పదకవితకు ఇంచుమించు ఆద్యుడని ప్రసిద్ధి చెందిన అన్నమాచార్యులు 1408 నుండి 1502 వరకు జీవించినాడని మనకు స్పష్టంగా తెలుసు. సిద్ధేంద్రయోగి కూచిపూడి నర్తకుల ద్వారా దేశంలో ప్రచారం చేసిన భామాకలాపం, పారిజాతాపహరణ ప్రదర్శనలను అన్నమాచార్యుడు తన జీవితకాలంలో స్వయంగా చూచాడని నిరూపించతగ్గ విచిత్ర సాక్ష్యం ఆచార్యుల కీర్తలనలోనే మనకు స్పష్టంగా లభిస్తుంది. ముక్కుతిమ్మన పారిజాతాపహరణ పద్యప్రబంధాన్ని 1509-30ల మధ్య కృష్ణదేవరాయల పరిపాలన కాలంలో రచించాడు. అందులోని శ్రీకృష్ణుని తలను సత్యభామ ప్రణయ కోపంతో కాలితో 'తొలగం ద్రోచిన' వృత్తాంతం భాగవత, హరివంశాది సంస్కృత మూలగ్రంథాలలో కానరాదు. ఇది తెలుగువారి దేశి రూపక, యక్షగానకర్తల సొంత ఇతివృత్తం అయి ఉండడానికి ఆక్షేపణ ఉండదు. అన్నమాచార్యుల కీర్తనలలో ఒకదానిలో అలమేలుమంగ నాయకుడైన వేంకటేశ్వరస్వామిని ఇలా అంటుంది. (అహిరి రాగం)

'వాలుగ చూపులు వాడగ నాటకశాలలోన నిను జవరాలు
చాలగమురియుచు నరగున చివుకున కాలజిమ్మినను కలగితివపుడు
జట్టిగొనెర నిను జవరాలు, చిట్టంటు చేతల చెలగితివపుడు
ఆ జవరాలు (సత్యభామ), 'నిన్ను' కాలజిమ్మితే – కలగితివి కాదా! స్వామీ

అని అలమేలు మంగ అడిగినట్టు చెప్పిన అన్నమాచార్యులు ఆ పాటలో నాటకశాలలోన అని చెప్పడమూ, అంతఃపురంలో శయనాగారంలో అని చెప్పక పోవడమూ, అన్నమాచార్యులు దృశ్యాన్ని పారిజాతాపహరణ (దేశ) యక్షగాన ప్రదర్శనగా నాటకశాలలో దర్శించారన్నది తిరుగులేని లిఖిత సాక్ష్యంగా గ్రహించాలి.

ఈ ముప్పయిఏళ్ళలో అత్యంత జనాదరం పొందిన అన్నమయ్య పాట అలమేలు మంగ నృత్యాన్ని వర్ణించేది – భామాకలాపంలో ప్రవేశదృశ్యాన్ని మనస్సులో పెట్టుకుని కూర్చినదే. ఇద్దరు హంగుదారులో, చెలికత్తెలో పట్టిన తెరకు వెనుక శిరస్సు మాత్రం కనపడేటట్టు భామనే అని పాడుతూ చేసే భామా ప్రవేశంలో మొదటిఘట్టమైన జడపట్టును జ్ఞాపకం చేస్తుంది. అలరులు కురియగ ఆడెనదే అలకల కులుకుల అలమేలు మంగ అనే పల్లవి ఆ తర్వాతి అనుపల్లవిలో అరతెరమరగున అన్న ఘట్టానికి వచ్చేసరికి ఆ తెర నర్తించే నాయిక నడుము వరకూ దిగుతుంది. అది అయిపోయాక మట్టపు మలుపులు మట్టెల కెలపులు అని చరణం వచ్చేసరికి పాదాలను కూడా పూర్తిగా కనబరచడానికి వీలుగా తెర పూర్తిగా తొలగిస్తారన్నది స్పష్టం. అంతేకాక దేశి యక్షగానాల ద్వారా తెలుగువారు సృష్టించుకున్న సత్యభామ పాత్ర స్వరూప స్వభావాలు అన్నమాచార్యులకు పూర్తిగా తెలిసినట్టు నిరూపించే మరికొన్ని గేయాలను కూడా ఆయన కూర్చారు. ■

24, ఫిబ్రవరి, 08, ఆదివారం 'ఆంధ్రప్రభ'

44. ఆంధ్రి -4

సిద్ధేంద్రుడి రచనలుగా - కూచిపూడి వారి ప్రదర్శనలలో ఐదు శతాబ్దుల నుంచి ప్రసిద్ధి పొందిన భామాకలాప దృశ్యమూ, పారిజాతకథలోని నాయికానాయకుల ప్రణయకలహ దృశ్యమూ, అన్నమాచార్యుల వారు తమ కాలంలో నాట్యశాలల్లో దర్శించారనడానికి వారి కీర్తనల్లో లభించిన సాక్ష్యం స్థూలదృష్టికి విచిత్రమనిపించవచ్చు గాని, సూక్ష్మంగా ఆలోచిస్తే పూర్వపక్షం చేయడానికి వీలులేని 'డాక్యుమెంటరీ ఎవిడెన్సు' - లిఖిత సాక్ష్యం- రాగిరేకులలోని కీర్తనలలో శాశ్వతంగా చెక్కబడింది.

13వ శతాబ్దినాటి జాయపసేనాని నృత్తరత్నావళిలో సంస్కృతనామాలతో కనపడే కోల్హాటకము, గోండ్లీ, పేరణీ అనబడే దేశి నృత్య విశేషాలు. భరతుడి తర్వాతి కోహలుడూ, మతంగుడు మొదలైన లక్షణకర్తల నుండి పది, పదకొండు, పన్నెండు, పదమూడు శతాబ్దులలో - శ్రీగదితమూ, రాసకమూ, హల్లీసకమూ, పారిజాతమూ వంటి పూర్వ దేశి రూపకాల వలెనే - దేశీ సంప్రదాయం నుంచి ఉద్ధరించి, సంగీత నాట్య శాస్త్రజ్ఞులు వాటిని శాస్త్రంలో చేర్చి భరత నందికేశాదులు చెప్పినట్లుగా చతుర్విధాభినయాత్మకంగా ప్రదర్శించేటట్లు 'మార్గీకరించార'ని గ్రహించాలి. ఈ విషయంలో మన రాష్ట్రానికి వచ్చి పరిశోధన సాగించిన సునీల్‌కొఠారీ అనే కేంద్ర సాహిత్య నాటక అకాడమీకి చెందిన జిజ్ఞాసువు, ఉత్తరాది అధికార వర్గాలు వెనుక, కూచిపూడి రూపకాలు (జానపద) దేశి కళలే కాని శాస్త్రీయములు కావు అని అభిప్రాయపడిన అపోహలను తొలగించారు.

కూచిపూడి రూపకాలు గాని, మేలటూరు రూపకాలు గాని, యక్షగాన ప్రదర్శనలుగా రాణించినప్పుడు అవి భరతుడు మున్నగు వారు నాట్యమునకు ఇచ్చిన సంపూర్ణ లక్షణానికి లక్ష్యాలు అవుతాయి. సదిర్ నాట్యములూ, నర్తకీ ప్రదర్శనలూ, అవి ఆలయములలో చేసినా రాజసభలలో చేసి, భరతాదులు నందికేశ్వరాదుల లక్షణంలో ఒక భాగమునే ప్రదర్శించి అంశాలు అనిపించుకుంటాయి. ఏమయినా అదీ ఇదీ కూడా నాట్య సంప్రదాయమే. ఆంధ్రదేశం అని చారిత్రకంగా స్థిరపడి ఆంధ్రుల దేశంలో వర్ధిల్లిన నాట్య సంప్రదాయం ఏదైనా అది - భరతాదుల తొలుతనే ఆంధ్రుల సంస్కృతి నుంచి ప్రభవించిన కొన్ని రాగాలను 'ఆంధ్రి' అని పిలిచినట్లు - ఆంధ్రుల నాట్య

సంప్రదాయానికి చెందిన అన్ని విభాగాలనూ 'ఆంధ్రి' అని పిలవడంలో – ఆంధ్ర రాజాస్థానాలలోను, దేవాలయాలలోను, స్త్రీలే 'మూలపురుషులు'గా వర్ధిల్లిన నాట్యరీతులు గానీ, తరువాత కూచిపూడి వంటి కేంద్రాలలో స్త్రీ వేష ధారులైన పురుషులే ప్రవర్తకులుగా వ్యాపింపజేసిన నాటకరీతులు గానీ అన్నీ ఆంధ్ర నాట్య సంప్రదాయాలే కనుక, సంప్రదాయం అంతటినీ 'ఆంధ్రీ' అంటే – ఒడిస్సా దేశపు నాట్యాన్నీ, సంగీతాన్నీ ఒడిస్సీ అన్నట్లుగా సముచితంగా వుండదూ? వారికీ, వీరికీ కూడా గురువులు సంస్కృతభాషలో లక్షణ గ్రంథాలు వ్రాసి లక్ష్యాలతో శిష్యపరంపరలోని స్త్రీ పురుషులను సుశిక్షితులను చేసిన, వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి గారి వంటి ప్రసిద్ధి పొందిన భరతశాస్త్ర కళాపారీణులే కదా? కావ్య మీమాంసా కర్తయైన రాజశేఖరుడు ఉద్దామంగా వీస్తున్న దక్షిణపు గాలిని (మలయ మారుతాన్ని) వర్ణిస్తూ – "ఆంధ్రీ నారీమణుల కొప్పులను విడిపోయేటట్లు చేస్తూ తమలపాకుతీగలు మరింత మెలికలు తిరిగేటట్లు వీస్తూ – మన్మథుని సారథియైన దక్షిణ వాయువు వస్తున్నా"డంటాడు. కృష్ణదేవరాయుల సాహిత్య సభాసల్లాపాలలో ఒకనాడు రాయలవారు మంచి కవిత్వంలో గుణీభూత వ్యంగ్యం (ధ్వని) ఏ విధంగా భాసించాలో నిత్య జీవితంలో నుంచి ఉదాహరణ పూర్వకంగా చెప్పమని అడిగితే కాబోలు అల్లసాని పెద్దన ఈచాటు పద్యం చెప్పారట.

ఘనతర ఘూర్జరీ కుచయుగ
క్రియ గూఢము గాక, ద్రావిడీ
స్తనగతి తేటగాక, అరచాటగు
ఆంధ్రవధూటి సిబ్బెపుం
జనుగవ వోలె గూఢమును
చాటు దనంబును లేక యుండ చె
ప్పిన అదెపో కవిత్వమనిపించు,
నగించటుగాక యుండినన్!

ఘూర్జరీ, ద్రావిడీ (కేరళీ) ఆంధ్రీ, వధూటులు పూర్తిగా కప్పుకొని ఒకామే, అసలు కప్పే లేక ఒకామె అరచాటుగా సగం కప్పీ, కప్పకా ఒకామె పైటను ధరించే విధానాలను ఆయా కవితారీతులతో పోల్చి చెప్పిన పద్యంలో ఆంధ్రీ దర్శనం ఎంతో హృద్యంగా , సహజంగా చమత్కరించారు ఆంధ్ర కవితాపితామహుడు.

కాకతీయాంధ్ర సామ్రాజ్య చక్రవర్తియైన గణపతిదేవుని ఆస్థాన విద్వాంసుడూ, గజసైన్యాధ్యక్షుడూ అయిన జాయపసేనాని 13వ శతాబ్దిలో తన నృత్యరత్నాకరంలో నిండుకొలువులో నాట్యప్రదర్శనమును దర్శించే సభాపతిని అంటే సార్వభౌముని

మహాదేవీ, మంత్రి సామంతాది సమేతుడుగా రత్న సింహాసనారూఢునిగా వర్ణించి, ఆ తరువాత నర్తకినీ, ఆమెకు హంగుదారుల బృందాన్నీ వర్ణించాడు. నర్తకీ అలంకరణ, ఆహార్యకాలను వివరించేటప్పుడు ఆయన ఆమెను 'కర్ణాటకీ'గా పేర్కొన్నాడు. శ్రీనాథుడు కూడా క్రీడాభిరామం ప్రదర్శించిన నటులు 'ద్వారసముద్రం' (కర్ణాటకం) నుంచి వినుకొండకి వచ్చి ప్రదర్శించారన్నాడు. ఆ 15వ శతాబ్దిలోనే ఆ శ్రీనాథ కవి సార్వభౌముడే సామాన్య జనుల కోసం దేశిచ్ఛందస్సయిన ద్విపదలో రచించిన 'పల్నాటి వీరచరిత్ర'లో నలగామరాజు సభామంటపాన "ఆంధ్రీ" నర్తకీ ప్రదర్శనమును బృందసమేతంగా ఎలా వర్ణించాడో తెలుసుకుందాము. (ఆంధ్రీ అని ఆయన అనలేదు. కర్ణాటకీ అని కూడా అనలేదు.)

"వింతగా గాయనుల్ వీణల బూని, తంత్రులు బిగియించి తగునట్లు 'సుతి' చేసుకున్నారు. సరిగ మేళములైన స్వర సప్తకంబు ఆరోహణావరోహణ భేదముల బహురాగ సంప్రాప్తి పట్టగా చేర్చి సంచారి సంస్థాయి సరస భావముల మృదుతర శబ్దార్థ మిళితమైనట్టి ఘనతరాలంకార గతులను మూర్ఛనల్" మొదలైన ముఖ్య ధర్మాలను జత చేసి ఎండిన చెట్లు చిగిరించినట్లు పాడారు.

"నాట్యమేళము వారు నవ విలాసములతో వచ్చిన నమ్రతతో మొక్కి పక్కగా నిలిచారు. నలగామరాజు నవ్వుతూ నాట్యంబు సేయ సెలవిచ్చాడు. వర మృదంగము వాయించే మేటి కూడా భాగమున కుదురుగా నిలిచె, తాళ మానజ్ఞుడు దాపటి దిశను నిలిచాడు. ముఖ వీణ వాయించు ముఖ్యుడొకడు, రాగమాలాపించు రమణులిద్దరూ వెనుక నిలుచున్నారు. 'కంజలోచన' అనే ఘనమైన పాత్ర (ధారిణి) భరత శాస్త్రోదిత బహురాగములను గరిమతో నేర్పిన 'కంతుబాణంబు' వేత్రపాణికి (సూత్రధారునకు) వినయము చూపి అతడొసంగిన గజ్జ అతి భక్తితో పాదముల గట్టుకొని పంచవర్ణముల కాశె (కోక) గట్టిగ కట్టి మద్దెల తాళాల మధ్య నిలుచుండి ఓరచూపున రాజును ఒయ్యన చూసి సమపాదయుత స్థానకంలో దేవుని తలకు మొక్కి పుష్పాంజలి ఒసంగి నాట్యమునకు పూనుకున్నది. నాదంబు సభ యెల్లకమ్మ, ఘన కళాశైలిలో తొమ్మిది విధముల భూచారి నాట్యములను, పదునారు విధముల ఆకాశచారులను ఆడి, తొమ్మిది విధముల అంగహారములను గతిచారి భేదాలను కనబడేటట్లు నర్తించి భ్రమణాలు, పాణిభేదాలు చూపుతూ పేరణి,దేశి, ప్రేంఖణము, శుద్ధ దండిక, కుండలి మొదలైన సప్త తాండవాలను సభ వారచ్చెరువు పొందేటట్లు ప్రదర్శించింది?" ■

2, మార్చి, 08, ఆదివారం 'ఆంధ్రప్రభ'

45. నేటి పన్నెండు స్వరస్థానాలలో నాటి ఇరవై రెండుశ్రుతులు...

భరతముని నాట్యశాస్త్రంలో వివరించిన రీతిని ఒక స్థాయిలోని సప్తస్వరాలూ 22 శ్రుతులలో అమరి ఉన్న ఏర్పాటును ఆనాటి సంగీత వాద్యాలపైన సాధారణ విద్యార్థులు తమంత తాము తెలుసుకోవడం కష్టసాధ్యమని ఇంతకుముందు రాశాను. ఒక పాఠకుడు ఆ కష్టసాధ్యమైన విషయం తనకు తెలిసేట్టు వ్రాయమని నాకు ఉత్తరం వ్రాశారు. ఈ భావతరంగంలో ఆ పనికి పూనుకున్నాను.

చతుశ్చతుశ్చతుశ్చైవ షడ్జ మధ్యమ పంచమాః
ద్వేద్వే నిషాద గాంధారౌ త్రిస్త్రీ ఋషభ ధైవతౌ

అని ఒకసారీ,

తిస్రోద్వే, చతస్రశ్చ, చతస్రస్తి స్ర ఏవ చ
ద్వేచతస్రశ్చ ష్వడ్జగ్రామే శ్రుతినిదర్శనమ్

అని ఒకసారీ చెప్పాడు 22 శ్రుతులలో సప్తస్వరాల అమరికను గురించి.

22 శ్రుతులలోను నాల్గవ శ్రుతి షడ్జం గాను, ఏడవ శ్రుతి రిషభం గాను, తొమ్మిదో శ్రుతి గాంధారం గాను, 13వ శ్రుతి మధ్యమం గాను, 17వ శ్రుతి పంచమం గాను, 20వ శ్రుతి ధైవతం గాను, 22వ శ్రుతి నిషాదం గాను గుర్తించాలని వ్యాఖ్యాతలూ, తత్వశాస్త్రకర్తలూ మతంగుడూ శార్ఙ్గదేవుడూ మున్నగువారు చెప్పారు. ఇలా గుర్తించిన ఏడు స్వరాలూ భరతుని కాలం నుంచి 12వ శతాబ్దం దాకా శుద్ధస్వరాలని, ఇవి కాక మిగిలిన శ్రుతులను వికృతస్వరాలని అన్నారు. వీటిలో షడ్జం చతుశ్రుతికమూ అంటే - దానికి ముందరి స్వరమైన శుద్ధనిషాదం నుంచి చతుశ్రుత్యంతరంలో ఉంటుందనీ, రిషభం త్రిశుతికం అంటే దానికి ముందరి స్వరమైన షడ్జం నుంచి మూడు శ్రుతుల అంతరంలోఉంటుందనీ అర్థం.

పై విధంగా ఏర్పరచిన భరతుని 22 శ్రుతుల అమరికలో త్రిశ్రుతిక రిషభమే వస్తుంది కాని, చతుశ్రుతి రిషభం రాదు. పై స్వరాలలో నిషాదాన్ని ఆధారపడ్డం

అనుకుంటూ – నిషాదం నుంచి 'నిసరిగమపదని' అనే మూర్ఛనలో (అసలు) షడ్జం చతుశ్రుతికం కనుక అది చతుశ్రుతి రిషభంగా పలుకుతుంది. షడ్జాది మూర్ఛన ఖరహరప్రియకు దగ్గర స్వరాలను పలికితే,నిషాదాది మూర్ఛన శంకరాభరణ స్వరాలకు దగ్గరగా పలుకుతుంది. రిషభాది మూర్ఛన హనుమతోడివలె గాంధార మూర్ఛన కల్యాణిస్వరాలలాగే మధ్యమాది మూర్ఛన హరికాంభోజిలాగా పంచమాది మూర్ఛన నటభైరవిలాగా, ధైవతాది మూర్ఛన పంచమం లేకుండా రెండు మధ్యమాల (శుద్ధాప్రతీ) తోడిలాగా పలుకుతాయి. ఈనాడు కర్ణాటక సంగీత గాయకులు శ్రుతిభేద (గ్రహభేద) పద్ధతి ఆలాపనల్లో పైన చెప్పిన రాగాలను స్ఫురింపజేస్తారు.

అయితే హార్మోనియం, పియానో వాద్యాలలో అమరి ఉన్న 12 స్వరస్థానాల మెట్లకూ, వీణలపై అమరి వున్న 12 స్వరస్థానాల మెట్లకూ, భరతుని నాటి సప్తస్వరాల మెట్లకూ షడ్జ మధ్యమ పంచమాలు తప్ప మిగిలిన స్వరాల (ఫ్రీక్వెన్సీలలో) తరచు దనాలలో వ్యత్యాసాలున్నాయి. భరతుని నాటి శ్రుతుల ఏర్పాటుకు ప్రకృతి సహజ శ్రుత్యంతర సారణ (జస్ట్ ఇన్టొనేషన్) అంటారు. పాశ్చాత్యవాద్యాలయిన హార్మోనీ పియానోల సారణ (ట్యూనింగ్)ను సమాన శ్రుత్యంతర సారణ (ఈక్వల్ టెంపర్‌మెంట్) అంటారు. ప్రకృతిసహజ శ్రుత్యంతర సారణను అసమాన శ్రుత్యంతర సారణ అని కూడా అంటారు. షడ్జ మధ్యమభావంతోను, షడ్జ పంచమ భావంతోను అంతర గాంధార భావంతోను అవి శుద్ధంగా పలికేటట్లు ఏడు స్వరాలనూ పరస్పరసంబంధ సహజ సుందరమైన లెక్కలతో ఏర్పాటయింది భరతుని స్వరసప్తకం. వీణలలో ఏర్పాటు సహజశ్రు త్యంతర సారణను అనుసరించిందే కాని, భరతుని నాటి ఏర్పాటు కంటే భిన్నమైన పద్ధతిలో కాలక్రమాన రూపొందింది. దీనికి కారణం 14వ శతాబ్దం నుంచి ప్రాయోగిక సంగీతంలో వచ్చిన మార్పుల వల్ల వీణలలో శ్రుతుల ఏర్పాట్లు మారిపోయాయి. అసలు భరతుడు శ్రుత్యంతరాలను చతుశ్రుతికమూ, త్రిశ్రుతికమూ, ద్విశ్రుతికమూ అని చెప్పడంలో సప్తస్వరతంత్రుల పొడవుల్లో పరస్పర నిష్పత్తిని నిగూఢంగా ఉపదేశించాడన్న విషయాన్ని గుర్తించినవారు లేరని గాని, ఉన్నా, దాన్ని వృత్తిరహస్యంగా తమలో దాచుకుని ఉండాలని గానీ చెప్పవచ్చు.

నిషాదానికి నాలుగు శ్రుతుల అంతరంలో ఉందన్నా, షడ్జం చతుశ్రుతికమన్నా అర్థం ఏమిటంటే, నిషాదతంత్రి 9 యూనిట్లు అయితే షడ్జతంత్రి 8 యూనిట్లు. అలాగే షడ్జానికి మూడు శ్రుతుల అంతరంలో భరతుని శుద్ధ రిషభం ఉందంటే షడ్జతంత్రికి రిషభ తంత్రి 9/10 నిష్పత్తిలో ఉందని అర్థం. రిషభానికి గాంధారానికి నిష్పత్తి 15/16. ఈ తంత్రి పొడవు నిష్పత్తి భిన్నాన్ని తలకిందులు చేస్తే 9/8, 10/9, 16/15 అనే

భిన్నాలు క్రమంగా చతుశ్రుతిక స్వరానికి, త్రిశ్రుతికస్వరానికి, ద్విశ్రుతికస్వరానికి దాని పూర్వస్వరపు (పిచ్) ఉచ్చతా నిష్పత్తిని తెలుపుతాయి. దశాంకపద్ధతిలాగా, లోగారిదమ్సు లాగా, అరబిక్ అంకెలలాగా నిష్పత్తి భిన్నాల లెక్కలు మనసంస్కృతి వారసత్వం అని గుర్తింపక, కేవలం పాశ్చాత్య విజ్ఞానభిక్ష అనుకోవడం మూర్ఖతా, అజ్ఞానమూను. భరతుని నాడు త్రిశ్రుతికాలుగా ఉండే శుద్ధరిషభ, శుద్ధధైవతాలు 14వ శతాబ్దంలో విద్యారణ్యుని నాటి నుంచి ఒక మెట్టు దిగిపోయి, ద్విశ్రుతికాలయిపోయాయి. ఆ ద్విశ్రుతికతలో కూడా 16/15 కాని 135/128 కాని ఉచ్చతానిష్పత్తిని స్వీకరించాయి. భరతుని శుద్ధ గాంధారాన్ని ఈ నాటి వైణికులు సాధారణగాంధారం లేదా షట్శ్రుతి రిషభం అంటారు. దీని ఉచ్చతా నిష్పత్తి 32/20, భరతుని సాధారణ గాంధారం 6/5 నిష్పత్తి గల స్వరం 5/4 నిష్పత్తి గల అంతరగాంధారం. వీటిలో సహజశ్రుత్యంతరమేళనం కోసం అట్టే ఉంచారు కాని విద్యారణ్యుని నాటి నుండి చతుశ్రుతిరిషభానికి చతుశ్రుత్యంతరంలో 9/8×9/8=81/64. తీవ్రాంతర గాంధారం కొన్ని మేళకర్తలలోకి చొచ్చుకుపోయింది. దీనిని పైథాగరస్ మేజర్ థర్డ్ అంటారు.

వీణాశ్రుతిసారణలో ముక్తతంతి పైని షడ్జం సిద్ధం చేసుకున్నాక సారికలలో మొదటి సారిక పైని భరతుని త్రిశ్రుతి రిషభం కాకుండా విద్యారణ్యుని నాడు అవతరించిన ద్విశ్రుతి రిషభం (16/15) ఏర్పాటవుతుంది. ఆ స్వరానికి 135/128 నిష్పత్తిలో చతుశ్రుతి రిషభం షడ్జానికి చతుశ్రుత్యంతరంలో భరతుని సాధారణ గాంధారం (9/8×16/15)= 6/5 అని వినపడుతుంది. దీనికి ద్విశ్రుత్యంతరంలో అంతరగాంధారం (5/4). దానికి ద్విశ్రుత్యతరంలోశుద్ధ మధ్యమమూ వినబడతాయి. ఇదేవిధంగా స్థాయి అంతా 16/15 గాని 135/128 గాని ఈ రెండింటిలో ఒక ద్విశ్రుత్యంతరం వినియోగించి మిగిలిన స్వరాలను సాధిస్తారు. ■

16, మార్చి, 08, ఆదివారం 'ఆంధ్రప్రభ'

46. 'విశ్వనాథ'గురించి నా జ్ఞాపకాలు

1937-40ల మధ్య నేను వాల్తేరులో ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో పింగళి లక్ష్మీకాంతంగారి శిష్యుడుగా ఎమ్.ఏ చదువుతున్నాను. రెండో సంవత్సరం తెలుగు విద్యార్థి సారస్వతసంఘానికి నేను అధ్యక్షుణ్ని. మా సహపాఠి కార్యమపూడి రాజమన్నారు కార్యదర్శి. మా మరో సహపాఠి కాకర్ల వెంకటరామ నరసింహం గారు. కొందరు ఆచార్యులలోను, సాహిత్య విద్యార్థులలోను విశ్వనాథ వారికీ, పింగళి వారికీ ఒకరంటే ఒకరికి పడదని ఒక అపోహ ఉండేది. ఆ అపోహను తొలగించాలని పట్టుదలతో మేం, మా సాహిత్యసంఘం వార్షిక సభకి విశ్వనాథవారిని ఆహ్వానించాము. శాఖాధ్యక్షులయిన పింగళివారూ, ప్రిన్సిపాల్ విస్సా అప్పారావుగారు, వైస్ ఛాన్సలర్ కట్టమంచి రామలింగారెడ్డి గారూ మా ప్రతిపాదనకు నిరభ్యంతరంగా సమ్మతించారు. హౌరా మెయిలులో దిగిన 'మేస్టార్ని' జటకాలో వాల్తేరు తీసుకొచ్చి, ఆచార్యుల స్టాఫ్ రూంకు తీసుకురాగానే పింగళి మేస్టారూ, విశ్వనాథ మాస్టారూ 'ఏం కాంతం', 'ఏరా సత్యం' 'వదినెలా ఉందీ, పిల్లలంతా కుశలమేనా' వంటి ఆప్యాయ సంభాషణలతో, ఆనందబాష్పాలతో పలకరించుకోవడం చూసి మురిసిపోయాం నేనూ, మా సహపాఠులమూ. యూనివర్సిటీ సభామందిరంలోనే కాకుండా, హాస్టల్ సభాగారంలో కూడా ఆనాడు విశ్వనాథ కవితాగానకౌముదులు వెల్లివిరిశాయి.

1938 మే నెలలో 8వ తేదీన మద్రాసులో అప్పటి మద్రాసు రాష్ట్రపు ప్రధాని రాజాజీ మంత్రివర్గంలోని యువమంత్రి బెజవాడ గోపాలరెడ్డి గారి పెళ్ళి జరుగుతోంది. చెట్‌పట్‌లోని పచ్చయప్పాస్ కళాశాల తరగతి గదులూ, హాస్టల్ గదులూ, పెళ్ళికి వచ్చిన అతిథి బృందానికి విడిది ఇచ్చారు. నవ్యసాహిత్య పరిషత్తు కవుల మహాసభా సమావేశాన్ని ఆ పెళ్ళికి ఒక హంగుగా ఏర్పాటు చేస్తూ మహాకవులను, యువకవులను ఆహ్వానించారు. అధ్యక్షులైన తల్లావఝ్ఝులా, కృష్ణశాస్త్రి గారి బృందంతో పాటు నేనూ ఒక నాటకంలో పాత్రధారిగాను, యువకవిగా ఆ సభలలో పాల్గొన్నాను.

పరిషత్తులో కావ్యపఠనం చేసిన కవీశ్వరుల రచనలలో 'గోపాలోదాహరణము' విశ్వనాథ మేస్టారి విశిష్టరచన. 'ఏడాది తిరగకుండా', 'పాలబుగ్గల చిన్ని గోపాలరెడ్డి' అవతరించాలి అని ఆయన ఉదాహరణంలో ఒక చరణం. విశ్వనాథ మేస్టారూ, పాటిబండ

మాధవశర్మగారూ కూడా పాల్గొన్న ఆ నాటి (1939-40) రేడియోనాటికలలో విశ్వనాథవారే రచించిన 'మృచ్ఛకటికం' ఒకటి. ఆ తర్వాత నేను మద్రాసు రేడియోలో చేరి, కాలు నిలదొక్కుకుంటున్న కాలంలో - మేస్టారి 'గోదావరి' సంగీత రూపకం - దానిలోని ఆరంభగీతం -సుమారుగా ఇలా సాగుతుంది. అచ్చంగా ఇవే మాటలు కావు - ఇలాంటివే! "త్రియంబకగిరిస్ఫార చాంద్రమకుటాంచిత జటాబంధురోదార కల్లోల వాఃపూర గోదావరి". మొదటి పంక్తిలో నా కల్పన కొంత చేరి ఉండొచ్చు గాని, రెండోది ఆయనదే - ఈ పాటని నేను ముత్తు స్వామి దీక్షితులు 'మాయే' అనే కీర్తనకి కూర్చిన తరంగిణి రాగంలో ట్యూన్ చేశాను. తరంగిణి రాగం-లో శాస్త్రీయప్రౌఢతకి తోడు, హిందుస్థానీ టప్పాశైలిలోని ద్రుతగమకాలతో పాటు జంఝూటిరాగంలోని జానపదరామణీయకతతో నదీప్రవాహదృశ్యాన్ని నాదవిన్యాసమాధుర్యాన్ని శ్రవణేంద్రియం ద్వారా మనఃఫలకానికందిస్తుంది. ఇది ఏభయిలలో కృష్ణాపత్రికలో అచ్చయినట్లు జ్ఞాపకం! తరంగిణి రాగంలో చేసిన మేస్టారి పాట మళ్ళీ దొరకకపోవటం చేత, 1972లో విజయవాడ నుంచి ప్రసారం చేసిన 'కొండ నుంచి కడలిదాక' (గోదావరిని గురించినదే) రూపకానికి - ఆరంభవాద్యగోష్ఠి సంగీతాన్ని తరంగిణి రాగంలోనే ప్రయోగించి కూర్చి, మేస్టారి కిన్నెరసాని సంగమఘట్టాన్ని వింజమూరి లక్ష్మి బృందం చేత పాడించాను.

యాభయిలలో మద్రాసు నుండి ప్రసారమై నేను నిర్వహించిన రెండు రేడియో నాటికలు విశ్వనాథవారి రచనలు - ఉపనిషత్కథ నాచికేతుని కథ ఒకటీ (అందులో నాచికేత పాత్ర నాదే) - రామాయణ కథాత్మక నాటికలు సుమిత్ర ఒకటీ, మారీచుడు ఒకటీ. 'మారీచుడు' ఇతివృత్తం ప్రసిద్ధమైన మాయలేడి కథ, సీతకోరికపై రాముడు పట్టీ తిట్టో, కొట్టో తీసుకొద్దామని తరుముకు వెళ్ళిన బంగారు లేడిని గురించి దూరంగా అడవిలోకి ఆకర్షించుకుపోతూ అది ఎన్ని రకాలుగా పరుగులెత్తిందో అన్ని సంస్కృత ఛందస్సులలో వివిధగతుల గేయాలు వ్రాశారు విశ్వనాథ - అన్ని గతులకూ సరిపోయే రాగాలనూ, తాళాలనూ వాడాను.

'బద్దన్న సేనాని' అనే నవలను రాస్తూ రాస్తూ, దాన్ని సీరియల్‌గా విజయవాడ కేంద్రం నుంచి తానే చదివి ప్రసారం చేశారు విశ్వనాథ. 'ఋషియైన నన్నయ రెండవ వాల్మీకి' - ఇత్యాది శీర్షికలతో కవిత్రయ సాహిత్యశిల్ప విచారమును ఆ నాడు బిబిసి నుండి ప్రసారం అవుతూ ఉండే 'చాప్టర్ అండ్ వెర్స్' అనే థోర్డ్ ఛానెల్ ప్రోగ్రాం పద్ధతిలో ప్రసారం చేశారు మేస్టారే. 'ఏకవీర' ఒక గంట నాటకంగానూ, వేయిపడగలు సీరియల్‌గాను ఒకటి మద్రాసు నుంచీ, రెండోది విజయవాడ నుంచీ ప్రసారం అయ్యాయి.

1971 నుంచి 76 దాకా నేను విజయవాడ ఆకాశవాణి డైరెక్టర్‌గా ఉండిన

రోజులలో ఆయన ఆశీస్సులు పొందకుండా చేసిన కార్యక్రమాలు చాలా అరుదు. 1971-72 ప్రాంతంలో ఆయన జ్ఞానపీఠ పురస్కారగ్రహీత అయినప్పుడు 'విశ్వనాథ కవితా వాహిని'- అనే ఒక గంటన్నర సాహిత్య కార్యక్రమం ప్రసారం చేశాను.

'కొండ నుంచి కడలిదాక' అని గోదావరి నదిపై నేను కూర్చి ప్రసారం చేసిన సంగీత రూపకానికి, జపాన్ రేడియో బహుమతి వచ్చినప్పుడు -ఢిల్లీనుంచి వచ్చిన ఎస్.ఎన్. మూర్తి గారు ఆ పురస్కారం నాకు అందించేటప్పుడు ఏర్పాటు చేసిన సభలో అధ్యక్షత వహించిన విశ్వనాథవారి ఆనందగాద్గదిక్యాలూ, ఆప్యాయపూరితమైన విసుళ్లూ, వాటితో కూడిన ఉపన్యాసం టేపు పైని నేను భద్రంగా దాచుకున్నాను - అందులో అడివి బాపిరాజు గారి పాటలు రెండూ, తన (విశ్వనాథ) పాటా (కిన్నెరసాని) శ్రీనాథుడి పద్యాలూ, రామదాసు కీర్తనా, పడవ పాటా - ఇన్ని చేర్చానని ఎంత సంతోషించారో! "వాడి గురువెటువంటి మంచికవి, వాడి తండ్రెటువంటి మంచి కవి? బాపిబావ పాటలు నా పాటా,శ్రీనాథుడి పద్యాలు కలిపి కొట్టాడు - బహుమతి' అన్నారు. ■

23, మార్చి, 08, ఆదివారం 'ఆంధ్రప్రభ'

47. శ్రుతిలయలు

మన ఇళ్ళలో సంగీతం నేర్చుకునే పిల్లలు వాయించుకునే హార్మోనియంపెట్టెని చూసే వుంటారు. ఆ పెట్టెలోని మెట్లు (స్వరాల)పైని వ్రాసిన 12 అంకెలూ, ఒక స్థాయిలోని 12 స్వర స్థానాలు గమనించే వుంటారు. కింద రాసిన అంకెలు 1 నుంచి 7 వరకు, మన గాయకులు మామూలు సంభాషణలో చెప్పుకునే ఒకటి శ్రుతి, 2 శ్రుతీ అని తెల్లమెట్ల సృతులు ఆధారశ్రుతిగా పాడేప్పుడూ, నల్లమెట్లు శ్రుతులుగా చెప్పాలనుకుంటే 1 1/2 శ్రుతీ, 2 1/2 శ్రుతీ, 7 1/2 శ్రుతీ ఉండవనీ, 4 1/2 శ్రుతీ, 5 1/2 శ్రుతీ, 6 1/2 శ్రుతీ ఉంటాయనీ, ఈ ఒకటీ, ఒకటిన్నరా, రెండూ రెండున్నరా మొదలైన శ్రుతులను **C,C** షార్పు, **D,D** షార్పు, **E,F,G** షార్పు, **G, G** షార్పు, **A,A** షార్పు, **B** అని పాశ్చాత్య సంగీతంలో వాడే పేర్లను కూడా కొందరు వాడుతారు. పైనవ్రాసిన అంకెలలో 12 స్వరస్థానాలూ, చూపించిన తరువాత వచ్చే తెల్లమెట్టు పైని 8 అంకె వేసి కొట్టివేసిన స్వరం 1వ మెట్టు కింది షడ్జం (సి) అయితే, దానికి తారాస్థాయి షడ్జం అన్నమాట. ఇప్పుడు ఒకటో తెల్లమెట్టుకీ, 8వ తెల్లమెట్టుకీ నడుమ ఈనాడు 12 స్వరస్థానాలుండగా, భరతముని నాట్యశాస్త్రం కాలంలో 22 శ్రుతులుండే వనీ, ఆ 22లోను ఏడు శుద్ధ స్వరాలతో స్వరసప్తకంతో షడ్జగ్రామాన్ని, ఎలా పలికించగలిగే వారో, ఆనాటి 22 శ్రుతి స్థానాలలో ఏ స్థానాలు క్రమంగా మాయమయిపోయి ఈనాడు హార్మోనియం పెట్టె పైని 12 స్వరస్థానాలతో ఒక స్థాయిగా ఎలా రూపొందిందో, మీకు ఎక్కువశ్రమ లేకుండా బోధపరచడానికి ప్రయత్నిస్తున్నాను. హార్మోనియంలోని ఈ 12 స్వరస్థానాలకు ఉపాధ్యాయులు చెప్పే పేర్లు ఇస్తున్నాను.

1. షడ్జం(స), 1 1/2 శుద్ధరిషభం (శు.రి)
2. చతుశ్రుతిరిషభం (ఒకే మెట్టుకి రెండుపేర్లున్నాయి (చ.రి) శుద్ధ గాంధారం ఆ రెండు మెట్లూ ఒకే రాగంలో రావు (శు.గ) 21/2 సాధారణగాంధారం (డిటో) (సా.గ) షట్శ్రుతిరిషభం (ష.రి)
3. అంతరగాంధారం (అం.గ)
4. శుద్ధ మధ్యమం (శు.మ) 41/2 ప్రతి మధ్యమం (ప్ర.మ)
5. పంచమం 51/2 శుద్ధ దైవతం
6. చతుశ్రుతిదైవతం శుద్ధ నిషాదం

   61/2 షట్శ్రుతి దైవతం కైశికి నిషాదం

7. కాకలినిషాదం

8. తారస్థాయి షడ్జం!

మనిళ్లలో కర్ణాటక సంగీతం నేర్చుకునే బాలబాలికల ప్రారంభ అభ్యాసానికి నేర్చుకునే సరళీస్వరాలూ, జంట స్వరాలూ, అలంకారాలూ - ఇవన్నీ మాయామాళవ గౌళరాగస్వరాలు. అవి ఇవి షడ్జమూ, శుద్ధరిషభమూ, అంతరగాంధారమూ, శుద్ధ మధ్యమమూ, పంచమమూ, శుద్ధదైవతమూ, కాకలి నిషాదమూ, పంచమమూ, శుద్ధ దైవతమూ, కాకలి నిషాదమూ, తారాస్థాయి షడ్జమూ.

సుమారు 14వ శతాబ్దం నుంచి షడ్జపంచమాలకు శుద్ధస్వరత్వం, శుద్ధం కాని వికృతస్వరత్వమూ అనే భేదాలు లేవు. రి, గ, మ, ధ, నీలకు మాత్రమే, శుద్ధ స్వరమూ, వికృతస్వరమూ అనే భేదాలు అమలులోకి వచ్చాయి. ఈ సంప్రదాయం ప్రకారం, షడ్జమూ, శుద్ధరిషభమూ, శుద్ధదైవతమూ, శుద్ధ నిషాదమూ కలిగిన రాగానికి 72 మేళకర్తల పద్ధతిని నెలకొల్పిన వెంకటమఖి - కనకాంబరి అనీ, అదే పద్ధతి ప్రకారం గోవిందామాత్యుడనే విద్వాంసుడు కనకాంగి అనీ పేరు పెట్టారు. ఈ మేళాన్ని మొదటి శుద్ధ స్వరమేళంగా పేర్కొని దీనికి 'ముఖారి' అని పేరుపెట్టిన విద్వాంసుడు విజయనగర సామ్రాజ్యస్థాపకుడూ, రాజగురువూ, మంత్రీ, శృంగేరీ శంకరపీఠాధిపతీ అయిన విద్యారణ్యస్వామి. అయితే తోలుబొమ్మలూ, యక్షగానాలూ మొదలయిన దేశిరూపకప్రదర్శనలలోను, త్యాగరాజాది వాగ్గేయకారుల కీర్తనలలోను (ఎంతని నే వర్ణింతును శబరీ భాగ్యము) వినిపించే సాంప్రదాయికరాగమైన ముఖారీ ప్రాచీన స్వరూపాన్ని ప్రకటిస్తూ, కనకాంగి మేళకర్తలోని శుద్ధస్వరాల సంపుటి ముఖారి అనే సిద్ధాంతాన్ని ఆక్షేపిస్తూ నిలబడుతుంది. సంగీతసారం అనే శాస్త్ర గ్రంథం రచించడానికి ముందు విద్యారణ్యస్వామి, తన నాటి దేశీయ (హైందవ, పారశీక) సంగీత విద్వాంసులతో సమావేశం ఏర్పాటు చేసి, వారి వారి వాద్యనిర్మాణాన్ని, వాదన, గానపద్ధతులనూ పరిశీలించి, భరతముని నాటి నుండి శార్ఙ్గదేవునిదాకా కొనసాగిన ప్రాచీన సంప్రదాయ చిహ్నాలు ఆచరణకి దూరమైపోవడం గుర్తించి, ఆ నాటికి ఆచరణలో ఉన్న పద్ధతులను అనుసరించి శ్రుతి నిర్ణయమూ, శుద్ధవికృతి స్వరనిర్ణయమూ చేశాడు విద్యారణ్యుడు. ఆయనకు తరువాత వచ్చిన సంగీతలక్షణకర్తలు రామామాత్యుడు, సోమనాథుడు, అహోబలుడు, గోవిందదీక్షితుడు, వేంకటమఖి మున్నగువారు ఆయన చూపిన మార్గాన్నే అనుసరించి శాస్త్ర నిర్ణయాలలో కొత్త పుంతలు తొక్కారు. ■

30, మార్చి, 08, ఆదివారం 'ఆంధ్రప్రభ'

48. శ్రీశ్రీ రేడియో నాటికలు

'మరోప్రపంచం, గవేషణ, అనంతరయాత్ర, విదూషకుడి ఆత్మహత్య, బలి, గుమాస్తా కల, చెప్పని సందేశం, శిరస్సు చెప్పిన రహస్యం' మొదలైన 15 నాటకాలు శ్రీశ్రీ షష్టిపూర్తి సన్మానసంఘం వారు ప్రకటించిన వచనవిభాగం (రెండో సంపుటం)లో వున్నాయి. వీటిలో 14 రేడియో నాటికలుగానే రాశారు శ్రీశ్రీ. అన్నీ మద్రాసు కేంద్రం నుంచే ప్రసారం అయ్యాయి. వాటిలో ఏడెనిమిదికి పైగా నేను నాటకశాఖ నిర్వహించే ఎగ్జిక్యూటివ్‌గా, ముందుగా రచయిత సమ్మతి పొంది, రెండు మూడు నెలల ముందుగానే ప్లాన్ చేసి షెడ్యూలు చేసి తగిన నేపథ్య సంగీతంతో ప్రసారం చేసినవే.

'మరోప్రపంచం' గేయం నేను కాకినాడ కాలేజీలో ఇంటర్ చదువుతున్న రోజులలోనే సాంస్కృతికకార్యక్రమాలలో, కృష్ణశాస్త్రిగారి హయాంలో అనసూయా సీతలు పాడే వరసలో బృందగానాలుగా పాడేవారం. రేడియో నాటికలో 'కనుపాప' (ఆకుపచ్చని) గాజుబంతిలా వుంటుంది. అది ప్రధానపాత్ర. వృద్ధకంఠాలూ, యువకంఠాలూ బృందగానాలు రూపాయణాపైసలు లేని లోకంలో ఊపిరి సలపని మనుష్యులు. నీరయితే నిమ్నానికి ప్రవహిస్తుంది. కాని, ధనం మాత్రం ఉన్నత క్షేత్రాలకి తప్ప ఇంకో చోటికి పోదు. ధనస్వాముల వారి హయాంలో ప్రజల బాధలు గుణకారం జరిగినంత జోరుగా బ్యాంకుల్లో అంకెలు పెరిగిపోతాయి!

'కనుపాప' అంటే భావి మానవుడు –24వ శతాబ్దపు విశేషాలిలాగ చెపుతాడు! "సమష్టి బాధ్యతతో వ్యక్తిత్వం హరించుకు పోదు. సమగ్ర సమాజజీవితంలో వ్యక్తిత్వం సంపూర్ణంగా వికసిస్తుంది... మేము గోళాకారపు గాజు గృహాల్లో జీవిస్తాం. భూమి ఆకారంతో విశ్వం ఆకారంతో మా శరీరాలనీ, నివాసాలనీ సమన్వయించుకున్నాం. ఏ క్షణంలో ఎక్కడ ఎవరేం చేస్తున్నదీ తెలుస్తూనే ఉంటుంది."

'గవేషణ' నాటకంలో యమదూతలు పొరపాటున భూలోకం నుంచి ఆయువు ఇంకా మూడని వ్యక్తి ప్రాణం తీసుకువెళతారు. తీరా అదిపొరపాటని తెలిసి ధర్మదేవత ఆజ్ఞ చొప్పున ఆ ప్రాణాన్ని నీ శరీరంలోకి వెళ్ళిపో అని వదిలేస్తే, ఆ లోపున భూలోకంలో ఆ వ్యక్తి దేహం దహనం అయిపోయి, దొరికిన ప్రతి పక్షీ, కప్పా, గబ్బిలమూ వంటి మృతశరీరాల్లోనూ, ఆ ఆత్మ చొరబడబోయి, తృప్తికలక్క, ధర్మదేవత దర్శనం కోసం

పాకులాడటమూ, ఆ తరువాత ప్రసవించబోయే తల్లి గర్భంలోని మృతశిశువు దేహంలో ప్రవేశిస్తాడు.

ఈ నాటికలన్నింటిలోను కాలాంతర స్థలాంతరపరివర్తనలలో శ్రీశ్రీ కల్పనాశక్తి ఎంతో అభూతపూర్వమైన చమత్కారం కలిగిస్తుంది. అంతేకాదు, అవి సమకాలిక మానవ జీవితం పైని తిరుగులేని వ్యాఖ్యలు!

'అనంతరయాత్ర' జీవితానంతరం–ఆత్మ అంటూ వుంటే దాని పరిభ్రమణమూ, యాత్రా – ఎలా వుంటాయన్న ఊహ.

"కాలం అంతా ఒకటే గాని, అందరికీ ఒకటే కాదు. జీవిస్తున్న వారి కాలం వేరు, మరణించినవారి కాలం వేరు. గర్భంలో వున్న శిశువుదొక కాలం. ఇంకా గర్భస్థం కాని జీవిదింకో కాలం. స్టీమరులోనో, విమానంలోనో ప్రయాణం చేస్తున్నవాడికీ, నిద్రపోయి కలలు కంటున్నవాడికీ, మతిపోయిన వాడికీ, వైరాగ్యనైరాశ్యాల వల్ల కాషాయం ధరించినవాడికీ కాలం ఒకే విధంగా గడవదు".

ఒకరైలు ప్రమాదానికి కొన్ని క్షణాల ముందు ఆ రైలులోని ఒక బోగీలో ఇద్దరు స్త్రీలు, ఒక తత్త్వశాస్త్రాధ్యాపకుడూ, వీరి సంభాషణ – అందరి వాచీలూ సాయంత్రం ఆరు గంటలకి ఆగిపోతాయి. ఆశ్చర్యపడే లోగానే రైలు ప్రమాదానికి గురౌతుంది. వార్తలు వినే చోట, జనం మాట్లాడుకునే మాటలూ, సానుభూతి సభలో శత్రుమిత్రుల మాటలూ, తర్వాత పుట్టబోయే పిల్లల ఆత్మల మాటలూ – ఇవన్నీ వింటూ రియాక్ట్ అయ్యే తత్త్వశాస్త్రజ్ఞుడి మాటలలో కాలం గురించి మనకి తెలిసున్న నిబంధనలన్నీ సళ్ళిపోయి వినిపిస్తాయి.

"ఒక స్థలమే ఒక కాలంలో స్వర్గంలా కనపడుతుంది. అదే ఇంకొక సమయంలో నరకమైపోతుంది.... నరకం అంటే అశాంతి. స్వర్గం అనగా ప్రశాంతి" పోతన గారి భాగవతంలోని బలివామనుల ఘట్టానికి అటూ ఇటూ నరకం అంటే ఇదీ, స్వర్గం అంటే ఇదీ అని మనస్సులకి అందిస్తాడు శ్రీశ్రీ. మధ్య మానవలోకం కళ్ళకి కడుతుంది. – బలి అనే రేడియో నాటిక స్వర్గంలో దేవేంద్రభోగం అంటే ఇదీ ఇంద్రుని మాటల్లో! "దేవగురువుల్ని ఆలోచనామందిరానికి తీసికెళ్ళు, మేం మొదట నందనవనానికీ, తరువాత శయ్యామందిరానికీ రా అమ్మాయీ!" దానశూరుడైన బలితో ఇంద్రుడి కాంట్రాక్టు.

'గుమాస్తా కల'లో సామాన్య మానవుడూ, గుమాస్తా అయిన కోనేటిరావు, జీవితంలో స్మరించదగ్గ సంఘటనలేవీ లేనివాడు. సాహిత్య రంగంలో నాయకత్వం లేనివాడు. పత్రికలలో పేరు కనబడని అల్పజీవి. నిజమైన జీవితం అతనికి ఒక స్వప్నం!

అతను కనే కలలు – యుద్ధంలో కెప్టెన్‌గా – సినిమాలో హీరోగా – అలా కలలుకంటుంటే కోనేటి నిద్రలో కోడి కూస్తుంది.

'ఏ దేశ చరిత్రచూసినా ఏమున్నది' అనే గేయం ఆధారంగా కల్పించిన రూపం 'చరిత్ర చెప్పని రహస్యం'. అందులో ఒక విచిత్రమైన యంత్రం ద్వారా చరిత్రలో భూతకాలసంఘటనలను తిరిగి శాబ్దికంగా వినిపించే శాస్త్రజ్ఞుడు వస్తాడు. కృష్ణరాయల దర్బారులో గండపెండేర గౌరవం పొందడానికి ముందు పెద్దనగారు వినిపించిన "పూతమెరుంగులు" పద్యం పెద్ద ఉత్పలమాలిక, నా చేత పాడించి ఆనందించారు శ్రీశ్రీ.

కైలాసం అనే శిల్పి – చెక్కిన శిరస్సు చెప్పిన రహస్యం ఏమిటి? "ప్రతి కొత్త ఊహ ఒక గొప్ప శిలువ. ఇక ముందు బతుకు ఇవాళే బతుకుతారు వీళ్ళు. నిన్నటి కళ్ళు వీళ్ళ మీద నిప్పులు చెరుగుతాయి. బతికున్నంతకాలం చంపి, చచ్చిన తరువాత శిలావిగ్రహాలు స్థాపిస్తారు" అని. ■

13, ఏప్రిల్, 08, ఆదివారం 'ఆంధ్రప్రభ'

49. ఆకాశవాణిలో మా పింగళి మాస్టారు

'సాహిత్యచరితలో జంట కవుల పంట
ఆంధ్రికి ప్రత్యేకమైనదంట
ఆధునికాంధ్రాన ఆదికవుల జంట
తిరుపతి వేంకటేశ్వరుల దంట,
మలికైతరీతుల తొలి పంట వేంకట
పార్వతీశ్వర కవిద్వయము దంట,
తొలకరి కైతల మలి పంట పింగళి
కాటూరి కవియుగ్మకమ్ము దంట
ఒక్క కవుల జంట నొకరికి పుత్రుడ
నొక్క జంటలోని యొకరి శిష్యుడగుట
రెండు జంటలందున మిగిలిన
తండ్రి, గురుని, భక్తి దలతునెపుడు".

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ అధ్యక్షతలో రిటైరయి, విజయవాడ ఆకాశవాణిలో సాహిత్యకార్యక్రమ ప్రయోక్తగా ఉంటూండిన మా గురువుగారు పింగళి లక్ష్మీకాంతం గారికి 1967 జనవరిలో, నూజివీడులో ఆయన శిష్యబృందం చేసిన సన్మానంలో నేను రచించి చదివిన పద్యాలలో ఒకటి అది.

అది ఒక చిత్రమైన అనుభవం, వాల్తేరు నుంచి సెలవులకో – ఆ తరువాత రిటైరయాకో మద్రాసులో తమ బావమరుదుల మోచర్ల వారింట్లో ఉంటూ వస్తున్న పింగళి మాస్టార్ని, ఆకాశవాణిలో ప్రయోక్తగా చేరమని ప్రోత్సహించడానికి, మద్రాసు రేడియో అధికారులు వారి ప్రియశిష్యుల్లో ఒక్కణ్ణైన నన్ను రాయబారం పంపారు. అది బి.వి. కేస్కర్ గారి సంస్కరణ ప్రయోగం. సాహిత్యమూ, సంగీతమూ వంటి ఆయా క్షేత్రాలలో అశేషకృషి చేసిన సమర్థులూ, విఖ్యాతులు అయిన వారిని, రేడియోలో ఆయా శాఖలకి ప్రయోక్తలుగా నియమించడం ఆ ప్రయోగం.

రేడియోలో అప్పటికీ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌లే ఆయా శాఖలకి నియంతలుగా, కార్యక్రమాల కల్పనా, పరిపాలనా, నిర్వహణలు నేరవేరుస్తూ ఉండేవారం. ఈ కొత్త

ప్రయోగం రేడియోలో అప్పటికీ ఉండి పనిచేస్తున్న వారిలోను, క్రొత్తగా చేరబోయే ప్రయోక్తలలోను కూడా పరస్పర ఈర్ష్యలకు, తమ తమ యోజనలోను, నిర్వహణలోను రెండవవారు తెలిసో తెలియకో ప్రతిష్టంభన కలిగిస్తారేమో అనే భయాందోళనలు కలగకపోలేదు.

నాటకప్రయోక్త అయిన బందావారితో కొన్నాళ్లు, సాహిత్య ప్రయోక్త పింగళివారితో కొన్నాళ్లూ, వారి వారి శాఖల నిర్వహణలో నా వంటి ఎగ్జిక్యూటివ్ సహకారం ఏర్పాటు కావడం చేత, విజయవాడ వంటి కేంద్రంలో కార్యక్రమ కల్పనలోను, నిర్వహణలోను మృదువుగా సాగిపోయి, రాణింపు హెచ్చడానికి తోడ్పడిందని సగర్వంగా చెప్పుకోవచ్చు. మా గురువు గారు తన ఆత్మలహరిలో వ్రాసికొన్నట్లుగా...

"అధికారము మన్నించెద
నధికారిని గుణము బట్టి యారాధింతున్
అధము డగునేని యాతని
పథమునకున్ తొలగి నిలుతు పామునకు బలెన్."

సంస్కృతకార్యక్రమాల నిర్వహణలో పింగళి వారు పెద్ద పెద్ద పండితులను కూడా బ్రాడ్ కాస్టింగ్ మాధ్యమానికి, వారు ఏ విధంగా తమ ప్రసంగాలను మలచుకోవాలో చెప్పి ఒప్పించేవారు. సంస్కృతనాటకాలలో కాళిదాసు, భవభూతి, భాసుడు, విశాఖదత్తుడు, భట్ట నారాయణుడు వంటి వారి ప్రసిద్ధరచనలను, రేడియో మాధ్యమానికి అనుగుణంగా, సంస్కృత సంభాషణలను తేలిక పరచి అనుసరణలను తయారుచేసేవారు. నాటకీయ శాఖానటులలో తెలుగులో బాగా చేసేవారిని సంస్కృతనాటకాలకు పిలిపించి, వారి సంస్కృత సంవాద సామర్థ్యమూ, నాటకీయోచ్చారణా, రసావేశ వాచికాభినయాలు స్పష్టంగా ప్రసారంలో వెలువడడానికి, ఒక్కొక్కరికీ సంస్కృతంపాఠం చెప్పినట్లు ఒద్దికలు (రిహార్సల్స్) దిద్ది తీర్చేవారు. ■

20, ఏప్రిల్, 08, ఆదివారం 'ఆంధ్రప్రభ'

50. "మా అబ్బూరి' మాస్టారు ఛందస్సుల్లో కొత్త మెలికలు"

1934-35 సంవత్సరాలలో 'నదీసుందరి' నాటకాన్ని ఇంటర్‌మీడియెట్‌కు తెలుగు పాఠ్యగ్రంథంగా పెట్టింది - ఆంధ్ర విశ్వవిద్యాలయం. ఆ సంవత్సరంలో నేను మా పిఠాపురం హైస్కూల్‌లో ఐదవ ఫారం (ఎస్.ఎస్.ఎల్.సి.) చదువుతున్నాను. కాకినాడ కాలేజీలో ఇంటర్ చదువుతున్న మా అన్నయ్యకు అది పాఠ్యాంశం మాత్రమే కాదు. కళాశాల వార్షికోత్సవంలో మా అన్నయ్య (నళినీకాంతరావు) కావేరి పాత్ర, వాళ్ళ లెక్చరర్ కాళ్లకూరి సత్యనారాయణగారు అగస్త్యపాత్ర ధరించారు.

ఆ నాటకాన్ని చదివిన (పిఠాపురంలో) మా పినతండ్రి సూర్యనారాయణరావు గారు, "కాళిదాస - భవభూతుల సంస్కృతనాటకాలతో సమానమైన జననాంతర సౌహృదం కలిగించే పాత్రలతో వాతావరణంలో గుండెలను డగ్గుత్తికతో పట్టివదలని ఉత్తమమైన తెలుగు నాటకాన్ని సృష్టించిన ప్రథమశ్రేణి కవులలో ఒకరు. ఈయనెవరో గాని - అబ్బూరి రామకృష్ణరావుగారు" అన్నారు, ఆయన చుట్టూ చేరి సాహిత్య విషయాలు నేర్చుకుంటూ చర్చించే మాతరం పిల్లలతో! అప్పటికే ముద్దుకృష్ణగారు సంకలనం చేసి విడుదల చేసిన ఫెదర్‌వెయిట్ పుస్తకం ఆధునిక కవుల కవితాఖండాల సంపుటం 'వైతాళికులు' తీసుకొచ్చి అందులోని కొన్ని పద్యఖండికలు వినిపించాను. అబ్బూరి మేస్టారి కవితాఖండికలతో నా పరిచయం వాటితోనే.

'పూజాశిరీషము లేరుకొంటివి, పోయివచ్చెదొ జవ్వనీ
తేజోవిలీన దృగంచలమ్ముల తేరి చూచెద వెవ్వనీ!'

పెర్షియన్ - ఉర్దూ కవితలలో తరచుగా, వినిపించే 'గజల్'లాగా తెలుగు గేయం వ్రాయాలని చేసిన ప్రయత్నం అది - అని తరువాత వాల్తేరులో ఆయన పాఠం చెప్పే తెలుగు ఎమ్.ఏ. తరగతులలో విద్యార్థిగా కలిసినప్పుడు చెప్పారు.

అదికాక, తెలుగులో సొంతంగా ఉన్న ఛందస్సులలోనే కొత్త అందాలను వెతుకుతూ, ఆయన చేసిన ప్రయోగాలు ఆనాటి 'వైతాళికుల'లోనే దర్శనమిచ్చాయి.

'పూజాతిసాంద్ర కర్పూరంబులందు
ప్రాజ్ఞ దీపాథోలవమ్ముల యందు
మడుగు సన్నని పాట

పొడుచు వెన్నెల తేట
కలవు తిక్కన పల్కు తెలుగుపల్కులకు!

'లజ్జామనోహరలావణ్యమూర్తి, తేజోరుణాక్షి సందీప్తి పాంచాలి
కనుల క్రొమ్మెరుపులు, కనుబొమ విరుపులు
కలవు తిక్కన పల్కు తెలుగు పల్కులకు'

రగడలో నుంచి ముత్యాలసరాన్ని ఎంచి కూర్చి,గురజాడ వారు తరువాతి తెలుగుకవులకు, మాత్రాచ్ఛందస్సుల్లో మరచిపోయిన 'గుమ్మడేడే' వంటి దేశిగేయాల వైపు దారి చూపిస్తే, వెంకట-పార్వతీశ్వరకవులు, రాయప్రోలు, అబ్బూరి, తెలుగు ప్రజల దేశికవితాచ్ఛందస్సులలో మకుటాయమానమైన ద్విపదను ఆదరించి మార్గదర్శకు లయ్యారు. అబ్బూరి మాస్టారు - ఆ ద్విపదలోనే రెండు పాదాలను ఠీవిగా నడిపి, మూడో పాదానికి బదులు రెండేసి ఇంద్రగణాలతో రెండు పంక్తులు పాడి, చివర మళ్ళీ ఒక మామూలు ద్విపదపాదంతో ముగించడం, దేశి సుడికారపు అందాలను సంస్కృత సమాసాల తొలి రెండు పాదాలతో మేళవించి, తిక్కన కవిత్వంలోని ఉభయ భాషాకవిమిత్రులకు నివాళులర్పించారు.

ఈ విధంగానే ద్విపదచ్ఛందస్సులో రెండు పాదాల తరువాత ఒక చిన్న మెలికతో కొత్త మలుపు కనపరుస్తారు. 'ఆంధ్రవీరకంఠీరవ' అనే శీర్షికన కోడి రామమూర్తిపై వ్రాసిన కవిత.

"నీ యశఃపారిజాతమ్ముల మూల, ఆంధ్ర
మాతృగ్రీవమందు ముత్యాల హారమై వ్రేలగా
తారాళి దూరమై తూలగా, చేరిపాడెదము నీ గౌరవగీతి!'
"నీ విజయపతాక మాడెడు చోట,
ఆంధ్రదేవి ప్రసన్నయై పాడు పాట నవ్యశోభాప్తిచే
శాశ్వతదివ్యసందీప్తిచే మ్రోగెడు గాక ఆశాభిత్తులదర"!

ఎరిగున్న ఏ తెలుగు ఛందం గాని, సంస్కృతవృత్తంగాని మాతృక అనడానికి వీలులేకుండా ఒక కొత్త ఛందస్సును 'సరోజినీ దేవి'పైని వ్రాసిన కవితలో ప్రయోగించారు. పాదాల ఏర్పాటు మొదట ఆయన చేసినట్లుగానే చూపిస్తాను.

తొలి ప్రొద్దు రేకలు,
తలనూపుమొకలు,
కడిలేని బంగారు గనులు,
సరోజినీ గానశకలములు!

దారితప్పిన చోట
తేరిన సెలయేట
పారు మెల్లని పాట
చిందు తియ్యదనాల చెలులు,
సరోజినీ స్నిగ్ధగీతములు!

మాస్టారు ముత్యాలసరానికి మాతృకామూర్తియైన రగడను నిర్లక్ష్యం చెయ్యలేదు. ఆయన సంధ్యాకామినిని ఆహ్వానించే గేయం.

'పూవు పొడితో పసుపు పూసుక, కావి యిగురుల కాంతులద్దుక
త్రోవ లెరిగిన చరణములతో రావె సంధ్యాకామినీ!
ఉదయకన్యలు కలశములతో పిదికి పంపిన యాలమందల
పొదుగులను క్షీరముల నింపితి గదవె సంధ్యాకామినీ!"

ఇందులోఏడు మాత్రల గణాలే అయినా, పాడేటప్పుడు ప్రతీ యేడోమాత్రనీ అర్థం చెడకుండా గడుసుగా పొడిగిస్తే, ఎనిమిది మాత్రల రక్తినిచ్చే ఆదితాళం పడుతుంది.

కవిత్రయంలో నన్నయ - ఎర్రనలు తరచుగా వాడి, నన్నయకు పూర్వం కూడా బెజవాడ శాసనం ద్వారా ప్రసిద్ధిపొందిన తెలుగు వారి దేశిచ్ఛందం మధ్యాక్కర! విశ్వనాథ సత్యనారాయణగారు అభిమానించి ఈ ఛందస్సుతో ఒక శతకమే వ్రాశారు. మా అబ్బూరి మాస్టారే - మధ్యాక్కరలో ఆధునికమైన అందపు మెలిక చూపించిన నవకవిశేఖరుడు. ఆ మెలిక పల్లవిలోనే స్వీకరించి, గేయశరీరంలో ఎర్రాప్రెగడ ధోరణి అవలంబించారు. రెండు మధ్యాక్కర పాదాలయాక ఆ మెలిక మళ్ళీ ప్రయోగిస్తారు. పృథివీప్రశంసలో.

"ఓ విశాలావనీ! శోభాతిపావనీ!
ఆరంభ పుణ్యక్షణముల, నీశుడు విసరిననాటి
నీయాదిసౌభాగ్య మెటుల, వెల్గెనో భవదీయశాటి
ఆకుపచ్చనియాకులో, పండువెల్తురు రేకులో
నిన్ను ప్రశ్నించగా జాల, నీనాటి ప్రొద్దుటి పూట
గంభీరమై ప్రవహించె, నీదు సౌందర్యంపు పాట!
కాంతికల్లోలినీ, వైభవశాలినీ!"

పాటంతా చదవాలనుంటే 'వైతాళికులు' పుస్తకంలోనో, 'అబ్బూరి' కవితాసంకలనంలోనో చదువుకోవాలి. వినాలంటే నేను పాడగా వినాలి! ■

27, ఏప్రిల్, 08

51. కృష్ణమాచార్యుల సింహగిరి వచనాలు

మే 1వ తేదీన వైశాఖ శుద్ధతదియనాడు సింహాచలంలో వరాహ నరసింహ స్వామికి చందనమహోత్సవం! అంటే స్వామివారి మూర్తికి ఏడాది పొడుగునా చేస్తూ వచ్చిన చందనపు మైపూతను ఆనాడు వొలిచివేస్తారు. అందుచేత ఆ నాటి దర్శనాన్ని 'విశ్వరూపదర్శనం' అంటారు. ఈ స్వామి 'సింహగిరి నరహరి' కూడాను.

"యతిరాజముని వరము, దాతారు, కృష్ణకున్వారు, అనాథపతీ, సింహగిరి నరహరీ నమో నమో దయానిధీ' అనే మకుటంతో 14వ శతాబ్దపు తొలి దశాబ్దులలో తెలుగు భక్తి సంకీర్తనలకు ఒరవడి అనదగిన సింహగిరి నరసింహ 'వచనాలు' వెలువడ్డాయి. వాటి కర్తా, తెలుగులో తొలి వాగ్గేయకారుడూ అయిన కృష్ణమాచార్యులు, ఈనాడు మనకి స్మరణీయుడు.

'వచనాలు' అనేవి కోవెలలో భక్తిరచయితల భక్తిసంగీత సాహిత్యంలో తాళం లేకుండా కొన్ని, తాళగంధి అంటే సూచనామాత్రంగా తాళంతో నడిచేవి కొన్ని. సంగీత శాస్త్రంలో గద్యప్రబంధాలు అనే ప్రక్రియకు చెందినవి!! ఇవి వేరు వేరు రాగాలతో భావానుగుణంగా గానం చేయటమే. పీసపాటి దండకాలు, తాళగంధి వచనాల కోవకి చెందుతాయి. వాటిలో ఖండగతి తాళం సామాన్యం! సూర్యదండకం, ఆంజనేయదండకం, శ్యామలాదండకం, మొదలైనవి ఆలయభక్తి సంగీతంలో గద్యప్రబంధాలే! వచనాలూ అంతే! కృష్ణమాచార్యులు ఈ క్రియకు ఆద్యుడని, అన్నమాచార్యుల సంకీర్తనలక్షణం అనే గ్రంథంలోనే ఆయన మనుమడు చేసిన తెలుగు అనువాదంలో ప్రశంస కనబడుతుంది.

"ధరకృష్ణాచార్యాదిక పరికల్పిత పదము తాళబంధచ్ఛందో
విరహితమై చూర్ణాఖ్యన్ బరగునది నిరుక్తనామభాసిత మగుచున్!"

అంటే వచనాలను 'చూర్ణము, చూర్ణికా' అని కూడా అంటుంటారు. అన్నమాచార్యుల కుమారుడు పెదతిరుమలాచార్యులు ఏడుకొండల స్వామికి అంకితంగా వేంకటేశ్వర వైరాగ్యవచనమాలికా గేయములు రచించారు. వీటిని తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రకటించారు. సింహగిరి నరహరి వచనాలను డాక్టర్ కులశేఖరరావు గారు పరిష్కరించగా, హైదరాబాదు ఆంధ్రరచయితల సంఘం తరఫున డాక్టర్ ఖండవిల్లి

లక్ష్మీరంజనం గారు ప్రకటించారు. శఠకోప విన్నపాలూ, శేషగిరినాథ విన్నపాలూ అనే రచనల శీర్షికలను బట్టి, వచనాలకు విన్నపాలనే వ్యవహారం కూడా వుందని తెలుస్తుంది.

కడచిన ఇరవయి ముప్పయి ఏళ్ళుగా తెలుగు ఆకాశవాణి కేంద్రాల నుంచి, భక్తిరంజని కార్యక్రమంలో కొన్ని దండకాలను కృష్ణమాచార్యుల సింహగిరి వచనాలను,పెదతిరుమలాచార్యుల వేంకటేశ్వరవచనాలను ఈ వ్యాసకర్త గానం చేయగా, శ్రోతలు వింటూ వుండాలి.

కృష్ణమాచార్యులు ఇప్పటికి దాదాపు 700 ఏళ్ళ క్రితం జన్మించారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని సంతాపూర్ లేక సంతూరు అనే గ్రామం జన్మస్థలం! కాకతి ప్రతాపరుద్రుడు ఓరుగల్లులో చక్రవర్తిగా ఏలుతూండిన కాలంలో, ఆ మహారాజు కృష్ణమాచార్యులకు కనిగిరిసీమలోని ఏబది గ్రామాలకు ఆధిపత్యం ఇచ్చి గౌరవించాడట!

క్రీ.శ. 1290లకి సరియైన వికృతి నామసంవత్సరంలో సంతూరులో అంధశిశువుగా పుట్టి, తల్లిదండ్రులు వదలివేసిన కృష్ణమాచార్యులను కృష్ణకున్వారు అనే హిందూస్థానీయుడైన విష్ణుభక్తుడు, సన్యాసి, సింహాచలంలోని ఒక మఠంలో కొన్నాళ్ళు పెంచాడట. నరహరిస్వామి బాలరూపాన పాలు తెచ్చి ఆ పసివానికి త్రాగడానికి ఇస్తే, వాటితో తుడుచుకున్న కళ్ళకి దృష్టి తిరిగివచ్చిందని ఒక వచనంలో కృష్ణమాచార్యులే చెప్పుకుంటారు. 1306లో (పరాభవసంవత్సరం) తన 16వ యేటనే ఆరంభించిన ఈ వచనాలలో కొన్ని దేవుని నామావళి సంకీర్తనలు! కొన్నిటిలో ఆయన ఆత్మకథలోని ఘట్టాలను వర్ణిస్తారు. కొన్ని పశ్చాత్తాపప్రార్థనలు! కొన్ని పురాణ వైరాగ్యనీతిబోధలు! కొన్నింటిలో స్వామితో మారాము గారాము చేస్తాడు! సీత కల్యాణ కథను ఒక వచనంలో చిత్రించిన ఘట్టం.

"దేవా, గోదావరి యావల శ్వేతద్వీపమందు మా మేనమామ శ్రీరంగాచార్యులు కలరు. వారి కుమార్తె యందు తిరుకల్యాణము కాబోవుచున్న వాడను. ఇది మీకు విన్నపము సేయుచున్నాడను. మీకు విన్నపము చేసిన 'నేను వేంచేసెదనోయి కృష్ణమాచార్యా'యని యానతిచ్చిన 'ఓం నమో నారాయణాయ మీరే వేంచేసెదరు ప్రహ్లాదవరదా'యటంచు మీకు విన్నపము చేసిన, 'అట్లు గాదోయి కృష్ణమాచార్య, నీవు పదునాకొండవ యవతారుండవు. లీలావినోదముతో నీ తిరుకల్యాణము చూడవేడు కయ్యేను. నేనును వేంచేసెదను అని యానతిచ్చిన...." ■

4, మే, 08, ఆదివారం 'ఆంధ్రప్రభ'

52. ఆకీర్తనలు 'రామదాసు'ల విన్నపాలు....

భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణమహోత్సవం ఏటా జరుగుతుంది. ఆంధ్రప్రదేశం నాలుగు మూలల నుంచీ రామదాసు కీర్తనలు గోష్ఠిగా పాడే బృందాలు, ఒక్కొక్క బృందానికి 15, 20 మంది భక్తులకు తక్కువ కాకుండా భద్రాచలం చేరుకుంటాయి. భద్రాచలం రాములకి అంకితంగా భక్తరామదాసు రచించిన కీర్తనలు, ఈ గోష్ఠులలో గానం చేస్తారు. గానం చేస్తూ, నృత్యం చేస్తూ, దీపపుసమ్మెల చుట్టూ మండలాలు తీర్చి చిందులు వేస్తారు. ఈ కీర్తనల అన్నింటిలోనూ భద్రాచలముద్రా, రామదాసు నామముద్రా ఉన్నవి, రామదాసు స్వయంగా రచించిన కీర్తనలే అని విశ్వసించవచ్చు.

అయితే ఈకీర్తనలు 'రామదాసు చరిత్ర' అనే పేరుతో అప్పుడప్పుడు వెలువడిన యక్షగానాలు లేక హరికథలలో, యక్షగానకర్తల నాటకీయ సంవాదకీర్తనలతో కలిసిపోయి ఉంటుంటాయి. అటువంటి యక్షగానాలు వ్రాసినవారు 18వ శతాబ్ది నుంచీ మొన్న మొన్నటి దాకా ఐదారుగురున్నారు. మొట్టమొదటివాడు గరుడాచల యక్షగానకర్త, రామదాసుకు స్వయానా సమకాలికుడూ శిష్యప్రాయుడూ అయిన భద్రగిరి యాదవదాసు. ఆ తరువాత వచ్చినవి తిరుక్కడైయూర్ కృష్ణదాసు రచన, 19వ శతాబ్దంలో వచ్చిన తూము నరసింహదాసు లేక సింగరిదాసు.

'రామదాసు గారూ రండీ రసీదందుకోండీ, ధన్యుడవు తానీషా నీవు, ఏ దేశము వారు మీరు ఎందుండి ఇట వచ్చినారు' వంటి నాటకీయసంవాద దరువులు తీసేసి, కేవలం రామదాసు పాత్రపాడే కీర్తనలలో అంకితం ముద్రలతో ఉన్న కీర్తనలు 108 దాకా ఉంటాయి. పరిశోధకులలో ఒకరు197 కీర్తనలూ,మరొకరు 132 కీర్తనలూ రామదాసువిగా గుర్తించారు.

ఆ కీర్తనలకి ఆనందభైరవి, ఆహిరి, వరాళి, ధన్యాసి, సౌరాష్ట్ర, యదుకుల కాంభోజి, కాంభోజి, సైంధవి, సురటి, నాదనామక్రియ, కల్యాణి, శంకరాభరణం, పున్నాగవరాళి, శహన, బిళహరి, ముఖారి, సావేరి, నీలాంబరి వంటి కర్నాటక సంగీతరాగాలు, కాపి, బేగడ, కమాసు, దర్బారు, బేగడ, యమునాకల్యాణి వంటి హిందుస్థానీ సంగీతసంపర్కం వున్న రాగాలూ ఉన్నాయి.

రామదాసు కీర్తనలు ఆయన దాశరథీశతకపద్యాలలాగే ఆత్మాశ్రయ నివేదనలూ, ప్రార్థనలూ, వాటి సంగీతం, ఆ కీర్తనలలో భక్తుడు భద్రాద్రి రామునితో ప్రార్థనపూర్వకంగా చేసే విన్నపాలూ, వేడికోళ్ళూనూ.

రామదాసు తన కీర్తనలలో ఆయా రసావేశానికి కావలసిన రాగాన్ని అప్రయత్నంగా పొదుగుకోవడమే కాని, రాగవిద్వత్ ప్రదర్శనకోసం గాని, కచేరి ప్రయోజనాలకోసం గాని రచింపలేదు.

త్యాగరాజుకు నాదమూ, బ్రహ్మమూ రాముని ప్రతిరూపాలు. రామదాసుకు, రాముని సన్నిధి రూపగుణ స్తుతులే అంతిమధ్యేయాలు. త్యాగరాజు తన నాటికి తంజావూరులో పరిణామం చెందిన కర్ణాటక సంగీత విద్వత్ ప్రదర్శనలూ, రాగతాళ విన్యాసాలూ ప్రదర్శించి వాటిలో తాను రామునికి చేసిన విన్నపాలూ, ప్రార్థనలూ ఒక వాహికగా వాడుకొన్నాడు. రామదాసు తానూ తన చుట్టూ చేరిన భక్తసమాజమూ, దేశంలో ఉండే, ఉండగల దీనపీడితప్రజలెవరికైనా సరే, గొంతులు నాలుగూ కలిపి చేసే ప్రార్థనలూ, అడుగులు త్రొక్కుతూ పాడే భజనలూ కూర్చాడు.

అన్నమాచార్యుల సంకీర్తనల్లో ఆధ్యాత్మికతలో శృంగారమూ, శృంగారంలో ఆధ్యాత్మికతా కలిపి రంగరించి కూర్చిన కవితాశిల్పాలూ మెండుగా కనిపిస్తాయి. క్షేత్రయ్య పదాలు నాటకీయంగా, నృత్యాభినయాలు ప్రదర్శించడానికి వీలుగా కూర్చిన ప్రేయసీప్రియుల ప్రణయసంవాదాలు. రామదాసుకీర్తనలు, దీనాతిదీనుడైన ఏ భక్తుడైనా తన దురవస్థ నుంచి తప్పించమని శ్రీరామునకు చేసుకున్న విన్నపాలు. సంగీతమూ రాగమూ రామదాసును, దైన్యసముద్రం ఉండి ఉద్ధరించడానికి వినియోగించుకొన్న తెప్పలు.

త్రిపుటలు, జంపెలు, అర్ధచంద్రికలు, కందార్థాలూ వంటి యక్షగాన దరువుల రూపాలు రామదాసు కీర్తనలలో కాన రావు. రామదాసు కీర్తనలు ఉత్సవ సంప్రదాయ కీర్తనలకు ఒరవడులయ్యాయి. ■

11, మే, 08, ఆదివారం 'ఆంధ్రప్రభ'

53. సాహితీ సమితి సభాపతి..

ఆయన ఎక్కడ కూర్చున్నా, ఆలోచిస్తున్నా, మాట్లాడుతున్నా చదువుతున్నా, రాస్తున్నా - నలుగురు సాహితీపరుల మధ్య సభాపతిలాగే మెలిగేవారు. ఆయన సాహితీసమితి సభాపతీ, నవ్యసాహిత్య పరిషత్ అధ్యక్షులూ కూడా. ఆయనే తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి. స్వామీ శివశంకరులు.

పిఠాపురంలో వారి వియ్యంకుడైన మొక్కపాటి నరసింహశాస్త్రి గారింటికి వెళ్ళాలంటే మా ఇంటి ముందు నుంచే (క్రొత్తపేట) వెళ్ళాలి. శివశంకరుల కోడలు మొక్కపాటి నరసింహశాస్త్రి గారి కుమార్తె మహాలక్ష్మి గారికి, నాకూ కర్ణాటక సంగీతపాఠాలు చెప్పిన గురువు ఒకరే.

ఒక రోజు పొద్దుట వేళ మా ఇంటి అరుగు మీద మా నాన్నగారితో సమావేశమై కవిత్వమూ,జ్యోతిషమూ చర్చించుకునేవారు. కృష్ణలీలాతరంగిణి రచించిన స్వామినారాయణతీర్థులు తమ వంశస్థుడైన (తల్లావఝ్ఝల) గోవిందశాస్త్రి అనీ, అందుకే వారికుటుంబంలో తీర్థుల వారి తరంగాలు అధమం రెండో, మూడో ప్రతి ఒక్కరూ నేర్చుకు తీరాలని చెప్పేవారు. మా తాతగారు బాలాంత్రపు వెంకటనరసింహం గారు తరంగాలూ, ఆధ్యాత్మమూ పాడే వారనీ, నరసింహంగారు పోయే ముందు అపత్సన్యాసం స్వీకరించింది నారాయణతీర్థనామం గ్రహించారనీ మా నాన్నగారు శివశంకరులతో చెప్పారు.

1935, 36 ప్రాంతాలలో నా గేయరచనలో కొంత నిలకడ దొరికి, ఒకటి, రెండు కృష్ణాపత్రిక లోను, ఒకటి, రెండు భారతిలోను పడడం చూసిన శివశంకరులు, అముద్రితంగా వున్న రెండు, మూడు ఖండకావ్యాలు తీసుకుని, మరికొందరు యువ కవిమిత్రుల రచనలతో పాటుగా ఒక చిన్న సంకలనంగా 'కదంబం' అనే పేర సాహితీసమితి ప్రచురణగానో, నవ్య సాహిత్యపరిషత్ ప్రచురణగానో తన పీఠికతో వెలువరించారు.

1935, 37ల మధ్య నేను కాకినాడలో పిఠాపురం రాజా కళాశాలలో ఇంటర్ చదివాను. శివశంకరుల కుమారుడు కీ.శే. కృత్తివాసతీర్థులు నాకు ఒక తరగతి సీనియరు.

పిఠాపురంలో మా అరుగు మీద చూసిన తర్వాత శివశంకరుల్ని, కాకినాడ

కృష్ణశాస్త్రి గారి కవితా సామ్రాజ్యపు దర్బారు హాల్లో సభాపతి సింహాసనం పైనే మళ్ళీ చూశాను.

కళాశాలలో ఆంధ్రసంస్కృతి వారోత్సవాలూ, కావ్యనాటక ప్రదర్శనలూ, కవిపండితుల ఉపన్యాసాలూ, పెద్దాడ రామస్వామి, కృష్ణశాస్త్రిగారల నిర్వహణలో పెద్ద ఎత్తున జరుగుతూ వుండేవి.

ఆరోజులలో ఆచంట జానకిరాం గారు ఇన్సూరెన్స్ ఏజెంట్‌గా కాకినాడలో కాపురం వుంటూ, మా ఇంటికి వస్తూ నవ్యసాహిత్యపరిషత్ వారి ప్రతిభా, ముద్దుకృష్ణగారి జ్వాలా, కొంపెల్ల జనార్దన్‌రావుగారి ఉదయినీ పత్రికలతో పరిచయం చేసేవారు. ప్రతిభలో అనుకుంటాను 'నాలో మార్పు' అని శివశంకరుల ఆత్మచరిత్రాత్మకమైన సాహిత్య వ్యాసాలు చదివాను.

ఆ యేటి కళాశాల ఉత్సవాలలో శివశంకరుల పద్యనాటిక – పద్మావతీ చరణచారణ చక్రవర్తి – రంగస్థలంపైని ప్రదర్శింప జేశారు. అందులో బి.వి. నరసింహారావు గారు పద్మావతి, గాడేపల్లి అనంతం గారు జయదేవుడూ, నేను పరాశరుడూ పాత్రలను నిర్వహించాము.

1937లో నేను ఎమ్.ఏ. చదవడానికి వాల్తేరు వెళ్ళిపోయాను. 1938లో నేను తెలుగు విద్యార్థి సంఘానికి అధ్యక్షుణ్ణి – నా సహాధ్యాయి కార్యంపూడి రాజమన్నారు కార్యదర్శి. కె.వి.ఆర్. నరసింహం గారు మా మరో సహాధ్యాయి సలహాలు ఇస్తుండేవారు. అంతవరకు ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘాలు కాని, అధ్యాపకశాఖలు కాని, ఎన్నడూ చెయ్యని రీతిని అనుకోనివిధంగా మేం తల్లావఝ్జులవారినీ, విశ్వనాథ సత్యనారాయణగారినీ, గిడుగు రామమూర్తి గారినీ, మా శాఖాధ్యక్షులు లక్ష్మీకాంతంగారు, ప్రిన్సిపాల్, వైస్ ఛాన్స్‌లర్‌ల సమ్మతి మీదనే – తెలుగు శాఖ సాహిత్య కార్యక్రమాల్లో ఉపన్యాసాలకి ఆహ్వానించాం. ఉపన్యాసాలు సంతృప్తిగా జరిగాయి. శివశంకర శాస్త్రిగారు యూనివర్సిటీ హాస్టల్‌లో "ఏం, రజనీ నువ్విప్పుడు ఏమైనా రచనలు చేస్తున్నావా? అనడిగారు. వంగదేశపు కవియైన చండీదాసు రామమణితోడి ప్రణయగాథను గేయనాటకంగా రచిస్తున్నానని చెప్పాను. ఆయన ఎంతో సంతోషంతో నవ్వి, నన్ను అభినందించి, అప్పుడే తాను కూడా ఆ మహాకవి కవితాతత్వంపైన, రామమణీ ప్రణయకథ ఆధారంగా ఒక పద్యగేయ నాటిక రచిస్తున్నాని చెప్పారు. అది నాకు ఎంతో ప్రోత్సాహకారీ, గర్వకారణమూ కూడాను.

అంతేకాదు 1941లో ఫిబ్రవరి 21న నా చండీదాసు ఆలిండియారేడియోలో ప్రసారం అయింది. రేడియోలో ప్రసారం అయిన నా తొలి నాటకం అదే. అదే మాసం

ఫిబ్రవరి 15న గోఖలే హాల్ (మద్రాసు)లో మొక్కపాటి నరసింహశాస్త్రి గారి దర్శకత్వం కింద రంగస్థలగాయకుడైన కే.శే.హరనాథ్ (నర్తకుడు నరసింహాచార్యుల తండ్రి) చండీదాస్ పాత్రతో ప్రదర్శితమైంది. ఈ రెండు నాటకాలూ 1942వ సంవత్సర ప్రతిభ సంచికలో అచ్చయినాయని చెప్పుకుని గర్విస్తుంటాను.

శివశంకరుల 'హృదయేశ్వరి' పద్యకావ్యం కాక మిగిలిన రచనలలో చెప్పుకోతగినవి వారి పద్యగేయనాటికలే. వీటిలో ప్రేమవైఫల్యమే కథా వస్తువు. విద్వత్కవులు, కవయిత్రులు అయిన పాత్రలలో స్త్రీ పునర్వివాహసమస్యతో ఈ ఇతివృత్తాలను కూర్చారు. అవి, దీక్షితదుహిత, విద్వచ్ఛిరోమణి అయిన అప్పయ్య దీక్షితుల కుమార్తె కథ. దేశిచ్ఛందస్సులలోని (మాత్ర) గేయాలు. మంజరీ ద్విపదలు, ఆటవెలదులు, తేటగీతులు వాడారు.

యక్షరాత్రి అనేనాటిక, వికటనితంబ అనే విదుషీమణిని గురించిన కథ. విద్యాసంస్కారవిహీనుడైన ఒక భర్త చనిపోగా వితంతువైన వికటనితంబ, ఇందురాజు అనే మరొకరిని వివాహంచేసుకొన్న గాథ.

నోణకజాయ, వరపరీక్ష, దీపారాధన, కవిప్రియ ఇత్యాదిగా ఇన్ని పద్యగేయ నాటకాలు రచించిన శివశంకరులు మా బోంట్లకు ఆదర్శప్రాయులైన మార్గదర్శకులు!■

18, మే, 08, ఆదివారం 'ఆంధ్రప్రభ'

54. పసిడిమెరుంగుల... తెలుగుతల్లీ!

పసిడి మెరుంగుల తళతళలు
పసిమి వెలుంగుల మిలమిలలు
గౌతమి కృష్ణల గలగలలు
గుడి జేగంటల గణగణలు
మెరసి మొరసి మించిన శుభసమయము తల్లీ
తరళ యశోపతి అనుపమిత రాగవల్లీ నీ
వరసంతతి చేమోడ్పులివె తెలుగుతల్లీ!

కవిపికముల సల్లాపములు,
గాయక బర్హాలాపములు,
లాస్యత్ ఖగవిన్యాసములు,
భాస్వత్ పటహనినాదములు,
విరిసి మ్రోగి పరచిన శుభసమయము తల్లీ
సరళోక్తి మధురసవతీ కోమలవల్లీ నీ
వరసంతతి చేమోడ్పులివె తెలుగు తల్లీ!

హాలికజన కలహాసములు,
శ్రామికజన మధుహాసములు,
దాస్యవిముక్త నివాసములు
స్వతంత్ర ప్రభావికాసములు
ఒలసి మెలసి చెలగిన శుభసముయము తల్లీ,
చరణార్పిత కోటిత్రయ హృత్సుమవల్లీ నీ
వరసంతతి చేమోడ్పులివె తెలుగు తల్లీ!

సుమారు డెబ్బయి యేళ్ళ క్రితం అంటే, 1938–39లో నేను వాల్తేరు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఫోర్త్ బి.ఏ. ఆనర్స్ చదువుతున్నప్పుడు, మా ఉపకులపతి (వైస్ ఛాన్సలర్) డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి గారు నన్ను తెలుగు తల్లికి ప్రార్థనగా ఒక

పాట వ్రాసి, సంగీతం అమర్చి, మా విద్యార్థిబృందంలో ఐదారుగురితో కలసి బృందగానంగా పాడించాలని ఆదేశించారు. 1939 మార్చిలో వచ్చిన ఉగాది నాడనుకుంటాను తిక్కవరపు రామిరెడ్డి సభామందిరం, కొత్తగా కట్టించిన భవన ప్రారంభోత్సవం దానితో మొదలు పెట్టాలని వారి కోరిక. అంతకు కొన్ని మాసాల ముందుగానే ఈ పాటకి నేను ఆనందభైరవి రాగంలో, ఆదితాళంలో వరుస కుదుర్చుకుని మిత్రబృందసమావేశాలలో పాడుతూండేవాడిని. శ్రీయుతులు జనమంచి రామకృష్ణ, పెద్దిభొట్ల సుబ్బరాయశర్మ, గంగాధరభట్ల కామేశ్వరరావు, మొదలైన మా గాయక మిత్రబృందం ఏడెనమండుగురం, ఆ ప్రారంభోత్సవంలో పాడాము. మా మధ్య చేరుకుని, మా భుజాల మీద చేతులు వేసుకుని వి.సి, సి.ఆర్. రెడ్డి గారు కూడా ఈ పాట పాడి వుండటం ఒక మరపురాని మధురసన్నివేశం!

ఈ పాటలో ఆయనకి ప్రత్యేకంగా నచ్చిన కొన్ని లక్షణాంశాలు ఉన్నాయి. మొదటి పంక్తిలోని పసిడి మెరుంగుల ఇత్యాది పల్లవి కాదు. రాగమూ, తాళమూ, సాంప్రదాయికంగా నడుస్తూ కొన్ని దేశి అందాల వంపులూ, ఛందస్సులో అప్పటికి ఒక కొత్త పదమూ ఆయన్ని ఆకట్టుకున్నాయి. ఇంగ్లీషు సోనెట్సులో లాగా బర్డెన్ ఆఫ్ ది సాంగ్ (పల్లవి) ప్రతి స్టాంజాకీ చివర వస్తుంది.

ప్రతీ తెలుగు పాటలోనూ, కీర్తనలోనూ, కృతులలోనూ చరణాల చివర పల్లవి రావడం ఆనవాయితీయే కానీ, ఆ పల్లవుల తోనే ఆ పాటలు ప్రారంభమవుతాయి.

ఈ పాట చరణం (లేదా అనుపల్లవి) తో మొదలుపెట్టి ప్రతి చరణానికీ చివర 'నీ వరసంతతి చేమోడ్పులివె తెలుగుతల్లీ!' అని పునరావృత్తి అవుతుంటుంది.

నేను రేడియో (మద్రాసు)కి కేజువల్ ఆర్టిస్టుగా కార్యక్రమాలలో పాల్గొంటూండే తొలి మాసాలలోనే 1941 మార్చి (23) ఉగాది నాడు మద్రాసు కేంద్రకార్యక్రమాలు ఈ తెలుగుతల్లి పాటతో ప్రారంభమయ్యాయి. అప్పుడు ఇంగ్లీషులో ఢిల్లీ నుంచి వెలువడుతూండే, రేడియోకార్యక్రమాల పత్రికలో ఉగాది కార్యక్రమాలను గురించి ముందుగా వివరించే ప్రకటనలో మచ్చుకిగాను, ఈ పాట మొదటి స్టాంజా అంతా ఇంగ్లీషు అక్షరాలలో అచ్చు అయింది. ఇండియన్ లిజెనర్ ఆ పత్రికపేరు.

1948 డిసెంబరు నెలలో ప్రారంభమైన ఆకాశవాణి విజయవాడ కేంద్రంగా ప్రారంభించిన ఒకటి – రెండు వారాలు, ప్రసారాలను ఈ పాటతోనే ప్రారంభించేవారు. ఇది జరిగి అరవై ఏళ్లు కావస్తోంది.

నలభైలలో నేను కళాశాలలోను, ఇతరత్రాను, లలిత సంగీత సభలలో నా గానం వినిపించుకున్నప్పుడు ఈ గేయం పాడమని అడుగుతుండేవారు.

నేను అప్పటికి రేడియోలో పని ప్రారంభించి, ఎనిమిది – పదేళ్ళు దాటేనాటికి, వేరు వేరు విశ్వవిద్యాలయాలలో పదవులు నిర్వహించి మద్రాసు చేరుకున్న శ్రీ సి.ఆర్. రెడ్డి, హఠాత్తుగా రాయపేట వుడ్‌లాండ్స్‌లో నేను పాటలు పాడుతూ వున్న శ్రీ ఆచంట జానకిరాం గది తలుపులు తోసుకుని, అవతలి గదిలో నుంచి నా తెలుగుతల్లి పాటే కూనిరాగంగా పాడుతూ లోపలికి వచ్చి, 'ఏదీ రజనీ ఒకసారి మన ఆనాటి పాట పూర్తిగావినిపించు' అని అడిగేసరికి నాపై ఉద్యోగి మాత్రమే కాక, కుటుంబమిత్రుడైన శ్రీ జానకిరాం పొందిన గర్వమూ, ఆనందమూ ఇంతా అంతా కాదు. 1941లో ఇండియన్ లిజనర్‌లో ఈ పాట స్టాంజాను అచ్చువేయించిన ఆఫీసర్ జానకిరామే ! ■

25, మే, 08, ఆదివారం 'ఆంధ్రప్రభ'

55. ఒక్క కలంపోటుతో....

నేను రచయితని, జగమెరిగిన జంటకవులలో ఒకరికి కుమారుణ్ణి కావడం చేతే కాకుండా వారి కవితా కుటీరంలో భావయిత్రినీ, కారయిత్రినీ, సాధయిత్రినీ, నిత్యకృషితో పోషించుకున్న వాణ్ని కావడం చేత, కవికుమారుణ్ణీ, కుమారకవినీ కూడా ఆయ్యానని ఈ డెబ్బయ్యోయేట కూడా సవినయంగా చెప్పుకోగలవాణ్ణి. ఇల్లు ఒక సాహిత్యకృషి క్షేత్రం. ఇంట్లో అన్నలూ, బావలూ, మావయ్యలూ అంతా కలం పట్టినవారే.

మా పెత్తండ్రి కొడుకు కరదు గట్టిన రాజకీయవాది. మొదటిలో కార్డు హోల్డరూ, వామపక్షనిర్ధ్ధామధామరేవంతుడూనూ. మా సొంత అన్న 50 -55 ఏళ్ల క్రితమే అంతర్జాతీయ సామ్యవాదగీతాన్ని అనువదించి మొదట నాచేతే పాడించాడు.

సాహిత్యం – 'సహితస్య భావం', అది అందరినీ కలిపేదిగానే ఉండాలి గానీ విడదీసేదిగా వుండరాదనేది, సాహిత్యపరుని జవాబుదారీ (కమిట్‌మెంట్) సాహిత్యానికే అన్న ఆదర్శం మా నాన్నగారి వారసత్వంగా నాకు అందింది.

అయితే అది అలా స్థిరపడడానికి కొంత కాలమూ, పరిస్థితులూ, కలిసిరాక పోవడమూ, కలిసిరావడమూ. కొంత గుంజాటన పడ్డాక స్థిరమైన తోవ దొరికింది.

విశ్వవిద్యాలయంలో చదువుతూండిన రెండవ దశకం చివర సంవత్సరాలలో (18, 19, 20) ఒక పక్క ఆదర్శవాదీ, సాంఘిక సంస్కారీ, విద్రోహిగా పరిగణన పొందిన చండీదాసు జీవితాన్ని సంగీతనాటకంగా వ్రాస్తున్న రోజులలోనే నేను చలం, శ్రీశ్రీ, పట్టాభి, జలసూత్రం ఆనాటికి వ్రాస్తున్న తిరుగుబాటు భావాలతో, విశృంఖల ఛందస్సుల్లో రచనలు చేసే ధోరణికి కొంత వరకూ లొంగాను. నా భావకవితాగేయాలతో పాటు ఈ తిరుగుబాటు ధోరణిని రచనలు కూడా కొన్ని పత్రికలలో ప్రచురితమవుతూ వచ్చాయి. భావకవితాగేయాలు 'రజని' పేరుతోను, తిరుగుబాటు గేయాలు 'పూషా' పేరుతోను ప్రచురితం అయ్యాయి.

సాహిత్యదృక్పథం అని ప్రారంభించిన నాటి భావతరంగ శీర్షికలో 'సారస్వతం' అని కూడా చేర్చడానికి కారణం నా ప్రథమ స్వభావం కవిత్వరచన కాగా, ద్వితీయ స్వభావం (సెకండ్ నేచర్) సంగీతం అయి స్థిరపడటం చేత, నన్నేదో భావమో,

ఆవేశమో ఊపినప్పుడు ముందుగా రాగమూ, దానితో లయతో కూడిన గేయరచనా సిద్ధమవుతూ వచ్చాయి.

నా గేయరచనా దక్షతా, గేయనాటికారచనాధోరణీ, సంగీతకల్పనాశక్తీ, నన్ను ఆలిండియా రేడియోకు ఆకర్షించి, నా 21వ ఏట, క్యాజువల్ కళాకారుడుగాను, 22వ యేట నిలయరచయితగానూ రూపొందించాయి. ఆ ఉద్యోగంలో నేను పనిచేసింది రెండేళ్లే. నా గేయరచనా ప్రయోగాలూ, తొలి సంగీత ప్రయోగాలూ అప్పుడే ప్రసారం అయ్యాయి.

'చల్లగాలిలో' – 'ఓ విభావరీ', 'కోపమేల రాధా' వంటి పాటలను రాజేశ్వరరావు పాడటం వల్ల కూడా చాలా జనరంజకత పొందాయి. నా మూలగేయరచనా, ఆయన సంగీతకల్పనా ఒకే విధమైన మనోధర్మంలో కలిసిపోయాయి.

ఆ మధ్య ఒకటికి రెండు వారాలుగా టివిలో 'ఎందరో మహానుభావులు' అని తెలుగు గేయకర్తలనూ, సంగీతకర్తలనూ, గాయకులనూ పేర్కొని, వారికి వందనాలర్పిస్తున్న కార్యక్రమం చూపిస్తున్నారు. ఆ కార్యక్రమంలో 'చల్లగాలిలో' పాటని స్మరించి శ్రీ రాజేశ్వరరావుకి మాత్రం ధన్యవాదాలు చెప్పి గేయరచయిత పేరు స్మరించకపోయిన కార్యక్రమకర్తల సర్వవిషయజ్ఞతను ఎలాగ మెచ్చుకోవాలో తెలియదు.

ఇంతకు ముందు ఒకసారి వ్రాశాను, మద్రాసు రేడియో నుంచి 1944 ప్రాంతంలో ప్రసారం అయిన నా సంగీత కార్యక్రమాలలో నేను మధ్య ప్రాచ్య సంగీతాలాపనలను అవలీలగా చేసి వుండటం విని స్వర్గీయ బి.ఎన్.రెడ్డిగారు, నన్ను రేడియో స్టేషన్ నుంచి డైరెక్టర్ ద్వారా పిలిపించుకుని, తీసుకువెళ్ళి – 'ఓహోహో పావురమా' తమ స్వర్గసీమ సినిమాలో శ్రీమతి భానుమతి ధరిస్తున్న పాత్ర కోసం వ్రాయించారు. దానితోపాటు ఐదారు పాటలను – నేను వ్రాసినా, ప్రభుత్వపు అనుమతి ఇబ్బంది వల్ల క్రెడిట్‌లో మా అన్నయ్య ప్రకటించారని వ్రాశాను.

ఇటీవల ప్రసారం అయిన 'ఎందరో మహానుభావులు' స్పాన్సర్డ్ సీరియల్ 'ఓహోహో పావురమా' శ్రీమతి భానుమతి పాడిన పాటతో ప్రారంభం అయింది. పాటకు ముందు నివాళులూ, జోతలూ, కీ.శే. సముద్రాల వారికి సమర్పించారు, ఒకవ్యాఖ్యాత! ఇందులో పాల్గొన్న వ్యాఖ్యాతలంతా కవులూ, రచయితలూ, ప్లే బాక్ గాయకులూను! నా వ్యాఖ్య 'ఎందరో మహానుభావులు – అందరికీ వందనము'.

ఇప్పుడు ఈ ఆత్మవిమర్శ రావడానికి ముఖ్య కారణం – ఇదే. ఇది నా జీవితధ్యేయమనే – ఆదర్శంతో ఏభై యేళ్ళకు పైగా కొంత అజ్ఞాతంగానూ, కొంత జ్ఞాతంగానూ సినిమా పరిశ్రమల్లోను, బాగా సుజ్ఞాతంగా రేడియోలోనూ అర్పించిన

తన సారస్వత (సాహిత్యసంగీత) సేవకు సమకాలికులలో ఈనాడు సొంత వాద్యగోష్ఠుల ద్వారా పరస్పరాభివందనలు వెదజల్లుకునే సమకాలికులలో గుర్తింపు పొందకపోవడం సహజమే కానీ, అదే ఆత్మవిమర్శకు అవకాశం ఇస్తోంది.

ఒక గేయసాహిత్య చరిత్రకర్త - పెద్ద లావాటి గ్రంథమే - ఆధునిక గేయకవులని గురించి వ్రాస్తూ - ఎన్నో పేరులను స్మరించి, రేడియోలో కూడా కొందరు గేయకర్తలున్నారు. వారి రచనలు ప్రభుత్వ ప్రచార వ్యాపకాలూ, ప్రణాళికా ప్రచారాలకుద్దేశించినవీ అని ఒక్క కలం పోటుతో హతమార్చేశాడు. రేడియోలో పనిచేసి కృతకృత్యులైన వారూ, కీర్తిశేషులైన వారూ అయిన నా సహచరులందరికీ నా సహ సానుభూతి ! ■

01, జూన్, 08, ఆదివారం 'ఆంధ్రప్రభ'

56. నా తొలి కవితలలో తిరుగుబాటు ధోరణులు

1941 జనవరిలో మద్రాసు చేరుకునేసరికే కొన్ని సంగీతాత్మక గేయాలూ, రెండు మూడు గేయనాటికలూ కాక, 'పూషా' అనే కలం పేరుతో నేను అప్పటికప్పుడే వ్రాసి, బంధుమిత్రులకి చదివి వినిపిస్తూ వుండే తిరుగుబాటు ధోరణి కవితలూ సిద్ధం అయ్యాయి. ఫిబ్రవరిలో నా గేయనాటకం రేడియోలో ప్రసారం కావడంతో రేడియోవారు నన్ను నిలయరచయితగా బహుచవకగా బంధించేద్దామనుకుంటే, నేను కాదూ కూడదని ఇవతలే ఉండిపోయాను ఒక ఏడాది పాటు.

అప్పటి నా ఉద్యోగప్రయోగాలలో ఒకటి,రెండు మూడు మాసాల పాటు మహంకాళి శ్రీరామమూర్తి, గోరాశాస్త్రిలతో పాటు ఆనందవాణిలో సబ్ ఎడిటర్ ఉద్యోగం చెయ్యడం! మహంకాళీ, గోరా వేరు వేరు కలంపేర్లతో ఆనందవాణి వారపత్రిక అంతా నింపేసేవారు. ఆనందవాణి వారపత్రికా, వినోదిని కథల మాసపత్రికా, టాంటాం అనే టాబ్లాయిడూ జార్జిటౌన్‌లో 12వ (పేరు మరచాను) వీధిలో ఒక నాయుడుగారి యాజమాన్యంలో ఉండేవి. మహంకాళి ఆనందవాణికి ఎడిటర్, గోరా సహసంపాదకుడూను. నా 'పూషా' పద్యాలు కొన్ని ఆ ఆనందవాణిలో పడ్డ వాటి కటింగ్సు, తన దగ్గరున్నాయని ఒకసారి కుందుర్తి అన్నారు. ఆ రోజుల్లో వినోదిని ప్రత్యేక సంచికను ఒకదానిని ఆంధ్రప్రభలో సహాయసంపాదకుడుగా ఉన్న నార్ల ఎడిట్ చేసేవారు. అందులో 'మధ్యాన్నం' అనే నా పూషా 'పద్యం' ఒకటి పడింది.

"ఇది యెండిన మొండి మధ్యాన్న మది యెండిన
బండ మధ్యాన్నం
హృది మండిన యెండు మధ్యాన్నం
ఇది రోల్సు రాయ్సులో షికారుపోయే
సాయంత్రం యెంత మాత్రం కాదిది.
కూలివాళ్లు పనికై పోయే, బిచ్చగాళ్లు ముష్టికి పోయే
శుభోదయం అంతకంటే కాదిది
ఇది యెండిన మొండి మధ్యాన్నం."

మధ్యతరగతి మానిసి యెండబారుతనానికి సంకేతంగా మధ్యాన్నాన్ని చిత్రిస్తూ రాసిన కవిత అది.

అది 1942. అదే వినోదిని ప్రత్యేక సంచికలో భాగవతుల శంకరశాస్త్రి (ఆరుద్ర) అనే బాలకవి రచించిన ఒక బాలల రూపకాన్ని ప్రకటించారు. ఆ తరువాత కుందుర్తి వారి మధ్యతరగతి మీది కవితలు రావడానికి కొంతకాలం పట్టింది.

ఎనార్కీ (అరాచకం) అనే నా కవిత ఇలా నడుస్తుంది.

"మేం సమాధి నిర్మాతలం, వెస్ట్ మినిస్టర్ అబే, తాజ్మహలూ పిరమిడ్లూ సమాధులనేకం!
అవి మానవవ్యక్తుల సమాధులు! మా నిర్మితిసంఘం సమాధి!
మహాకాల చక్రాన్నంటుక పరిభ్రమణ చేసే శక్తులు పరిక్లమన పొందిన నరులని
పరిప్లవన చేయిస్తూంటే వాహినిలో నలుసును నేనూ పరిక్రమిస్తా వడిగాను!
ఇది ఉద్యత్ హోమానలం! సహేంద్ర తక్షకాయస్వాహా!
ప్రాచీనతలన్నీ కరడై వయస్సుతో వరడై బెరడై వదలకున్న వాసనలన్నీ
సహేంద్రతక్షకాయస్వాహా
వాగనీ మోగనీ చెలరేగనీ విప్లవశంఖం! విలయశంఖం."
అఖండ సమాధి అనే అరాచకభావన రూపొందిన కవిత రెండవ ప్రపంచ యుద్ధపు భావాలు లోతుగా చొచ్చుకుపోయిన యువభావాలు.
కాలచక్రం మధ్యేమార్గాన తవ్వుతున్నాం అఖండసమాధిని వైవిధ్యాలూ,
వైరుధ్యాలూ, వైతథ్యాలూ, వైధవ్యాలూ, వృద్ధ వృద్ధ వృద్ధ వృద్ధతలూ
రూపం దాల్చిన బృహద్గజానికి
కాలచక్రం మధ్యేమార్గాన తవ్వుతున్నాం అఖండసమాధిని
జాతులు భాషలు దేశాలు, ఖండాలు సముద్రాలు
గోళాలు

అరాచకంలో ఎనార్కీలో విప్లవ విలయప్రళయజ్వాలలో
భగ్నం భగ్నం మగ్నం నగ్నం కావాలి
వర్షానంతర ప్రశాంతశారదనభానికి
దేర్ ఈజ్ ఓన్లీ వన్ ఫిట్ టెస్ట్!
సర్వైవల్ ఆఫ్ దీ ఫిటెస్ట్!

వీటిలో త్రిశంకునరకం అనే కవిత, ఉదయఘంటలు అనే కవితాసంకలనంలో పడింది. 'పూషా' రచనగానే!

'ఎందరో స్వర్గం స్వర్గం స్వర్గం అన్నారు!
పుర్రెకొక బుద్ధి! జిహ్వకొకరుచి! మనిషి మనిషికీ తలకొకస్వర్గం!
పెద్దలో మొద్దులో అన్నారు. దేవుని ప్రతిబింబమె మానవుడని!
మొన్నటి థింకర్ ఒకడన్నాడు మానవప్రతిబింబమె దేవుడని!
'అదీ యిదీ కూడా కాదంటా, సైతాన్ ప్రతిబింబం మానవుడో
మానవ ప్రతిబింబమె సైతానో అంటా కాదనే దెవరంటా!
శంకరుడొకడూ గౌతముడొకడూ ముండితమస్తకులై అన్నారు.
'లోకం శోకమయం సమస్తం' సర్వం దుఃఖం ఖల్విదంజగత్!
ముందో వెనకో తెలియని అటు స్వర్గం అనేది లేనేలేదు.
ముందో వెనకో తెలియని యిటు నరకం లేదన గుండెలేలేదు.
ముందూ వెనుకా తెలియని ఇటు అంతా నరకం, చింతానరకం!
రావాలిప్పుడు కావాలిప్పుడు కుశంకునరకం, త్రిశంకునరకం!

ఈ రచనలలో కలిగిన దిగులునూ, నైరాశ్యాన్నీ, నా హృదయంలో భరించడం గాని, దానిని నా చుట్టు పక్కల వాళ్ళకి వ్యాపింపచెయ్యడం గాని ఇష్టపడని మధురస్వభావాన్నీ ఆశావాదాన్నీ, వైరుధ్యాల సమన్వయమనోధర్మాన్నీ నాలో క్రమంగా రూపొందించుకోవడం చేత, 50లలో వ్రాసిన చీకటీ వెలుగూ అనే గేయంలోని సమన్వయదృష్టితో ఈ వ్యాసం ముగిస్తాను (దీపావళి గేయం 954).

తానే వెలుగట, పరుడు చీకటట, తానే లోకశాంతి రక్షకుడట!
తానే పరుడని పరుడూ తానని తానెరింగితే అదే స్వర్ణయుగం!

*　　*　　*

చీకటి వెలుగును లోగొనకుండా, చీకటిని వెలుగు పైకొనకుండా చీకటీ వెలుగూ చేరి ఏకమై

లోకశాంతి రక్షించే కాలం తిరుగును గిరగిర తిరిగి
మరుగుపడి మరల తిరుగబడి తిరుగును మరి మరి
ఇరులు కురియు అమావాస్య రేయి, ధరణి శాంతికై పండుగ సేయ
వరుస ప్రమిదలై స్నేహదీపములు నరుని మనసు ముంగిట వెలిగేయా?
తిరుగును గిరగిర తిరిగి మరుగు విడి, అవే భావములు కలుగును మరి మరి! ■

08, జూన్, 08, ఆదివారం 'ఆంధ్రప్రభ'

57. ఢిల్లీలో దక్షిణ భారత ప్రసారసేవ

అది 1942 జులై తర్వాత. నేను జులై 1వ తారీఖున ఆలిండియా రేడియో (అప్పటికింకా ఆకాశవాణి కాదు) మద్రాసు కేంద్రంలో రచయితగా, కళాకారుడుగా చేరాను.

రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభించి మూడేళ్ళైంది. మన దేశంలో బ్రిటీష్ పరిపాలన నిరంకుశంగా సాగుతున్న రోజులు, జర్మనీ, ఇటలీ, జపానులు అక్షరాజ్య కూటంగా ప్రపంచం అంతటా ఫాసిజం నెలకొల్పే అడకత్తెర వ్యూహంలో, అటు యూరప్‌లో జర్మనీ, ఆఫ్రికాలో ఇటలీ, ఇటు ఆసియాలో జపానూ, దేశం తర్వాత దేశాన్ని దురాక్రమణ కావిస్తున్నాయి. బ్రిటను, అమెరికా, రష్యాలు అక్షరాజ్యకూటమికి వ్యతిరేకంగా ఆయారంగాలలో యుద్ధం కొనసాగిస్తూ భారతదేశంలో కూడా సైన్యాల్ని రిక్రూట్ చేస్తున్న రోజులు. 1942 మొదటి 3, 4 మాసాలలో మద్రాసు జపాను విమాన దాడులూ, సబ్ మెరీన్ దాడులూ రుచి చూసింది. విమాన దాడి హెచ్చరిక రావడంతోనే బ్లాక్ అవుట్! చీకటిలో ఏఆర్‌పి షెల్టర్‌లలో దాక్కొంటూండేవాడిని – రేడియోలో నాతోటి ఉద్యోగులతో పాటు.

అప్పుడు భద్రత (సెక్యూరిటీ) కోసం పది కిలోవాట్ల మద్రాసు షార్ట్‌వేవ్ ప్రసారయంత్రాన్ని ఢిల్లీకి పంపించేసి, ఎడిషినల్ సౌత్ ఇండియన్ సర్వీస్ అనే పేర ఢిల్లీ నుంచి తమిళ, తెలుగు కార్యక్రమాలు ప్రసారం చేసేవారు. 1945లో ప్రపంచయుద్ధం పూర్తయ్యేదాకా ఈ ప్రసారాలు ఢిల్లీ నుండి కొనసాగాయి. ఈ సర్వీస్ ఒక అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్ (సహాయ కేంద్ర నిర్దేశకుడు) అజమాయిషీలో నడిచేది. తెలుగు, తమిళ భాషలలో కార్యక్రమాలను ప్లాన్ చేసి, రచనలూ, నాటకాలూ, ప్రసంగాలూ, పాటలు తయారు చేసి, ప్రసారం చెయ్యడానికి నిలయ కళాకారులూ, వాద్యకారులూ, తమిళమూ, తెలుగూ తెలిసిన అనౌన్సర్లూ, రచయితలూ, ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌లూ పనిచేసేవారు. ఆ రెండు మూడేళ్ళలో తెలుగు కార్యక్రమాలను తయారు చేసి విశిష్టత సంపాదించిన కొందరు ప్రముఖుల సేవను స్మరించడం కోసమే, ఈ భావతరంగ విన్యాసం. శక్తివంతమైన ప్రసారయంత్రం ఢిల్లీ వెళ్ళిపోయింది. మద్రాసు నుంచి తెలుగువారికోసమని మేం ప్రసారం చేసే కార్యక్రమాలు అంతకంటే దుర్బలమైన ప్రసార యంత్రం ద్వారా

వెలువడి, ఆంధ్ర ప్రాంతాలలోని శ్రోతలకు ఆ కార్యక్రమాలు కలిగించే తృప్తికన్నా ఢిల్లీనుంచి వెలువడిన ప్రసారాలు ఎక్కువ సంతృప్తిని ఇస్తుండేవని, ఆ నాటి శ్రోతల ఉత్తరాల ద్వారా గాని, పత్రికలలోని అభిప్రాయవేదిక ద్వారా గాని తెలుస్తుండేది. ఏ.ఎస్.ఐ.ఎస్. అనే ఈ ఎడిషనల్ సౌతిండియన్ సర్వీసుకు సహాయకేంద్ర నిర్దేశకులుగా స్మరణీయ కార్యక్రమాలకు కారకులైన అధికారులలో డాక్టర్ అయ్యగారి వీరభద్రరావు ఒకరు. అప్పటి ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌లలో చెప్పుకోదగినవారు కీ.శే.యండమూరి సత్యనారాయణరావు.ఇప్పుడు కెనడాలోని ఇండియన్ ఎంబసీలో వున్న ఎస్.కె. కన్నమ్మ! ఈ సర్వీస్‌కు నాటకాలు వ్రాసి, సర్వీస్ కార్యక్రమ ప్రసారాలకు అనౌన్సర్‌గా పనిచేసి, ఆనాటి తెలుగు శ్రోతల ఆదరాభిమానాలను చూరగొన్న నిలయరచయితా, కళాకారుడూ బుద్ధవరపు నాగరాజామాత్యుడు. పదేళ్ళ క్రితం వరకు బెంగళూరు ఆంధ్రప్రభ దినపత్రిక సహాయ సంపాదకుడుగా పనిచేసి రిటైర్ అయ్యారు. ఈ సర్వీస్‌లో ప్రసారం అయిన తెలుగు నాటకాల్లో ఎక్కువ సంఖ్యలో నాగరాజామాత్యుని రచనలే. అప్పుడప్పుడు యండమూరి సత్యనారాయణరావు రచనలూ, డాక్టర్ అయ్యగారి రచనలూ కూడా ప్రసారం అయ్యేవి. ఢిల్లీలో ఈ తెలుగు నాటకాలలో పాల్గొనే తెలుగు కళాకారులు ఆనాడు ఉండే వారా అని ప్రశ్న కలగవచ్చు. ఢిల్లీలో వార్తా ప్రసార విభాగంలోను, ఇతర శాఖలలోను, ఇతర ప్రభుత్వ కార్యాలయాలలోనూ పనిచేసే ఉత్సాహులు ఆ నాటకాలలో పాల్గొనేవారు. వారిలో కొందరి పేరులు, కపిల కాశీపతి, కలపటం రామగోపాలరావు, పన్యాల రంగనాథరావు, వారణాసి సుబ్రహ్మణ్యం, క్రొవ్విడి లక్ష్మన్న, గంగాధరభట్ల కామేశ్వరరావు, వేణు మొదలైన వారు పురుషపాత్రలకీ, స్త్రీ పాత్రలకి మా చెల్లెలు అనూరాధ (శ్రీమతి నాగరాజు), విశ్వనాథ అచ్యుతదేవరాయలు శ్రీమతి కమలా, ఇంకా అలమేలు మంగాదేవీ, మామిళ్ళపల్లి రాజ్యలక్ష్మి పాల్గొనేవారు.

నాగరాజామాత్యుడు ఆనాడు వ్రాసి ప్రసారం చేసిన నాటికలలో తెలుగు శ్రోతలను ఉర్రూతలూగించినవి 'నారాయణా, సీతయ్యా' అనే ఇద్దరు స్నేహితుల ముఖ్యపాత్రలతో సాగిన సాంఘిక హాస్యనాటికలు. వీటిలో ఆంగ్ల రచయితలైన బెర్నార్డ్ షా, వోడ్‌హవుస్‌ల సంవాదాత్మకహాస్యమూ, సంఘటనలలో ఇమిడిన హాస్యమూ, ఆనాడు మన శ్రోతలకి ఎంతో ఆదరపాత్రమైనాయి. ఆ నాటకాలు సీరియల్స్ కావుగాని, అవే పాత్రలతో కూడిన సంఘటనలు కూర్చి వ్రాసినవి పుష్పబాణవిలాసము, రాధామాధవమూ, మీసాల పక్షులూ, రసరాట్టు అనేవి. వాటిలో రెండు, మూడు నాటకాలు ఢిల్లీలోను, మద్రాసులోను, ఆంధ్రదేశంలోని కళాశాలల్లోను యువకులు రంగస్థలంపైని కూడా ప్రదర్శించేవారు. ఆరోజులలో 'అమాత్యుడు' వ్రాసి ప్రసారం చేసిన పౌరాణిక, చారిత్రక

నాటకాలలో చెప్పుకోతగినవి. దక్షాధ్వరధ్వంసమూ, నరకాసురుని పునరాగమనమూ, విశ్వనాథ నాయకుడూను! దక్షాధ్వరధ్వంసంలో డా॥ అయ్యగారి వీరభద్రరావు గారు దక్షుడు. నరకాసురుని పునరాగమనంలో నరకాసురుని పాత్రా ఆయనదే. ఈ పౌరాణికపాత్రల నిరూపణలో ఏదో ఒక కొత్తదనం చూపడానికి ప్రయత్నించారు రచయిత. ఆ పద్ధతి శ్రోతలకు ఆకర్షణీయం అనిపించేది.

అయ్యగారి వీరభద్రరావుగారికి గురజాడవారి కన్యాశుల్కం ఎంతో ఇష్టం. ఆయన ఆ నాటకంలో స్వయంగా లుబ్ధావధాన్లు పాత్ర నిర్వహించేవారు. ఆనాటి ఢిల్లీ ఆంధ్రులలో ఈ వ్యాసంలో ముందుగా చెప్పిన ప్రముఖులు తలో వేషం వేసి ఢిల్లీలో కన్యాశుల్కం నాటకం రంగస్థలంపై ప్రదర్శించారు. కపిల కాశీపతి గిరీశం, మామిళ్ళ పల్లి వేణు వెంకటేశం, అయ్యగారివారు లుబ్ధావధాన్లు, కలపటం రామగోపాలరావు రామప్పంతులూ, క్రొవ్విడి లక్ష్మన్న అగ్నిహోత్రావధాన్లు, ఎస్.కె. కన్నమ్మ మధురవాణీ, మామిళ్ళపల్లి రాజ్యలక్ష్మి బుచ్చెమ్మా, ఆనాటి వేషాలతో, సెట్టింగులతో ఒకటి రెండు ఛాయాచిత్రాలు అయ్యగారి ఆల్బంలో కనబడుతూండేవి.

మన రేడియో ప్రసార చరిత్రలో ఈ ఏ.ఎస్.ఐ.ఎస్. సర్వీసు పాత్ర కుతూహల కారియైన ఇంటర్లూడ్. ■

15, జూన్, 08, ఆదివారం 'ఆంధ్రప్రభ'

58. వేదవ్యాస గురుడు

హోమరు కానీ వర్జిలు కానీ
హెరోడోటస్ కానీ తూకిడైడిస్ కానీ
ప్లేటో కానీ అరిస్టాటిల్ కానీ
అందరినీ కలిపి ఒక ప్రోగు చేసినా కానీ
అతనికి సాటి రారు!

అలాంటి అతీత ప్రతిభాశాలి అని పాశ్చాత్య సాహిత్యవేత్తల చేత మెప్పు పొందిన ధీమంతుడూ, లోకగురువూ వేదవ్యాసుడు.

"వ్యాసం వశిష్ఠ నప్తారం శక్తేః పౌత్రం అకల్మషమ్
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్!!"

నవవధూవరులు విధిగా నక్షత్రమండలంలో పెండ్లినాడు దర్శించే అరుంధతీ దేవికి భర్తా, సప్తర్షులలో ఒకడూ అయిన వశిష్ఠునికి ముని మనుమడూ, శక్తికి మనుమడూ, సిద్ధాంతకర్తా అయిన పరాశర మహర్షి కొడుకూ, వేదాంతీ, భాగవత కథాకథనదక్షుడూ అయిన శుకమహర్షికి తండ్రి అయిన తపోనిధీ, అకల్మషుడూ అయిన వ్యాసమహర్షికి నమస్కారం!

ఆకాశగమనం చేస్తూండిన ఉపరిచరవసువనే భూలోకపు రాజుకీ, చంద్రిక అనే అప్సరకీ కారణజన్మగా పుట్టిన సత్యవతిని, బెస్తవారి కులం పెద్ద అయిన దాశరాజు పెంచుకుంటాడు. తండ్రి ఆ కన్యారత్నాన్ని యమునానదిలో పడవ నడిపే పనికి పురమాయిస్తాడు. ఒకనాడు పడవలో పయనం చెయ్యడానికి వచ్చిన పరాశరమహర్షికీ, సత్యవతికీ తాత్కాలికదాంపత్యం వల్ల సద్యోవిద్యావేత్తగా వ్యాసుడు జన్మిస్తాడు. నల్లని మేనిచాయవాడు కనుక కృష్ణుడనీ, యమునా నదిలో లంకలో పుట్టడం చేత ద్వైపాయనుడనీ, రెండూ కలిపి కృష్ణద్వైపాయనుడనీ అసలు పేరు. రేగుచెట్ల తోటలో తపస్సు చేశాడు గనుక బాదరాయణుడు. ఒకేరాశిగా ఉండిన వేదాలను క్షుణ్ణంగా పరిశీలించి, క్రోడీకరించి, ఋగ్, యజుస్, సామ, అథర్వణాలనే నాల్గు వేదాలుగా విభజించిన ఖ్యాతి వల్లనే ఈయనకి వేదవ్యాసుడనే పేరు వచ్చింది. వ్యాసుడి తల్లి సత్యవతి, తరువాత కొన్నాళ్ళకు హస్తినాపురంలో కురువంశరాజమాత అవుతుంది.

ఆమె కుమారుడు, రాజూ అయిన విచిత్రవీర్యుడు, సంతానం లేకుండా మరణించడం చేత, రాజ్యానికి వారసుల కోసం, తల్లి అనతిపైని, వ్యాసుడు దేవరన్యాయం ప్రకారం, తనకు వరుసకు మరదళ్ళయిన అంబికాంబాలికలకు, ధృతరాష్ట్రపాండురాజులను ప్రసాదిస్తాడు. వీరిద్దరి పుత్రులూ కౌరవులూ, పాండవులూ. ధృతరాష్ట్రుడు పుట్టంధుడు కావడం చేత, పాండురాజు రాజ్యపాలన చేస్తూ మరణించడం, ఆ తరువాత వ్యాసుని సలహాపైనే ధృతరాష్ట్రుడు, ధర్మరాజుకు యువరాజ్యాభిషేకం చేయడం, ఆ తరువాత కురుపాండవ దాయభాగవివాదంలో కౌరవుల దుశ్చర్యలు, పాండవుల ఇక్కట్లు ఫలితంగా రెండు పక్షాలకు దేశంలోని రాజ్యవర్గాల వారి సహాయంతో కురుక్షేత్రయుద్ధం జరుగుతుంది. ధర్మపక్షమైన పాండవులు గెలుస్తారు కాని జననాశం తప్పలేదు. ఈ గాథంతా వ్యాసుడు జయేతిహాసంగా రచించాడు. వ్యాసశిష్యుడు వైశంపాయనుడు దీనిని భారతంగానూ, అతని శిష్యుడు సూతుడు మహాభారతంగానూ పెంచి రచించారు. భారతగాథ కేవలం భరత వంశవీరుల యుద్ధగాథే కాదు. దేశ కాల పాత్ర వ్యత్యాసం లేకుండా ఈర్ష్యాద్వేష లోభాదిదుర్గుణాలకూ, శాంతి క్షమా దాంత్యౌదార్యాది గుణాలకూ, చెడుగుకూ, మంచికీ కలకాలంగా జరిగే పోరాటంలో చివరకు ధర్మపక్షమే జయిస్తుందని, వ్యాసమహర్షి రచించిన ఇతిహాసం ప్రకటించింది. ధర్మపరత, నైతిక ప్రమాణాలతో, సాంఘికరాజకీయ సాంస్కృతికాదార్శాలలో నాటి నుంచి నేటిదాకా ప్రపంచం అంతటితో శిరోధార్యం అయిన భగవద్గీత ఈ భారతంలో కృష్ణభగవానుడు అర్జునుడికి యుద్ధభూమిలో యిచ్చిన సందేశం! సార్వకాలిక సార్వజనీన సనాతన ధార్మికసందేశం! గీతకు మనవారు ఉపనిషత్ గౌరవపీఠం ఇచ్చిన సంగతి అటుంచితే, బాదరాయణుడు చేసిన మరొక గొప్ప పని బ్రహ్మసూత్రాలను రచించటం. ఉపనిషత్తులలో చెప్పబడిన గొప్ప గొప్ప సత్యాలను సూత్రరూపాలలో రచించిన మహామహుడు! (తత్త్వమసి అంటే ఆ కనబడే విశ్వమే అనగా బ్రహ్మపదార్థమే నీవు మొదలైనవి).

ప్రాచీన మధ్యయుగాల నడిమి కాలంలో కొందరు ఋషులు దక్షిణాపథానికీ, దక్షిణ భారతానికీ వలసపోవడాన్ని పాశ్చాత్య చరిత్రకారులు ఆర్యనైజేషన్‌గా చిత్రించారు. అంటే ఆర్యులు కాని జాతులను ఆర్యసంస్కృతి పరులుగా మార్చే యత్నంలో ఆ ఋషులు, దక్షిణానికి వెళ్లారని ఆ చరిత్రకారుల వ్రాతలు! మన పురాణేతిహాసాలను బట్టి చూస్తే ఆ నాటి భారతదేశంలో ఆర్యఅనార్యులనే విభజనమే కనబడదు. కాగా యక్ష, గరుడ, నాగ, గంధర్వ, విద్యాధర, కిన్నర, కింపురుష, అభీర, భిల్లనిషాదులు, పురాణేతిహాసాలలోని భారతదేశపు జాతులు. ఇంతకీ ఋషులు ఆర్యావర్తం వదిలి వెళ్ళి చేసిన పని వివిధ జాతుల మధ్య సాంస్కృతిక సమైక్యసాధనే! అగస్త్యుడు చేసిన పని అదే. వ్యాసుడు కూడా

కాశీని వదిలి దక్షిణ దేశం వెళ్ళాలని కాశీవిశ్వేశ్వరుడే శాసించినట్లు, శ్రీనాథుడు రచించిన కాశీఖండ, భీమఖండ పద్యకావ్యాలలో కనిపిస్తుంది..స్కాందపురాణాన్ని అనుసరించి శ్రీనాథుడీపద్యకావ్యాలు వ్రాశాడు.

'దక్షుని సవనాగారము దాక్షారామంబు శివుడు తన్మధ్యమునన్
సాక్షాత్కరించి యుండుట మోక్షము భోగంబు బ్రాతెముజ్జగములకున్'

కాశీని వదిలిన వ్యాసుడు, పురుషోత్తమక్షేత్రం (పూరి), శ్రీకూర్మం, సింహాద్రి, పీఠికాపురం (పిఠాపురం), చాళుక్య భీమవరం, సర్పవరాల మీదుగా ప్రయాణించి, పైల సుమంత జైమినివైశంపాయనాది శిష్యులతో సహా ద్రాక్షారామం చేరుకుని, అక్కడ అగస్త్యలోపాముద్రలను కలుసుకుంటాడు. వారూ, వీరూ కష్టసుఖాలు, వలస కారణమైన గాథలు చెప్పుకుని, అంతా కలిసి రెండు జాముల వేళ ఆకాశమండలానికెగసి, భూమండలానికి నడుమ కమలంలాగ ఉన్న ఆంధ్రభూమిని దర్శిస్తారు. ఆ కమలంలోని తేనెసప్తగోదావరి జలం! బ్రహ్మాసంవేద్యాది బహుతీర్థాలు దాని రేకులు. చుట్టూ వున్న అందమైన పుణ్యస్థలాలు అకరువులు! ఆ కమలానికి నాళం పక్కనే వున్న (లవణ)సముద్రతీరం (కోస్తా ఆంధ్ర)! దక్షవాటిక భీమరేశ్వరాలయం దానికర్ణిక! ఆ కమలానికి హంసం భీమేశ్వర శివదేవుడు! గౌతమీ సింధు కౌంతేయ కణ్వనదులూ, తుల్యభాగా, ఏలేరు, ఆ కమలానికి 'తుమ్మికొనలు!' ఇదీ వ్యాసాగస్త్యుల చేత సపరివారంగా గగనమండలం నుంచి శ్రీనాథమహాకవి దర్శింపచేసిన ఆంధ్రభూభువనసౌందర్యం! "ఆంధ్రభూభువనమధ్యము పుండరీకము." ■

13, జూలై, 08, ఆదివారం 'ఆంధ్రప్రభ'

గాంధర్వవేదం - గాంధార గ్రామం

ద్వారకా ఆర్యులే - డోరిక్ ఆర్యులు

59. మన సప్తశ్వర పరిణామం - పైథాగోరస్ పై ప్రభావం

వేద సంస్కృతి ఆధారంగా ఉద్భవించినదీ, భారతదేశానికి వాయువ్య సరిహద్దులో ఉండే గంధర్వజాతి జనులు అవలంబించిన సంగీతశాస్త్రమూ 'గాంధర్వవేదం' అయింది.

రామాయణం ప్రారంభంలోనే 'కోన్వస్మిన్ 'సాంప్రతంలోకే' అని - వాల్మీకి అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పిన దేవర్షి నారదుడు, పురుషోత్తముడైన రాముని చరిత్రమును రామాయణముగా రచింపుమని ప్రోత్సహించిన నారదుడు మొదటినారదుడు. భాగవత భారతాలలో శ్రీకృష్ణునికీ, అర్జునునికీ గయోపాఖ్యానం వంటి ఉపాఖ్యానాలలోను, సత్యభామకి అమరావతిలోని పారిజాత వృక్షముపైని ఆశ కలిగించి, అమరావతిపై శ్రీకృష్ణునితో కలిసి దండయాత్ర చేయించిన నారదుడు రెండవ నారదుడు. ఇతడే - సంగీతశాస్త్రమైన శిక్షా శాస్త్ర రచయిత. 'షడ్జం వదతిమయూరః' ఇత్యాది సమాచారాన్ని శాస్త్రంగా ఉపదేశించినవాడు, సంగీతమకరందముగా చత్వారిం శచ్ఛతరాగ రచయితా మూడవ నారదుడు.

వైదిక సంగీతం : 'మార్గ' : 'గాంధర్వల' :

"అత్యర్థం ఇష్టం దేవానాం తదా ప్రీతికరం పునః
గంధర్వాణాం ఇదంయస్మాత్ తస్మాత్ గాంధర్వం ఉచ్యతే"
- (సంగీత రత్నాకరం - శార్ఙ్గదేవుడు)

దివ్యజీవులైన దేవతలకు ప్రీతికరమూ, మానవాతీతులుగా పరిగణితులైన గంధర్వులకు ఇష్టమూ అయిన ప్రాచీన భారతపు వైదిక సంగీతాన్ని - అంటే సామవేద సంగీతాన్ని మార్గ సంగీతం అనీ, గాంధర్వం అనీ అనేవారు.

సృష్టికర్త అయిన బ్రహ్మతో సంబంధం :

బ్రహ్మలోకం నుంచి నాట్యవేదపు - అవతరణ గురించి చెపుతూ, నాట్యశాస్త్ర కర్తయైన భరతముని - "క్రీడగా ప్రదర్శించతగ్గ ఒక ఆటను కోరుకుంటున్నాం. దయచేసి ప్రసాదించు" అని ప్రార్థించిన దేవతలతోనూ, ఋషులతోనూ సృష్టికర్తయైన పితామహుడు (ద్రుహిణ బ్రహ్మ) ఇలా అన్నాడని వ్రాశాడు.

"సర్వశాస్త్రార్థ సంపన్నం సర్వశిల్ప ప్రవర్తకం
నాట్యాఖ్యం పంచమం వేదం సేతిహాసం కరోమ్యహం,

జగ్రాహ పాఠ్యం ఋగ్వేదాత్ సామభ్యో గీతిమేవచ
యజుర్వేదా దభినయం రసాన్ అథర్వణా దపి !"

"శాస్త్రాలన్నిటిసారంతో సంపన్నమైనదీ, లలిత కళలన్నిటికీ ఒరవడిగా ఉండగలదీ అయిన ఐదవ వేదాన్ని నాట్యవేదం అనే పేర సృష్టిస్తాను. ఇతిహాసాలలోని గాథలు ఇతి వృత్తాలుగా, ఋగ్వేదం నుంచి ఛందములను, సామవేదం నుంచి సంగీతాన్ని, యజుర్వేదం నుంచి నటనమును, అథర్వణవేదంనుంచి రసాలను సంగ్రహించి, ఈ నాట్యవేదాన్ని సిద్ధింపజేస్తాను'– (దీనిని భరతుడు మునుల ద్వారా అప్సరసల ద్వారా భూలోకంలో ప్రవర్తింపజేయగలడు) అని పితామహుడు సెలవిచ్చాడు.

లౌకిక సంగీతం – 'దేశి' – 'గానం'

సామవేదం నుంచి ఆవిర్భవించిన వైదిక సంగీతం లేక 'మార్గ' సంగీతం కంటే భిన్నమైన ప్రాచీన భారతీయ సంగీతం 'దేశి' – లేక – గానం – లేక – లౌకిక సంగీతం ! ఇది ఆనాటి దేశి జనానీకంలో దేశపాలకుడు మొదలు గోపాలకుని వరకు అడవులకు, కొండలకు చెందిన గిరిజన, వనచరజాతులదాకా తమ నిత్య జీవితం వినోదాలలో పాడుకొనే సంగీతం.

వైదిక, పురాణ, ఇతిహాసయుగాలలో భారతీయ సమాజం :

వైదిక, పురాణ, ఇతిహాస కాలంలో భారతీయ సమాజంలోని వివిధజాతుల ప్రజలను గురించి తెలుసుకోవాలంటే – ఆధునిక మనుజ శాస్త్రజ్ఞుల పాశ్చాత్య పద్ధతి ననుసరించిన ఆర్య, ద్రావిడ, ఇత్యాది విభజనను ప్రక్కకు నెట్టి – మన వేద, పురాణేతిహాసాలలో తరచుగా వినబడే సుర, అసుర, రాక్షస, యక్ష, గంధర్వ, విద్యాధర, కిన్నర, కింపురుష, గరుడ, నాగ, కిరాత, నిషాద, భిల్ల, శబరాది జాతులను పరిగణనలోకి తీసుకొని తీరాలి. ప్రాచీన భారతపు లౌకిక సంగీతం లేదా దేశిసంగీతం ఈ జాతులవారందరి కృషి ఫలితం అని చెప్పాలి. మన సప్తస్వరాలలోను మూడవ దాని పేరు గాంధారము, – ఏడవదాని పేరు నిషాదమూ – ఈ స్వరాలకు ఆ పేరులు రావడానికి ఆ జాతులపేర్లతో సంబంధం కారణం కాదని చెప్పడం కష్టం.

సప్తస్వర పరిణామం – ప్రాతిశాఖ్యులు – శిక్షాశాస్త్రాలు :

వైదిక సంగీతంలోని ఏకస్వర గాయన పద్ధతీ, ద్విస్వర గాయన పద్ధతీ, త్రిస్వర గాయనపద్ధతి, చతుస్వర గాయనపద్ధతీ క్రమముగా సప్తస్వరాలుగా పరిణామం చెందినట్లు ఋక్ ప్రాతిశాఖ్య ద్వారా తెలుస్తుంది.

"త్రిషమంద్రాదిషుస్థానేషు ఏకైకస్మిన్ సప్తసప్తయమాఃభవన్తి !"

మంద్ర, మధ్య, తార, అను మూడు స్థానముల (స్థాయుల) లోను ఒక్కొక్కదానికి ఏడేసిచొప్పున నియతి గల స్వరాలకు యమ(ము) అని అవి ఏర్పడిన నాటి పేరు. వేదగాన స్వరాలకు, ప్రాతిశాఖ్యలనాటి సప్తయమములుగాను మార్గసంగీత సప్తస్వరాలుగాను క్రమంగా లౌకిక సంగీతపు సప్తస్వరాలుగాను పరిణమించిన విషయమును శాస్త్రబద్ధం చేసి నారదీయ శిక్షా శాస్త్రముగా మనకు అందించినవాడు నారదుడు : శిక్షా శాస్త్రంలోని నారద శ్లోకం :

"సప్తస్వరాన్ త్రయోగ్రామాః మూర్ఛనాస్తు ఏకవింశతిః
తానా ఏకోన పంచాశత్ ఇత్యేతత్ స్వరమండలమ్!! "

స్వరాలు ఏడు : గ్రామాలు మూడు, మూర్ఛనలు ఇరవై ఒకటి. తానాలు నలభైతొమ్మిది. లౌకిక సంగీతపు పునాది సూత్రాలను వివరిస్తూ నారదుడు వైదిక సంగీతంలోని ఏయే స్వరాలూ లౌకికసంగీతంలో ఏయే స్వరాలుగా వ్యవహారంలోకి ప్రవేశించాయో ఈ క్రింది శ్లోకంలో చెప్పాడు.

"యస్సామగానాం ప్రథమః సవేణోర్మధ్యమ స్వరః
యో ద్వితీయః స గాంధారన్ తృతీయస్తు వృషభః స్మృతః
చతుర్థః షడ్జ ఇత్యాహుః పంచమోధైవతోభవేత్
షష్ఠో నిషాదో విజ్ఞేయః సప్తమః పంచమ స్మృతః

సామసప్తకంలోని స్వరం పేరు	**మార్గ/లౌకికసంగీత పరిణామంలో అదే స్వరానికి పేరు**
ప్రథమ	మధ్యమం (వేణువులోని మధ్యమం)
ద్వితీయ	గాంధారం
తృతీయ	ఋషభం
చతుర్థ	షడ్జం
పంచమం(మంద్రం)	ధైవతం
షష్ఠ (అతిస్వార్య)	నిషాదం
సప్తమ (కృష్ట)	పంచమ

గంధర్వజాతి, నారదుడు :

"తతో హాహా హూహూశ్చైవ నారదస్తుంబురు స్తథా
ఉపగాయితుం అరబ్ధాః గాంధర్వకుశలారవిన్
షడ్జమధ్యమ గాంధార గ్రామత్రయ విశారదాః"

షడ్జ మధ్యమ గాంధార గ్రామాల ప్రయోగంలో విశారదులై గాంధర్వ కళలో

కౌశల్యానికి ఆరంభకులుగా పేరుపడిన గంధర్వులలో హాహా హూహూ, నారదుడు, తుంబురుడూ గణనీయులని మార్కండేయ పురాణం చెపుతుంది. వీరు కాక పర్వతుడు, స్వాతి మొదలైన వారి పేరులు కూడ కనబడతాయి.

స్వామి ప్రజ్ఞానానంద 'హిస్టరీ ఆఫ్ ఇండియన్ మ్యూజిక్' లో గంధర్వజాతిని గురించి ఇలా వ్రాశారు. క్రీ.పూ. 545 ప్రాంతాన వాయవ్య భారతంలోని గాంధారం అనే ప్రాంతీయ విభాగం సంగీత కళాకుశలతకు పేరుపడింది. గంధర్వులనే జాతి ఆ విభాగంలో నెలవులు ఏర్పరచుకొన్నారని ప్రాచీన సాహిత్యంలో తెలుస్తుంది. వారు మానవాతీతులనీ, దేవయోనులనీ, గీత నృత్యవాద్య కళాకోవిదులనీ ప్రసిద్ధి పొందారు. వారు పాడే గానశైలి వైదిక సంగీతానుసారియై గాంధర్వం అని పేరుపొందిందని - 'నాట్యశాస్త్రంలో భరతముని ఉటంకించాడు. పాశ్చాత్య సిద్ధాంతుల అంచనా ప్రకారం భరతముని క్రీ.పూ. 5 శతాబ్దాల నాటివాడు.

గాంధార, గాంధారి, గంధర్వ, గాంధర్వం :

మన సంగీతంలోని సప్తస్వరాలలోను మూడోదానికి గాంధారం అనే పేరు రావడానికి, మహాభారత కాలంనాటి గాంధార నగరం, రాజ్యం ఆ పేరుతో ప్రసిద్ధి పొందడానికి (నేటి ఆఫ్ఘనిస్తాన్ ఆగ్నేయ పరగణాలోని కాందహారే అది కావడానికి) ప్రాచీన భారతీయ సంగీతంలో గ్రామత్రయంలో గాంధార గ్రామానికి, నాటి నుంచి పరిణామగతిలో వినబడుతూన్న గాంధారి, రక్త గాంధారి, దేవ గాంధారి, శుద్ధ గాంధారి వంటి రాగాల ప్రచారానికి, పదబంధ పరిణామంలో గంధర్వ జాతియులతో విడదీయరాని ముడి ఏదో ఉండి ఉండాలని స్పష్టమవుతూ ఉంటుంది.

గంధర్వజాతి జనులకు ఆ కాలపు భారతీయులలో దేవతలతో సమానగౌరవం ఉండడమూ, వారికి పవిత్రమైన వైదిక సంగీతానికి పరిణామరూపమైన 'మార్గ' లేక 'గాంధర్వం'తో విడదీయరాని అనుబంధం ఉండడమూ, భారతీయ వైవాహిక ఆచారాలలో ముందుగా పెండ్లికూతురుని గంధర్వుడొకడు తన వశంలో పట్టి ఉంచగా అతనిని ప్రార్థించి ఆ చెర నుంచి ఆమెను తప్పించడం కోసం ప్రత్యేక మంత్రపఠనం నాటినుంచి నేటివరకూ జరుగుతూ ఉండటం -ఇవన్నీ కలిపి ఆలోచిస్తే, గంధర్వజాతి ఆనాటి భారతీయ సమాజావరణ హద్దుల కావల అంటే ఆర్యావర్తానికి అవతలి ప్రాంతాలనుంచి వచ్చిన విదేశీయులుగా భావించడానికి అవకాశం బొత్తిగా కనబడదు.

ప్రదర్శన కళలలో అత్యంత కౌశలం కలిగి, గుర్రపుస్వారీలో అతీతనైపుణ్యంతో కొండలమీద నివాసం కనుక గెరిల్లాయుద్ధపు (మాయా) యుద్ధప్రక్రియలతో, హఠాత్తుగా కనబడుతూండడమూ, ఆకస్మికంగా మాయం అవుతూండడం వల్ల కామచారులనిపించు

కోవడం వల్లా అప్పుడు కొన్ని గాథలలో (గయోపాఖ్యాన కథలోలాగా) వైమానిక వ్యోమయానం (పుక్కిటి పురాణం అనిపించవచ్చు) చేస్తూ, కృష్ణార్జునులవంటి భారతవీరులకు స్నేహ గౌరవ పాత్రులై వారికి అపురూపమైన ఆయుధాలను (శంఖ) వాద్యాలనూ ఇచ్చి, అసామాన్యగౌరవ స్థితిని పొందిన జాతి గంధర్వులది. ఇటువంటి జాతులు ఆనాడు మరికొన్ని ఉన్నాయి. ఆనాటి పురాణేతిహాస భారతీయ సమాజంలో – వారు యక్షులు, కిన్నరులూ, కింపురుషులూను. మేఘసందేశంలో యక్షుణ్ని కాళిదాసు గుహ్యకుడని కూడా వ్యవహరిస్తాడు. గంధర్వుల లాగే అనేక ప్రదర్శన కళలలో (పెర్ఫార్మింగ్ ఆర్ట్స్) నిష్ణాతులై – రహస్య, అజ్ఞాత వర్తనకు అలవాటుపడిన సరిహద్దు ప్రాంత జాతుల ప్రజలు అని ఆర్యావర్తంలోని ప్రధాన రాజ్యాల పాలకులకు సరిహద్దు గలవారని అనుకోవాలి. (నేటి నేపాలీలకు, గుర్ఖాలకు పూర్వీకులై ఉండాలి).

గంధర్వ – సెన్‌టార్ శబ్దాలు :

గ్రీకు పురాణ గాథలలోని సెంటార్స్ ప్రాచీన గ్రీసుదేశపు సంగీతానికి అధిదేవతలు. ప్రాచీన భారతీయ పురాణ గాథలలోని గంధర్వ శబ్దానికీ – గ్రీకు పురాణగాథలలోని సెంటార్స్ శబ్దానికీ పోలికలూ, సంబంధాలూ కనిపిస్తాయని – 'భరతనాట్యం' పై పరిశోధక గ్రంథం రచించిన ఆర్. సత్యనారాయణ ఆ విషయంపై ఇలా వ్రాశారు :

"గ్రీకు సెంటార్స్‌కూ, హిందువుల గంధర్వులకూ వారి వారి పురాణగాథలలో ఎన్నో సామ్యాలు కనిపిస్తాయి. మొట్టమొదట విషయం ఆ రెండు శబ్దాలకూ భాషాశాస్త్ర నియమాలకు సంబంధించిన బాంధవ్యం ! శాబ్దిక పరిణామసూత్రాల ననుసరించి – ఈ శబ్దం నుంచి (గంధర్వ) ఆ శబ్దానికి (కెన్టార్ లేదా సెన్టార్), ఆ శబ్దం నుంచి ఈ శబ్దానికి ఇట్టే క్రమపరిణామం కనిపెట్టవచ్చు. వారూ వీరూ కూడా మానవాతీతులైన దేవతాజన్ములుగా భావించబడినవారే. ఇద్దరికీ చిత్రలేఖనాలలో గుర్రపుముఖమూ మానవశరీమూ కలిసి ఉండడం చూస్తాము. ఇద్దరికీ సంగీతంలో అవినాభావ సంబంధం ఉంది. –

గంధర్వులకు వేదాలతో సంబంధం అత్యంత ప్రాచీనతరమైనదనే విషయం గుర్తుంచుకోవాలి. గ్రీకులు, హిందువులు శతాబ్దాల తరబడి ఒకరి నుండి ఒకరు సంస్కృతి సౌరభాలను పంచుకోవడమూ, సొంతం చేసుకొంటూండడమూ కూడా కాదనరాని సత్యమే. ఐతే, అర్యసాముదాయిక సంస్కృతి ఏకత్వాన్ని గుర్తిస్తే సామ్యాలు చక్కగా బోధపడగలవు"

– *(భరతనాట్యం – ఆర్. సత్యనారాయణ)*

కెంటార్ లేక సెంటార్ సంస్కృతిపై గంధర్వ సంస్కృతి ప్రభావం :

సామవేదమునుంచి పుట్టిన 'మార్గ' సంగీతం 'నాట్యవేద' ప్రణేత అయిన ఆదిభరతుడు లేక సృష్టి కర్త పితామహుని సృష్టి అనే భావనా, గాంధర్వవేదపు తొలి ప్రవర్తకులు దేవతాజాతివారైన గంధర్వులనే భావనా, అ జాతి మహాపురుషులలోని వారుగా నారదుడూ, తుంబురుడూ, పర్వతుడూ, విశాఖిలుడూ, విశ్వావసువూ, ముని భరతుడూ మొదలైనవారు గణనీయులైనవారనే భావన మార్గసంగీతపు అనాదిత్వాన్నీ, అత్యంత ప్రాచీనతనూ నొక్కి చెపుతాయి.

ప్రాచీన గ్రీకు సంగీతానికి అక్కడివారి దృష్టిలో దేవతాజాతికి చెందిన సెంటార్సు ప్రవర్తకులు, ప్రాచీన భారతీయ సంగీతంలాగే ప్రాచీన గ్రీకు సంగీతం కూడా ఒకస్థాయిలో సప్తకం (హెప్టాడ్) అనబడే ఏడు ముఖ్యస్వరాలతో కూడినది– ఒక్కొక్క స్వరానికి ఒక్కొక్క మూర్ఛన (ఇండియాలో) ఉన్నట్లు గ్రీసులో ఒక్కొక్క స్వరానికి ఒక్కొక్క మోడ్ ఉండేది. ఇదీ అదీ కూడా అవరోహణ ప్రధానమే.

భారతీయం : నిదపమ గరిస లేదా మ గరి స నిదప

గ్రీసు : బి.ఎ. జి.ఎఫ్.ఇ.డి.సి. – లేదా ఎఫ్.ఇ.డి.బి.ఎ.జి.

క్రీ.పూ. 5వ శతాబ్దంలో పైథాగోరస్ గ్రీసుదేశ సంగీతంలో కొన్ని మార్పులు తెచ్చాడు. మధ్యస్థాయి 'సి'కి తారస్థాయి 'సి' ద్విగుణం అని కనిపెట్టి – హెప్టాడ్ అనే ఏడుస్వరాల మూర్ఛనను ఆక్టేవ్ అనే ఎనిమిదిస్వరాల మూర్ఛనగా నిర్దేశించాడు. స్వర సప్తకం స్వరాష్టకం అయిందన్నమాట. భారతదేశంలో స్థాయిలు మూడు ఒక్కొక్క స్థాయికి ఏడేసి స్వరాల సప్తకం అని ఋక్ ప్రాతిశాఖ్యలో నియతం అయినట్లు ముందే చెప్పుకున్నాము.

ముందే ప్రాచీనులకు కూడా తెలిసి ఉన్నప్పటికీ, పై సప్తకంలోని ఒక్కొక్క స్వరమూ దానికింది సప్తకంలోని అదే పేరింటి స్వరంకంటే స్థాయి (హెచ్చుతనంలో) (రెండురెట్లు) ద్విగుణోత్తరోత్తరము అన్న అంశాన్ని 13వ శతాబ్దంలో శార్ఙదేవుడే వాచ్యంగా తన సంగీతరత్నాకరంలో చెప్పాడు.

నారదుని శిక్షాశాస్త్ర రచన జరిగే నాటికి ముందు మన సంగీతంలో గ్రామాలు మూడు, గ్రామానికి ఏడు మూర్ఛనలతో మూర్ఛనలు ఇరవై ఒకటి ఉండేవి. గ్రామాలలో షడ్జ గ్రామము మధ్యమ గ్రామము 16వ శతాబ్దం దాకా ప్రచారంలో ఉండేవి ; గాంధార గ్రామం మాత్రం స్వర్గలోకానికి వెళ్లిపోయిందని నారదుడే శిక్షాశాస్త్రంలో చెప్పాడు. ఈ పరిస్థితే భరతముని నాట్యశాస్త్రం సిద్ధమయిన నాటికి, ఆ తరువాతి దత్తిల, మతంగుల గ్రంథాలు (దత్తిలము, బృహద్దేశి క్రీ.శ. 2వ శతాబ్ది, క్రీ.శ. 7వ శతాబ్ది) వెలువడిన నాటికి కూడా షడ్జమధ్యమ గ్రామాలు రెండే వ్యవహారంలో ఉండేవి.

పైథాగోరస్‌కు ముందరికాలంనాటి గ్రీసులో స్వరసప్తకము వాటి ననుసరించిన ఏడు మూర్ఛనలూ ఉండేవి. ఆ స్వరసప్తకములోని ఏడు స్వరాల అంతరాలు, ఒక్కొక్క స్వరపు స్థాయి నిష్పత్తులూ భారతీయ సంగీతంలోని షడ్జగ్రామ మధ్యమ గ్రామాలను అనుసరించే ఉండేవి. ఆ అంతరాలూ, నిష్పత్తులూ జస్ట్ ఇంటోనేషన్ అనగా షడ్జ పంచమ సంవాద భావాలకు అనుగుణంగా ఉండేవి.

భారతీయ	:	స (10/9)	రి (16/15)	గ (9/8)	మ (9/8)
		1	10/9	32/27	4/3
గ్రీకు	:	డి.	ఇ.	ఎఫ్.	జి.
భారతీయ	:	ప (10/9)	ద (16/15)	ని (9/8)	స
		3/2	5/3	16/9	2
గ్రీకు	:	ఎ.	బి.	సి.	డి.

పైథాగోరస్‌కు ముందు గ్రీకు స్వరసప్తకము, ప్రాచీన భారతీయ స్వరసప్తకమూ ఒకేవిధమైన అంతరాలతో స్థాయి నిష్పత్తులతో అమరి ఉండడం కేవల కాకతాళీయం కాదు.

పాశ్చాత్యం సంస్కృతిపై అభిమానులైన ప్రపంచ సంగీత శాస్త్రజ్ఞులూ, వారికి భావదాస్యం చేసే భారతీయ శాస్త్రజ్ఞులూ స్వరాష్టక పరిజ్ఞానానికి, మధ్యషడ్జానికి తారషడ్జం ద్విగుణస్థాయి కలిగి ఉంటుందనే పరిజ్ఞానానికి ఆది గురుత్వం క్రీ.పూ. 5వ శతాబ్దినాటి పైథాగోరస్‌కు కట్టబెడుతూ ఉండడం పరిపాటి.

స్వామి ప్రజ్ఞానాంద తాను రచించిన 'రాగ – ఓ – రూప' అనే గ్రంథంలో స్వామి అభేదానంద పుస్తకం నుంచి చేసిన ఉద్ధృతిలో "వైదిక మంత్రాల ఉచ్చాటన పద్ధతి నుంచి హిందువులు తమ సంగీతశాస్త్రాన్ని అభివృద్ధి చేశారు. సామవేదం స్వరయుక్తంగా గానం చెయ్యడానికి ఉద్దేశింపబడినది. ఏడుస్వరాలతో, మూడుస్థాయులతో కూడుకొన్న షడ్జగ్రామం గ్రీసు కంటే ఎన్నో శతాబ్దులు ముందుగానే భారతీయులకు తెలుసు. బహుశా గ్రీకులు దానిని భారతీయులనుంచి నేర్చుకొని ఉండాలి". అలాగే, ఏలన్ డేనియలు అనే సంగీతజ్ఞుడు రచన నుంచి చేసిన ఉద్ధృతి : "పైథాగోరస్ సంగీత పద్ధతిని ప్రాచ్యఖండం నుంచి తెచ్చి, తన దేశీయులగు హెల్లాన్ (గ్రీకుల)కు అవలంబింపజేశాడని ఊహించడం సహజం. గ్రీకుల సంగీతానికి ఈజిప్షియనుల సంగీతానికిలాగే మూలాధారం భారతీయుల సంగీతమే." స్వామి అభేదానందరచనలోని మరికొన్ని వాక్యాలు : "పైథాగోరస్ కాలం నుంచి గ్రీకులకు భారతీయులకు చాలా

సన్నిహిత సంపర్కం ఉండేదన్న చారిత్రక సత్యం మరువరానిది. పైథాగోరస్ భారతదేశానికి విజ్ఞానసేకరణకోసమై వెళ్ళినట్లు పాశ్చాత్య చరిత్రకారులే వ్రాశారు." క్రీ.పూ. 5వ శతాబ్దంలోని హెరొడోటస్ అనే గ్రీకు రచయిత మాటలలో 'హిందువులు ఆనాటి గణనీయమైన గొప్పజాతి', డి.లసీ-పి' రీరీ అనే ఫ్రెంచి రచయిత మాటలలో 'పైథాగోరస్ వ్రాసిన వైజ్ఞానిక విషయాలకు మూలాధారం వెతకగా వెతకగా భారతదేశమే గమ్యము కాగలదు'.

వైదికయుగపు కాలనిర్ణయం :

సామవేదపు కాలనిర్ణయమును గురించి చర్చిస్తూ డాక్టర్ ఫెల్బర్ అను పాశ్చాత్య పండితుడు అది క్రీ.పూ. 3000 సంవత్సరాలకంటే ఎంతో వెనుకటి కాలమునకు చెంది ఉండాలనంటాడు. సామవేదం నుంచి గంధర్వవేదం జనించి ఉండడమూ, గంధర్వులు దానియందు దక్షులు కావడం, గుర్రపు ముఖముగల హయగ్రీవోపాసనమూవంటి సంస్కృతి చిహ్నాలు వేదములు – వైదిక ఋషులు భారతీయులే అనడానికే కాకుండా బహుళజాతి జనుల సాముదాయిక సంస్కృతి ఫలితంగా భావించడం సముచితం. కలియుగాది క్రీ.పూ. 3101 అనే విషయం ఇక్కడ గుర్తుంచుకోవాలి.

రామాయణ ప్రాచీనత :

ప్రాచీన భారతచరిత్రలో భారతదేశ సంస్కృతికి యశస్సును చేకూర్చే సంఘటన ఏదైనా, రామాయణ భారతేతిహాసాలు జరిగిన కాలంగాని, వాటి రచనలు జరిగిన కాలంగా నిర్ణయించవలసి వచ్చినప్పుడు పాశ్చాత్య చరిత్రకారులు, పండితులు క్రీ.పూ. 5వ శతాబ్దికి తరువాత జరిగింది అంటూండడం పరిపాటి. ఎందుకంటే ప్రపంచ సంస్కృతి విజ్ఞానపరిణామాల చరిత్రలో ఆ కిరీటం యూరోపుకిగాని గ్రీసుకిగాని దక్కకుండా పోతుందేమో అని వారి భయం. అందుచేతనే రామాయణ రచనకాలం వారి దృష్టిలో క్రీ.పూ. 4వ శతాబ్ది. మహాభారతం క్రీ.పూ. 3వ శతాబ్ది. నారదీయ శిక్షాశాస్త్రం క్రీ.శ. 1వ శతాబ్ది; భరతుడి నాట్యశాస్త్రం క్రీ.శ. 2వ శతాబ్ది, ఈ నిర్ణయాలు పక్షపాతంతోను, ఈర్ష్యతోను చేసినవే.

సంప్రదాయజ్ఞులైన భారతీయ పండితుల విశ్వాసాన్ని బట్టి రామాయణ రచనం వేదకాలానికి దాదాపు సమీపాన జరిగింది. అప్పుడే ఆదికవి వాల్మీకి లౌకిక ఛందస్సులో మహాకావ్యరచన ఆరంభించాడు. ఆ తర్వాత కొన్ని వందల ఏళ్లకి మహాభారతరచన జరిగింది.

ఆదికావ్యంలోనే ఆ అనుష్టుప్ ఛందాలను శ్రీరాముని రాజసభలో వాల్మీకి శిష్యులైన కుశలవులు మార్గసంగీత శైలిలో గాంధర్వ కళానైపుణ్యం ప్రదర్శిస్తూ గానం

చేసిన విధం ఎలా వర్ణితమయిందో చూద్దాం :

"పాత్యేగేయేచ మధురం ప్రమాణై స్త్రి భిరన్వితం"
జాతిభిః సప్త భిర్యుక్తం తంత్రీలయ సమన్వితం ॥
రసైః శృంగారకరుణా హాస్యరౌద్ర భయానకైః
వీరాధిభిశ్చ సంయుక్తం కావ్యంఏత దగాయతాం"

తౌతు గాంధర్వ తత్త్వజ్ఞౌస్థానమూర్ఛన కోవిదౌ
భ్రాతరౌ స్వర సంపన్నౌ గంధర్వా వివరూపిణౌ
రూపలక్షణసంపన్నౌ మధురస్వర భాషిణౌ

తౌచాపి మధురం వ్యక్తం స్వచిత్తాయత నిస్వనం
తంత్రీలయ వదత్యర్థం విశ్రుతార్థ మగాయతామ్॥"

సోదరులైన కుశలవులిద్దరు సుశ్రావ్యమైన కంఠస్వరాలతో దేవతాజన్ములైన గంధర్వశైలి సంగీతతత్వాన్ని పూర్తిగా తెలిసినవారై, మంద్ర మధ్యతారములనే మూడు స్థానములందును (స్థాయిలందును) సప్తస్వరములతో ఒక్కొకటి ఆధారంగా ఏర్పడిన మూర్ఛనల్లో మహాకావ్యఛ్ఛందాలను ప్రాచీన వీణాతంత్రులపై లయాను గుణముగా మ్రోగిస్తూ, ఏడు శుద్ధ జాతులలో (ఆనాటి రాగాలు) సందర్భానుసారం శృంగారం, కరుణ, హాస్యం, రౌద్రం, భయానకం, వీరం మున్నగు రసాల ద్వారా శ్రోతృజన చిత్తానందం కలిగిస్తూ గానం చేశారు.

"తతస్తుతౌ రామవచః ప్రచోదితౌ
అగాయతాం మార్గవిధానసంపదా
సచాపిరామః పరిషద్ గతఃశనైః
బుభూషయాసక్తమనా బభూవహ !!"

శ్రీరాముని వచనముల వల్ల ప్రోత్సాహితులై మార్గసంగీత ప్రయోగంలో సంపత్కరమైన కౌశలం గలిగిన ఆ సోదరులిరువురు రామాయణమును గానం చేశారు. శ్రీరాముడును ఆ పరిషత్తును మెల్లగ ప్రవేశించి వారిని బహుమానాలతో అలంకరింప సంకల్పించాడు.

కీ.శే. డాక్టర్ కున్హన్‌రాజా (ఆంధ్ర విశ్వకళాపరిషత్ మాజీ సంస్కృతాచార్యులు) చతుర్వేదాల క్రమావతరణము గురించి, వాటి కాల నిర్ణయమును గురించి చెప్పిన అమూల్యాభిప్రాయమును ఇక్కడ స్మరించుకోవలసి ఉంటుంది.

"భారతదేశ ప్రాచీన చరిత్రలోని వివిధ సంఘటనల కాలనిర్ణయం చేయవలసి వచ్చినప్పుడు శతాబ్దాల తరబడి ఆసేతుహిమాచలము అన్ని పంచాంగములలోను

వాడుకలో ఉంటూ వచ్చిన కలియుగారంభ సంవత్సరము క్రీ.పూ. 3101 - అనే పరిగణన ఎంత మాత్రమూ నిర్లక్ష్యం చెయ్యరానిది. వేదకాలమును గురించి బాలగంగాధరతిలక్ మహాశయుడు నిర్ణయించిన క్రీ.పూ. 10,000 (పదివేలు) అత్యంత సమీపమైనదిగా గ్రహించవచ్చు. పాశ్చాత్య చరిత్రకారుల వారి అనుయాయులైన భారతీయ పండితులు నిర్ణయించే తేదీలు శాస్త్రీయ పరిశోధనకు ఎంతమాత్రము నిలబడలేదు. భూగర్భ పరిశోధనలు అంతగా అభివృద్ధి చెందని రోజులలో, బైబిలులో చెప్పిన ప్రపంచచరిత్ర తేదీలు మొత్తం సృష్టే నాలుగువేల సంవత్సరాలకు వెనక్కి పోని కారణం చేత, పాశ్చాత్య పండితుల శ్వేతజాతి దురహంకారం వల్లా వేదకాలానికి క్రీ.పూ. 10,000 (పదివేలు) సంవత్సరాల వెనుకటి దాకా వెళ్ళడమా అని భయపడిపోయారు.

వేదకాల ప్రారంభం క్రీ.పూ. 6,000 (ఆరువేలు) కొన్ని సహస్రాబ్దాలు ముందరిదై ఉండాలి. ప్రచారంలో ఉండిన వేదపాఠాలు క్రీ.పూ. 5000 (ఐదు వేలు) క్రీ.పూ. 4,000 (నాలుగు వేలు) సంవత్సరాలనాటివి. వేదకాలపు ఋషులు నెలవుకు పశ్చిమాన (ఇరాను నుంచి అస్సీరియా వరకు) అవేస్తనులు, అస్సీరియనుల వంటి శత్రువులపై విజయం సాధించడం మనకు ఋగ్వేదంలో కనిపిస్తుంది. ఇతర వేదాలు, బ్రాహ్మణాలు క్రీ.పూ. 4,000 (నాలుగువేలు) నాటివైయుండి, (ధర్మగ్లాని) ధార్మిక క్షీణతను అరికట్టడం జరిగినకాలమే క్రీ.పూ. 3,000 (మూడువేలు) కలియుగ ప్రారంభమనీ ఆ ద్వాపరాంతంలోనే యుధిష్ఠిరుడు, శ్రీకృష్ణుడు, వేదవ్యాసుడు, పరీక్షిత్తు, భారతజాతికి ధర్మోపదేశం చేసి నడిపించిన నాయకులయినారని గ్రహించాలి."

- (డా॥ కున్హన్ రాజా)

వేద, రామాయణ, మహాభారత కాలాల నిర్ణయం

భారతీయ పండితులలో సరియైన సాంప్రదాయిక దృక్పథానికి చెందిన వారిలో అధిక సంఖ్యాకులు మహాభారత యుద్ధకాలం క్రీ.పూ. 3137 అనీ, క్రీ.పూ. 3101 కలియుగ ప్రారంభమయి, పాండవులకు మనుమడయిన పరీక్షిత్తు (హస్తినాపురంలో) పట్టాభిషిక్తుడైన సంవత్సరమనీ విశ్వసిస్తారు. అందుచేత రామాయణకాలం క్రీ.పూ. 4,000 (నాలుగువేలు) కాగా, ఋక్, యజుర్, సామ, అధర్వణ వేదాల విభజనాక్రమ పరిణామమూ క్రీ.పూ. 5,000 నుంచి, క్రీ.పూ. 3,200 (వేదవ్యాసుని కాలం దాకా) లోపున జరిగి ఉండాలి. అందుచేత, ముందరిపుటలో చేసిన నిర్ణయానుసారం కుశలవులు చేసిన రామాయణగానము సామవేద సంగీతానికి అత్యంత సన్నిహితమైన మార్గసంగీతంలో సాగిందనడానికి లిఖితసాక్ష్యం వాల్మీకి రామాయణం (బాల కాండ) చతుర్థ సర్గాంతంలో 'మార్గ విధాన సంపదా' అనే విశేషణమే :

నారదుని పౌరాణిక ఐతిహాసిక వ్యక్తిత్వాలు :

రామాయణేతిహాసపు మొదటి పుటలోనే మనకు దేవర్షి నారదుని పాత్ర దర్శనం ఇస్తుంది. అతడు వాల్మీకికి, రామునకు (కావ్యకర్తకు, కావ్యనాయకునికి) సమకాలికుడు. ఆ నారదుడు ఎంతో మహనీయుడూ, గౌరవాస్పదుడూ అయిన మహర్షి – తపస్వి – త్రిలోక, త్రికాలజ్ఞాని – ఇతనిని క్రీ.పూ. 4000 నాటి ప్రథమ నారదుడు అని పేర్కొందాము. ఇతడు బ్రహ్మమానస పుత్రుడు.

ఇంకొక నారదుడు మహాభారతకాలంనాటి నృత్యనాటకాదుల సమాహార మయిన లౌకిక సంగీతానికి పరిణామదశ కాలం క్రీ.పూ. 3101 అని స్పష్టంగా కనబడుతూండగా, క్రీ. శ. మొదటి శతాబ్దం అనడం కాని, (పైథాగొరస్‌పై భయ గౌరవాలతో) క్రీ.పూ. 5వ శతాబ్ది అనడం కాని బొత్తిగా అసమంజసం.

ప్రచారంలో ఉన్న శిక్షాశాస్త్రం రచన నారదునిదని ప్రాచీనులూ, నవ్యులూ అంతా ఒప్పుకున్న విషయమే. పాశ్చాత్య పండితుడు కర్ట్‌శాక్స్ దివ్యగాయకుడూ, ఋషీ అయిన నారదుడు విద్యలకూ, లలితకళలకూ అధిదేవతయైన సరస్వతి కుమారుడనీ, (దాక్షిణాత్యులు 'యాళ్' అని పిలిచే సంగీతవాద్యం) 'మహతి' అనే 'ఇండియన్ హార్ప్'ను కనిపెట్టినది అతడే అని ప్రకటించాడు. అందుచేత శిక్షాశాస్త్రరచన అతనిదే అనడం ఎంతో సముచితం. సామవేదం నుంచి ప్రాతిశాఖ్యల నాటి వైదిక సప్తస్వరాలు ఏవిధంగా లౌకిక సంగీతంలోని సప్తస్వరములుగా పరిణామం చెందాయో శిక్షాశాస్త్రమే ప్రకటించింది.

మహాభారతకాలంలో లౌకిక సంగీత వ్యాప్తి :

మహాభారతం అశ్వమేధ పర్వంలో మన లౌకిక సంగీత సప్తస్వరాల ప్రశంస కనబడుతుంది. అయితే శబ్ద బ్రహ్మ సిద్ధాంత తత్త్వపు పరివేషంలో శబ్ద సంహతిలో స్వరాల పరస్పర ఇష్టానిష్టతలలో గర్భితమై నేటి సంగీతశాస్త్రపు సంవాదిత్వ వివాదిత్వాలకు ప్రాతిపదిక స్ఫురణ మనోజ్ఞంగా ప్రతిభావంతమై సాక్షాత్కరిస్తుంది.

శబ్ద బ్రహ్మతత్త్వం :

"తత్రైకగుణ ఆకాశః శబ్ద ఇత్యేవ సంస్మృతః
తస్య శబ్దస్యవక్ష్యామి విస్తరేణ బహూన్ గుణాన్
షడ్జర్షభోగాంధారో మధ్యమః పంచమః స్మృతః
అతః పరంతు విజ్ఞేయో నిషాదో ధైవతస్తథా
ఇష్టోృ నిష్టశ్చ శబ్దస్య సంహతిః ప్రవిభాగవాన్
ఏవంబహు విధోజ్ఞేయోః శబ్ద ఆకాశ సంభవః

"ఆకాశమునకుండే ఒకే ఒక గుణం శబ్దం – అంటే శబ్ద వ్యాపనం! ఆ శబ్దానికి సంబంధించిన వివిధ గుణాలను గురించి విస్తరించి చెపుతాను. షడ్జము, ఋషభము, గాంధారము, మధ్యమము, పంచమము, ఇంకా ఇతర గుణాలు నిషాదము, ధైవతము, పరస్పర సంవాదులై పక్క పక్క పలకడానికి ఇష్టత కలిగీ, అన్యోన్యవివాదులై పలికినప్పుడు అనిష్టతను ప్రకటించీ, పరస్పర సంహతి విహతుల ద్వారా శబ్దములు నిత్యనూతనమైన (సంగీత) రచనాత్మక ప్రతిభకు కారణములవుతూ విశ్వములోని ప్రాతిపదిక నాదమును బహువిధముల ప్రకటించి ఆకాశము శబ్దబ్రహ్మ అని చాటుతున్నది." మహాభారత కర్తయైన వేదవ్యాసుని ఈ ఉపదేశంలో నాదబ్రహ్మ తత్త్వపు పునాదిసూత్రం నిబద్ధం అయి ఉన్నదని గమనించాలి. మతంగుడు శార్ఙ్గదేవుడు వంటి లక్షణకర్తల నుంచి త్యాగరాజు వంటి మహావాగ్గేయకారుల వరకు ఈ తత్త్వాన్ని ఎందరో అవలంబించి ఉండడం భారతీయ సంగీతపు స్వతంత్ర వ్యక్తిత్వానికి రాచబాట కలియుగాదినే పడిందని తెలుసుకోవచ్చు.

ప్రయోగాత్మక లౌకిక సంగీతం :

(భారతకాలం) :

మహాభారతంలోని విరాటరాజు రాజధానిలో నర్తనశాల ఉండేదన్న విషయం మనకందరకు తెలిసిందే. నాట్య, నృత్యగాన, రూపక ప్రదర్శనలకు మాత్రమే కాక ఉత్తరవంటి రాజకన్యలకు బృహన్నల వంటి ఆచార్యుల చేత ఆ లలితకళలల్లో శిక్షణ ఇవ్వడం అక్కడే జరిగేది. మధురా బృందావనాల చుట్టు ప్రక్కల ప్రజల గ్రామాలలో, వనాంతరాలలో, యమునాతీర సైకతాలలో శ్రీకృష్ణుని మురళీమోహన గానం, గోప గోపికల రాసలీలా నృత్యాలూ, ద్వారకలో ప్రద్యుమ్నాది యాదవకుమారుల నాటక ప్రదర్శనలూ ఆనాటి లౌకికగానం వ్యాపించిన స్థలాలు.

హరివంశ – గాంధార గ్రామ ప్రశంస :

మహాభారతం కథానంతరం హరివంశ పురాణం – కృష్ణుని గురించీ, యాదవులను గురించీ, ఇంకా ఎన్నో ఇతర విషయాలను మహాభారతంలో వివరముగా చెప్పని వాటిని చెప్పడం కోసం హరివంశపురాణ రచన జరిగింది. ఇందులో ప్రద్యుమ్నాది యాదవ రాకుమారులు, నటీనట బృందం భద్రుడనే సూత్రధారుని యజమాన్యములో వజ్రనాభుడనే అసురరాజు రాజధానియైన వజ్రపురానికి వెళ్ళి గంగావతరణం, రామాయణ కథాసంఘటనలు, రంభా రావణ సంవాదం, రంభా నలకూబర సంవాదం వంటి నాటకాలను బహు చాతుర్యముతో ప్రదర్శించినట్లూ, గాంధార గ్రామ రాగాలను నైపుణ్యంతో పాడినట్లూ ప్రభావతీ ప్రద్యుమ్నోపాఖ్యాన సందర్భంలో వర్ణితమై ఉంది :

'భైమ్యాపి బద్ధనేపథ్యే నటవేషధరాన్ తథా
కార్యార్థం భీమకర్మాణో నృత్యార్థం ఉపచక్రముః ।
తతస్తుదేవ గాంధారం ఛాలిక్యం శ్రవణామృతం
భైమస్త్రియః ప్రజగిరే మనఃశ్రోత్ర సుఖావహం
ఆ గాంధార గ్రామరాగాన్ గంగావతరణం తథా
విద్ధం ఆసారితం రమ్యం జగిరే స్వర సంపదా॥

ప్రద్యుమ్నుడూ, అతని సోదరులూ, రుక్మిణి అంతఃపురానికి చెందిన భైమస్త్రీలు నటవేషములను ధరించి - (వజ్రపురంలో) (నేపథ్యమును) ప్రవేశ నిష్క్రమణాలకు అనుకూలమైన రంగస్థలాన్ని నిర్మించి, ఒక దేవకార్యం సాధించడానికై పూనుకొని, నృత్యప్రదర్శన ఆరంభించారు. (వారి మహత్కార్యం ఏమిటంటే, నటవేషమిషతో అసురరాజైన వజ్రనాభుని కోటలో ప్రవేశం సంపాదించడం). రుక్మిణి పరిచారికలు (భైమ్యాః) శ్రవణామృతం అనిపించేటట్లు దేవగాంధార రాగగానమును, ఆ తర్వాత ఛాలిక్యం అనే విశిష్టశైలికి చెందిన రాగాలను మనస్సులకూ, శ్రవణాలకూ ఆనందం కలిగించేటట్లు గానం చేశారు. గాంధార గ్రామరాగాల వరకు వివిధరాగాలను ఆలపిస్తూ గంగావతరణ నాటకాన్ని ప్రదర్శించారు. వీటన్నిటికి ముందు ప్రదర్శించిన పూర్వరంగంలో 'విద్ధం' అనే వాద్య సముదాయ ప్రయోగం ద్వారా శ్రోతోవహము, మధ్యలయ, సమపాణి అనే మూడు విభాగాల వాద్యసంగీతాన్నీ, ఆ తరువాత 'ఆసారితం' అనే నాట్యశాస్త్ర లక్షణానుసారియైన ప్రయోగం ద్వారా నలుగురు నర్తకీమణుల చేత, ముందుగా ఒక్కతె చేత క్రమంగా ఇద్దరూ, ముగ్గురూ, నలుగురూ చేరుతూ నాలుగు విభాగాల రంగపూజా కార్యక్రమాన్ని రమ్యంగా నిర్వహించి స్వరసంపదను ప్రదర్శించారు. ఈ విద్ధమూ, ఆసారితమూ అనే ప్రక్రియల లక్షణం భరతుని నాట్యశాస్త్రంలో నిబద్ధమై ఉండడం గమనార్హం.

వాయుపురాణంలో బ్రహ్మలోక గమన ప్రశంస :

వాయుపురాణంలో ఈనాటి మనకు ఎంతో వింత గొలిపే సంఘటన ఒకటుంది. ఈ సంఘటన హరివంశంలో ఇంతకుముందు పరిచితం చేసిన సంఘటనకు ముందెన్నడో జరిగిన చరిత్ర గనుక వాయుపురాణం కూడా మహాభారత, హరివంశము లతో సమకాల రచనగా మా నిర్ణయం. ఈ గాథ ఏమిటంటే, యాదవ రాజు రైవతుడనే అతడు 'మేరువు' లేక - బ్రహ్మలోకానికి తన కూతురు రేవతితో యాత్రకి వెళ్ళి, ద్వారకకి తిరిగివస్తూ 'ఛాలిక్యం' అనే విశిష్ట సంగీత ప్రక్రియనొక దానిని తీసుకువచ్చాడట.

"ఋషయః ఊచుః-

కథంబహుయుగే కాలే వ్యతీతే సూతనందన ?

నజరాం రేవతీప్రాప్తా పలితంచ కుతః ప్రభో !

మేరుంగతస్యవా తస్య శర్యాతేః సంతతిః కథం

స్థితాపృథివ్యాం అద్యాపి శ్రోతు మిచ్ఛామ భవతః-

కియన్తోవా సురగణా గంధర్వాన్‌తత్ర కీదృశః

యచ్ఛృత్వారైవతః కాలాన్ ముహూర్త మివమన్యతే"

సూత ఉవాచ :

నజరా క్షుత్పిపాసావా నచ మృత్యు భయంతత ః

నచరోగః ప్రభవతి బ్రహ్మలోక గతస్యహి ... .

శృణ్వాన్ సురావాసగతో నరేంద్రః చాలిక్య గాంధర్వముదారకీర్తి ః

మేనే కిలైకం దివసం సహస్రం చతుర్యుగాణాం నృపరైవతోఽథ

తతః ప్రవృత్తాచ కుమారజాతిః గంధర్వజాతిశ్చ తథాపరాహి

దీపాద్ యథా దీపశతాని రాజన్ వివేదకృష్ణశ్చ సనారదశ్చ

ప్రద్యుమ్న ముఖ్యైః నృపభైమ ముఖ్యైః ... ...

(తెలుగు) శ్రీమద్భాగవతంలోని రుక్మిణీ కల్యాణంలోని మొదటి పద్యం –

"ఆ వనజ గర్భుపంపున రైవతుడను రాజు తెచ్చి

రామునకిచ్చెన్ రేవతియని యెడు కన్యను"

ఈ పద్యం ద్వారా మనకి పరిచయం అయిన రైవతుడనే యాదవ రాజు బలరామునికి రేవతినిచ్చి పెండ్లిచేసిన మామగారు.

వాయుపురాణంలో –

కథకుడైన సూతుని శౌనకాది మహామునులిలా అడిగారు : 'ఏమయ్యా సౌతి, బహుయుగాల కాలం గడిచి పోయినాకూడా బ్రహ్మలోకం వెళ్ళివచ్చిన రేవతికి వార్ధక్యం ఎందుకు రాలేదు, జుట్టెందుకు నెరయలేదు ! 'మేరు' యాత్రచేసి వచ్చిన ఆశర్యాతి వంశస్థుడైన రైవతుడు భూమిపై ఈనాడు ఎలా మనగలిగాడో వినగోరుతున్నాము. అక్కడి దేవతలూ గంధర్వులు ఎలా ఉంటారు ? వారి సంగీత ప్రదర్శనవింటూ రైవతుడు భూలోకవత్సరా లెన్నిటినో ఎలాగు ఒక ముహూర్త ప్రాయంగా గడిపాడో !'

సూతుడిలా అన్నాడు :

'బ్రహ్మలోకం వెళ్ళినవారికి ముసలితనం రాదు. ఆకలిదప్పులుండవు. మృత్యువు వల్ల

భయం లేదు ; ఏ రోగమూ కలుగదు. అసురావాసానికి వెళ్లిన రైవత రాజు అక్కడి దేవగంధర్వులు గానం చేసిన ఛాలిక్య పద్ధతి సంగీతం వింటూ ఒక్క దివసంలాగ బ్రహ్మలోకంలో గడిపిన కాలంలో మర్త్య కాలమానంలో చతుర్యుగ సహస్రం (వేయి మహాయుగాలు) గడిచి పోయాయట.'

పురాణాలలోని మేరువు, మేరుగిరి :

వేదకాలమును గురించి డాక్టర్ కున్హన్‌రాజా ఉపన్యాసములనుంచి ఉద్ధృతి ఉటంకిస్తూ ఋగ్వేదకాలం బాలగంగాధరతిలక్ మహాశయుడు నిర్ణయించినట్లు క్రీ.పూ. 10,000 (పదివేలు) వరకు వెనక్కివెళ్ళే అవకాశం ఉన్నదని ఈ వ్యాసంలో ముందు సూచించాం. అదే భావంతో తిలక్ మహాశయులు రూపొందించి వైదిక ఋషుల ఆర్కిటిక్ తీరనివాస సిద్ధాంతాలకు ఈ వాయుపురాణంలోని బ్రహ్మలోక ప్రయాణగాథతో ముడిపెట్టి కొద్దిమార్పుతో పరిశోధిస్తే ఆ బ్రహ్మలోకం కాశ్మీరానికి పైని నేటి పామిర్ పీఠభూమికి కొంచెం ఉత్తరాన ఉన్నట్లు తోస్తుంది. మార్కండేయపురాణంలోను, భాగవత విష్ణుపురాణాలలోను జంబూద్వీపవర్ణన, మేరు ఇలా వృత భారతాది వర్షాల వర్ణనా ఈ అవకాశాన్ని సమర్థిస్తాయి. అది ప్రాచీన భారతీయుల అనాది విశ్వాసాలలో ఒకటి – భూగోళపు నిలువురేఖ మేరువు శిఖరాన్ని తాకుతూ ధ్రువనక్షత్రం వైపు చూపుతుంది. ఆనాటి ధ్రువనక్షత్రస్థానంలో ఈనాటి 'అభిజిత్' లేక, 'బ్రహ్మ' నక్షత్రం ఉండేదని గ్రహించాలి. నక్షత్ర గ్రహతారాదులు ఆ మేరువుచుట్టూ ప్రదక్షిణం చేస్తున్నట్లు కనిపిస్తాయి. భూమి ఆ రేఖనుచుట్టి ఆత్మప్రదక్షిణం చేస్తూండడం చేత ఉత్తరధ్రువం 10,000 సంవత్సరాలనాడు ఆ పామిర్ గుండాపోతూ ఉండినప్పుడు దివారాత్ర కాలగణనం వేరువిధంగా సాగే వైదిక ఋషుల నివాసం పామిర్‌చుట్టుపట్ల నెలకొని ఉండే అవకాశాలు లేకపోలేదు – అనుకుంటే బ్రహ్మలోకమో, సురావాసమో, పామిర్‌కు – ఉత్తరానగల తాజికిస్తాన్, కజకిస్తాన్‌ల ప్రాంతంలో ఉండవచ్చు. ఇటీవల సింధుసభ్యతా పరిశోధకుల తవ్వకాలలో దొరికిన అవశేషాలను బట్టి క్రీ.పూ. 4,000 ఏళ్ళనాడు చైనా, రష్యన్ టర్కిస్తాన్ (ఉత్తరకురు)లతో సింధుసభ్యతానుయాయులైన భారతీయులకు రాకపోకలు ఇచ్చిపుచ్చుకోడాలు ఉన్నట్లు తేలింది.

మేరునివాసంలోని గంధర్వుల నుంచి ఛాలిక్య గాంధర్వం అనే ప్రత్యేక గాన ప్రక్రియను రైవతుడు నేర్చుకొని – ద్వారకలోని యాదవులకు నేర్పాడు. శ్రీకృష్ణుడు, నారదుడు, ప్రద్యుమ్నాది యాదవ కుమారులు, రుక్మిణి అంతఃపురంలోని (భైమ) స్త్రీలు ఆ ప్రత్యేక శైలిని నేర్చుకొన్నారు. వీరంతా గాంధర్వం లేక మార్గ సంగీతంలో నిష్ణాతులు, మూడు గ్రామాలలోను ఆనాడు ప్రచారంలో ఉండిన మూర్ఛనలన్నీ వారికి కంఠోపాఠం.

ప్రాచీన గ్రీసులోని డోరిక్ ఆర్యులెవరు ? డోరిక్‌మోడ్ ఎక్కడిది?

ప్రాచీన ప్రపంచ చరిత్ర వ్రాస్తూ, పాశ్చాత్య చరిత్రకారులంతా వైజ్ఞానిక, తాత్విక సాంస్కృతిక యశః కిరీటాన్ని ప్రాచీన గ్రీసుకు అందులో ముఖ్యముగా యూరపీయన్ ఆర్యుల తలపై పెడుతూంటారు. వారిని ఆ చరిత్రకారులే డోరిక్ ఆర్యులంటారు. తత్వశాస్త్రము, గణితము, అన్ని విజ్ఞానశాస్త్రాలు, ఖగోళశాస్త్రము మున్నగు విషయాలన్నిటిలోను ప్రపంచము ఈ 'డోరిక్' ఆర్యులకు ఋణపడి ఉందని కొనియాడుతూంటారు. ఈ 'డోరిక్' ఆర్యను జాతికి చెందిన మహామహులెవరంటే. హెూమర్, వర్జిల్, ప్లేటో, అరిస్టాటిల్, ఆర్కిమిడిస్, సోక్రటీస్, పైథాగోరస్ మున్నగువారు.

ఈ డోరిక్ ఆర్యులు మధ్యప్రాచీన రాజ్యాలలో కొంతకాలం ఏలుబడి సాగించి అక్కడినుంచి ఇటలీ, గ్రీసు, మైసీనియా, క్రీటు, కార్తేజిలలోని అంతకు పూర్వం ఉంటూండిన జాతుల రాజ్యాలను, సంస్కృతినీ నాశనం చేసి, మధ్యధరా ప్రాంతంలో నెలకొన్నారు. ఇటలీలోని ఎట్రస్కన్లు, గ్రీస్‌లోని థ్రస్సాలియన్లు, నోసస్ క్రీటులలోని మైసీనియన్లు డోరిక్ ఆర్యుల చేత సమూలనాశనం అయారు. పాశ్చాత్య చరిత్రకారులు ఈ డోరిక్ ఆర్యులకు 'డోరిక్' అనే ఉపనామం ఎలా వచ్చిందో చెప్పలేకపోయారు. పాశ్చాత్య చరిత్ర విజ్ఞానుల మిగిలిన అన్ని సిద్ధాంతాలలాగే ఈ 'డోరిక్' ఆర్యుల మూలమాతృభూమి మధ్యప్రాచ్యానికి ముందు జర్మనీలోని డాన్యూబు తీరమో, రష్యాలోని వోల్గా తీరమో అయి ఉండాలని చేసిన నిర్ణయం సహేతుకంగా లేదు. అది ఇండియాయే అయి ఉంటే భారతీయార్యులే గ్రీకు ఆర్యులకు మూలపురుషులనీన్నీ వారి ఋగ్వేదమే ప్రపంచ మానవవాఙ్మయంలో మొట్టమొదటి వాఙ్మయం అనీ ఒప్పుకొంటే యూరప్ శ్వేతజాతీయులకి తలకొట్టివేసినట్లు ఉంటుంది కాబోలు.

ద్వారకా ఆర్యులే డోరిక్ ఆర్యులు :

ఈ వ్యాసంలో వేదకాల నిర్ణయమూ, రామాయణ మహాభారత, హరివంశాది పురాణాలలోని విషయాలతో ఇంతవరకు చేసిన చర్చలదృష్ట్యా చేసుకున్న సిద్ధాంతాల ప్రోద్భలంతో మరికొన్ని సాహిత్య సాక్ష్యాల ఆధారంతో, ఈ 'డోరిక్' ఆర్యులు భారతదేశ వాయవ్య పర్వత మార్గాలలోను, సముద్రమార్గంలోను క్రీ.పూ. 3101 కి తరువాత సహస్రాబ్దంలో మధ్యప్రాచ్యానికి వలసపోయిన ద్వారకా ఆర్యులే అని ఎలుగెత్తి చాటడానికి ఎంతమాత్రమూ సందేహించనక్కరలేదు. ద్వారకా ఆర్యులు, అంటే యాదవులు కృష్ణ నిర్యాణానంతరం మధ్యప్రాచ్యంలోని జూడియా, మిడియా, మిటన్నీ ప్రాంతాలలో రాజ్యాలు నెలకొల్పుకొని, క్రీ.పూ. 1400 వరకు పరిపాలిస్తుండినట్లు క్రీ.పూ. 1400 ప్రాంతంలో ఆసియా మైనర్‌లోని బోఘాజ్‌కోయి వద్ద లభించిన శిలాక్షర సాక్ష్యాలు ధ్రువపరుస్తున్నాయి.

హెర్క్యులీస్ - హరికులేశుడు :

ప్రాచీన గ్రీకు పురాణగాథపై వ్యాఖ్యానిస్తూ 'రిటర్న్ ఆఫ్ ది హిరాక్లిడె' - హిరాక్లిడే జాతీయుల తిరిగిరాక అనే తన రచనలో కర్నల్‌టాడ్ 'గ్రీకులు హెర్క్యులీస్‌ను తమజాతికి ఆరాధ్యకథానాయకుడుగా గౌరవించడాన్ని పరిశోధిస్తే వారు ప్రాచీన భారతంలోని హరివంశపురాణంలో చెప్పబడిన యాదవుల హరికులేశ (శ్రీకృష్ణ) ఆరాధనకి వారసులు అనిపిస్తుంది' అన్నారు.

'భారతీయుల ఉపనివేశములు' అనే పరిశోధన వ్యాసంలో యు.డి. హెర్బెల్లోప్‌ను ఒక బెంగాలీ చరిత్ర పరిశోధకుడు ఉద్ధరిస్తూ వ్రాసిన దానిని మా పెత్తండ్రి బాలాంత్రపు నీలాచలంగారు (ఆంధ్రప్రచారిణీ తణుకు, 1914 ప్రచురణ) చేసిన అనువాదం ఇలా చెపుతోంది : "ఇండోఆర్యనులు పెర్షియన్ గల్ఫ్‌ను, మధ్యధరా సముద్రాన్ని దాటి యూరప్‌కు వలసపోయారు. యూరప్‌లోని గ్రీకులూ, రోమనులూ ఆ ఆర్యుల సంతతివారే"

నీలాచలంగారు అనువదించిన ఆ చిన్ని పుస్తకం మూలరచన బెంగాలీ - (రచయిత పేరు ప్రస్తుతం అందుబాటులో లేదు) అందులోని మరికొన్ని వింత సమాచారాలేవిటంటే - వజ్రనాభుడనే అసురరాజు రాజధాని వజ్రపురం మధ్య ఆసియాలోనిదనీ, ప్రద్యుమ్నుడు మొదలైన యాదవ రాకుమారుల బృందం శ్రీకృష్ణుని రాజకీయాలలో ప్రచ్ఛన్న వేషాలలో మధ్య ఆసియాలోని వజ్రపురంలో నాటక ప్రదర్శనలు చేశారనీ, హరివంశంలోని ఈ కథను మనం ఇంతకుముందు చర్చించుకొన్నాము. హరివంశంలోనిదే - మరొకగాథ అనిరుద్ధ కుమారుడు (ప్రద్యుమ్నుని కొడుకు) పరిణయమాడిన ఉషను కన్నతండ్రి బాణాసురుని రాజధాని శోణపురం ఆఫ్రికాలో ఈజిప్టుకు దగ్గరగా ఉన్న విషయం కూడా 'భారతీయుల ఉపనివేశములు' అనే ఆ పుస్తకంలో కనబడుతుంది.

హెర్క్యులీస్, హరికులేశుడు శ్రీకృష్ణుడు శేషశాయి :

హెర్క్యులీస్ కథకూ హరికులేశుడైన శ్రీకృష్ణునికీ సంబంధం నిరాధారం కాదనడానికి బలవత్‌ప్రత్యక్ష సాక్ష్యం ఆకాశంలో సప్తర్షిమండలానికి దగ్గరగా కనబడే హెర్క్యులీస్ అండ్ డ్రాగన్ అని పాశ్చాత్యులు పిలిచే నక్షత్రమండలం. దీనికి ఆ పేరు గ్రీకు ఖగోళసిద్ధాంతి అర్రియన్ గ్రీసులో అంతవరకు గుర్తింపబడకపోవడం చేత డోరిక్ ఆర్యులే దానిని హెర్క్యులీస్ అని పిలువనారంభించారని వ్రాశాడు. ఈ నక్షత్రరాశిని భారతీయులు అనాదిగా శేషశాయియైన విష్ణునిగాను, కృష్ణునిగాను గుర్తించినట్లు సాహిత్యసాక్ష్యమూ, భారతీయుల నిత్యనైమిత్తిక సాక్ష్యమూ లభిస్తున్నాయి. సూర్యోదయాత్పూర్వంగాని, సూర్యాస్తమయానంతరం గాని ఈ నక్షత్రాల గుంపు

ధ్రువనక్షత్రం చుట్టూ సప్తర్షిమండలం ఖగోళంలో కావించే ఉపవృత్తపు అంచులో ఉదయించి, అస్తమిస్తున్నట్లు కనబడుతూంటుంది. దానిని బట్టి ఆయా ఏకాదశులకు శయనైకాదశి, పరివర్తనైకాదశి, ఉత్థాన లేక ప్రబోధైకాదశి, వైకుంఠైకాదశి అని – ఆ పర్వదినాలలో విష్ణుప్రీతికరమైన వ్రతాలను భారతీయులు ఏనాటినుంచో అనుష్ఠిస్తున్నారు. కాళిదాసు మేఘసందేశంలో యక్షుడు 'శాపాంతో మే భుజగశయనా దుత్థితే శార్ఙపాణౌ' అని మేఘునితో మహావిష్ణువు శేషపాన్పుపై లేచి కూర్చున్నపుడు నాకు శాపం అంతం అవుతుందని చెపుతాడు. అది ఉత్థానైకాదశి – కార్తీకమాసంలో వస్తుంది. మన విష్ణువూ లేక కృష్ణుడే హెర్కులీస్ అనడానికి ఇవి బలవత్ సాక్ష్యాధారం !

(ఏషియామైనర్) బోఘాజ్ కోయి – వలస :

గ్రీసుపైకి డోరిక్ ఆర్యులుగా దండయాత్ర చేయకముందు ఏషియామైనర్‌లోని బోఘాజ్‌కోయి వద్ద వలస చేసిన ఇండో ఆర్యులను గురించి డాక్టర్ కున్హన్ రాజా తమ ఉపన్యాసాలలో ఏమి చెప్పారో తెలుసుకుందాం.

"హిట్టైట్ రాజయిన సుబ్బిలు లియూమాతో మితన్నీ రాజయిన 'మత్తియుజ' క్రీ.పూ. 1400లో చేసుకున్న రాజకీయ ఒప్పందం క్యూనిఫారంలిపిలో బోఘాజ్‌కోయి (ఏషియా మైనర్) లోని ఒక శిలాశాసనం పైని చెక్కబడి ఉంది. అందులో వైదిక దైవతాలయిన ఇంద్ర, వరుణ, నాసత్యులు సాక్షులుగా పేర్కొనబడ్డారు.

ఆర్యులు – భారతదేశానికి ఇంకా రాకముందే యూరప్ నుంచి ఏషియా మైనర్‌లో వలసచేశారనీ, ఆ తర్వాత ఇరానూ, అక్కడినుంచి భారతదేశమూ చేరుకున్నారని ప్రాశ్చాత్య పండితుల వాదం.

దైవాల ఆరాధన :

(ఏషియా మైనర్‌లోని) హిట్టైట్ రాజుల ఉనికి ఋగ్వేదంలోని నలుగురు భారతదేశపు వైదిక ఆర్యులు విడిపోవడానికిముందే ఉండడానికి వీలులేదు. ఎందుకంటే, ఆ దేవతలకు ఋక్కులద్వారా స్తుతులను, ఆరాధనమును చేస్తూ, ప్రజలా, రాజులా, నిత్యకృత్యాలలో వారికి కృతజ్ఞతలర్పించే ధర్మమేదీ ఆ ప్రాంతంలో వ్యాప్తి పొందినట్లు కనిపించదు. ఒక ప్రజల సాహిత్యంలో ఎప్పుడో ఆ దేవతలు ఉండడం ఏషియా మైనర్ రాజులు ఆ దేవతల పేర్లను కృతజ్ఞతార్పణకు స్వీకరించారనడానికి బలం చాలదు. ఆ దేవతలు అక్కడి సాహిత్యంలో ఆరాధితులవుతూ ఉండి, ఆ ప్రాంతాలకు చెందని ఇతర ప్రాంతాలలో కూడా ప్రజలలో ఆరాధనీయులు అయి ఉండాలి. అందుచేత ఇరానియన్, ఇండియన్ ఆర్యులు పరస్పరం విడిపోయిన తర్వాత ఇది జరగిందనడానికి వీలులేదు. ఒకవేళ విడిపోయిన తర్వాత జరిగి ఉంటే ఆ ధర్మవ్యాప్తి ఇరానియన్ ఆర్యుల ద్వారా జరిగి ఉండాలి. ఇరాన్ – ఇండియా ఏషియామైనరులకు నడుమ ఉన్నది కనుక!

అయితే ఇరానియన్ ఆర్యుల సమాజంలో ఆనాటికి ఇంద్రుడు, నాసత్యులు అసురవిరోధులు అంటే వారి మతానుసారం దైవాపరాధులయిపోయారు. వరుణుడు పేరు మారిపోయి అహురమజ్దా అయినాడు. వైదిక వరుణదేవుని పేరూ, రూపూ ఆ విధంగా మారి, మాసిపోయాయి. అందుచేత ఈ దేవతలను ఏషియా మైనరువారు స్వీకరించడం వైదిక సంస్కృతినుంచే, వైదిక - ఇరానియన్ శాఖలు విడిపోకముందే జరిగి ఉండాలి.

ఇంతకీ చెప్పవచ్చినదేమిటంటే - భారతీయులైన యాదవ వంశస్థులయిన ద్వారకా ఆర్యులే ఏషియామైనర్ ప్రాంతానికి వలసవెళ్ళి, రాజ్యాలు నెలకొల్పుకొని, కొన్ని శతాబ్దులక్కడ ఉండి, హెర్క్యులీస్ పౌరాణిక ఆరాధ్యనాయకుడుగా గాథలు పెంచుకుని గ్రీసు మొదలయిన మధ్యధరా సముద్ర రాజ్యాలాక్రమించి అక్కడ నెలకొన్నారు. డోరిక్ ఆర్యులు క్రీ.పూ. 500 ప్రాంతంలో గ్రీసునుండి ఉద్భవించిన ప్లేటో, అరిస్టాటిల్, పైథాగోరస్ మొదలగు విజ్ఞాన ఖనుల ద్వారా ప్రపంచవ్యాప్తి పొందిన శాస్త్రీయ విజ్ఞానానికీ, తత్వశాస్త్రాది జిజ్ఞాసలకూ శ్రీకృష్ణుడు, వేదవ్యాస మహామనీషుల వారసత్వమే మూల సంస్కృతి అని నిర్వివాదంగా గ్రహించాలి. సంగీతశాస్త్రంలో-ప్రాచీన గ్రీసులోని డోరియన్ స్కేల్‌కు మూలం మహాభారత కాలంనాటి ద్వారకా ఆర్యుల షడ్జ గ్రామమే అనీ అది ద్వారకావాసుల గానపద్ధతికి చెందినది కావడం చేతనే దానిని డోరిక్‌స్కేలని డోరికమోడ్ అనీ వ్యవహరించే వారనీ గ్రహించాలి.

ముగింపు మెరుపు :

'హిస్టరీ ఆఫ్ సౌత్ ఇండియన్ మ్యూజిక్'లో ఆర్. రంగరామానుజ అయ్యంగారి ఉద్ధృతాలలో 'హిస్టరీ ఆఫ్ మ్యూజికల్ నొటేషన్', అనే ఫ్రెంచి గ్రంథంలోని ఒక వ్యాఖ్య - ఇంతకుముందు చేసుకున్న చర్చకంతకు ముగింపు మెరుపుగా పనికివస్తుంది :

"క్రీ.పూ. 582-500 కాలానికి చెందిన గ్రీకుతాత్వికుడు పైథాగోరస్ గణాంక సంఖ్యల పరమార్థ ప్రయోజనాలను తెలిసికొన్న విజ్ఞాని గ్రీసునుంచి భారతదేశానికి అంతదూరమూ ప్రయాణం చేసివచ్చి, ఇక్కడి జ్ఞానుల వల్ల మనోవికాసాన్ని పొంది, సంగీతంలోని సప్తస్వరాల పరస్పరాంతరాలు కతిపయగణిత నిష్పత్తులపై ఆధారపడి ఉంటాయని గ్రహించాడు.

"తంత్రుల మ్రోతలో రేఖాగణితం (జ్యామెట్రీ) గర్భితమై ఉంది. ఆకాశంలో పరిభ్రమించే గ్రహగోళాల పరస్పరమైన అమరికలో శ్రావ్యమైన సంగీత సంబంధం నిబిడమై ఉంది." అని పైథాగోరస్ వాక్రుచ్చాడు. సామవేద సంగీతపు ద్వావింశతి శ్రుతి నిబద్ధమైన సప్తస్వరాత్మకమైన గ్రామంలో శ్రావ్యసుందరమైన సంగీతంలోనే సమస్యాత్మకములైన సకలప్రశ్నలకూ జవాబులిమిడి ఉన్నాయని గ్రహించి, దానిని డోరిక్

మోడ్ ప్రాచీన రూపంగా గ్రీసుదేశీయులకి పరిచయం చేశాడు. దాని నుంచి ఆనాటి గ్రీసియన్ సంగీతపు మూర్ఛనలను ఏర్పరిచాడు. శతాబ్దాలతరబడి అవి యూరప్‌లో ప్రాచుర్యం పొందాయి. ఇండియానుంచే ఆత్మ యొక్క అవినాశిత్వమును గుర్తించి, పునర్జన్మ తత్త్వం గురించి పైథాగోరస్ తెలిసికొన్నాడు. మేజర్‌టోన్, మైనర్‌టోన్, సెమిటోన్ ప్రయోగాలతో కూడిన శ్రుతివిజ్ఞానమును గ్రీసు దేశీయుల సంగీతానికి పైథాగోరస్ భారతీయ సంప్రదాయాలనుంచి స్వీకరించాడు. ఇండియానుండి వస్తూపోతూ ఉండే విదేశీయుల సంగీత రహస్యాలను గ్రీకులకు నేర్పారు. సంగీతశాస్త్ర విషయాలలో భారతీయ మౌలికతలేని విషయమేదీ కూడా గ్రీసుదేశానికి సొంతం అనదగిన వాటిలో లభించదు.

'హిస్టరీ ఆఫ్ ఇండియన్ మ్యూజిక్' గ్రంథంలో స్వామి ప్రజ్ఞానానంద పాశ్చాత్య సంగీతజ్ఞుడయిన ఎడ్వర్డ్ మేక్డోవెల్ వ్యాఖ్యలను ఈవిధంగా ఉద్ధరించారు : 'పైథాగోరస్ 12 ఏళ్ళపాటు మేజి అనే ఇరానీ గురువులతో బాబిలోన్ దేవాలయంలో కాలం గడిపి, గాల్ (ఫ్రాన్స్) దేశపు డ్రూయిడులతోను, ఇండియన్ బ్రాహ్మణులతోను, ఈజిప్టులోని మతగురువులతోను చర్చలు చేసి, వారి ఆలయాల క్రతువిధానాలను గురించి తెలుసుకొంటూ ఇండియా చేరాడు. అక్కడ సంగీతంలోని గ్రామాలు, శ్రుతులు, స్వరాలు వాటి అమరికను గురించి తెలుసుకొని, ఆ విజ్ఞానాన్ని గ్రీసుదేశపు సంగీతంలో పొందుపరచాడు.'

ఆధారస్వరమైన షడ్జానికి అక్షరసంకేతం 'ఉట్' అనే మాట. సంస్కృతశబ్దమైన గ్రామం వాడుకలో అపభ్రంశమై 'గామా' గా, పరిణమించగా దానికి 'ఉట్' చేరి - గ్రామా + ఉట్ = 'గామట్' అనే శబ్దం ఒక స్థాయి అనే అర్థంలో పాశ్చాత్యులు వాడుతున్నారు. 'గామా ఆహ్' అనే మాటను అరబ్‌దేశీయులు 'ఆహ్' అనే అర్థంతో వాడతారు.

అరబ్బుల సంగీతంతో మన సంగీతానికి పోలికల కంటె వ్యత్యాసాలెక్కువ. మనకి 22 శ్రుతులుండేవని వెనుకటి కాలంలో అనుకుంటే, అరబ్బులకి 17 శ్రుతులే అని వాళ్ళ శాస్త్రం.

షడ్జం ఆధారస్వరంగా వుండే స్వర సంపుటి షడ్జగ్రామంగాను, మధ్యమం ఆధారస్వరమైతే మధ్యమగ్రామంగాను అలాగే గాంధారాన్ని ఆధారంగా వినియోగించిన స్వరసంపుటిని గాంధారగ్రామంగా పేర్కొని, ఆ గ్రామాలలో వేరు వేరు రాగాలను కనిపెట్టి, ఆ రాగాల ప్రయోగాలతో నాటకాలాడినట్లు శ్రీకృష్ణకుటుంబంలోని ప్రద్యుమ్నాది యువజనం - వజ్రపురంలోను, ఇతర నగరాలలోను గాంధారగ్రామ రాగాలను వినియోగిస్తూ నాటకాలు ఆడినట్లు, హరివంశంలోను, ప్రభావతీ ప్రద్యుమ్నంలోనూ, మనకు సాక్ష్య సమాచారం లభిస్తోంది.■

rajani bhavatarangaalu

balantrapu rajanikantarao

ఆధునిక వాగ్గేయ కారుని
ఏడు దశాబ్దాల జ్ఞాపకాల పందిరి.


సినిమా, రేడియో రంగాలపై
మనసు పులకించే ముచ్చట్లు...

సంగీత వారసత్వంపై, తెలుగు నాట్యరీతులపై
వెలుగుచూపే పరిశోధనా దీపాలు...

కాళిదాసు, అన్నమయ్య నుండి రవీంద్రుడి వరకు

ఆంధ్రి రాగం నుండి జ్యోతిషం వరకు
ఎగిరే విశ్లేషణా విహంగాలు...

కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి గ్రహీత
బాలాంత్రపు రజనీకాంతరావు రచించిన వ్యాసాలు.



1960లో డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ నుండి కేంద్ర సాహిత్య అకాడెమీ
అవార్డు స్వీకరిస్తున్న రజనీకాంతరావు

NAVODAYA